ఉమాసహస్రము

శ్రీ బాలసరస్వతీ ప్రచురణము - 10

శ్రీనమోభగవతే శ్రీరమణాయ

శ్రీ భారతీ దేవ్యైనమః

ఉమాసహస్రము

(ద్వితీయ భాగము)

శ్రీవాసిష్ఠ గణపతిముని ప్రణీతము

ఆంధ్రీకృతికర్త:-

"సాహిత్యవిద్యాప్రవీణ - ఉభయభాషాప్రవీణ"

"కవిశేఖర"

దంతుఱి లక్ష్మీనారాయణశాస్త్రి

ప్రకాశకుఁడు:-
వేదుల రామమూర్తి

ప్రేరకుఁడు
అయలసోమయాజుల చిట్టిసోమయాజులు.

*


ప్రథమ ముద్రణము

ప్రతులు : ఆరువందలు

దుర్ముఖి-శ్రావణము.

*

ప్రాప్తిస్థానము:-
వంతుల లక్ష్మీనారాయణశాస్త్రి
అధ్యాపకుఁడు, శ్రీ మహారాజ ప్రభుత్వసంస్కృతకళాశాల
పత్తిపాటివారివీధి - విజయనగరము



ఉమాసహస్ర కృతికర్త.

శ్రీవాసిష్ఠ గణపతిముని సమారాధనము

కాయముచేత అల్పుఁడయి గౌరవబుద్ధి ననల్పుఁడై ప్రజా
శ్రేయముఁగోరి - లోకశుభసిద్ధికి అద్భుతమంత్రయోగ ని
ష్ఠాయుతుడై అపూర్వనిజశక్తిఁ దపించిన పుణ్యమూర్తి మా
నాయన - శ్రీగణేంద్రమునినాథుఁడు మాకు స్ఫురించుఁగావుతన్.

నిగమార్థ ప్రతిపాదనైకసుగా నిత్యాత్మరూపోల్లసద్
భగవద్ దివ్యకటాక్షపాత్రునిగ సత్ పాండిత్య సాహిత్య పూ
ర్ణగుణస్తుత్య కవిత్వమూర్తిగ అపర్ణాదేవి ఏకావ్యకం
ఠగణాధ్యక్షు ననుగ్రహించె నతనిన్ ధ్యానింతు మెల్లప్పుడున్.

అలఘుగుణుండ వీవొక మహాత్ముఁడ వన్న తలంపుకన్న ఏ
తెలివియులేని- మమ్ము భవదీయపదాంబుజ భక్తులన్, కృపా
విలసిత వాఙ్మరంద శుభవీక్షల నేలిన నాయనా, నినున్
దలతుము దేశికాగ్రణీ! గణాధిపమౌని! అనుగ్రహింపవే.

కావ్యకంఠమహాముని కథితమగుచు
వర్తిలు ఉమాసహస్ర కావ్యమిది సకలము
ఆంధ్రభాషానువాద సమన్వితముగ
వెలసి తదనుగ్రహస్ఫూర్తి నలరుగాత.

ఇట్లు
శ్రీగణపతిముని చరణసేవకులు

1. వేదుల రామమూర్తి
2. అయలసోమయాజుల చిట్టిసోమయాజులు
3. భక్తబృందము.

★

ఓం నమోభగవతే శ్రీ రమణాయ.

శ్రీ భారతీ దేవ్యై నమః.

శ్రీ గణపతి మునిచరిత్ర సంగ్రహము.

సకలవేద శాస్త్రార్థగర్భితమును, నిగూఢార్థతత్త్వ వివరణచాతురీ సమన్వితమును, అపూర్వవిషయకథనోల్లసితమును, గంభీరభక్తియోగ సమున్మీలితమును శ్రీరమణ భగవత్పాద శుభానుగ్రహప్రబోధోచ్చాలితమును, ఉమాస్తోత్రరూపమును, నగు నీమహాకావ్యము – ఉమాసహస్రమను పేరఁ బ్రసిద్ధమగుచున్నది.

"ఉమ – పురాణప్రసిద్ధయు దేశకాలాది పరిచ్ఛిన్నయునగు పార్వతిమాత్రమే కాదు. ఆమె అజరయు, నమరయు, ననిర్వాచ్యయు, నపరిచ్ఛిన్నయునగు పరమేశ్వర మానశక్తి" అని యిందుగ్గడింపఁ బడుటవలన పరమేశ్వరశక్తియే ఉమ. అను నంశ మిందు స్పష్టీకరింపఁబడినది. ఉమాభిధయగు నామహాశక్తినిగూర్చి రచింపఁ బడిన సహస్ర (వేయి) శ్లోకములను గలిగియుండుటచేత నీమహాకావ్యము 'ఉమాసహస్ర' మగుచున్నది.

స్తోత్రసాహిత్యరూపమగు నీమహాకావ్యమును రచించిన భగవంతుఁడగు వాసిష్ఠగణపతిముని, కావ్యకంఠ పదలాంఛనుఁడు, మహాచార్యుఁడు, తపశ్శాలి. నైష్ఠికశిఖామణియును, మాననీయచరితుఁడునగు నీమహాశయుని మేధామయియగు జీవితప్రభ-సర్వతోముఖి. కావుననే బహుమార్గములఁ బ్రసరించి ప్రతిమార్గము యొక్కయు నవధినధిగమించినది.

వేదములు, శాస్త్రములు, తపము, జపము, కవిత్వము, అనునవి నిసర్గజ్వలితమగు నీమహాత్ముని ప్రజ్ఞను సముజ్జ్వలింపఁజేసి జీవితమును సార్థకము నొనర్చినవి. కావుననే రాష్ట్రీయవిషయములు, లోకవార్త, సంఘక్షేమము, ధర్మోద్ధారము, అస్పృశ్యత, ఇత్యాది విషయములం దితనిచిత్తము తగులువడినను గూడ నందుఁ గొంత కాలమే ప్రసరించి సంఘకైంకర్యముఁజేసి తదుపరి నిరంతరమును జపతపోనిష్ఠమే యగుచుండెడిది.

ఉమాసహస్ర వ్యాఖ్యాతయగు బ్రహ్మశ్రీ కపాలిశాస్త్రిగారిచే నిటీవల నిబంధింపఁబడిన వాసిష్ఠవైభవమను సంస్కృతగ్రంథమునం దీతని చరిత్రాంశము కొంతవిపులముగ నున్నది. అందు ప్రకటింపఁబడని జీవితవిశేషము లింకను గొన్ని కలవని కొందరుమిత్రులు చెప్పుచున్నారు. అవికూడ నేపుణ్యపురుషునిచేనైనఁ బ్రకటింపఁబడఁగావలెనని యూహించుచున్నాను.

ఆజన్మసిద్ధయు, అసాధారణియు, లోకోత్తరకవితా ప్రకాశికయునగు నీతని ప్రతిభ– పాఠకమహాశయుల కించుకైనను గోచరింప వీలగునను నాశయమున నాగరీ లిపియందుఁ బ్రకటితమైన యేతన్మూలమగు నుమాసహస్రమున బ్రహ్మశ్రీ కపాలి శాస్త్రిగారిచేఁ బ్రదర్శింపఁబడినరీతి నించుక యనుసరించి శ్రీవాసిష్ఠగణపతిముని చరిత్రాంశము నిందించుక స్పృశించుచున్నాను.

ఈమహాకవి జన్మస్థల మాంధ్రరాష్ట్రమునందలి విశాఖపట్టణజిల్లాయందలి బొబ్బిలి సంస్థానమునందున్న 'కలవరాయి'(కుముదోపల.) తత్పూర్వులు చోళదేశీయ కుంభఘోణనగరప్రాంతమునందున్న 'వలంగిమాన్' అగ్రహారవాసులు. ఋగ్వేదులు. కౌండిన్యసగోత్రులు. రెండువందల సంవత్సరములక్రిందటనే వారియాంధ్రదేశమున కరుదెంచిరి. వీరియింటిపేరు అయ్యలసోమయాజులవారు. ఇతనితండ్రి అయ్యలసోమయాజుల నరసింహశాస్త్రి, సద్గృహస్థుఁడు. కాశీక్షేత్రమున కరిగిన యితనికి దేవతాప్రసాద సూచకమగు నొక దివ్యదర్శనము కలిగెను. అచట నీయన విఘ్నేశ్వరసన్నిధియందుండునపుడు, ఒకశిశువు గణాధిపతి విగ్రహమునుండి యితని సమీపమున కరుదెంచి తిరుగ వెంటనే యావిగ్రహమునం దంతర్భవించెనట.

తదుపరి వారణాసినుండి యితఁడు కలవరాయికి రాఁగానే మధ్యమపుత్రుఁ డగు నితఁడు జన్మించెను. మఱియు ననేకములగు నిదర్శనములచేత నితఁడు గణపత్యంశ సంజాతుఁడను దృఢనిశ్చయముగల నరసింహశాస్త్రి యితనికి గణపతియను నామము నిడెను.

ఆఱేండ్లవయస్సు వచ్చువఱకు నితనిశరీరము రోగాక్రాంతమై యుండెను. ఆఱవయేడు రాఁగానే నిమిత్తమాత్రమగు చికిత్సావిశేషముచేత రోగనిర్ముక్తుఁడగు నీబాలుని ధీప్రకాశము వెంటనే వ్యక్తమై విలసిల్లుట కారంభించెను. ఏతద్వంశీయులగు పూర్వులవలెనే యితనితండ్రికూడ ఆయుర్వేదమునందును, దైవజ్ఞతంత్రమునందును, తంత్రశాస్త్రమునందుఁగూడ విశారదుఁడై యుండెను. శ్రీవిద్యోపాసన ఏతత్కులజుల కులధనము. నానాశాస్త్రజ్ఞమగు వీరికులమున నుదయించిన గణపతిని ప్రాక్తనసంస్కారములవలెనే జ్యోతిషాదివిద్యలుకూడ స్వయముగా వరించినవి. పదవయేటను గణపతి పంచాంగమును గుణించెను. పండ్రెండవయేట మేఘసందేశకావ్యము ననుసరించి భృంగసందేశకావ్యమును రచించెను.

నిరంతర కవితోపాసకుఁడగు నీబాలకవి పదునాల్గవయేటనే కవితను వశీకరించుకొని, వయోనురూపమును, రమణీయమునునగు కవితౌద్ధత్యమును ప్రదర్శింపఁ దొడఁగెను.

ఆనాఁటి పద్యము నొకదానిని జూడుఁడు!

ఇహైకే పాంచిదేశాచే న్నసన్తోషాయ కాశ్చితిః
శివానన్దాయ కాకానాం బాలకోకిల కాకలీ॥

బాలకోకిల కాకలి— కాకుల కానందదాయికము కానట్లు నాయీకవిత కొందఱు లోకులకు, సంతోషదాయకము కానిచో మాకు లోపమేదియును లేదు' కావ్యాభ్యాసమును ముగించి, వ్యాకరణ - అలంకారములను నేర్చుకొనుచుండు నపుడే, వాల్మీకి - వ్యాసుల, రామాయణ - మహాభారతములను సవిమర్శముగఁ బఠించెను. మహాభారతమును మాత్రము పలుసారులు పఠించెను. తత్పఠనము చేతనే యీబాలకవి ధీవిశేషము సువ్యక్తమయ్యెను. అప్పటికే యీతనికి వివాహమయ్యెను. తపస్సే సర్వమును సాధించునను దృఢనిశ్చయమున, మహత్త్వము నభిలషించి, తపోభిలాషియగు నితఁడు తండ్రి యనుమతిఁగొని తీర్థయాత్ర నొనర్చుట కారంభించెను.

పదునెనిమిదియేండ్ల యీడుగల యీకవికుమారుఁడు భువనేశ్వరము మొదలగు క్షేత్రములకరిగి తపస్సు నొనర్చుచుండెను. తదుపరి కాశీక్షేత్రమునందు విశ్రుతపాండిత్యులగు శివకుమార పండితులతోడి పరిచయభాగ్య మీతనికిఁ గలిగెను. గౌడ (వంగ) దేశమున విఖ్యాతమగు నవద్వీపనగరమున పాండిత్య పరీక్షకై పండితసభ జరుగునని విని సుహృత్ప్రేరణమున శివకుమారపండితదత్తమును, పరీక్షాప్రవేశ లాభసమభ్యర్థన పరమును, నగు పత్రిమునుగొని నవద్వీపమున కరిగెను.

అచట పరిషత్కార్యనిర్వాహకుఁడగు శితికంఠవాచస్పతి కాపత్రము నొసఁగెను. పత్రికచివరను లిఖింపఁబడిన 'దేవాసురసమీకేషు బహుశోదృష్టవిక్రమః' అను హనుమత్కీర్తన పరమగు రామాయణ శ్లోకార్థమును సమీక్షించి తృప్తుఁడయిన వాచస్పతి మిశ్రుఁడీతనికి పరీక్షాప్రవేశమునకై యనుమతి నొసంగెను.

పరిషద్ - దివసము - వచ్చెను.

ఏకవింశతి వర్షవయస్కుఁడగు మన యువకవి శరీరముచేఁ గృశించియున్నను, సాహితీసంపదచే బలిసియుండెను. కావుననే లోకమునంతను తృణీకరించుచున్నట్లున్న దీప్తదృష్టులతోఁ గూడ సభాభవనమునఁ బ్రవేశించెను.

అందు సముపవిష్టుఁడును, గంభీరాకృతియునగు నొక వృద్ధపండితుని జూచి పార్శ్వవర్తిని పిలిచి

"ఈమహాశయుఁ డెవఁడు"

అని యడిగెను.

అతఁడే పరీక్షకుఁడు - ఆశుకవి, అంబికాదత్తుడు. కావున నాప్రశ్నము నాలకించి తానే ప్రత్యుత్తరమును జెప్పుమిషతో పరీక్ష కారంభించెను.

ఆబాల్యసిద్ధకవితాస్ఫురి విలసితుఁడగు నీతనిమహానుభావము నావిష్కరించు నీకథాఘట్టము నొకించుక నివేదింతును.

అంబికాదత్తుఁడు :—

సత్వరకవితాసవితా గౌడోహం కశ్చిదమ్బికాదత్తః

(నేనాశుకవితా జనకుఁడను (సూర్యుఁడను) గౌడుఁడను నాపేరు అంబికాదత్తుఁడు

గణపతి:—

గణపతి రితికవికులపతి రతిదక్షో దాక్షిణాత్యోహమ్॥

(నేను కవికులమున కధిపతిని. అతిదక్షుఁడను, దాక్షిణాత్యుఁడను, నన్నుగణపతి యని పిలుతురు.)

అని పద్యమును బూరించి—

'నీవు అంబికకు దత్తుఁడవు మాత్రమే. నేనో ఔరసుఁడను.' అని చమత్కరించెను.

విశే:- నీవు దత్తపుత్రుఁడవు. నేను - అంభికాసంభవుఁడను, అని భావము. అంబికాదతుని పద్యమున "కవితాసవితా" అనుచోటనుమాత్రమే శబ్దాలంకారము గలదు.

గణపతిపద్యమున పతిరితి, పతిరతి, దక్షోదాక్షి, అనుచోట్ల శబ్దాలంకారములు గలవు.

తరువాత పరీక్ష - ఉపక్రమింపఁబడియెను. పద్యపూరణమునకై కొన్ని సమస్య లీయఁబడినవి. వానిలో రెంటినిమాత్రము ప్రదర్శించి గణపతికల్పితములగు పూరణములను విశదీకరింతును.

(1) స్తనవస్త్రం పరిత్యజ్య వధూః శ్వశురమిచ్ఛతి (కిం త్వనవద్యచరితా)
కోడలు పయ్యెదనువిడిచి మామను గోరుచున్నది,
(కులట కాదు)

(2) పిపీలికాచుమ్బతి చన్ద్రమణ్డలమ్.
చీమ-చంద్రమండలమును స్పృశించుచున్నది.
గణపతీ యిందు మొదటిదాని నిట్లుపూరించెను.

(1) హిడిమ్బా భీమదయితా నిదాఘే ఘర్మపీడితా (స్తన)
భీమదయితయగుటవలన కోడలగు హిడింబ, వేసవియందు స్వేదపీడితయగుట వలన పయ్యెదను తొలఁగించి, వాయువును (మామను) గోరుచున్నది.

రెండవసమస్య నిట్లు పూరించెను.

శ్లో॥ సతీవియోగేన విషణ్ణచేతసః
పరిభోగ్య శయానస్య హిమాలయేగిరౌ
శివస్య చూడాకలితం సుధాశయా
పిపీలికా చుమ్బతి చన్ద్రమండలమ్॥

సతీవియోగమున విషాదమునొందిన మనస్సుగలవాడును, హిమాలయపర్వతమునందుఁ బరుండియున్నవాఁడును, ప్రభువునగు శివుని శిరమునందున్న చంద్రమండలమునొకచీమ – అమృతమునందలి యాశచేత స్పృశించుచున్నది.

ఇట్టితీక్ష్ణమగు సమస్యాపూరణమున నిరర్గళకవితాధారచే విద్వత్సమాజమును సమ్మోహింపఁజేసి,

తరువాత

పరీక్షకులొసఁగిన శ్లోకములను– అద్భుతమగు గీర్వాణ వాగ్వైర్యామృతము నావిష్కరించుచు, వ్యాఖ్యానించి, సభాసదుల హృదయములను రసార్ద్రముల నొనర్చెను.

తదుపరి సంవాదమున నొకరివాక్యములయం దగుదోషముల నింకొకరధిక్షేపించుచు, పరీక్షక – పరీక్షిష్యమాణులిరువురును సభ్యులకు సాహితీవినోదమును సంఘటించి, పిదప శాంతించిరి. పిమ్మట నచటి విద్వత్ పరిషత్తుచే నీమహాకవికి కావ్యకంఠోపహారయుక్తమగు క్రింది ప్రశంసాపత్ర మీయఁబడెను.

—॥ ప్రశంసాపత్రమ్ ॥—

శ్రీమద్గణపతి శాస్త్రిన్!

సంసారే ఖల్వస్మిన్ కవిత్వమిత్యసముద్ర సముత్థమమృతమ్। సుదుర్లభంచ తత్ లోకాధిక సౌభాగ్యవశాత్ సుప్రసన్న దైవానుకమ్పయావా, యస్య కస్యచిదిహ సమధిగమ్యతే, సచభూస్థోపి స్వర్గీయ ఇతి సస్పృహ మాలోక్యమానో గుణపక్షపాతిభి ర్విద్వద్భిర్నితరామాద్రియతే. అతో యదద్య శ్రీమద్భి రసాధారణ కవిత్వమిహ ప్రకటయ్య, సుధియః, సర్వే, సన్తోష మాపాదితాః. తేనైవ చరితార్థా వయం ప్రవాసినః కోవిదా వయమశేష గుణధామ్నే విశాఖపట్టణ ప్రదేశాన్తర్గత "కలవరాయి" గ్రామవసతయే, శ్రీమద్ గణపతిశాస్త్రిణే తుభ్యమాశీర్వాద పూర్వక మిమం శ్లోకముపహరామః॥

ప్రాచీనైస్తైః కవికులవరైః కాలిదాసాదిభిర్యా
లబ్ధాకీర్తి ర్భువదనుగతా సైవభూయా దిదానీమ్।
సద్భిర్దత్తో యదిహరుచిరః కావ్యకణ్ఠోపహారః
తేన శ్రీమానిహ భువి భవానుజ్జ్వలత్కాన్తి భూయాత్॥

౧౯—౨౭ శతాబ్దీయసారశ్యేష్ఠస్వాష్ట మదివసే
శ్రీయుత రాజకృష్ణ తర్క పఞ్చాననః.

ఈ యుపహార పత్రముక్రింద పదునాల్గురు పండితుల స్వహస్త లిఖితములగు నామములు కాన్పించుచున్నవి.

ఇరువది యైదవయేడు రాఁగానే ద్రవిడదేశమునకువెళ్ళి అయిదాఱేండ్లు యాత్రలను సేవించెను. మొదట కాంచీక్షేత్రమును సేవించి యచటనుండి అరుణాచలక్షేత్రమున కరిగెను. అచ్చట నొకసంవత్సర ముండెను. అచటనున్నప్పుడు ఆ యరుణాద్రియందు వసించిన బ్రాహ్మణస్వామిని ప్రసంగవశమున రెండుమారులు వీక్షించెను. తదుపరి, అరుణాచలమునుండి వెడలి తత్సమీపప్రదేశములందుఁ గొంతకాల ముండెను. తరువాత ద్రవిడక్షేత్రములకు వెళ్ళుచు అచ్చట నచ్చట, పండితగోష్ఠులయందును, అభిజ్ఞపరిషత్తులయందును తన యష్టావధాన నైపుణిని బ్రదర్శించెను ఈ కాలమునందే "అగ్నిమీళే" అను మంత్రమునుండి "సుసహాసతి" అనునంతవఱకునుగల ఋగ్వేదమును స్వరయుక్తముగ నధ్యయనమునొనర్చి, సాయణీయమగు భాష్యమునుగూడ సమాలోకించెను. మఱియును తపఃప్రభావమువలన గూఢములగు మాంత్రవర్ణిక భావముల నాకళించి, గహనములగు దేవతాతత్త్వములనుగుర్తించి, సహృదయులగు నంతేవాసులకు నిరూపింపసాగెను. జైమినీయ తర్కవార్త్తికము మొదలగు శాస్త్రగ్రంథములను తరువాతనే రచించెను. ఈసమయమునందే యీమహానుభావుని ప్రతిభావము బహుముఖముల విజృంభించెను. భగవంతుఁడగు రమణమహర్షి యొక్క కరుణాకటాక్షమున కాస్పదము గూడనయ్యెను. స్వయముగా ననేకులగుశిష్యులకు మంత్రదీక్ష నొసగెను.

ఒకానొకప్పుడు జరుపఁబడిన యష్టావధానమున గంటకొక శతకము నిర్మింపవలసియుండ నాఱు నిమిషముల కాలమునందే యిరువదియైదు- పద్యములను రచించెను. లేఖకులుకూడ లిఖింపశక్తులు కారైరి. కీర్తిశేషుఁడును మహాశయుఁడునగు వి. కృష్ణస్వామ్యార్యుఁడు అదృష్టపూర్వమగు నావాగ్విక్రమము నాలోకించి ఆశ్చర్యపరవశుఁడై ఈమహాకవిని బహువిధముల బహుమానించెను.

క్రీ॥ శ॥ 1907 సంవత్సరమునకు ముందే యష్టావధానక్రీడను ముగించిన యీతనిచిత్తము గాఢతపఃపరతంత్రమయ్యెను.

అవధానములయందీ కవిసార్వభౌముఁడా యాసభలయందు రచించినపద్యములయందు ఖండకావ్యములు రెండును, ఒక (తత్త్వ) ఘంటాశతకమును లభ్యములై సురక్షితములగుచున్నవి. ఇది కవి వైభవఘట్టము.

X

—• భగవంతుఁడగు రమణమహర్షి దర్శనము – ఉపదేశలాభము •—

క్రీ. శ. 1907 సంవత్సరమున సీయాచార్యుఁడు – అరుణాచల క్షేత్రమునఁ దపస్సునొనర్చుచుండెను. ఇట్లుండ నొకదినమున నితనిచిత్తము సంశయార్తమ్ము వలె నొకముహూర్తమ్ము మాత్రము చలితమయ్యెను.

“బాల్యమునుండియు శతలక్షసంఖ్యాకమగు జపమున పంచాక్షర పురశ్చర్యనొనర్చితిని. శ్రీ విద్యాద్యములగు మంత్రములను జపించితిని. ఏకవారాశన – ఉపవాసాది కృచ్ఛ్రవ్రతముల నాచరించితిని. అయిన నింతకలికును భగవంతుఁడు ప్రసన్నుఁడు కాకున్నాఁడు. శాస్త్రములు మృషలు కానేరవు. నేనొనర్చుచున్న సాధనవిధానమునందేదయిన లోపముండియుండవలయును. ఏమిచేయుదును! అయ్యో! వేదశాస్త్రపురాణేతిహాసములను చక్కఁగ విచారించినను శ్రద్ధావంతుఁడనైనను గూడ నాకు తపఃస్వరూపమే తెలియదయ్యెనే” అని ధ్యానించుచుండ నితనికి ప్రజ్వలితమగు నొకానొక ధీవిశేషముదయించెను.

“ఈ యరుణాద్రియందుఁగల గుహలోనున్న బ్రాహ్మణస్వామి బహుకాలమునుండియు మౌనమవలంబించి, తీవ్రతపఃపరతంత్రుఁడై యున్నాఁడు. అతనికి తపస్స్వరూపము తెలిసియేయుండవచ్చును. కావున నిప్పుడే యాతనిని సందర్శించి యడుగుదును” అని తత్క్షణమే జపమునొనర్చుచున్న స్థలమునుండి బయలువెడలెను.

అది – సోమవారము కార్తిక శుద్ధ చతుర్దశీదివసము. (క్రీ॥ శ. 18 11–1907) రవి–ఆకాశమధ్యమునుగడచి రెండుగడియలు పశ్చిమాభిముఖముగఁ బయనించెను.

కవి — పర్వతము నారోహించి, గుహకువెలుపల సముపవిష్టుఁడయిన బ్రాహ్మణస్వామి నవలోకించెను.

అది – అరుణాచలమున కృత్తికోత్సవము జరుగురోజులు– ఆయుత్సవదివసములయందు బ్రాహ్మణస్వామి నివసించిన ప్రదేశముగూడ జనసంకులమై యుండెడిది. కాని యీదినమునందుమాత్రము నిర్మానుష్యమై యుండెను. దైవమనుకూలమనితలంచి, ధైర్యమునవలంబించి, యుత్సాహవంతుఁడగు సీయాచార్యుడు ఆస్వామి సన్నిధికి వినయముతో నరిగెను. సమీక్షించినవెంటనే సమీపమునకువెళ్ళి ఆమహాసీంద్రుని దక్షిణచరణమును దక్షిణహస్తముతోడను వామచరణమును వామహస్తముతోడను పట్టుకొని, సాష్టాంగప్రణామమునొనరించి. యిట్లు విజ్ఞాపించెను.

“శ్రీ॥ తపము – బహుళశ్చరితము. శాస్త్రములు – అధీత
ములు. మహామంత్రములు – జప్తములు. తపస్స్వ
రూప మెఱుఁగ నట్లుంటి, తద్రూపమెఱుఁగు
దీవు, నను సత్కృపననుగ్రహింపుమయ్యా!

సర్వమును బ్రహ్మముగాఁ జూచు నా మునిపుంగవుఁ డపుడు 'ఇతఁడు ఆంధ్రుఁడు, విద్వాంసుఁడు. కావ్యకంఠ గణపతిశాస్త్రి' అని గుర్తించెను. రెండు మూఁడు సంవత్సరములకు ముందిచట నీయాచార్యుఁడు నివసించియున్నపుడు రెండుమార్లీ మౌనస్వామిని దర్శించియుండెను. అప్పుడొకసారి 'శుక్లాంబరధరమ్' అను గణపతి ధ్యానశ్లోకమును ఈ బ్రాహ్మణస్వామి పరముగ వ్యాఖ్యానించియుండెను. ఈయంశమును ఆగుహావాసి యపుడు స్మరించెను. ఆ కాలమునందే 'హర సహస్రి'మను పేరుగల స్తోత్రమునురచించి, అరుణాచలేశ్వరుని సన్నిధియందు గాన మొనర్చిన యీ కావ్యకంఠుని మధురవిచిత్రమగు వాణీవిహారము తత్ క్షేత్రవాసులకు పూర్వపరిచితమే యగుటవలన నాబాలవృద్ధమగు నచటిజనమంతయు నతని కావ్యవైభవమును గీర్తించుచుండెడిది.

ఇట్లు గుర్తించిన పిమ్మట

చాల కాలమునుండియు, అంతర్బహిర్మౌనియగు స్వామి కొంత కాలము కరుణార్ద్రదృష్టి సేచనమున నితని ననుగ్రహించుచు నట్లే చూచుచుండెను. తరువాత నీయుభయుల జీవితములకునుగూడ నూతనాధ్యాయమును సంప్రవర్తింపఁజేయునది, యగు ఉపదేశభారతి - కావ్యకంఠునికొఱకు ముక్తకంఠకవాటమై మౌని సార్వభౌముని హృదయమునుండి ద్రవిడభాషారూపమున బయలువెడలెను. దానిసంస్కృతానువాదమున కిది యాంధ్రానువాదము.

'నేను, నేను' అనునది (స్మృతి) యెక్కడనుండి యుదయించును, అనివిచారించుచు, (మనస్సు) పుట్టినచోట లీనమగును. అదియేతపము. 'జపింపఁబడుచున్న మంత్రముయొక్క ధ్వని యెచ్చటనుండి పుట్టుచున్నది' అని విచారించినయెడల (మనస్సు) అది పుట్టినచోట లయమునొందును. అదియేతపము.

ఈ గురూపదేశమును తరువాత నీకవి

అహమితిస్మృతిః క్వనువిభాసతే
ఇదమనుస్మరన్నపది లీయతే'

అనుగీతమున నిబంధించెను.

ఈయుపదేశమును గ్రహించి సంతృప్తుఁడగు మహాకవి యానందమగ్నుఁడై యిప్పుడు బాహ్యమౌనము నడిగియున్న స్వగురువగు బ్రాహ్మణస్వామియొక్క ప్రత్యగ్రలబ్ధములగు పాదపద్మములయొద్ద కొన్నిగడియలవఱకు ధ్యాననిష్ఠయందుండిలేచి బయలుదేరెను. వెడలుచున్నప్పుడు పార్శ్వవర్తియగు నొకపురుషుని 'ఈతని నామధేయమేమి' అని యడిగెను. పూర్వాశ్రమమునం దితనిపేరు "వేంకటరామార్యుఁడు" అని యతఁడొసగిన ప్రత్యుత్తరమును విని సంక్షేపరమణీయమగు రమణనామమును వినిర్మించెను. మఱియు "ఇతఁడు - పరతత్త్వము జూచిన గొప్పమహర్షి" అని తన యనుచరవర్గమునకుఁ దెలియఁజేసెను.

ఆనాటినుండియే "రమణమహర్షి" అను ప్రసిద్ధి ప్రపంచమునఁ బ్రసరించి వెలయుచున్నది.

తరువాత దేవీప్రసాదమువలననే సిద్ధుఁడగు గురువు లభించెనని కృతజ్ఞుఁడై భక్తిపరవశతనొంది దేవినిగుఱించిన పద్యసహస్రముచేత "ఉమాసహస్రము" అను నీస్తోత్రకావ్యమును రచించెను. ఆచార్యుఁడగు నితఁడు ఇరువది దినములకు సమాప్తి నొందింపవలయునను వ్రతమునుధరించి యీగ్రంథరచన నారంభించెను. కానియిరువదవనాటికి రెండువందలకంటె నెక్కువపద్యములు రచింపవలసినవి మిగిలియుండెను.

గణపతిమహాకవి ఆనాటిరాత్రి ముహూర్తద్వయము దాటినపిదప అరుణాచలాంకమున ఆశ్రమగుహకు వెలుపల - స్వగురువగు మహర్షిసన్నిధియందు సముపవిష్టుఁడై పద్యరచన నారంభించెను. నలుగురుశిష్యులు వానిని వ్రాయఁదొడఁగిరి. అర్ధరాత్రిమగుసరికి పద్యరచన ముగిసెను. అచట నిమీలితనేత్రుఁడైయున్న భగవంతుఁడు మహర్షి వెంటనే ఉన్మీలితనేత్రుఁడై 'నేను పలికినదంతయు వ్రాయఁబడియెనా!' అని యడిగెను. మహర్షి కావించిన యీప్రశ్న ఆచార్యునకును, తదితరులకునుగూడ నాశ్చర్యమును గలిగించెను. "కరుణామూర్తియగు రమణభగవానుఁడు అగాధమగు నంతర్ధ్యానమునుండి యప్పుడేనిర్గమించి బాహ్యాంతర్భువనములకుఁగల భేదమునుజూడక యిట్లడుగుచున్నాఁడు. ఈమహర్షి యనుగ్రహము వలననే ప్రేరితమగు దివ్యావేశమే అర్ధరాత్రమగులోపలనే గ్రంథసమాప్తి యగుటకు కారణమయినది' అని భగవత్ప్రశ్నయొక్క భావము నెఱిఁగి - అంతేవాసియగు గణపతి "చిత్తము" భవదనుగృహీతమునంతయు గ్రహించి యిప్పుడీగ్రంథమును సమాప్తి నొందించితిని. అని యుత్తరమొసఁగెను. కావుననే మొదట ప్లవంగసంవత్సరమున నిబంధింపఁబడిన, ఉమాసహస్రము చివరను లిఖింపఁబడిన శ్లోకములయందు

ఈ యంశమును, రచనాకాలమును, నిట్లు తెలుపఁబడినది.

శ్లో. "యదస్య మహతః కాలే, పారంయాతోఽస్మి కర్మణః।
అనుగ్రహోఽయమాచార్య రమణస్య మహాత్మనః"॥
ప్లవఙ్గే కార్తికే కృష్ణే, షష్ఠ్యాం మఙ్గళవాసరే
స్తోత్రమేతత్ సమారబ్ధం తటే శోణధరాభృతః॥
ఏకాదశ్యాం శుక్లపక్షే, మార్గశీర్షే రవేర్దినే
నీతం సమాప్తిం వింశత్యాదినానాం వ్రతినా మయా॥

(పావనమగు నీగ్రంథమును కాలాంతరములయందేదు మాగ్లికవికులేశ్వరుఁడు సంస్కరించెను.)

తరువాత నచటఁ గొన్నినాళ్ళుండి తదితరక్షేత్రముల కరుగఁగోరి "అహం మూలాన్వేషణమే" ఇష్టార్థసిద్ధ్యుపాయమను నంశమును మహర్షివలనఁ దెలిసికొని, బయలుదేఱి దక్షిణదేశమున కన్యాకుమారీక్షేత్రమువఱకునుగల తీర్థములకువెళ్ళి ఆయా దేవతామూర్తులను స్తోత్రమొనర్చెను. పశ్చిమసముద్రతీరమునందున్న గోకర్ణమునందుఁ గొంతకాలముండెను. మంత్రసాధనమున నచట భువనేశ్వరి నారా

ధించెను. అచ్చటనే స్వప్నమున ఒకానొక స్త్రీకనఁబడి యతినిజిహ్వయందు మధువునుంచి యంతర్ధానము నొందెనట! అటుపిమ్మటనే తనకు కవితవశితయయ్యె నని యీయాచార్యుఁడు శిష్యులకుఁ దెలిపెను.

ఆంధ్రోత్కల మధ్యమునందున్న మహేంద్రపర్వతమున నడిమివయస్సున తప మొనర్చెను. మరల నరుణాచలమునకువచ్చి భగవత్సన్నిధియందుఁ జాలకాలముం డెను. అచ్చటనె గొప్పవగు యోగానుభవములను సంపాదించెను.

అచ్చటనే యాశ్రమగుహయందు తపస్సు నొనర్చుచుండ నీమహాను భావుని శీర్షకపాలములు శిరోగ్రంధభేదముచేత భిన్నములయ్యెను.

తరువాత- ఇతనిజీవితముయొక్క- అపరార్ధము- ఋగ్వేదార్థవిచారాదికముచే కృతార్థత నొందెను.

ఈ యాచార్యుఁడు పూర్వోత్తర మీమాంసావిమర్శము నొనరించుచు గ్రంథములను నిబంధించెను. జ్యోతిషాయుర్వేద తంత్రశాస్త్రీయములగు గ్రంథములను గూడ రచించెను. చరిత్ర విమర్శనిపుణుఁడగు నితఁడు "భారతసంగ్రహము" అను విమర్శగ్రంథమును అత్యంతసరళముగు రీతితో రచించెను. పూర్ణాఖ్యమగు నొక కథను సర్వగుణశోభితము, హృద్యము సుగమమునగు (నాంధ్ర) భాష నాశ్రయించి నిబంధించెను. మఱియు ఉమాశతికము, శివశతికము, ఇంద్రాణీ సప్తశతి, ప్రచండ చండీత్రిశతి, అగ్నివాయ్వాదిగీతమాల, ఇత్యాది స్తోత్ర కావ్యములను రచించెను.

ఆచార్యుఁడగు గణపతి - గణాధిపతియొక్క- యంశమున తానుజనించినట్లుస్వయముగానె ఉమాసహస్రమునందును, తదితరగ్రంథములందునుగూడ చెప్పియున్నాడు.

ఆంధ్రభాషానువాద సహితమగు నీగ్రంథమును ప్రకటించుచున్న బ్రహ్మశ్రీ వేమల రామమూర్తి ప్రభృతులచేత ఖడ్గపుర సమీపమునందలి "నింపూరాలో" నిర్మింపబడిన ఆశ్రమమున నివసించుచు తనచరమదశయం దీయాచార్యుఁడు శిష్యుల ననుగ్రహించుచుండెను.

అతిమానుష వాగ్వీర్యసమృద్ధుఁడు, బహువిద్యావిలాసి, తపోధనుఁడు - ఆచార్యుఁడు - ముని, భగవంతుఁడు వాసిష్ఠగణపతి, నిజవిజ్ఞాన విలాసలాంఛనము లను తన భక్తబృందమునందును, గద్యపద్యాత్మకమగు వాఙ్మయమునందును, నిలిపి ధాతృసంవత్సర శ్రావణ శుద్ధ సప్తమీ (15-7-1936, దివసమున నింపూరామండి స్వస్థానమున కరిగెను. ఉమాసహస్రస్థితమగు నొకపద్యమున గణపతి జయవాదమును ప్రకటించుచు నీయంశము నింతటితో విరమించెదను.

శ్లో. జయతు భరతక్షోణీఖణ్డం విషాద వివర్జితమ్
జయతు గణపస్తస్య క్షేమం విధాతుమనాముని:
జయతు రమణస్తస్యాచార్యో మహర్షికులాచలో
జయతు చ తయోర్మాతా పూతా మహేశవిలాసినీ.

(ఉమా 34 స్త 24 శ్లో)

ఓంనమో భగవతే శ్రీరమణాయ

ఉమాసహస్రము నందలి 2, 3, 4. శతకములను (అనగా300 శ్లోకములను) ద్వితీయ భాగముగా ముద్రింపించుటకు తోడుపడిన

భక్తమహాశయుల నామావళి

సంఖ్య	చందాదారుని పేరు	ఊరి పేరు
1.	మహారాజశ్రీ వేదుల రామమూర్తి పంతులుగారు	తగరంపూడి
2.	,, చేంబోలు శ్రీరామశాస్త్రిగారు	స్టేషన్ మాస్టర్, మండలా
3.	,, చేంబోలు సూర్యనారాయణ శాస్త్రిగారు	డిటో లాంమటా
4.	,, చెళ్లపిళ్ల గుంపస్వామిగారు	,, కటంగీ
5.	,, వడ్లమాని రామసుబ్రహ్మణ్యంగారు	,, తలోడి
6.	,, గోవిందు అనంతపద్మనాభంగారు	,, మూలు
7.	,, అక్కినపల్లి జోగారావుగారు	,, వాడెగామ్
8.	,, బులుసు వెంకటరామ కృష్ణా రావుగారు	,, ఘన్‌సోరు
9.	,, జడితల ముఖ్యప్రాణమూర్తి రావుగారు	,, సోవంగీ
10.	,, ధవళ సన్యాసిరావునాయుడుగారు	,, నైన్పూరు(రిలీవింగు
11.	,, కె. బుచ్చిరెడ్డి నాయుడుగారు	,, పెండ్రా)
12.	,, కాసిరెడ్డి రామారావు నాయుడుగారు	అసిస్టెంటుస్టేషన్ మాస్టరు ఉమరానల్లా
13.	,, పంతుల విశ్వనాధరావు పంతులుగారు	డిటో సోవంగీ

సంఖ్య	చందాదారుని పేరు	ఊరి పేరు
4.	మహారాజశ్రీ గోడ సత్యనారాయణ పంతులుగారు	అసిస్టెంట్ స్టేషన్ మాష్టర్ మన్‌సోరు
5.	,, రాళ్ళపల్లి సంగమేశ్వరశర్మగారు	,, డిటో
6.	,, సారిపాక రామమూర్తిగారు	,, డిటో
7.	,, అమ్ము వెంకట సూర్యనారాయణ గారు	రిలీవింగ్ స్టేషన్ మాష్టర్ నైన్‌పూరు
18.	,, వేరి శ్రీరామమూర్తి పంతులుగారు	యస్.పి. డబ్ల్యు ఇన్‌స్పెక్టరు భామినీబంజరు
19.	,, పీనపాటి కృష్ణమూర్తి పంతులుగారు	సిగ్నలర్ నైన్‌పూరు
20.	,, గొల్లకోట నరసింహమూర్తి పంతులుగారు	గార్డు, నైన్‌పూరు
21.	,, మండా జగన్నాధరావు పంతులుగారు	స్టేషన్ కమిటీ యకౌంటెంటు నైన్‌పూరు
21.	,, సరస్వతుల రామారావు పంతులుగారు	క్లార్కు డి. టి. యస్. ఆఫీసు. నైన్‌పూరు
23.	,, బలిజేపల్లి రామకృష్ణ శాస్త్రిగారు	మేనేజరు బీరార్ ఆయిల్ ఇండస్ట్రీస్ అకోలా
24	,, యమ్. శివరామకృష్ణారావుగారు	మేనేజరు నాగ్‌పూరు
25	,, వీరవిల్లి సూర్యనారాయణ శ్రేష్ఠిగారు	మర్చెంట్సు విశాఖపట్నం
26.	శ్రీమతి కొత్తూరు లక్ష్మీ నరసమ్మగారు	హైదరాబాద్
28.	మహారాజశ్రీ మంత్రిప్రగడ సన్యాసిరాజుగారు	గజపతినగరం గీతాప్రచారకమండలి
28.	,, కోలగట్ల వెంకటసుబ్బారావు శ్రేష్ఠిగారు	గజపతినగరం గీతాప్రచారకమండలి

ఓం నమో భగవతే శ్రీరమణాయ

ఆంధ్రీకృతి సమర్పణము

అమృత నిరంజనాద్వయ సదాత్మవిహారముఁబూని, దివ్యభ
వ్య మధురదృక్ పరంపగల భక్తులఁ ముక్తులఁజేయ— వారిహృత్
తమము హరించి తన్నిగమతత్త్వ సుఖానుభవంబుఁ గూర్చు శ్రీ
రమణ మహర్షి సద్గురు పరాత్పరు మత్కృతిభర్తఁ జేయుదున్!.

శాంతిరసప్రవాహిని - నిజాశ్రమ, మద్భుతదివ్యమోద సం
క్రాంతి- పవిత్రదర్శనము, గాఢ వివేక విఖండితాత్మ వి
భ్రాంతి- కటాక్షపాతము; విభాసిల ఏభగవానుఁడు ఈజగద్
ధ్వాంత మడంచు తద్ గురువతంసుఁడు మత్కృతి స్వీకరించుతన్.

మంత్ర నినాదమూల పరమాత్మ వివేక కుమారనవ్య సి
ద్ధాంత మహోపదేశము- గణాధిపమౌని - ఉమాకటాక్ష సం
క్రాంతిగడించి అయమకు కాన్కయొసంగు సహస్రముల్ నివే
దింతును తెన్గుబాస గురుదేవ మహర్షికి శాంతిదాతకున్.

ఓం, తత్, సత్.

ఇట్లు
శ్రీరమణ భగవత్పాదశిష్యుఁడు
పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి

ఓం

శ్రీ గురుదేవ ప్రార్థన

మాయామేయ కుమారమూర్తివయి ఆత్మానంద నిష్ఠుండవై
శ్రేయస్సాధకమై వెలుంగు అరుణాద్రిన్ నిల్చి - సచ్ఛక్తి నీ
మాయాలోకము నిర్వికల్ప శివసామ్రాజ్యమ్ము నేలించు నిర్
ధ్యేయబ్రహ్మము నాశ్రయింతు నను నంతేవాసిఁ బాలింపవే.

ఆద్యంతమ్ములు, దేశకాలములు; భేదాభేదముల్, లేక సద్
విద్యారూపిణియై - మనోవచన సంవేద్యము గా, కెప్పుడున్
విద్యుచ్ఛక్తినిఁబోలి - మానవతమో విధ్వంసమున్ జేయుచున్
పరిద్యోతించు భవత్కటాక్షకలికన్ ప్రార్థింతు యోగిప్రభూ.

ఆనాడాశువులన్ నుతించి ఉపదేశాకారమౌ నక్షర
మ్మర్థింపగ "ఏకము + అక్షరము నీవే వేరుగా వెల్గు స
త్యానందాత్మ స్ఫురించుచుండు హృదియందు" అంచున్ గటాక్షించి ప్ర
జ్ఞాన శ్రీ నలరించి ప్రోచిన గురుస్వామీ! ధృతిన్ నిల్పుమీ.

రావయ్యా! శివదర్శనమ్మిడి ననున్ రక్షింప - ఈ తుచ్ఛ మా
యావిద్యా వరణాంతరస్థితుల నిల్లయ్యయ్యొ ఎన్నాళ్ళు వే
రై వర్తింపగలార, మింక రమణేశా! తీయవయ్యా తెరల్
నీవున్ నేను నపార యోగ సరసిన్ గ్రీడింత మేకమ్ముగన్.

ఉపనిషదర్థమున్ భగవదుక్తియు, ఇంచుకఁ న్నదయ్యు శాం
తపడని నామనస్సు - రమణార్యకటాక్ష, మహోపదేశ ల
బ్ధ పదవిఁ గన్నదాదిగ అతాంతనితాంత హితాంతరాత్మ యు
క్తిపరత "ఓం నమో భగవతే రమణాయ" అనున్ పరిశాంతమై

అమృతతరంగమా భవదపాంగము చందనలేప మానిమే
షమునను జ్యోతిఁజూపగల సాధనమా యరుణాద్రి నీమహా
సముఖమునన్ గనుంగొనిన సౌఖ్యమె సౌఖ్యము, దానినే ప్రభూ
రమణ మహర్షి! నిత్యమభిరామ మకామము నక్షరమ్ముగన్.

ఓం నమోభగవతే శ్రీరమణాయ.

చిట్టాయవలస అగ్రహారము
స్వభానుసంవత్సర
శ్రావణశుద్ధ పంచమి.

ఇట్లు,
శ్రీ రమణాంతేవాసి
పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి



ఆంధ్రీకృతికర్త

పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి

స
మ

వే
మ
వా
శ్రీ
ఏక
మా
శ్రీ
రిం
పిమ
సమ
శ్రీ
విలి
ర్పం
సాం
ఆంధ
సంస
ద్వితీ
మన
శ్రీ
ముద్ర
ఆంధ్ర

ఓం నమో భగవతే శ్రీరమణాయ.

విజ్ఞాపిక

ఉమాసహస్రము - శ్రీమద్గణపతిముని కావ్యకంఠసముద్గీతము. ఈ స్తోత్ర సాహిత్యప్రబంధము - వైదికవిజ్ఞాన సమలంకృతము. వివిధదర్శనగర్భితము. లలిత మధుర సమర్థపద గుంఫితము.

శ్రీ గణపతి మునిశిష్యులును, నాకు బంధువులును, భక్తులును అగు బ్రహ్మశ్రీ వేదుల రామమూర్తి మహాశయుల నిరంతరమగు ప్రోత్సాహమువలనను, అపూర్వమగు నీపవిత్రగ్రంథమునందలి గౌరవమువలనను, నాయసమర్థతను గణింపక, ఏతదనువాద మహాకార్యభారమును వహించుటకు నిమిత్తమాత్రుడను కావలసివచ్చినది. శ్రీ స్వభానునామ సంవత్సరమున శ్రావణ శుద్ధ పంచమీ శుభదివసమున (1943 సం) ఏతదాంధ్రీకరణమునకు ప్రారంభించి ఒక నెలదినములలో నిందలి మొదటిశతకమును మాత్రము ముగించితిని. మూలశ్లోకములను ఆంధ్రపద్యరూపమున ఆంధ్రీకరించి శ్రీ T. V. కపాలిశాస్త్రి మహాశయులు రచించిన ప్రభా వ్యాఖ్యానము ననుసరించి ఆంధ్రవ్యాఖ్యా వివరణములను సంఘటించితిని. తదుపరి మూడేండ్లు గడచిన పిమ్మట 8-5-1946 తేదీని తిరువణ్ణామలైయందు (అరుణాచలమునందు) కృపాసముద్రుఁడును శాంతిపూర్ణుడును భక్తజనపరివేష్టితుఁడును అగు భగవంతుఁడు శ్రీరమణ మహర్షిని సందర్శించి తత్కటాక్షమున అశుప్రచలితమై వెనువెంటనే విలిఖితమగు పద్యవింశతిని (ఆత్మాభీష్టనివేదనమును) శ్రీవారిసన్నిధిని పఠించి సమర్పించితిని. భక్తమిత్రుల యభిమతము ననుసరించి దానినిందు ప్రకటించితిని. ఆనాడు సాయంకాలమున శ్రీరమణ భగవానుడు నాయందు కటాక్షించి అనూదితమును, ఆంధ్రపద్యరూపమును, అగు ఉమాసహస్రమునందలి ప్రథమశతకమును, దాని సంస్కృత మూలమునుగూడ సమగ్రముగా విని యామోదించి నన్ననుగ్రహించెను. ద్వితీయదివసమున శ్రీమదరుణాచలేశ్వరుని సందర్శించుకొని ఆనాటిసాయంకాలమున 1939లో ఆంధ్రీకృతమై అముద్రితమగు "అధ్యాత్మోపనిషత్తును" శ్రీ భగవానునికి వినిపించి- తదామోదభాగ్యమును బడసితిని. తరువాతనే అది ముద్రితమయినది. తృతీయదినమున గేయానువాదమగు "వేదాంతడిండిమమును" ఆంధ్రధ్వన్యాలోకమునందలి "బ్రాహ్మీవరివస్యాంజలిని" శ్రీరమణభగవానుద్ధ

విని- కటాక్షించెను. మూడవనాటిరాత్రి అరుణాచలమునుండి చిదంబరము వెళ్ళి శ్రీ నటరాజస్వామిని సందర్శించి విజయనగరమునకు వెళ్ళఁగోరిన నేను- తదాదేశబలమున నాకు దెలియకుండగనే పాండిచ్చేరికిఁగూడ వెళ్ళి శ్రీగణపతి మునిశిష్యులును ఉమాసహస్ర వ్యాఖ్యాతలునగు శ్రీ టి. వి. కపాలిశాస్త్రి గారికిఁగూడ ఈగ్రంథమును వినిపించి వారియామోదమునుగూడ బడయఁగలిగితిని. అదియిందు ప్రకటితము. తరుపరి భగవదిచ్ఛా ప్రసాదబలమువలన తిరుగ అరుణాచలమునకు వచ్చి శ్రీరమణ భగవానుని సందర్శించితిని. ఆపవిత్ర దినమున తత్కటాక్షప్రసాదప్రసారమహిమమున తిరుగ శ్రీభగవానుని దివ్యసన్నిధియందు 2 గం. కాలము ఉపన్యసించుటయు 1 గం॥ కాలము సంస్కృతాంధ్రములయందు ఆశుధారారూపమున పద్యరచనము నొనర్చుటయూ, సంభవించెను. కాని ఆపద్యములకు పారమార్థికాక్షరస్వరూపమే కలిగినదికాని లౌకికాక్షరస్వరూపము కలిగినది కాదు. తరువాత శ్రీరమణ భగవానుఁడు నేవర్థించిన "ఉపదేశాక్షరమును" గూడ సంస్కృతాంధ్రద్రవిడభాషా పద్యరూపమున ప్రసాదించి- నన్ను కృతార్థునొనర్చెను. ప్రశ్నోత్తరరూపమగు నీక్రింది పద్యమునదానియందలి యర్థమును విబంధించితిని.

"స్వామీ! అక్షర మొండొనంగు, ముపదేశశ్రీ స్వరూపమ్ము నా,
కేమీ సర్వము నీవెఱుంగుదువు నీకిం కేటి కర్థింపఁగా;
నేమూర్ఖుండ నెఱుంగ నేమియును, తండ్రీ! అక్షరమ్మీవె; హృ
ద్ధామస్థుండవు, దానివ్రాయఁగలవే! "ధన్యోఽస్మిధన్యోస్మ్యహమ్॥"

తరుపరి స్వగ్రామమగు చిట్టాయవలస వెళ్ళి- ఇందు ప్రకటింపఁబడిన కృతిసమర్పణమును - గురుదేవ ప్రార్థనమును - నాకొదవిన శ్రీరమణాశ్రమానుభూతిని స్మరించునదియగు క్రిందిపద్యమును- గూడ శ్రీభగవానునికి నివేదించుకొంటిని.

"అమృతశీతల తాపహారి కాంతి తరంగ
ములు పొంగె (అందు) సకలాంగములు మునింగె
ప్రణవమంత్ర విశిష్టపావన శ్రుతిపాత
శబ్దంబు వినిగిడె- నిశ్చలత నెగడె
విమలహృద్వనజ భక్త, మునీంద్ర, యోగి, సం
గత్వమ్మొలసె - ఆసంగత్వ మెలసె
బ్రహ్మవిత్ ప్రభు, సరూపబ్రహ్మ, రమణ ద
ర్శనమబ్బె - పారవశ్య మెదఁబ్రబలె

సత్కటాక్ష వెల్లివిరిసె- యోగశక్తి వెలసె
అక్షరాత్ముల పరశ భాగ్యానుభూతి
గలిగె అపుడే నెవండనో తెలియనైతి
నాశ్రమంబగు శ్రీరమణాశ్రమమున.''

అటుపిమ్మట శ్రీరమణానుగ్రహమున ఏతద్గ్రంథ సర్వస్వామ్యముగల 'శరసివ కీలును, శ్రీవాసిష్ఠముని ప్రవరానుచరాగ్రగణ్యులునగు శ్రీయుత డి. యస్. విశ్వామిత్రగారిని శ్రీకపాలిశాస్త్రి మహాశయుల సహాయమున ప్రార్థింప శ్రీవిశ్వామిత్ర మహాశయులు ఈసత్కార్యము నందాదరము వహించి- ఈఉమాసహస్రమును సమూలముగ ఆంధ్రలిపియందును భాషయందునుగూడ ప్రచురించుకొనుటకు తే 1-8-1946దీగల అనుమతిపత్రమూలమున బ్ర॥ శ్రీ॥ వేమల రామమూర్తిగారికి అధికార మొసంగియున్నారు. తరువాత- 8-5-1946 తేదీని శ్రీరమణభగవానునికి వినిపింపఁబడి- సమర్పింపఁబడి- తదాశీర్భాగ్యమును బడసిన ఉమాసహస్రమునందలి ప్రథమశతకము 1-4-1950 తేదికి ఉమాకటాక్షమున వెలువడినది, పిమ్మట శ్రీమహారాజ సంస్కృతకళాశాలనుండి కొంతకాలము సెలవుగైకొని మిగిలిన తొమ్మిది శతకములుగూడ 1-2-51 తేదీనాటికి గద్యరూపమున నాంధ్రీకరించితిని, కాని శ్రీ గణపతి మునిశిష్యులగు బ్ర॥ శ్రీ॥ వే॥ రామమూర్తి బావగారికి మిగిలినగ్రంథమును ప్రకటించుటకు తగినంత యవకాశము కలుగకుండుటవలన తరువాతిగ్రంథమును ప్రకటించుటకు వీలుకలిగినది కాదు. ప్రకటితమైన ప్రథమశతకమును సమీక్షించి ఆమోదించిన భక్తులలో శ్రీరమణ-గణపతి-మునులయందు ప్రపూర్ణమగుభక్తికలిగిన యొకానొక సత్పురుషుని ఆకస్మిక సహాయమున ఈద్వితీయభాగమును ప్రకటించుటకు సదవకాశము లభించినది. ప్రస్తుతము మధ్యప్రదేశమునందలి "బాలఘాట్" జిల్లాయందున్న పాద్రిగంజ్ యందు మలేరియా ఇన్స్పెక్టరుగా నుద్యోగమునొనర్చుచున్న భక్తమహాశయులగు శ్రీ అయలసోమయాజుల చిట్టిసోమయాజులుగారు విజయనగరమునందు మాయింటికివచ్చి- ఈగ్రంథముయొక్క- మిగిలినభాగములను ప్రకటింపవలెనను తలంపును తెలిపి పాద్రిగంజ్ వెళ్ళి భక్తులసహాయమునుగొని ఈద్వితీయభాగమును ముద్రింపించుటకు వలసిన ధనసహాయమును గావించిరి. శ్రీమదుమాకటాక్షమునను, శ్రీరమణ- గణపతిమునీంద్రుల అనుగ్రహమువలనను శ్రీ ఆయ్యల సోమయాజుల చిట్టిసోమయాజులుగారికిని, ఈగ్రంథప్రచురణమునకు తోడ్పడిన శ్రీయుత వేమలరామమూర్తి ప్రభృతులగు తదితరభక్తులకును ఆయురారోగ్య భాగ్య విజ్ఞాన సంపత్తి కలుగవలయు నని భగవానుని ప్రార్థింతును. ఏతత్ గ్రంథప్రచురణమునకు తోడ్పడిన భక్తుల పవిత్రనామావళిని ఈగ్రంథమునందు ప్రక

టించుచున్నాము. భగవదనుగ్రహపాత్రులగు శ్రీయుత సోమయాజులుగారి ఉత్సాహపూర్ణమగు కృషివల్లను, భక్తమహాశయుల తోడ్పాటువల్లను, మిగిలిన యారు శతకములునుగల తృతీయభాగముగూడ, శ్రీమదుమాగణపతి–శ్రీగురురమణ–భగవదనుగ్రహమున శీఘ్రముననే ప్రకటితము కాగలుగునని దృఢముగా విశ్వసించుచున్నాను.

1-4-1950 సంవత్సరమున ప్రకటితమైన ప్రథమశతకమున మూలశ్లోకములను పద్యరూపమున నాంధ్రీకరించియుంటిని. కొందఱు పాఠకుల యభీష్టము ననుసరించి మిగిలిన తొమ్మిదిశతకముల యందునుగల మూలశ్లోకములను ఆంధ్రగద్యరూపమున మాత్రమే అనువదించియుంటిని. ప్రభావ్యాఖ్యానమును మఱికొంత విపులీకరించితిని. ప్రకటితమయిన ప్రథమశతకమునుగూర్చి శుభాశయులగు కొందఱు పండితవరేణ్యులును ప్రసిద్ధములగు కొన్ని పత్రికలును ప్రసాదించిన సదభిప్రాయములను దీని తృతీయభాగమున ప్రకటింపగలనని యాశించుచున్నాను. ఏతద్గ్రంథముద్రణము ముగియుచున్నప్పుడు నాశరీరమునందయిన అస్వస్థతవలన ఈభాగమునందు ప్రమాదవశమున దొరలిన ముద్రణస్ఖాలిత్యములను పరిశీలించి- పరిశోధనపత్రికను ప్రకటించుటకవకాశము గలిగినది కాదు. ఈవిషయమున పాఠకులు నన్ను క్షమింపప్రార్థింతును. శ్రీ రమణ భగవానుని స్మరించుచు నిప్పటికీవిజ్ఞాపికను ముగింతును.

వత్తిపాటివారివీధి
విజయనగరము
1-8-1956

ఇట్లు
సజ్జన భక్త విధేయుఁడు
పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి
శ్రీభారతీతీర్థ–శ్రీకౌముదీపరిషత్ – సాహితీసమితి–సభ్యుఁడు.

ఓం

శ్రీ రమణ భగవత్ప్రశంసా పూర్వకమ్.

ఆత్మాభీష్ట నివేదనమ్.

శ్రీమద్ధ్యేయామయ స్వరూప! శుభకృద్ విజ్ఞానసారాం నిధే!
సోఽహం తత్త్వమసీతి వాగభిహిత ప్రజ్ఞానలక్ష్యాకృతే!
సర్వజ్ఞత్వ, బుధత్వ, విత్త్వ, విలసత్ సౌభాగ్యచిన్తామణే!
మాంపాహీశ్వర! దేవదేవ! రమణ! శ్రీయోగ విద్యాగురో! ౧

ధ్యాతృధ్యాన పదాతిగం, నిజతను వ్యాపారశూన్యం, విభుమ్,
కర్తృత్వాదినిరాస, సుస్ఫుట రసప్రజ్ఞాన సత్యశ్రియమ్,
శ్రీమన్తం, భగవన్త, మీశ్వరముఖం, దేవం, భజేఽహం సదా
స్వాత్మాలోకనిధిం, జడాన్ధబధిర శ్రీరూపరమ్యాకృతిమ్. ౨

ఓం లక్ష్యాత్మవిహారో, యోగవిదామగ్రిణీః, కృపాశీలః,
స్కన్దాంశ సముద్భూతో, రమణమహర్షిశ్చిరం జయతు భగవాన్. ౩

విషమే విషయారణ్యే
సఞ్చరతే శోకశల్య వికలాయ
జగతే సత్పథదర్శీ
రమణ మహర్షిశ్చిరం జయతు భగవాన్! ౪

జ్ఞాతృ-జ్ఞాన- జ్ఞేయాతీతః
ధ్యాతృధ్యాన ధ్యేయాతీతః
శ్రోతృశ్రవణ శ్రవ్యాతీతః
రమణ మహర్షిర్భగవాన్ ఖ్యాతః. ౫

అజ్ఞోఽహం వర్ణాశ్రమ
జాతి మత వ్యక్తి భేదనిష్ఠాత్మా

నాహం జానే తత్త్వం
భగవన్త మహం భజే గతిం రమణమ్. ౬

శ్రోత్రస్య త్వం శ్రోత్రం
మనసశ్చ మనస్త్వం
వేత్సి త్వం హ్యన్నిష్టం
వక్తవ్య మభీష్టమ్. ౭

★ ★ ★

ఆంధ్రపద్యరూపమగు భగవత్ప్రశంస.

ఆత్మాభీష్ట నివేదనము.

శ్రీమద్ వేదశిరోఽనుభావిశదసత్స్వీకార! సాకార వి
ద్యామూర్తీ; గురుదేవరూప పరమాత్మా! యోగవిద్యాఖనీ!
కామక్రోధ రుజావిఖండన, పటు జ్ఞానాసిధారా! ప్రజా
క్షేమార్థీ! రమణాభిధోత్తమ మహర్షీ! నన్ గటాక్షింపవే! ౮

ఆస్వాయంభువు - పంచేంద్రియముల - బాహ్య
విషయ సంబద్ధములను గావించె, గాన
శోకమయలోకనైజంబు స్వీకరించి
ఆత్మమూఢుండనైతినే, ననఘచరిత. ౯
"ఆత్మసాక్షాత్క్రియా యుక్తుడగు గురుండు
తెలుప తత్త్వైక్యబోధ సంధిల్లు" ననెడి
వేదవచనంబు వినితత్త్వ (ఆత్మ) వేత్తయైన
గురునరయుచుంటి నిన్నాళ్ళు గురువరేణ్య! ౧౦

పరమాత్మస్థితుండై - ప్రపంచవిషయభ్రాంతిన్ విసర్జించి, త
త్త్వరహస్యానుభవంబుగాంచిన స్థితప్రజ్ఞుండు, నిర్ద్వంద్వుం డె
త్తరి నెందున్ లభియింపడయ్యెను మహాత్మా! నేను సత్యాత్మకో
చిరసాలోక విహారి, నిన్నుం గనుంగొంటిన్ మంటి ధన్యాత్ముండన్. ౧౧

నగుణుండయ్యును నిర్గుణుండగుచు, తృష్ణాయుక్తుడయ్యున్ గణిం
పగ తృష్ణారహితాత్ముడౌచు, శుభరూపమ్మయ్యు నీరూపుడై,
నిగమాంతస్థిర తత్త్వమయ్యు శ్రుతివాక్యార్థవ్యాఖ్యుడౌ దేవుడా
భగవంతుండు గురుండుగా దొరకె నాభాగ్యంబు సామాన్యమే. ౧౨

మానవజన్మ (ముూని) మైత్రి పశుమార్గమునన్ జరియింపనొల్ల, వి
జ్ఞానధనంబుఁగోరక - అనర్థ్యము, తుచ్ఛము, నింద్యమౌ, ధన
శ్రేణిని గోరఁజెల్లునె! విశీర్ణ శరీర విభూతి-సుస్థిర
మ్మౌనె? తలంప దీనసుఖమా? శుభమా! యశమా! గురూత్తమా!

శాంతింబొందవు కోరెన్, లింద్రియములున్ స్వార్థములర్థించు, దు
శ్చింతల్ సంతతముస్ బ్రివాహసరణిన్ జిత్తంబుగందోచు, వే
దాంతోక్తుల్ 'తగదాత్మ హత్య' యను, తత్త్వార్థంబు గాన్పింప, దీ
ర్ఘాంతుల్ వీడు విధానమెద్ది? గురుదేవా! యోగవిద్యాఖనీ. ౧౪

మన వర్తనము - సినీమా బొమ్మనాట్యమ్ము,
వాయుసంచలిత దీపమ్ము, తనువు,
విషయుక్తఫలములు - వివిధ భోగములును,
గగనమ్మలోని చెంగలువ - సుఖము,
రొంపిలో దింపు వారువము - లింద్రియములు,
త్రాగి యూగిసలాడు తాగ్రిడు - మనసు
ఆత్మశక్తి హరించు యంత్రముల్ - కాంతలు,
ప్రత్యక్ష మృత్యుదేవత - ధనంబు,

అద్దెటికట్టుకొని క్షణంబధివసింప
నిట్టె దిగుమను రైల్వెట్టె - యీగృహంబు,
కాన, గురుదేవ! నీ మహాజ్ఞానబోధ
దివ్య తత్త్వస్వరూపంబుఁ దెలిసికొందు. ౧౫

గురువేదాంతములం బఠించితిని నాకున్ నేనె, వేరెవ్వరున్
గురువుల్లే, రనుభూతినొంద నొకటన్న! గూఢార్థమేమున్నదో!
పరతంత్రుండ, స్వతంత్రబుద్ధివి! శుభప్రారంభదీక్షానిరం
తర విద్యాకమనీయమూర్తివి! మహాత్మా! మార్గముం దెల్పవే. ౧౬

నేనే బ్రహ్మనంచుఁ బల్కెదను కానీ నేను గానేరకు
న్నా, నీనేనెది? నీవెఱుంగుదువుగానన్ నిన్నుఁ బ్రార్థింతు, న
జ్ఞానుండన్, భగవానుడా! తెలియు విజ్ఞానాంజనంబిచ్చి- నా
నేనున్ తానొనరించి ప్రోవఁగదవే! నిత్యస్వరూపోదయా! ౧౭

కాయం బింద్రియముల్ ధరించి మనుజాకారుండవై తోఁచి దే
వా! యీ ధారుణిలోపలన్ వెలయు సుబ్రహ్మణ్య దేవుండ వీ
మాయాబద్ధజగంబు నాత్మహితధర్మంబందు వర్తింపఁగాఁ
జేయన్ వచ్చితి వంద్రు సూరులుమహర్షీ! నిన్ను నిక్కంబుగన్, ౧౮

'జగ మఖిలము బ్రహ్మంబ' ని
'జగమనునిది బ్రహ్మమున నిజముగాదని, ప్ర
త్యగభిన్నము బ్రహ్మంబని
నిగమము లాడునది- తెలియ నేర్పు మహాత్మా! ౧౯

(జడవిజాచిత్తము తాను, ద్రష్టయును, దృశ్యద్రవ్యముంగాక యుం
డెడి, దిందున్ బ్రసరించు స్వాత్మరుచి-దృష్టృత్వము, దృశ్యత్వమున్
బడయున్, రెంటికి సామరస్యమును సంబంధించి; నానాత్మమై
చెదుగుల్ సేయ సహమ్మడంగునటు లాశీర్వాణి సాధింపుమీ!)

జాత్రిప్రీతివహింప, వాగమరహస్యాత్మ ప్రబోధక్రియా
ఖ్యాతిన్ మాదృశమూఢమానవుల నిత్యంబున్ ప్రబోధింతు, వో
తాతా! ఆత్మపదార్థముం దెలియు సత్యార్థంబు(సంధించి)నన్ దేల్పి-మ
చ్చేతః పూజఁబరిగ్రహింపవె! మహర్షీ! సత్యవిద్యాధునీ! ౨౦

బ్రహ్మశ్రీ తి. వి. కపాలిశాస్త్రిగారి అభిప్రాయము.

T. V. KAPALI SASTRI

Sri Aurobindo Asram.
Pondicherry.

శ్రీ విజయనగర మహారాజ కళాశాలాంధ్ర పండితులును, సాహిత్యవిద్యాప్రవీణులును, ఉభయ భాషా ప్రవీణాది పట్టములం బడసినవారునగు బ్రహ్మశ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి గారొనర్చిన సవ్యాఖ్యాన - ఉమాసహస్ర ఆంధ్రానువాదమునఁ గొన్ని భాగములను - నాకే చదివి వినిపించిరి. నేనపేక్షించిన పద్యములను వ్యాఖ్యలతో పఠించి శ్రావించిరి.

వృత్తఖండముంజూచి వృత్తముయొక్క పూర్తి నెఱుంగుట దుర్లభముకాదు. అర్థేందువును అపేక్షించి మండలము నెఱుంగుట సర్వసాధారణమేగదా!

వీరి గద్యముగాని, పద్యముగాని, అనాయాసప్రసన్నత్వములై మూలానుసారులై సహజములై, అందువలన ప్రశంసనీయములై యున్నవి. కావున ఈ యనువాదము నాకత్యంతసంతృప్తి నిచ్చెను.

'ఈయనువాదము — అనమానము' అనుట ఒకవేళ సందిగ్ధవచనము గాఁబోలు.

అనభ్యధికమనుట మాత్రము — అసందిగ్ధము.

శ్రీ అరవిందాశ్రమము
పాండిచేరి.
10—7—1946

ఇట్లు,
ఉమాసహస్ర వ్యాఖ్యాత.
తి. వి. కపాలిశాస్త్రి.

శ్రీ విజయనగర మహారాజ సంస్కృత కళాశాలా ప్రధానోపాధ్యాయులగు

బ్రహ్మశ్రీ పేరి వేంకటేశ్వర శాస్త్రులవారి

— అభిప్రాయము. —

శ్రీ వసిష్ఠకులావతంసులును, మహర్షికల్పులును, అపారమేధాశక్తిసంపన్నులును, ఉత్తరవిశాఖ మండలాంతర్గత కలవరాయి గ్రామవాస్తవ్యులును అగు బ్రహ్మశ్రీయుత అయలసోమయాజుల గణపతిశాస్త్రులవారిచే రచియింపబడిన ఉమాసహస్రమను నమూల్యగ్రంథమునకు - తన్మండలాంతర్గత చిట్టాయవలస అగ్రహార వాస్తవ్యులును శ్రీ విజయనగర మహారాజ సంస్కృత కళాశాలోపాధ్యాయులును, సాహిత్య విద్యాప్రవీణులును, ఉభయభాషాప్రవీణులును అగు బ్రహ్మశ్రీయుత పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారిచే రచియింపబడిన ఆంధ్రానువాదమును నేను కొంతవఱకు చూచితిని. శ్రీ గణపతిశాస్త్రులవారు ద్రావిడాంధ్రదేశములందు విశేషప్రఖ్యాతులు. ఋగ్వేదమునందు విశేషపరిశ్రమచేసి అందలి గూఢాశయములను బాగుగ నవగాహనము చేసికొన్నవారు. అద్వైత వేదాంతమునందు విశేష పాండిత్యముగలవారు. సాంఖ్యయోగాది దర్శనములయందును, అలంకారశాస్త్రమునందునుగూడ విశేషపరిజ్ఞానముగలవారు- అంతర్ముఖులు.

వీరు సహజసిద్ధమగు కవితాశక్తిగల్గి బాల్యమునుండియే సంస్కృతభాషయం దసంఖ్యాకములుగా గద్యపద్య రూపములగు కావ్యములను రచించిరి. వానిలో నీయుమాసహస్రము భావపూర్ణమై మృదు మధుర గంభీర శైలితో నలరారుచున్నది.

తపోలోకాదులు, అదితిదక్షులు, పార్వతీ జననము, మొదలగు వానిని గూర్చి శ్రీ శాస్త్రులవారు వ్రాసిన యంశములు పురాణ వాఙ్మయమును మాత్రమే చూచువారలకు కొంత అభూతకల్పనలుగ

కాన్పించును, కాని వైదిక వాఙ్మయమునుగూడ బాగుగ పరిశీలించి విమర్శక దృష్టితో నాలోచించినచో శ్రీ శాస్త్రిలవారి సమన్వయములు మిక్కిలి సమంజసములుగనే యుండునని భావించెదను.

ప్రకృతమున- ఈ గ్రంథరాజమున కాంధ్రానువాదకులగు శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిగారు కూడ ఆంధ్ర గైర్వాణ భాషలలో మంచి పరిజ్ఞానము గల్గి భగవత్ ప్రసాదితమైన కవితాశక్తిచే బాల్యము నుండియు మృదుమధురశైలిలో ననేకములగు సరస కావ్యములను, సంస్కృతాంధ్రములలో రచియించుచున్నవారు. వీరికి బాల్యము నుండియు ఆధ్యాత్మిక చింతనమున నాసక్తి మెండు. అందుచే వీరు కొన్ని ఉపనిషత్తులకును, ఇతరములైన ఆధ్యాత్మిక గ్రంథములకును ఆంధ్రానువాదములను, టీకా తాత్పర్యములను రచించి యాంధ్ర లోకమున కత్యంతోపకృతి నొనరించిరి.

ప్రకృతమునఁగూడ నీయుమాసహస్రము-ఉమాస్తుతిరూపమున సర్వజగదుపాదానమగు విశుద్ధ చిద్రూపమునే బోధించుచుండుటచేత వీరు దీనిని అన్యూనానతి ప్రసక్తముగ ననువదించి, అందలి గూఢార్థములను బాలకులు గ్రహించుటకై సుస్పష్టమగు భాషతో చక్కని వివరణమును గూడచేసిరి. [ఇటులనే వైతొమ్మిది శతకములను గూడ ననువదించి] ఆంధ్రలోకమునకు మహోపకృతిని శ్రీ శాస్త్రిగారు చేయఁగలరని విశ్వసించుచున్నాను.

పరమేశ్వరుడు శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిగారికి ఆయురారోగ్యములను, శుభ పరంపరలను కలుగఁజేసి అట్టి యవకాశమును ప్రసాదించుఁగాక! అని భగవంతుని ప్రార్థించుచున్నాను.

విజయనగరము
తే 1-8-1949

ఇట్లు
విద్వజ్జన విధేయుఁడు,
హరి వేంకటేశ్వర శాస్త్రి

బ్రాహ్మీప్రశంస

అమ్మ, పరేశశక్తి - పృథగాత్మ ధరించె విసృష్టి-నాదరూ
పమ్మున వాణియయ్యె, విభవమ్మున నిందిరయయ్యె, భోగభా
గ్యమ్మున గౌరియయ్యె, పరమామృతమూలతపస్స్వరూపచో
ద్యమ్మునసర్వహేతువు వుమయయ్యె, తగంబ-భజింతునిత్యమున్!

ఇట్లు

భక్తజనవిధేయుఁడు

పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి

★

ఓం నమో భగవతే, శ్రీ రమణాయ

శ్రీ భారతీదేవ్యై నమః.

ఉమా సహస్రము.

[ఆంధ్రప్రభా సహితము]

ద్వితీయ శతకమున ప్రథమ స్తబకము.

శ్రీఖణ్డ చర్చామివ కల్పయన్త్యో యాః కపోలేషు సఖీజనస్య
శ్రీకణ్ఠకాన్తా హసితాంకురాణాం శ్రీమన్తి కుర్వన్తు జగన్తి భాసః. ౧

చందనలేపమును సదా సఖీజనము కపోలములఁ బొందించు నదియుఁ బోలిన సర్వేశప్రియకాంతా బంధురహసితాంకురముల ప్రభా పరంపర, జగతీబృందమ్మును సౌభాగ్యాన్వితముగ నొనరించుఁగాత!

శివునికాంతయగు ఉమాదేవతయొక్క చిరునవ్వులు క్రొత్త మొలకలవలె నుండును. ఆనవ్వు మొలకలతళుకులు ఆయమ్మయొక్క సకియల చెక్కిళులందు మంచిగంధపుపూతను పూయుచున్నవి వలె నున్నవి. ఆ చిరునవ్వు మొలకల వెలుగులు లోకముల నన్నిఁటినిగూడ శ్రీమంతములుగా నొనర్చుఁగాత!

చందనలేపమున్ సఖుల- చారుకపోలములందు నిత్యమున్
బొందుగఁ గూర్చుచున్నదియుఁ బోలి వెలుంగు మహేశ్వరప్రియా
సుందర మందహాసముల శోభలు- స్వాత్మకళాలసజ్జగద్
బృందము నెల్లవేళలను శ్రీలలితంబు నొనర్చుఁ గావుతన్.

ఆంధ్రప్రభః— పర్వతరాజపుత్రి చెంతనున్న సఖీమణు లిద్దఱేయనియు వారు జయావిజయలనియు శివపురాణము నుడువుచున్నది. పార్వతికి బాల్యమునం దనేక సఖులుగలరని కావ్యసాహిత్యము తెలుపుచున్నది. మహాకవి కాళిదాసు కుమారసంభవమున "రేమే ముహుర్మధ్యగతా సఖీనామ్" (బహుసఖీమధ్యగతయై పార్వతి యాడుకొనియెను.) అని ప్రవచించెనుగదా!

ప్రస్తుతశ్లోకమున, 'జయావిజయుల కపోలములందు' అనిగాని "బహు సఖీజనుల కపోలములందు" అనిగాని అర్థమును గ్రహించి పురాణ - కావ్య ప్రసిద్ధులను రెంటినిగూడ సమన్వయించుకొనవచ్చును.

ఇందు 'ఇవ' అనునది ఉత్ప్రేక్షను తెలుపును. శుభ్రములగు పార్వతీ మందహాసకాంతులు - ఆమె ప్రియసఖుల కపోలములందు గంధపుపూతపూయుచున్నవా అనునట్లున్నవని యుత్ప్రేక్షింపఁ బడినది.

పార్వతీదేవి చిరునవ్వువెలుగులు సఖుల చెక్కిళులందు గంధమును పూయుచున్నను గంధము యథార్థము కాదు. అయినను అన్యధర్మసంబంధ నిమిత్తమున నవి సఖీకపోలములయందు గంధమును పూయుచున్నట్లు సంభావింపఁ బడినది.

అన్యధర్మ సంబంధనిమిత్తమున నొకానొక వస్తువున కింకొకవస్తువు తోడితాదాత్మ్యమును సంభావించుట - ఉత్ప్రేక్షయని చెప్పఁబడును.

ఇచట చిరునవ్వు మొలకలతళుకులు - గంధపుపూత పూయునవిగా సంభావింపఁబడినవి, అన్యమగు (ఉపమానమగు) చందనలేపమునందు శుభ్రత, శోభావహత, ఆహ్లాదకత, అను ధర్మములున్నవి. ఉపమేయమగు చిరునవ్వు మొలకలయందుఁ గూడ అధర్మములుండుటవలన, అచిరునవ్వు మొలకల తళుకులు - సఖుల చెక్కిళుల యందు గంధపుపూత పూయునవిగా ఉత్ప్రేక్షింపఁ బడినది.

ఇట్లు - ఇందొక వస్తువున కింకొకవస్తువుయొక్క - తాదాత్మ్యము చెప్పఁబడినది. కావున నిది స్వరూపోత్ప్రేక్షాలంకార మగుచున్నది.

మీఁదిశ్లోకమునందున్న 'ముహుః' (మాటిమాటికి) అను పదము చేతపూర్వాపరక్రమమున వ్యాపించిన హసితాంకురములకు అంతరము=తెరపి (అవకాశము) కలుగునని భ్రమింపఁగూడదు.

ఆ నవనవోద్భేదములు (హసితాంకురములు) నిరంతరములైనను ప్రసారభంగీ సౌభాగ్యమువలన ప్రత్యేకముగా భాసించుటచేత మరలమరల, తత్సఖీజనకపోలములయందుగంధమును పూయుచున్నట్లున్నవని సంభావింపఁ బడినది.

అచిరునవ్వు మొలకలనేకములైనను ఎడతెగక ఏకరూపములై యున్నను క్రొంగ్రొత్తలై వెలుంగుచు వ్యాపించుచుండుట లోకోత్తర రామణీయక వ్యంజకమగుచుండును. "క్షణే క్షణే యన్నవతాముపైతి తదేవరూపం రమణీయతాయాః" (ప్రతిక్షణమునందును క్రొత్తఁదనమునొందుటయే రమణీయతాస్వరూపము) అని మాఘకవి ప్రవచించెను.

సఖీ కపోలములయందు మందహాస కాంతుల విలాసమును తెలుపుటవలన, ఆ సఖులు దేవీసవయస్కలు, సమానాకారలు అను సంశము స్ఫురింపఁ జేయఁబడినది. దానిచేత, నవోఢయగు పార్వతి శ్రీకంఠ కాంతయయిన పిమ్మటగూడ. సఖీ సహచరియేయను సంశము ధ్వనింపఁజేయఁబడినది. ఈస్తబకమున దేవీ నవయౌవన-పరిణయ కల్యాణవార్తలే ప్రస్తావింపఁబడినవి.

కీర్తిర్వలక్షా కుసుమాయుధస్య
స్వర్ణాద్రికోదణ్డ జయోన్నతస్య
దరస్మితశ్రీర్ద్విరదాస్యమాతు
ర్ద్రాఘీయసీం వోవితనోతుభూతిమ్. ౨

బంగరుకొండ విల్లుగాఁగలిగిన శివుని జయించుటచేత నున్నతి నొందిన పుష్పబాణుని (పూవులే యమ్ములుగాఁగలిగిన మన్మథుని యొక్క) శుభ్రకీర్తి (కీర్తికిహేతువు) అగు గజాననజననీమందస్మిత ప్రభ - మీకు చిరస్థాయియగు సంపదను విస్తరింపఁజేయునుగాత !

ఆంధ్రప్రభ:— త్రిపురసంహారోద్యుక్తుఁడగు శివుఁడు సర్వోన్నతమగు మేరుపర్వతమును విల్లుగాఁబూనెను. కావున వ్యోమకేశుఁడగు;(ఆకాశమేజుట్టుగాఁ గలవాఁడగు) అతఁడా ధనువుకంటెనుగూడ నధికోన్నతుఁడని యూహింపవలసియున్నది. స్వశరీరదాహముచేతనైనను పార్వతియందు వలపుఁగలిగించి, మహోన్నతుఁడగు నాభగవానుని జయించిన మన్మథుఁడు మహామహోన్నతుఁడగుచున్నాఁడు. మఱియు శైలధనుష్కుఁడగు మహేశ్వరుని పుష్పాయుధుఁడగు పంచశరుఁడు జయించెననునిది మన్మథున కలౌకికమగు నద్భుతప్రభావాతిశయమును స్ఫురింపఁజేయుచున్నది. పార్వతీమందస్మిత ప్రభయే, పంచబాణునికీర్తికి హేతువుగాఁ జెప్పఁబడుటవలన నది యతనికంటెనుగూడ నున్నతమను నంశము ధ్వనింపఁజేయఁబడుచున్నది. కుసుమాయుధునికీర్తి- వలక్షమని చెప్పఁబడినది. వలక్షమనఁగా శుభ్రమని (తెల్లనిదని) యర్థము.మన్మథుఁడు బ్రహ్మ-మొదలు పురుగువఱకునుగల త్రిలోకములనుజయించును అజయించుటచేతఁగూడ తత్కీర్తికి హరవిజయముచేఁ గలిగిన శుభ్రత కలుగుటలేదు- మన్మథుఁ డేలోకములను జయించెనో ఆలోకములన్నియు పార్వతీపరమేశ్వర సంభూతములగుటచేత, తత్పరిణయ పర్యవసాయియగు జయముచేతనే రతీపతి కీర్తికిట్టివలక్షత (తెల్లఁదనము) కలిగినదని గ్రహింపఁదగియున్నది.

శివ— శక్తియోగరూపమగు కారణము [illegible]. కావున నేయనంగునికీర్తి నిర్మలమగుచున్నది.

హరివిజయముచేత పుష్పాయుధునకుఁ గలిగినకీర్తికి పార్వతీ మందహాసిత ప్రభయే హేతువగుచున్నది. అమ్మవారియొక్క చిరునవ్వు లేనియెడల— అనంగునికి హరివిజయము సిద్ధించునది కాదుగదా! అయినను, హేతుహేతుమంతులకు (కార్యకారణములకు) అభేదాధ్యవసాయమువలన, కీర్తికి హేతువుగాఁ జెప్పందగిన దేవి మందస్మిత ప్రభ— (కుసుమాయుధుని) కీర్తిగాఁ జెప్పఁబడినది. కావున నిది హేత్వలంకారమగుచున్నది.

"హేతుహేతుమతోరైక్యం హేతుంకేచిత్ ప్రచక్షతే"

"కారణమునకును– కార్యమునకునుగల ఏకత్వమును హేతువని కొందఱు చెప్పుదురు" అనునది హేత్వలంకార లక్షణము.

ప్రమథ్య మానామృతరాశివీచి
ప్రోద్గచ్ఛదచ్ఛాచ్ఛ తుషారకల్పాః ।
యుష్మాకమిచ్ఛాంవిదధత్వమోఘాం
విఘ్నేశమాతుర్దరహాసలేశాః ॥ 3

శీఘ్రముగను ప్రబలముగను మథింపఁబడుచున్న పాలకడలి యొక్క కెరటములనుండి లెస్సగా వెలువడుచున్నవియు, మిక్కిలిస్వచ్ఛములును, అగు నీటితుంపరల (శీకరముల) వంటివగు గణపతిమాతృ (పార్వతీ) మందస్మితప్రభలు - మీయభీష్టమును విఫలముగాకుండునట్లు చేయునుగాత!

ప్రభ:— ఇందు గణేశ్వరమాతృ. మందస్మితము స్తుతింపఁబడినది. దీని చేత- భక్తులకభీష్టములను సిద్ధింపఁజేయు నాశీస్సులు కావింపఁబడినవి. నిర్మలములును; ప్రసన్నములును, సుఖస్పర్శములును, అగు అమృతశీకరములు—మందస్మితప్రభ లకుపమానములుగాఁ జెప్పబడినవి. కావున, దీనిచేత మందస్మితప్రభలకుఁ గల సుఖ స్పర్శైకవేద్యత్వమును- అదృశ్యవిలాసత్వమును ధ్వనింపఁజేయఁ బడుచున్నవి.

చన్ద్రాతపః కల్పన సమ్భవనో్న
మహేశనేత్రా తిథితర్పణోనః

మనోభిలాషం సఫలీకరోతు
మహేశ్వరీహాసలవప్రకాశః ॥ ౪

మహేశ నేత్రములను అతిథులను తృప్తినొందించునదియు సంప్రసన్నమును, చంద్రాతపవిశేషరూపమును అగు మహేశ్వరీహాసలవప్రకాశము మా మనస్సునందున్న యభీష్టమును సిద్ధింపఁజేయుఁగాత!

ప్ర భ:— అతిథులనఁగా పనిమీఁదవచ్చిన భోజనార్థులని యర్థము.

ఇందు— చంద్రాతప— హాసలవప్రకాశములకు తాద్రూప్యమును చెప్పుటవలన నిచట రూపకాలంకారమగును. అయినను మహేశ్వరీహాసలవప్రకాశమునఁ బారోప్యమాణమగు చంద్రాతపవిశేషము— మహేశనేత్రములను అతిథులను సత్కరించుటయం దుపయోగించుటవలన పరిణామమే అలంకారమగునని గ్రహింపనగును.

సుఖశీతల— అమృతగర్భ— చంద్రాతపవిశేషముచే హాసలవముచేత, మహేశ్వరలోచనముల కమృతాశనత్వము సిద్ధించునపుడు, సర్వేశదృష్టి సంతర్పణమగు ఆహాసలవము మనోఽభిలాష పూరణముచే సకలతాపములనుగూడ నుపశమింపఁజేయుటకు సమర్థమగునను వస్తువు— పూర్వోక్తమగు పరిణామముచే ధ్వనింపఁజేయఁబడుచున్నదని యెఱుంగునది.

వలక్షవక్షోజపటాఞ్చలేన
చలేనసార్ధం కృతకేలయోనః
పురత్రయారాతికలత్రహాస
భాసోనిరాసం విపదాంక్రియాసుః ॥ ౫

చలించుచున్న తెల్లని వక్షోజపటాంచలముతోఁ (ధవళోత్తరీయాగ్రముతోఁ గూడ) పరిహాసములాడుచున్న పురత్రయారాతియగు శివుని కళత్రమగు పార్వతియొక్క మందహాసప్రభలు మా యాపదల నన్నింటిని నివారించునుగాత!

ప్ర భ:— ఇది యాశీరూపమగు ప్రార్థనయైయున్నది. పార్వతీదేవియొక్క శుభ్రస్మిత కాంతులకును—శుభ్రోత్తరీయ వస్త్రాచలాంచలముతోఁగూడి చేయఁబడుచున్న కేళులకును—గల అనురూపతవలన నిది సమాలంకారమని చెప్పఁబడును.

"[illegible]" అని [illegible] మున [illegible] చెప్పబడినది.

భూయాసురాయాసహరాణి తాని
స్మితాని భూతేశవధ్వాః [illegible]
యేషాంత్విషాబిభ్రతి దిగ్వధూటీ
గణ్డేషు కర్పూర పరాగ లీలామ్. ౬

దిక్కులను కాంతల చెక్కిళులయందు కర్పూరపరాగలీలను భరించుచున్న కాంతులుగల శివునిదరహాసములు మాశ్రమనపన యించునుగాక !

ప్ర థ:— [illegible] పరమేశ్వరుడు భూతేశుడు. [illegible] చెప్పబడును. కావున "భూతేశవ్య [illegible]" అను సర్ధమేర్పడుచున్నది. ఇచట [illegible] స్మిత కాంతులయందు [illegible] పదార్థమారోపితము. కావున నిది పదార్థవృత్తి [illegible] నున్నది.

అలంకారికుడు [illegible] చెప్పయున్నాడు.

కుర్వన్తు కామం సఫలం త్వ (మ)దీయం
కులాద్రికన్యా హసితాని తాని
యేషాం మయూఖైః క్రియతే సితాద్రే
రుద్యానవాటీషు నవో వసన్తః ॥ ౭

హిమాచలోద్యాన వాటికలయందు స్వకీయకాంతుల చేత క్రొత్తదగు వసంతమును (కుసుమప్రసవసమయమును) కల్పించుచున్న కులాద్రికన్యయగు పార్వతియొక్క మందస్మితములు— త్వ (మ) దీయ మగు మనోరథమును సఫలము నొనర్చునుగాత !

ప్ర థ:—కులపర్వతములు సప్తసంఖ్యాకములు. అందు హిమాచల మొకటై యున్నది. కావున పార్వతి కులాద్రికన్యయగుచున్నది.

ఉమాహసితమయూఖములు నిత్యసన్నిహితములగుటచేత వసంతమునకు నిత్య కుసుమితో[illegible]ను నవత్వము సిద్ధించెడిని.

ఉపవన పంక్తులయందు నిత్యమును అభినవమును అగు వసంతవిలాసమును గూర్చుటవలన, ఆహసితమయూఖములకు అమృతాత్మకత్వము (చంద్రత్వము) ధ్వనింపఁజేయఁబడుచున్నది. ఓషధీశుఁడగు చంద్రుఁడు అమృతకిరణుఁడుగదా!

[పార్వతీ హసితమయూఖములు– అమృతాత్మకములు కావున నీహిమాచల ప్రాంతములందలి ఉపవనములయందు నిత్యకుసుమాకరమగు వసంతమును సృజించినవని భావము]

"ఆరోప్యమాణమారోప విషయాత్మతయాస్థితమ్
ప్రకృతస్యోపయోగిత్వే పరిణామ ఉదాహృతః"

"ఆరోపింపఁబడిన వస్తువు– ఆరోపవిషయరూపమున పరిణమించి ప్రస్తుతార్థమున కుపయోగించునెడల పరిణామమని చెప్పఁబడును" అను లక్షణమునుసరించి ఇచట నారోప్యమాణములు (గమ్యమానములు) అగుణాఅమృతమయూఖములు.ఆరోపవిషయమగు స్మితమయూఖస్వరూపమున పరిణమించి క్రొత్తదగు వసంతమును రచించుటయందుపయోగించుటవలన పరిణామ మలంకారమగుచున్నది.

'ఆమ్రేడితం' భూషణచన్ద్రభాసాం
నాసావిభూషామహసాం 'ద్విరుక్తిః'
పురారినారీ స్మితకాన్తయో మే
పూర్ణానికుర్వన్తు సమీహితాని. ౩

శివశిరో ఽలంకారభూతములగు చంద్రకాంతులకు ఆమ్రేడితమును (ద్విస్త్రిరుక్తమును) నాసికాభరణ మణిద్యుతులకు ద్విరుక్తి (పునరుక్తి)యు నగు పురరిపువగు పరమేశ్వరునియొక్క కాంతయగు పార్వతి చిరునవ్వు మెఱుపులు మాయభీష్టములను సిద్ధింపఁజేయునుగాత!

ప్రభ:——భూషణమగు బాలచంద్రుని కాంతులు–పార్వతీస్మిత కాంతులయందు భిన్నవిభక్తిచేత నారోపింపఁబడినవి–కావున నిది వైయధికరణ్యముచేతనగు రూపకమగుచున్నది.

విషయమునకు- విషయితోడి- అభేదతాద్రూప్యారంజనము -రూపకమనులక్షణము సమకరించి ఇందు విషయమగు (ఉపమేయమగు) చిరునవ్వుకాంతులకు విషయియగు (ఉపమానమగు) భూషణచంద్రకాంతులతోడి యభేదతాద్రూప్యరంజనము గావించుచున్నది గదా!

అవ:- నిఖిలనిర్మాణనిశ్శ్రేయసంపాదకములు- సర్వాభీష్టప్రదాయకములు, అగు భగవతీదరహాసముల నిట్లైనిమిదిశ్లోకములచే స్తుతించి- "నిర్మాయ" అను క్రింది శ్లోకము మొదలు స్తబకము ముగియువఱకును పరిణయకల్యాణవార్తలను వర్ణింపఁగోరిన మహాకవి - ఇచట ప్రసక్తమగు తదంగబంధసౌందర్యాదికమును వర్ణించుచున్నాఁడు.

నిర్మాయవిశ్వాలయ మమ్బ! శర్వ
స్త్వయా సమం శిల్పవిదా స శిల్పీ
విహర్తుమిచ్ఛన్నయి వోఢుమైచ్ఛ
న్నారీంధవస్త్రీం పురుషోభవంస్త్వామ్.

అమ్మా! సర్వేశ్వరుఁడగు నాశివుఁడు స్వయముగా నిర్మాణకళావిచక్షణుఁడగు శిల్పియైయున్నాఁడు. నీవును శిల్పమర్మజ్ఞవే యగుచున్నావు. కావున శిల్పజ్ఞవగు నీతోఁగూడి శిల్పవిదుఁడగు నతఁడు మొదట బ్రహ్మాండమను ఆలయమును నిర్మించెను. తరువాత నచట విహరింపఁగోరిన శివుఁడు స్వయముగా పురుషుఁడై స్త్రీరూపమున జాయమానవగు నిన్నుఁ బెండ్లియాడఁగోరెను.

ప్రథ:—అంబాసహచరుఁడగు సర్వేశ్వరునిచేత విహారార్థమగు విశ్వనిర్మాణము నిర్వర్తింపఁబడినపిమ్మట వారికి, స్త్రీ- పురుషులై- భార్యాభర్తలగుటకు కోర్కె- కలిగెను. ఇట్లు విశ్వాలయనిర్మాణప్రారంభికయగు నిచ్ఛ జగన్మాతాపితృత్వబీజభూతదాంపత్యనిర్వాహిక యయ్యెనని భావము.

• ఆలయనిర్మాణేచ్ఛ- దాంపత్యమును సంఘటించెనని తాత్పర్యము,

దివ్యం దుకూలం ధవలం దధానా
వేణ్యాఫణీన్ద్రోపమయా లసన్తీ

పరిఫుల్ల రాజీవ విలోచనాత్వాం
పరిపశ్యభర్తుర్నయనాన్యహార్షీః. ౧౦

దివ్యలోకమునం దుదయించినదియు, తెల్లనిదియు అగు వస్త్రమును ధరించి నాగేంద్రునితో సాటియగు వాల్జడతోఁ బ్రకాశించుచు, వికసించిన కమలములవంటి కన్నులుగల నీవు జగత్పతియగు ముక్కంటి నయనములను సమాకర్షించితివి.

ప్ర భ:— శివునియొక్క సోమ- సూర్య- అగ్ని నేత్రములను హరించి (దొంగిలించి) జయించిన నీసరోజనేత్రముల సౌభాగ్యమనిర్వచనీయమని భావము. 'నయనాని' అను బహువచనముచేత పార్వతీసందర్శనమువలన హరుని జ్వలననేత్రముకూడ నిర్వీర్యమయినదని చెప్పఁబడినది. ఇచట నైల్యము- మసృణత్వము- మొదలగు సమానధర్మములవలన వేణీబంధ- భోగీంద్రులకు ఔపమ్యము చెప్పఁబడినది. పార్వతిధరించిన పరిధానముయొక్క ధవళిమ- వేణీనీలిమయొక్క లావణ్యమును పోషించునని గ్రహించునది.

ప్రత్యఙ్గబన్ధం జ్వలదుత్తమం తే
భుజఙ్గ రాజోపమవేణి-రూపమ్
ఆత్మైకనిష్ఠస్యచ విశ్వభర్తు
రారాధయామాస 'విలోచనాని.' ౧౧

ముఖ- వక్షోజ- భుజలతాద్యంగములయందు పరిస్ఫుటమును సర్వలక్షణ లక్షితమును, సర్పరాజోపమవేణియు నగుచు అంగసౌష్ఠవసంపన్నమగు నీరూపము- స్వాత్మయందే కేవలమగు దృఢస్థితిగలవాఁడయినను గూడ విశ్వభర్తయొక్క విలోచనములను (మూఁడింటిని)గూడ నారాధించినది. (తృప్తినొందించినది.)

ప్ర భ:— లోకోత్తరమగు సౌందర్యమును జూచుటచేతఁ గలిగిన చల్లఁదనముచేత, అగ్నిరూపమగు తృతీయనేత్రమునకుఁగూడ శాంతికలిగెను. నీయొక్క రూపముచేతఁ జేయబడిన యారాధనము- తథావిధమగు శాంతిజనకమని భావము.

మీఁది శ్లోకమున అప్యర్థకమగు ('కూడ' అనునర్థముగల) చకారమువలన ఆత్మైకనిష్ఠుఁడగుటచేత- అన్యవిషయము లేకుండుట- అనిర్వాచ్యమగు ధీరత- విశ్వ

భర్తయగు శివునికి సిద్ధించుచున్నను, తన్నయనాకర్షకమగు లావణ్యసౌభాగ్యమువలన ఉమాదేవీరూపము- భగవంతుఁడగు హరుని హృదయమునఁబ్రవేశించి, యతనిధీరతను పెకలించి తన్నయనముల నారాధించెనను నంశము మీఁదిశ్లోకమున స్ఫురింపఁజేయఁబడుచున్నది.

విషయవిముఖుఁడును కామదాహియునగు పరమేశ్వరుని నేత్రత్రయమును తృప్తి నొందించుట అర్థసిద్ధి. నయనత్రయసర్పణ రూపపదార్థనిష్పత్తి కిచట అసంభావనీయత్వమును వర్ణించుటవలన నిది అసంభవాలంకారమగునని యెఱుంగునది. "అసంభవోఽర్థనిష్పత్తే రసం భావ్యత్వవర్ణనమ్" (అర్థసిద్ధికి అసంభావ్యత్వమును జెప్పుదుమేని అసంభవాలంకారమగును) అనునది తల్లక్షణము.

అభూస్త్వ మాద్యస్య మనోమదాయ
నచాపి తే ప్రీతిపరం బభూవ
న కేవలం వాం సకలస్య చాసీద్
దామ్పత్య బన్ధస్య తగమ్బ! బీజమ్. ౧౨

అమ్మా! నీ వాదిపురుషుని మనస్సును హరింపఁజేసితివి. అతఁడు కూడ నీయొక్క ప్రీతికి స్థానమయ్యెను. ఇట్లు పరస్పరమగు మీ ప్రేమ ప్రభావము (కేవలమును) మీ యిరువురియొక్కయు దాంపత్యబంధనము నకేగాక లోకములందున్న సర్వ ప్రాణులయొక్కయుఁగూడ దాంపత్య బంధనమునకు బీజమై (కారణమై) యున్నది.

ప్ర థ:— సర్వమునకును మూలభూతుఁడును, సర్వపురుషులకును ప్రథముఁడును, అగుటచేత సర్వేశ్వరుఁ డాదిపురుషుఁడైయున్నాడు. జాయా చపతిశ్చదమ్పతీ, తయోర్భావః=దామ్పత్యమ్" అను వ్యుత్పత్తిచేత భార్యాభర్తృభావము దాంపత్యమని చెప్పబడును.

ఒండొరుల కెడబాటులేని దాంపత్యమే దాంపత్యబంధమని చెప్పఁబడును. బీజశబ్దమునకు కారణము, విత్తనము, అను నర్థములుగలవు.

ఉమా- మహేశ్వరుల కొకరియందొకరి కొదవిన ప్రేమబంధము, మొదట, తద్ దాంపత్యసంపాదకమయి, తదుపరి, తత్ఫలితమును జగద్రూపమును అగు అపత్యమునుండి యేర్పడిన స్త్రీ- పురుష రూపలోకగతమగు దాంపత్యమున కంతకును గారణమయ్యెనని భావము. (శివా) శివునకొదవిన అన్యోన్యప్రేమ-బీజమని చెప్పఁ

బడుటచేత వారి దాంపత్యము- వృంతము తొడిమ)అను నంశము బంధశబ్ద ప్రయోగమువలన ధ్వనింపఁజేయఁ బడుచున్నది.

"ప్రసవ బన్ధనము వృంత"మని చెప్పఁబడును. వారి దాంపత్యమునకు ఫలము జగద్రూపమగు నపత్యమని యూహింపఁదగియున్నది.

జగద్రూపమగు సంతతిలేనియెడల జగదీశ్వర దాంపత్యమునకు వైయర్థ్యముగాని శైథిల్యముగాని సంభవించెడిని.

భవభూతి యీయంశము నిట్లు చెప్పియున్నాఁడు.

శ్లో॥ "అన్తఃకరణతత్త్వస్య దమ్పత్యోః స్నేహసంశ్రయాత్
ఆనన్దగ్రన్థి రేకోఽయమపత్యమితి పఠ్యతే".

(జాయాపతుల హృదయమునకు, స్నేహమును అవిశ్లేషమును ఫలముగాఁ గలిగిన ఆనందమయమగు గ్రంథి- అపత్యమని చెప్పఁబడును)

ఇచట పరమేశ్వరీ- పరమేశ్వరులకు పరస్పరప్రేమాధాన రూపమగు నుపకారమువలన అన్యోన్యమను నలంకారమగుచున్నది.

తవాతికాన్తా నయనాన్తనృత్తి-
ర్హాసః పురారేశ్చ నవేన్దుహారీ
ఉభౌ వివాహోత్సవ పూర్వరఙ్గం
నిర్వర్త్తయామాసతురాదిరామే! ౧౩

ఆదిసుందరీ! నీ నయనాంతవృత్తి- (కడకంటి చూపులవిలాసము) **అత్యంతమును** కమనీయ. పురారియగు శివునిహాసముకూడ బాలచంద్రుని వలెమనోహరము. ఈరెండును (ఈయిద్దఱును) మీవివాహోత్సవమునకు పూర్వరంగమును నిర్వర్తించినవి. [నిర్వర్తించిరి.]

ప్ర భ:— సుఖమును పుట్టించునది ఉత్సవము.

"పూర్వమ్ రజ్యతే అస్మిన్నితి పూర్వరఙ్గః" అను వ్యుత్పత్తిగల పూర్వరంగము విఘ్నములను శమింపఁజేయు కర్మవిశేషమైయున్నది.

ఉమాదేవియొక్క కమనీయకటాక్ష విలాసరూపయగు వృత్తియు, అర్ధేందునివలె రమణీయమగు శివుని మందహాసమును మిళితములై నిర్విఘ్నమగునట్లు పాణిగ్రహణమహోత్సవమును నిర్వహించినవని భావము. పూర్వరంగమను పదముచేత- పార్వతీ- పరమేశ్వరోద్వాహము- నాట్యముగా స్ఫురింపఁజేయఁబడుటచేత నిచట

రూపకాలంకారము, ధ్వనించుచున్నదని తెలియనగును. నాట్యశాలయు, ఆనాట్యశాలయందగు రంగవిఘ్నములను తొలఁగించుటకు చేయబడు నాందీపాఠ- గీత- వాద్యాది వివిధాంగకర్మ విశేషమునుగూడ- పూర్వరంగమని చెప్పఁబడును.

మీఁది శ్లోకమున "నయనాన్తవృత్తిః" అను స్త్రీలింగముయొక్కయు, హాసః, అను పుంలింగముయొక్కయు స్వారస్యమువలన పూర్వరంగము నొనర్చు నటీనటులు ధ్వనింపఁ జేయఁబడుచున్నారు.

వివాహకాలమున లజ్జనొందిన నవవధువునకు నయనాంతవృత్తియు, వరునకు మందహాసమును వర్ణించుట ఔచిత్యపోషక మగుచున్నది.

ఉత్తరభాగమునఁజూపఁబడు "బ్రహ్మర్షి రజ్జభాజోనట్యాః" శివసూత్రధార సహచర్యాః" అను శ్లోకముగూడ ఏతత్సజాతీయమని గుర్తించునది.

దాతుం ప్రభుః సాన్త్వయితుం సమర్థః,
కర్తుం క్షమ, స్తర్జయితుంచశక్తః
సంరక్షతాన్మాం తవసర్వవన్ద్యే!
కరస్తుషారాంశుభృతా గృహీతః. ౧౪

సర్వప్రాణివంద్యవగు జననీ! భక్తలోకమున కభీష్టమును దానముచేయుటకు ప్రభువును, ఆశ్రితులను సంతోషింపఁజేయుటకు సమర్థమును, సర్వతంత్ర స్వతంత్రమగుటవలన దేనినయినను స్వేచ్ఛననుసరించి భేదముచేసైనను సాధించుటకు తగినదియు, శత్రువులను భయపెట్టుటకు శక్తిగలిగినదియు చంద్రధరునిచేత గ్రహింపబడినదియు నగు నీహస్తము నన్ను సంరక్షించుగాత!

ప్ర భ:— మీఁది విశేషణములవలన ఉమాహస్తము- సామ- దాన- భేద- దండోపాయ దక్షమను నంశము తెలియఁజేయఁబడినది. వివాహమున గ్రహింపఁబడుటవలనను, రక్షణపరాయణముగా ప్రసిద్ధమగుటవలననుగూడ నిచట విశేషింపబడినది- దేవిదక్షిణహస్తమే యగుచున్నది- సర్వేశ్వరునిచేత గ్రహింపఁబడిన హస్తమునకు సామాది సామర్థ్యము స్వారస్యావహమని యెఱుంగునది. ఒక్కటియే యగు హస్తమునకిట్లు దాన- సాంత్వన- కరణ- తర్జనముల నుల్లేఖించుటవలన నిచట నుల్లేఖాలంకారమని గ్రహింపనగును.

స్ప్రష్టుం నశక్యా పరమేవ రైస్త్వం
నచాన్య యాచిన్తయితుం నశక్యః
త్వమేవశర్వస్య సఏవ తేఽస్య
దామ్పత్యమేవం యువయోస్తు సత్యమ్॥ ౧౫

అమ్మా! నీవే ఉత్తమురాలవు. ఈశ్వరునికంటె నితరులు నిన్ను స్పృశింపఁజాలరు. నీకంటె నితర లతనినిగూడ చింతింపఁజాలరు. శర్వునకు నీవే యున్నావు. (అన్యస్త్రీ లేదు)నీకతఁడే యున్నాఁడు. (అన్యుఁడు లేఁడు) కావున ఇట్లు మీయొక్క (శివశక్తులయొక్క) దాంపత్యమే సత్యము. (తదితరమగు దాంపత్యము సత్యముకాదు)

ప్ర భ:— ఇచట శివ- శక్తులదాంపత్యము- అన్యోన్యాత్మకము-అవియోజ్యము (ఎడబాటులేనిది)'అని చెప్పఁబడినది.

కావున సత్యమగు। నీదాంపత్యము- అవికారి (మార్పులేనిది) అగును. తదితరము- అవికారి। కానేరదు.

పరమార్థమున శివశక్తుల దాంపత్యమొక్కటియే సత్యము. పుం, జాతియంతయు శివమూలము.

స్త్రీజాతియంతయు శక్తిమూలము. కావున లోకమునందు తదితరములగు దాంపత్యములన్నియునుగూడ తద్వివర్తములే (సత్యమగు నాదాంపత్యమునందు కల్పితములే)యని తెలియునది.

నిజాద్ వతంసేన్దుత ఇన్దుమన్య
ముత్పాద్య తేశమ్భు రదాద్వతంసమ్
మూర్తామివాసౌ శుభగాత్రి! రాత్రిం
ప్రాప్య త్వదీయాం కబరీం చకాసే. ౧౬

శుభగాత్రివగు (మంగళాంగివగు) జననీ! శివుఁడు నిజశిరోఽలంకారభూతమగు చంద్రునినుండి వేరొకచంద్రుని సృజించి నిన్నలంకరించెను. భూషణరూపుఁడగు నాచంద్రుఁడు నీకేశవేశమును రూపొందిన రాత్రినివలె నాశ్రయించి మిగుల బ్రకాశించెను.

ప్రథ:—వివాహ కాలమున నవవధువున కలంకారము నొసంగుట సంప్రదాయ సిద్ధము. కావుననే పరిణయ సమయమున వరుఁడగు శివుఁడు స్వాత్మశిరోభూషణము నుండి వేతిలోకభూషణమును స్రుజించి వధువగు పార్వతికి శిరోభూషణముగాఁ జేసె నని భావము.

ఇచట నైల్యసాధర్మ్యమువలన పార్వతీకబరికి నిశా-తాత్పర్యము సంభావింపఁ బడినది. కావున నిది స్వరూపోత్ప్రేక్ష యగును. చకాసే (బభాసే) అను చోట, శివుని పిశంగ జటాగతభూషణముకంటె, పార్వతీ నీలకబరీగత భూషణము యొక్క— 'భాసనాతిశయము' స్ఫురింపఁజేయఁబడుచున్నది.

బభూవిథా గేన్ద్రి గృహే యదా త్వం
స చేశ్వరస్తత్ర చకార వాసమ్
విలోకమానస్తవ దేవి! విద్యుత్
పాఞ్చాలికాయాః కమనీయభావమ్. ౧౭

దేవీ! (బాల్యమున) పర్వతరాజగు తండ్రియింట నీవునివసించుచున్నపుడు విద్యుత్పాంచాలికవగు (జాజ్వల్యమానమగు మెరుపుతోఁ జేయఁబడిన యాటబొమ్మవలెనున్న) నీయొక్క రామణీయకమును విలోకించుచు, నాయీశ్వరుడుకూడ నచ్చటనే నివసించియుండెను.

ప్రథ:— ఇందలి విద్యుత్పదముచేత- జ్యోతిరుజ్వలరామణీయక సంపన్నము- హారనయనాకర్షకమును అగు- తన్వీత్వమును(సూక్ష్మస్థితి) గమింపఁ జేయఁబడుచున్నది. ఇది స్వతస్సంభావితమగు వస్తుధ్వని.

సిద్ధం న వాం సాధయితుం ప్రవృత్తో
యోగం ప్రదగ్ధో మదన శ్చకల్పే
'పతీతి'కీర్తిం గిరిశస్యభర్తుం
తుభ్యం 'త్వవన్నే'తి యశః ప్రశస్తమ్. ౧౮

ప్రసిద్ధుఁడగు నామన్మథుఁడు, నిత్యసిద్ధమగు యోగమును అనఁగా శివ- శక్తి దాంపత్యరూపమగు సంబంధమును సాధించుట కుపక్రమించి శివనేత్రాగ్నిచేత భస్మముగాఁ జేయబడి-శివునకు వశి (జితేంద్రియుఁడు) అనుకీర్తిని పోషించుటకును, శివునందలి ప్రణయమువలన తపస్సు నాచరించునపుడు, పర్ణములను (ఎండినయాకులను) గూడ భుజింపకుండుట వలన నీకు 'అపర్ణ' అను యశమును గలుఁగఁజేయుటకును సమర్థుఁడయ్యెను. ప్రియలాభముకొఱకు మిక్కిలి కష్టమగు తపస్సు నాచరించిన పార్వతికి 'అపర్ణ' అనునామము ప్రసిద్ధము.

మహాకవియగు కాళిదాసు—

"స్వయం విశీర్ణ ద్రుమపర్ణవృత్తితా
పరాహికాష్ఠా తపస స్తయాపునః
తదప్యపాకీర్ణమితి ప్రియంవదాం
వదన్త్యపర్ణేతి చ తాం పురావిదః"

స్వయముగా రాలి-యెండినయాకులనుభుజించుట- తపస్సునకు పరాకాష్ఠ యగుచుండును. అట్టి పర్ణములను (ఆకులను) గూడ విడుచుటవలన ప్రియంవదయగు పార్వతిని- పురావిదులు- ,అపర్ణ, అని చెప్పుదురు."

అని స్వకృతకుమార సంభవమున పంచమసర్గమందలి పదునెనిమిదవశ్లోకమునఁ జెప్పియున్నాఁడు.

ఇచట సిద్ధమగు పార్వతీ-పరమేశ్వరయోగమును సాధించుటకయిన మన్మధుని ప్రవృత్తి-హేతువు. శివునకు వశియనుకీర్తిని సంధించుటయు, ఉమకు- అపర్ణ యను యశమును గలిగించుటయు ననునవి హేతుమంతములు (కార్యములు).

ఇట్లు హేతుమంతముతోఁగూడ హేతువును వర్ణించుటవలన నిది హేత్వలంకారమగుచున్నది. చంద్రాలోకమునందిట్లు చెప్పబడినది.

,,హేతో ర్హేతుమతా సార్ధం వర్ణనం హేతురుచ్యతే
అసావుదేతి శీతాంశుర్మానచ్ఛేదాయ సుభ్రువామ్"

హేతువును హేతుమంతముతోఁగూడ నొకేవాక్యమున వర్ణించుట హేత్వలంకార మనఁబడును. హేతువువలన నగుకార్యము హేతుమంతమని చెప్పఁబడును,

ఉదా:- "చక్కని కనుబొమలుగల కాంతలమానమును (కోపమును) ఛేదించుటకై చంద్రుఁడు ఉదయించుచున్నాఁడు.

ఘోరం తపశ్చేద్రచితం త్వయాఽపి
ప్రాగ్భోగిపభర్తుః సమనుగ్రహాయ
విహాయ యత్నం క ఇహాఖిలాప్య
సమృద్ధమప్యర్థ ముపైతు జన్తుః? ౧౯

ఓ సర్వలోక జననీ! పూర్వరూపమున (సతీదేవిగా నున్నపుడు) నీకు భర్తయగు నీశ్వరుఁడు నిన్నంగీకరించి యనుగ్రహించుటకొఱకు నీవుకూడ, నిరశనవ్రతసాధ్యమగు ఘోరతపము నొనర్చునెడల ఈ లోకమునందున్న జంతువెవ్వఁడైనను ప్రయత్నమును విడిచి- సిద్ధము గాని సాధ్యముగాని యగుచు సంబంధించియున్నను స్వాభీష్టవిషయము నెట్లు పొందును?

ప్ర భ:— పూర్వము సిద్ధించిన భర్తయొక్క అనుగ్రహముకొఱకు జగన్మాత యగు పార్వతికిఁగూడ తపశ్చరణ మావశ్యకమగునెడల ఆయమ్మకంటె వేరయిన అల్పజంతువునకు ఇష్టార్థలాభముకొఱకు ప్రయత్న మత్యంతావశ్యకమను నంశమును వేరుగా చెప్పనక్కఱలేదని భావము.

"కైముత్యేనార్థ సంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే" ('కిముత' శబ్దముయొక్క భావము కైముత్యము. కైముతికన్యాయముచేత నర్థసంసిద్ధి- కావ్యార్థాపత్తి యనబడును) అనులక్షణముచేత నిచటి యలంకారము కావ్యార్థాపత్తియని తెలియునది. ఈయంశమున క్రింది యుదాహరణమును గ్రహించునది.

"ప్రేయసీ! నీముఖమాచంద్రునే జయించినది. పద్మములమాట చెప్పనేల"

వి వః— ఆచంద్రుఁడన, పద్మములను జయించిన చంద్రుఁడనియర్థము.

పద్మములను జయించిన చంద్రునే నీముఖముజయించినది. ఇఁక పద్మములను జయించెనని చెప్పవలయునా?" అనఁగా పద్మములను మిక్కిలి సులభముగానే జయింపఁగలదని యర్థము.

ఇట్లు కైముత్యముచేత అర్థసంసిద్ధివలన నిది కావ్యార్థాపత్తి యగుచున్నది.

జ్వలత్కపర్దో, దహనాఙ్కభాలః,
కపాలమాలీ, కరికృత్తివాసాః,
భుజఙ్గభూషో, భసితాఙ్గరాగః,
పుష్పేషువైరీ; పరుషాట్టహాసః. ౨౦

శ్మశానవాసీ, పురుష, స్త్రిశూలీ,
జహార తే చేద నఘాఙ్గి! చేతః
దృష్టాన్తమర్థోఽయ మనాపనైవ
ప్రీతిర్బహిః కారణమాశ్రితేతి. ౨౧

జ్వలించుచున్న జటాజూటమును, దహనాంకమగు (నిప్పుతోఁ గూడిన) ఫాలస్థలమును, కపాలమాలయు, (తలపుఱ్ఱెల దండయు) గజ చర్మ వస్త్రమును (ఏనుఁగుతోలు కట్టుబట్టయు) సర్పభూషణములును, భస్మాంగరాగమును (బూదిపూఁతయు) గలఁవాడును పుష్పబాణుఁడగు మన్మథునకు శత్రువును, కర్కశమగు పెద్దనవ్వుఁగలఁవాడును.

శ్మశానమునందు (పితృవనమునందు) నివసించువాఁడును, త్రిముఖమగు త్రిశూలము గలవాఁడును, అగు పురుషుఁడు. అనవద్యాంగివగు (నిర్దుష్టములగు నవయవములు గలిగిన) నీమనస్సు నాకర్షించినపుడు ప్రీతియనునది— బాహ్యోపాధి నాశ్రయించి ప్రవర్తింపదనునర్థము దృష్టాంతము నొందుచున్నది. [ప్రీతికి బాహ్యగుణము కాన్పింపదు.]

ప్ర భ:— ప్రీతి-బాహ్యకారణము నాశ్రయింపదను ప్రసిద్ధమగు నభిప్రాయమునకు నిదర్శనమున్నదని భావము. ఇట్లనుటచేత ప్రేమకు అంతరమేయగు హేతువేదో కలదను నంశము స్పష్టముగా నవగమింపఁజేయఁబడుచున్నది. ఈయర్థమును

"వ్యతిషజతి పదార్థా నాన్తరః కోఽపి హేతుః
న ఖలు బహిరుపాధీన్ ప్రీతయః సంశ్రయన్తే"

చెప్పుటకు వీలుపడని యేదో ఆంతరమగు హేతువు అంతఃకరణాదులగు పదార్థములను, అన్యోన్యలగ్నములుగాఁ జేయుచుండును. ప్రీతులు— బాహ్యములగు హేతువులను (స్వోత్పాదకములుగా) అపేక్షించునవి కావు.

అని భవభూతిమహాకవికూడ ఉత్తరరామచరితమునఁ జెప్పియున్నాఁడు.

మీఁదిశ్లోకమున 'పుష్పేషువైరీ' అనుచోట 'పుష్పౌఘవైరీ' అను పాఠముగూడ నున్నది. పుష్పౌఘవైరియన మదనబాణభూతమగు పుష్పసమూహమునకు శత్రువని యర్థము. శృంగారాంగభూతమగు పుష్పసమూహముతోడి వైరము కామారియగు శివుని వైరాగ్యప్రసిద్ధిని సూచించునని తెలియునది.

మీఁదిశ్లోకమున అతిఘోరములును జుగుప్సావహములును నగు, జటాజూట-నేత్రజ్వలన-కపాలమాలాదులతోఁ గూడిన వాఁడును, శృంగారధ్వంసియు, వికృతవేషుఁడును అగు పురుషుఁడు - సర్వలక్షణసంపన్నములగు నంగములుగలదాని నాకర్షించెనను ప్రకృతార్థముచేత ప్రీతి-బహిరంగకారణము నాశ్రయింపదనుటకు దృష్టాంతము గలదను నప్రకృతమగు నర్థము సమర్పింపఁబడుటచేత- నిచటి యలంకార మర్థాంతరన్యాసమగుచున్నది.

రూపంపురారే రథ వాత దేతత్
నేయంచ చేష్టా సమయాన్తరేషు
కాన్తంవపుః కాన్తతరాశ్చలీలా
స్త్వయానమం ఖేలితు మేమధత్తే. ౧౨

పురారియగు మహేశ్వరునకు పూర్వోక్తమగు జ్వలించుచున్న జటాజూటము గలిగియుండుట మొదలగు రూపమును, శ్మశానమునందు నివసించుట మొదలగుచేష్టయు, పార్వతితో విహరించు సమయమునందుఁ గాక తదితరములగు సమయములందుండెను.

భగవంతుఁడు పార్వతితో విహరించుటకు కమనీయమగు శరీరమును మిక్కిలి కమనీయములగు లీలలను ధరించుచుండెను.

[ద్వాదశస్తబకమున "ముక్తభోగి కటకేనపాణినా" అని యారంభించి, పార్వతీపరమేశ్వరులకు శృంగారమును వర్ణించునపు డీయంశమును చెప్పఁబడును.]

ప్రహ్వాప్తయతః సమవేతసిద్ధో
వృత్త్యర్థగేన్ద్రో విరసన్మునీన్ద్రః
భూయోఽపి యోగో యువయోర్హిమాద్రౌ
బభారమాతర్మహ మద్వితీయమ్. ౧౩

మాతా! హిమాచల నివాసులగు యక్షులను ప్రహర్షింపఁజేసినదియు, సిద్ధపురుషులను సమ్మిళితుల నొనర్చినదియు, ప్రమథగణశ్రేష్ఠులను నర్తింపఁజేసినదియు; మునీంద్రులను వికసింపఁజేసినదియు నగు నీ పునస్సమాగమము- ఆహిమాద్రియందు- అద్వితీయమగు నుత్సవమును పోషించెను.

ప్రభ:—యక్షులనఁగా దేవయోనివిశేషులు. పార్వతీ-పరమేశ్వరుల కిపుడు జరిగిన సమాగమము, సతీభవసమాగమముకంటె వేఱగుటవలన పునస్సమాగమమగుచున్నది. వెనుక సతీ-శివులకు సమాగమముండెను. తత్ సతీ-రూపయగు పార్వతికి శివునితోడి సమాగమము (కలయిక) మరల నిపుడు కలుగుటవలన నిది వారి పునస్సమాగమమని చెప్పఁబడినది.

మీఁదిశ్లోకమున "ప్రహృష్టయక్షః" అనుటకుమారు "ప్రహృష్టపక్షః" అను వేరొకపాఠమున్నది. అపుడు, పార్వతీపక్షమగు హిమవద్బంధువర్గమును, శివపక్షమగు ప్రమథగణ యక్షరాజాదికమును, ప్రహర్షింపఁజేసినదను నర్థమును గ్రహింపవలయును.

మహేశ్వరస్త్వాం పరిణీయ లేభే
యావాత్మజౌ ద్వావనఘాఙ్గి! ముఖ్యౌ
ఏకస్తయోర్భ్రామ్యతి విశ్వమత్తుం
భూభృత్తటీరాశ్రయతే బతాన్యః. ౨౪

అనవద్యాంగివగు (దోషరహితమగు విగ్రహముగల) పార్వతీ! మహేశ్వరుఁడు నిన్ను పరిణయమాడి ముఖ్యులగు నాత్మజుల నిద్దఱిని గాంచెను. వారిలోనొకఁడగు గణపతి- విశ్వమును భుజించుటకై తిరుగుచున్నాఁడు. పాపమింకొకఁడు (స్కందుఁడు) పర్వతభూముల నాశ్రయించి యున్నాఁడు.

ప్రభ:—భుక్తిప్రియుఁడనియు, లంబోదరుఁడనియు ప్రసిద్ధుఁడగుటవలన గణపతి విశ్వమును భుజించుటకై తిరుగుచున్నాఁడని చెప్పఁబడినది. నగరంధ్రకృత్తు గుహుఁడు, మొదలగు నామముల చేత స్కందుఁడు- పర్వతమహావాసి అనునంశము ప్రఖ్యాతముగుచున్నది- గ[illegible]పతియు- [illegible]. విశేషమని సూచితము]

వ్యా:- ఒకఁడు భస్మశీలుఁడును, ఇంకొకఁడు పర్వతగుహావాసియు నగుట వలన వీరియాత్మజులిద్దఱునుగూడ సుఖజీవనులు కారనునంశము 'బత' (అయ్యో) అను పదముచేఁ దెలుపఁబడుచున్నది. ప్రభావ్యాఖ్యాత 'బత' అనునది విస్మయార్థకమని వచించెను. జగత్కుటుంబులగు పార్వతీపరమేశ్వరులు దేవాసుర మానవాది సకలజనకులగుచున్నారు. అయినను, ఆయాత్మజులయందు స్కంద- గణపతులకు విశిష్టతను స్ఫురింపఁజేయుటకు వారు ముఖ్యులని చెప్పఁబడిరని గ్రహించునది.

సఙ్కీర్తయన్త్యో, జగదన్తజనన్యాః
కల్యాణవార్తాః కమనీయకీర్తేః
ఇమాః ప్రమోదాయ సతాంభవన్తు
సన్దర్భశుద్ధా ఉపజాతయోనః. ౨౫

రమణీయకీర్తియగు జగజ్జననియొక్క కల్యాణవార్తలను సంకీర్తనమొనర్చునవియు, సందర్భశుద్ధములయినవియు, నిట్లు రచింపఁబడినవియున గుమాయీ ఉపజాతులు సజ్జనప్రమోదదాయకములగుఁగాత!

ప్రభ:—సందర్భమనఁగా, నిబంధింపఁబడిన పదవాక్యగుంఫన రూపమగు రచనము. శుద్ధములనఁగా, పద- పదార్థ- వాక్య- వాక్యార్థదోషరహితములు. ఉపజాతులనగా; ఉపజాతివృత్తనిబద్ధములగు శ్లోకములు.

'ఇది సవ్యాఖ్యమగు పంచమస్తబకము'

ఓమ్- తత్- సత్-

ఓం నమో భగవతే శ్రీరమణాయ
శ్రీ భారతీదేవతాయైనమః.

ఉమాసహస్రము.

(ద్వితీయ శతకము - ద్వితీయస్తబకము)

(ఆరవస్తబకము)

అవ:— ద్వితీయశతకముయొక్క ద్వితీయస్తబకమగునిందు-దేవియొక్క 'విశ్వైభవ సంపత్తి' స్తుతింపఁబడును.

హర్తారః శశికీర్తేః
కర్తారో నవభాసామ్
భర్తారో మమసన్తు
స్కన్దామ్బాదరహాసాః. ౧

చంద్రునకుఁగల ఖ్యాతిని హరించునవియు, క్రొత్తక్రొత్తలగు కాంతులను కలిగించునవియు, నగు స్కందాంబ (పార్వతి) యొక్క మందహాసములు నన్ను భరించునవియగుఁగాత !

ప్రభ:—ఆహ్లాదకత్వాదిగుణములచే— అమృతకిరణుని యశమునుగూడ నతిశయించునవియు, నవనవ వికాసముచే విలసిల్లునవియు, (ఆశ్రితులకు అభినవాభ్యుదయమును గలిగించునవియు) అగు పార్వతి మందస్మితములు- భక్తుఁడనగు నన్ను పోషించునుగాతయని యభ్యర్థనము కావింపఁబడినది.

దిగ్వల్లీష్వతి శుభ్రం
కుర్వన్తః కుసుమర్ధిమ్
భూయాసుస్తవ భూత్యై
మన్మాతుః స్మితలేశాః. ౨

దిక్కులను లతలయందు మిక్కిలి శుభ్రమగు కుసుమసమృద్ధిని (పుష్పప్రసూతిసంపదను) కలిగించుచున్న మాతల్లియగుపార్వతియొక్క మందహాసలేశములు- మీకైశ్వర్యమును ఘటించుఁగాత!

ప్ర.భ:— ఇది మంగళాశాసనము. ఇచట "దిశఏవవల్ల్యః" అను వ్యుత్పత్తిచేత, ఉత్తరపదార్థము ప్రధానమగుటవలన, ఇది అవధారణాపూర్వపదకర్మధారయ సమాసమేయగును కాని "వల్ల్య ఇవదిశః" అను వ్యుత్పత్తిచేత పూర్వపదార్థప్రధానమగు ఉపమితసమాసము కాదు. కుసుమసమృద్ధికరణము—వల్లులుగానిదిక్కులు—కావుగదా! స్మితలేశములు, కుసుమసమృద్ధికారకములగుటచేత నవి అమృతకిరణాత్మకములనునంశము గమింపఁజేయఁబడినది. రసాత్మకుఁడగు సోమునకే ఓషధీశత్వము ప్రసిద్ధముగదా! దిగ్వల్లులనుచోట— ఏకదేశవివర్తియగు రూపకము— అలంకారమని గ్రహించునది. కుసుమప్రసవసంపన్నములగు లతలు స్పృహణీయశోభలగునట్లు, పార్వతీమందహాసములవలన దిక్కులన్నియును, స్వోచితరమణీయశోభాసంపన్నములగుచుండునని భావము.

మీఁదిశ్లోకమున దిగ్వల్లీషు (దిక్కులను లతలయందు) అను బహువచనము వలన మందహాసవైభవము సార్వత్రికము (అంతటను ప్రసరించునది) అని చెప్పబడియెను.

"మందహాసవైభవము— మహాప్రభావముగలది. ఆమందహాసవైభవమువలననే— విశ్వమునందున్న— సర్వవస్తువులును— సర్వభూతములును వానివాని గుణములతోఁ గూడ ధరింపఁబడుచున్నవి." అని స్ఫురింపఁజేయుటకు— దిక్సంతతికి— విచ్ఛేదము లేని వికాసమును వ్యంజింపఁజేయునదియగు— దిగ్— వల్లీ— కుసుమప్రసవసమృద్ధికరఁణము— చెప్పఁబడినది.

ఇందు దిక్కులను— వల్లులుగా నారోపించుట— శాబ్దము. కర్తలగు స్మితలేశములచేత— కుసుమసమృద్ధి— యారోపింపఁబడినది. దానిచేత— నగు అర్థసామర్థ్యముచేత— దిగ్వికాసము— ఆక్షేపింపఁబడుచున్నది. (తీసికొని రాఁబడుచున్నది)దిక్కులు వికసించినవనునర్థము శబ్దముచేతఁగాక, అర్థముచేత నాక్షిప్తమగుటవలన— ఆదిగ్వికాసము— అర్థమైయున్నది. "వికసించిన పూవులుగలిగియుండుట" అనుధర్మము దిక్కులయందుపచరితమగుటవలనను— దిక్కులుగా నారోపింపఁబడిన వల్లులయందుండుటవలనను— ఇది— ఏకదేశవివర్తినియగు నుపమ కానేరదని తెలియునది.

ఏకశ్చేత్ తవశక్తో
బ్రహ్మాణ్డస్య భవాయ
భర్గప్రేయసి హాసః
కిం స్తోత్రం తవ భూయః. 3

భర్గప్రేయసివగు జననీ! నీహాసమొక్కటియే, బ్రహ్మాండము యొక్క ఉద్భవమునకు సమర్థమగునపుడు నీమహాభాగ్యమును వ్యాఖ్యానించుటకు ఏస్తోత్రమైనను సమర్థమగునా?

ప్రభ:—భగవతీముఖమునందు– హాసమెల్లప్పుడును వికసించుచుండును. నీవొకక్షణము నవ్వినచో– జగమంతయు నుదయించును. అట్టియెడల నీమహాభాగ్యమును వర్ణింపఁజాలిన స్తోత్రమేదియైనను నుండునా?

"స్మితము–జగత్సృష్టి" అనునంశమును పూర్వగ్రంథకర్తలుగూడ వర్ణించియే యున్నారు.

భామతీకారులచేత "స్మితమేతస్య చరాచరమ్" అని స్వకృతబ్రహ్మసూత్రభాష్యవ్యాఖ్యారంభమున బ్రహ్మము స్తుతింపఁబడినదిగదా!

[భామతీకారుఁడగు వాచస్పతిమిశ్రుని చరిత్రము నాచేరచింపబడిన, భామతి, అను ఖండకావ్యమున పాఠకులు పరిశీలింపఁగోరెదను.] [పం॥ ల॥ నా]

ఉద్యానేవియదాఖ్యే
కాలి! త్వాం విహరన్తీమ్
గోలైః కన్దుకకల్పై
రల్పావాక్ కిముమాతి. ౪

భగవతివగు కాళీ! 'ఆకాశము' అనుపేరుగల ఉద్యానమునందు కందుకకల్పములగు (గోళాకారములగు బంతులవంటివై రవీందు నక్షత్రరూపములగు) ఖగోళములతో నాడుకొనుచున్న నిన్ను స్వల్పమగు వాక్కు– ఎట్లువర్ణించును?

ప్రభ:—అనంతములగు బ్రహ్మాండకోటుల కవకాశమునొసఁగు నాకాశము– నీకు విహారోపవనమై యున్నది. అచటనున్న జ్యోతిర్గోళములు నీకాటబంతులై యున్నవి. ఇట్లుండ నీవింతదానవని పరిమితిఁదెలుపుట కేవాక్కు–సమర్థమగును? ఇయత్తా– పరిచ్ఛేద– రహితయగు భగవతి– వాక్కుల కందదని భావము.

ఖం క్రీడాభవనం తే,
కః కార్యాలయఏషః

పృథ్వీయం బహులాన్నా
మాతర్భోజనశాలా! ౫

తల్లీ! సర్వవ్యాపకమగు ఆకాశము- నీకుక్రీడాభవనము. (విహార స్థలము) ఈయాదిత్యమండలము-నీకార్యాలయము-(జగత్కార్యనిర్వాహక ప్రదేశము) బహులాన్నమగు నీభూమి-నీభోజనశాల.

ప్ర భ:—ఇచట చేసివిషయమున భోగ- భోజనములకు విశేషము లేదని యెఱుంగునది. సంస్కృతమునందు "క్షః" అనుపదము, బ్రహ్మను. ఆత్మను, వాయువును, సూర్యుని, వెలుఁగునని విశ్వప్రకాశుఁడు చెప్పియున్నాఁడు.

ఆధికారికులగు (ఆయాయుద్యోగములందు నియమితులగు) దేవతలకు—జగత్కార్యనిర్వాహక్రమము వ్యవస్థాపింపబడిన ప్రదేశము- స్వర్లోకమగు నాదిత్య మండలము. కావున నయ్యది కార్యాలయమని చెప్పఁబడినది. ఆటవస్తువులగు ఖగోళములతో నాపరమేశ్వరి విహరించుప్రదేశము భువర్లోకమగు నంతరిక్షము- కావున నది- క్రీడాభవనమని చెప్పఁబడినది. ఆధికారికులగు దేవతల ద్వారమున పరమేశ్వరిచే భుజింపఁబడుచున్న ప్రదేశము- ఈభూలోకము. కావున నది- భోజనశాలయని చెప్పఁబడినది.

ఇట్లు- వేదమంత్రమున "భూః, భువః, స్వః" అని చెప్పఁబడిన లోకములు మూఁడును, సర్వేశ్వరికి క్రమముగా, భోజన- విహార- కార్యాలయస్థలములగుచున్నవని ప్రతిపాదింపఁబడినది.

బుద్ధీనా మసి దాత్రీ
సిద్ధీనా మసి నేత్రీ
వీర్యాణా మసి పేటీ
కార్యాణా మసి ధాటీ. ౬

అమ్మా! సకలకళావిష్కర్తలును శాస్త్రీయములును అగుబుద్ధుల నొసఁగుదానవును, అణిమాద్యద్భుతరూపములును, సర్వోద్యమఫలరూపములును అగుసిద్ధులను సంఘటించుదానవును! వీర్యములకు మంజూషవును; (సకలవిధపరాక్రమ నిధానభూతవును) కార్యములకు అభ్యాసాదనమవును (పరచక్రము నాక్రమించుదానవును) అగుచున్నావు.

ప్ర భ:—"ధాట్రీ" అనుపదమునకు- అభ్యాసాదన మర్థమని హేమచంద్రుడు చెప్పెను.

విద్యానామసి భావో
హృద్యానామసి హావః
దేవానా మసి లీలా
దైత్యానా మసి హేలా. ౭

నీవు వేదాదులగు చతుర్దశవిద్యలకును తాత్పర్య రూపమగు భావమవు. రమణీయములగు వస్తువు లన్నిటియందును విలాసరూపమగు హావమవు. దేవతలయందు స్పృహణీయ(మగు)విలసితమగులీలవు. దైత్యులను తిరస్కరించు హేలవు.

ప్ర భ:—హేల యనగా, అవజ్ఞ. అవజ్ఞావిలాసములయందు హేలాపదము వర్తించునని నానార్థరత్నమాల చెప్పుచున్నదిగదా!

గన్త్వాణా మసిచేష్టా
స్థాణూనామసి నిష్ఠా
లోకానామసి మూలమ్
లోకాదే రసి జాలమ్. ౮

గన్తలగు చరప్రాణులకు గతివి, స్థాణువులగు స్థిరవస్తువులకు స్థితివి. సర్వలోకములకును మూలమవు. లోకుల జన్మములకు జాలమవు. (మాయికమగు కారణమవు.)

ప్ర భ:—జాలశబ్దము సంస్కృతమున పుంలింగమగునపుడు నీపవృక్షమును, స్త్రీలింగమగునపుడు బీరచెట్టును, నపుంసకలింగమగునపుడు, దంభ-ఇంద్రజాలములును అర్థములగునని త్రికాండశేషము చెప్పుచున్నది. "చర- స్థిరములకు- చరత్వ-స్థిరత్వ- ధర్మరూపిణివి నీవే" యనియైనను చెప్పనగును.

దేవీ, వ్యాపక తేజః
శక్తిః, స్తత్త్వవిచారే
అత్యన్తం సుకుమారీ
నారీ, మూర్తి విచారే. ౯

పరమార్థమును విచారించునపుడు ఉమాదేవి- వ్యాపక తేజశ్శక్తి యగుచున్నది. ఆయమ్మ మూర్తిని విచారించునపుడు అత్యంతకోమల గాత్రియగు పార్వతి యగుచున్నది.

ప్రశ్న:— వ్యాపక తేజశ్శక్తియన "సర్వవ్యాపియగు జ్యోతిస్సగు సర్వేశ్వరుని శక్తి" అనిగాని "వ్యాపక తేజోరూపిణియగుశక్తి" అనిగాని యర్థముఁజెప్పవచ్చును. వ్యాపక తేజోరూపిణియగుశక్తి అని చెప్పునపుడు శాకపార్థివః. పార్థివః=శాకపార్థివఃఅని జెప్పినట్లు, తేజోరూపిణీ, శక్తిః=తేజశ్శక్తిః" అని సమాసమును జెప్పుకొన వలయును.

తత్త్వమును విచారించువేళల- దేవీస్వరూపము- సర్వవ్యాపి తేజశ్శక్తియు- విగ్రహవత్త నపేక్షించువేళల- సుకుమారియగు నారియు నగునని భావము.

క్వజ్యోతి ర్మహత్తోఽస్మా
దాకాశాదపి భూయః?
తత్సర్వం వినయన్తీ
తన్వఙ్గీ క్వనునారీ? ౧౦

వ్యాపకమగు నాకాశముకంటెనుగూడ మహత్తరమగు జ్యోతిస్సెక్కడ? ఆకాశము నతిశయించుచు, మహాత్రోమహీయమగు ఆజ్యోతిస్సర్వమును జగన్నిర్మాణమునకొఱకు చలింపఁజేయుచున్న తన్వంగి (కృశించిన దేహముగలది) యగుసుందరియెక్కడ? (ఆశ్చర్యము గదా!)

ప్రశ్న:— మహాతోమహీయమగు జ్యోతిస్స్వరూపమును జగన్నిర్మాణముకొఱకు చరింపఁజేయుట అర్థసిద్ధి. దానికిచట నసంభావ్యత- వర్ణితము. కావున "ప్రత్యఙ్గబంధమ్" అని వెనుకటిశ్లోకమువలె నిదికూడ- అసంభవాలంకారమునకే లక్ష్యమగునని గ్రహించునది.

అవ:-ఇక్కడనుండి "ఆశ్చర్యం విదధానా" అను పదునైదవశ్లోకమువఱకునుగల వాక్యమొక్కటియే యని గ్రహించునది.

దేవేన్ద్రియవిభుత్వమ్
మార్యామోపశ్రి సహస్రిమ్
ఊష్మాణాం దహనాయ
జ్యోత్స్నై మోషధిరాజే. ౧౧

దేవేంద్రునికి ఈశితృత్వమును. ప్రభుత్వమును, సహస్రరశ్మియగు సూర్యునకు కిరణసహస్రమును (వేయికిరణములను) కాల్చువాఁడగు నగ్నికి వేడిమిని, ఓషధుల కధిపతియగు చంద్రునకు వెన్నెలను(నీవొక్క తెవే యిచ్చుచున్నదానవని పదునాల్గవశ్లోకముచే సమన్వయించు కొనునది.)

వాతాయామిత వీర్యం
విస్తారం గగనాయ
సాన్ద్రిత్వం వసుధాయై
తోయాయ ద్రవభావమ్. ౧౨

(జగత్ప్రాణుఁడగు) గాలికి అత్యధికమగు బలమును, ఆకాశమునకు వైశాల్యమును, భూమికి నిబిడత్వమును (ఘనీభావమును) నీటికి ద్రవత్వమును (ద్రవీభావమును).

మాహాభాగ్య మపారం
కోటిభ్యో విబుధానామ్।
చిత్రాః కాశ్చన సిద్ధీ
ర్లక్షేభ్యో మనుజానామ్. ౧౩

దేవకోటులకు, అమితమగు మహాభాగ్యమును, మనుజలక్షలకు అద్భుతములు అనిర్వాచ్యములు అగు సిద్ధులను.

ప్రభ:– 'కోటి' అనునది శతలక్షసంఖ్యావాచకమును, లక్ష– శతసహస్ర సంఖ్యావాచకమును, అగును. (కోటియన నూరులక్షలు. లక్షయన నూరువేలు,) అయినను "దేవకోటులకు" అనుదానికి "అమితసంఖ్యలగు దేవతలకు" అనునర్థమును, "మనుజలక్షలకు" అనుపదమునకు, "అత్యధికసంఖ్యలగు మనుష్యులకు"అను నర్థమును గ్రహింపవలయును. అపారమనఁగా అనంతమని యర్థము. మాహాభాగ్యమన, గొప్పదగునైశ్వర్యాంశమని యర్థము.

మహాన్ భాగో అంశః యేషాం తే, మహాభాగాః, తేషాంభావో మాహాభాగ్యమ్. గొప్పదగు నైశ్వర్యాంశముగలవారు మహాభాగులు. తద్భావము మాహాభాగ్యము.

స్థాణుభ్యో ధృతిశక్తిం
గన్తృభ్యో గతిశక్తిమ్
కస్మాచ్చిన్నిజకోశా
దేశా దేవి దదానా. ౧౪

దేవీ! కదలని వస్తువులకు ధృతిశక్తిని, కదలెడు ప్రాణులకు గతిశక్తిని, ఇట్లు పూర్వోక్తమగు సర్వమునుగూడ అనిర్వాచ్యమగు నిజకోశమునుండి నీవొక్క తెవే ఇచ్చుచున్నదానవు.

ప్ర భః- ధృతిశక్తియనఁగా, స్థిరత్వము నొదవించు ధారణాసామర్థ్యము. గతిశక్తియనఁగా, గమనసామర్థ్యము. ఎనిమిదవశ్లోకమున గంతలగు చరప్రాణుల యందలి "చలనమును" స్థిరవస్తువులయందలి స్థితియుఁ గూడ దేవికి స్వరూపమని చెప్పఁబడియెను. ఈశ్లోకమునందట్లుగాక, దేవి- చరాచరములకు 'గమనధారణా శక్తి దాత్రి' అని చెప్పఁబడినది.

పదునొకండవశ్లోకమునుండియు చెప్పఁబడిన విభుత్వము మొదలు పదునాల్గవశ్లోకమునఁ జెప్పఁబడిన గతిశక్తివఱకును గల సర్వమునుగూడ అద్వితీయయగు ఉమాదేవి, చెప్పుటకు వీలుపడని స్వీయనిధానమునుండి యిచ్చుచున్నదని భావము.

ఆశ్చర్యం విదధానా
సర్వంవస్తు దధానా
హన్తత్వం మమమాతః!
కాచిత్ కోమలగాత్రీ. ౧౫

మాతల్లీ! అద్భుతమును అసామాన్యమును అగు కర్మను చేయుచున్నదానవును, చరాచరమగు విశ్వమునంతను ధరించుచున్నదానవును అగునీవు ఒకానొక కోమలగాత్రివై యున్నావు. ఆశ్చర్యము!

శ్రోణీభార నతాయాం
కస్యాం చిత్తనుగాత్ర్యామ్
ఈదృక్షా యదిశక్తిః
కా వేత్తో ననుమాయా? ౧౬

శ్రోణీభారముచేత నమ్రయగు ఒకానొకతను గాత్రియందు (అల్పమగు గాత్రిముగల స్త్రీయందు) అఘటనఘటనాపటీయసియగు నిటువంటి శక్తియుండు నెడల నింతకంటె మాయ యింకేమున్నది?

ప్రి భ:—పూర్వోక్తప్రకారమై విలసితమగుశక్తి యొకానొక కాంతయం దుండుట మాయకాక వేఱేమగునని భావము.

'కావా తే నను మాయా' అను పాఠమునందు నీమాయ యింతకంటె వేఱగునా? అనునర్థము సిద్ధించును, కావున నుభయపాఠములందునుగూడ గలతాత్పర్య మొక్కటియే యగును.

రూపం తే - తనుగాత్రం
వాణీ తే - మృదునాదా
చాపం తే - మధురేక్షుః
పాణిస్తే - సుకుమారః. ౧౭

అమ్మా! నీరూపము తనుగాత్రము, నీవచనము మృదునాదము; నీచాపము మధురేక్షువు, నీహస్తము సుకుమారము.

ప్రి భ:—నీరూపము స్థూలముకాక యల్పమగుటచేత సుందరమగుగాత్రము గలది. నీవు సౌందర్య సంపన్నవగు అతిలలితగాత్రివని భావము. నీమాట మంజులమగు స్వరముకలది. నీవు కలకంఠివని భావము. నీధనువు తీయని చెఱకు. కావున నీవు స్వాధీనకామవగు కామేశ్వరివి. కాముఁడు- ఇక్షుధనుష్కుఁడనునది ప్రసిద్ధము. ఆచెఱకువిల్లు నీయదియే యగుటవలన నీవు వశీకృతకామ వగుచున్నావని భావము. నీపాణి కోమలము.

లోలే! లోచనయుగ్మే
భీరుత్వం ప్రికటం తే
బ్రహ్మాండం త్వ దధీనమ్
శ్రద్ధత్తా మిహ కోవా. ౧౮

చంచలయగు దేవీ! నీ నేత్రియుగళమున భీరుత్వము ప్రికాశించుచుండును. అయినను ఈబ్రహ్మాండమంతయు నీయధీనమునంగున్నది. ఈయంశము నెవఁడు విశ్వసించును?

ప్రథః- పూర్వోక్తప్రకారమున నీరూప, వచన, చాప, హస్త, నయనములు- ఇట్లింత లలిత రమణీయములగుచుండినను గూడ నీవిశ్వము త్వదధీనమైయున్నది ఈయంశమే నమ్మశక్యము గాకున్నదని భావము.

భ్రూభఙ్గం కురుషే చే
న్ముగ్ధే! గౌరి! ముఖాబ్జే
భూతాన్యప్యయిబిభ్య
త్యే జేరన్నపి తారాః. ౧౯

ముగ్ధవు గౌరివి అగుపార్వతీ! నీవు వదనకమలమున భ్రూభంగ మొనర్చితివా, పృథివ్యాది భూతములన్నియు భయపడును. నక్షత్రములు కంపించును.

ప్రథః-లజ్జావిజిత మన్మథయగు ఉదయద్ యౌవనముగ్ధయనియు, దశవర్ష వయస్కయగు అముగ్ధబాలిక-గౌరియనియు చెప్పఁబడును. అట్టిముగ్ధయు, గౌరియు నగు పార్వతి రోషముచేత నొనర్చిన భ్రూభంగము తలఁచుఁడగు కవికి రమణీయమై యున్నను, భూత నక్షత్రాదులకు భయకంపాదిప్రదమే యగునని భావము. "భీషాస్మాద్వాతః పవతే, భీషోదేతిసూర్యః" "బ్రహ్మమువలని భయమున వాయువు వీచును. సూర్యుఁడుదయించును" అనిశ్రుతిగదా!

శుద్ధాన్తేశ్వరి! శమ్భో
రిచ్ఛాచేత్ తవకాఽపి
ఘోరోఽగ్నిస్తృణగర్భాద్
ఘోరాగ్నేరపి శైత్యమ్. ౨౦

ఓశివాంతఃపురసుందరీ! నీయిచ్ఛామాత్రమున, తృణగర్భము నుండి, భీషణాగ్ని జనించును. ఆభీషణాగ్నినుండి శైత్యము (చల్లదనము) ఉదయించును.

ప్రథః-తృణమనఁగా గడ్డిపరక. దానినుండి ఘోరమగు నగ్ని యుదయించుట అస్త్రవిద్యా ప్రసిద్ధము. అసన్నమగు తృణమునుండి ఘోరమగునగ్ని జనించుట చేత శరవణజమగు నగ్ని సూచింపఁబడుచున్నది. అగ్నినుండి శైత్యముదయించుననుటచేత "అగ్నేరాపః" అనుశ్రుతిప్రసిద్ధమగు తత్త్వము ప్రవచింపఁబడినది.

ఇచట ముఖ్యముగా గ్రహింపఁదగిన యర్థము, "నీయిచ్ఛకు శక్యముకాని దేదియునులేదు." నీవు తలఁపరాని యద్భుతములను సాధించు స్వతంత్రురాలవు." అనునదియే.

అవః–ఇప్పుడు శివశక్తులకుఁగల కార్యవిభాగమును వర్ణించుచున్నాఁడు.

మూ॥ ద్రష్టుం విశ్వమపారం
భారస్తేదయితస్య
కర్తుం కార్యమశేషం
శ్రీమాతస్తవభారః. ౨౦

శ్రీ మాతా! అపారమగు విశ్వము నీక్షించుటయే నీభర్తకుఁ గల కార్యభారము. సృష్ట్యాదికార్యము- నిశ్శేష మొనర్చుట నీకుఁగల కార్యభారము.

ప్ర భః–సర్వేశ్వరుడు జగదభిముఖియగు దృష్టినిమాత్రమే ప్రసరించుచు సాక్షియగుచున్నాఁడు; కాని సర్వేశ్వరివగు నీవే సర్వకార్యనిర్వాహికవనిభావము. మీదిశ్లోక మీయంశమునే స్ఫుటీకరించును.

సాక్షీ కేవల మీశః
కర్తుం భర్తుముతాహో
హర్తుంవాఽఖిలమమ్బ !
త్వం సాక్షాద్ ధృతదీక్షా. ౨౨

అమ్మా! ఈశ్వరుడు కేవలమును సాక్షి (ద్రష్ట) యగుచున్నాఁడు. నీవు సర్వమును సృజించుటకుగాని భరించుటకుగాని హరించుటకుఁగాని దీక్షఁబూనినదానవు.

ప్ర భః—సృష్టి-స్థితి- సంహారములయందు పరమేశ్వరి 'బద్ధవ్రత' అని చెప్పుటచేత సాక్షిత్వద్వారమున నీకార్యములయందు పరమేశ్వరునకు అభ్యనుజ్ఞాన రూపమగు పరంపరాసంబంధము గమింపఁజేయఁబడుచున్నది.

మూ॥ కారస్కారముమే! యద్
బ్రహ్మాణ్డాని నిహంసి
తన్మన్యే సురమాన్యే
బాలైవాస్య! సదాత్వమ్. ౨౩

సురపూజ్యనగు జగదంబా! బ్రహ్మాండములను రచించి రచించి భంజించుచుందువు, గావున నీవెప్పుడునుగూడ బాలవేయగుదువని తలంచుచున్నాను.

ప్ర భ:—శైశవదశయందు బాలురు క్రీడావస్తువులను చేసిచేసి వానిని మరల భంజించుచుందురుగదా! ఇచట హేతువుకాని బాలాత్వము— బ్రహ్మాండములను మరల మరల సృజించి సంహరించుటకు హేతువుగా నుత్ప్రేక్షింపఁబడినది, కావున నిది హేతూత్ప్రేక్ష యగుచున్నది.

దీనిచేత—"అనాయాససిద్ధములగు భగవతీలీలావిలాసితములే—సర్గాది కార్యములు" అనునంశము ద్యోతితము.

మూ॥ లీలోజ్జీవితకామే!
రామే! శఙ్కరసక్తే!
త్వత్ పాదార్చనసక్తం
భక్తం మాంకురుశక్తమ్. ౨౪

శంకరునందనురక్తవై, శృంగారలీలచేత కాము నుజ్జీవింపఁజేసిన సుందరీ! భవత్పాదార్చనానురక్తుఁడను భక్తుఁడను అగు నన్ను శక్తియుక్తునిగాఁ జేయుము.

ప్ర భ:—హరనేత్ర దగ్ధుఁడగు కందర్పునకు, అనాయాససిద్ధమగు విలాసముచేత పునర్జీవనము నొసంగితివి. త్వచ్చరణ సేవాసక్తుఁడనగు నాకు బలము నొసంగుమని భావము. ఆధ్యాత్మికముగాని, ఆధిలౌకికముగాని, కార్యమేదయినను బలము లేనిదే నిర్వహింపఁ బడదుగదా! "నాయమాత్మా బలహీనేన లభ్యః" 'ఈయాత్మ బలహీనునకు లభింపఁడు' అని వినఁబడుచున్నది. కావున నన్ను శక్తిమంతునిగాఁ జేయుమని ప్రార్థించుచున్నాఁడు.

మూ॥ ఏతాః పావనగన్ధాః
సర్వేశప్రమదే! తే
హైరమ్బ్యామదలేఖాః
సన్తోషాయభవన్తు॥

సర్వేశ్వరప్రమదవగు పార్వతీ! పవిత్రపరిమళోపేతములును నీపుత్రుఁడగు గణపతికి సంబంధించినవియునగు మదలేఖలు (మదధారలు– మదలేఖావృత్తములు) నీకు సంతోషదాయకములగుఁగాత!

ప్ర భ:—ఇచట పార్వతీ సంతోషాశంసక–మదలేఖాపదముచేత, మీఁదిస్తబకమున నిబంధింపఁబడిన వృత్తము 'మదలేఖానామము' అను సూచ్యార్థము సూచింపఁబడినది కావున నిది ముద్రాలంకారమని చెప్పఁబడును.

ఇది– సవ్యాఖ్యమగు షష్ఠస్తబకము,

ఓమ్ తత్. సత్.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

ఉమాసహస్రము

(ద్వితీయ శతకమున - తృతీయ స్తబకము)

(సప్తమ స్తబకము)

మా॥ వాణీసరోరుహదృశో హసరాజహంసో
వక్త్రారవిన్దనిలయాద్ బహిరాగతాయాః
ఆలాపకాలగరహాస ఇహస్థితానామ్
క్షేమం కరోతు సుతరాం హరసున్దరీయః. ౧

(ఉమయొక్క) ముఖారవిందనిలయమునుండి వెలువడిన వాణీ సరోజనయనయొక్క హసరాజహంసమగు శివకాంతాలాపకాలదర హాసము- భూలోకమునందున్న జంతువులకు- సమధికమగు క్షేమమును ఘటించుగాత !

ప్ర భ:—ముఖారవింద నిలయమనఁగా, ముఖపద్మమే యగునివాసము. వాణీ సరోజనయనయనఁగా సరస్వతియనెడి సుందరి. పద్మసంభవుఁడగు బ్రహ్మయొక్క సుందరియగు సరస్వతికి వాహనము హంసమనునది ప్రసిద్ధము. పద్మసంభవునకు జన్మస్థలమగు అరవిందము సరస్వతికిఁగూడ నివాసస్థలము కాకతప్పదు. కావున లక్ష్మి జన్మస్థానమగు పద్మము సరస్వతీవాసస్థాన మెట్లగునను శంక కవకాశము లేదు. ఇచట సమానధర్మమగు తెల్లఁదనమువలన రాజహంస-దరహాసము లకు రాజహంసమే-దరహాసమని తాదాత్మ్యము. అధ్యవసితము. కావున వ్యస్తమగు రూపక మలంకారమగుచున్నది. మఱియు వాణీసరోజనయనయొక్క బహిరాగమన మునకును-ఉమాలాపమునకును తాద్రూప్యము. అనగా సరస్వతి బయలువెడలుటయే ఉమాలాపమని చెప్పఁబడినది. ఇది-సమాసార్థగతమగు, వైయధికరణ్యముచేత (భిన్నవిభక్తులతో) చెప్పఁబడినది. కావున నిదియు వ్యస్తమగు తాద్రూప్యరూపకమే యగునని గ్రహించునది. భగవతీ మందహాసము వాక్కును వహించుచున్నదనునది భావము.

మూ॥ నాదోఽసి, వాగసి, విభాసి చిదప్యఖణ్డా
ఖణ్డీభవన్త్యపి చిదస్యఖిలేన్ద్రికాన్తే
తత్త్వాదృశీం నిఖిలశక్తిసమష్టిమీశే
త్వామన్తరిక్షపరిక్లృప్తతనుం నమామి. ౨

సర్వేశ్వరసుందరివగు నోయీశ్వరీ! నీవు నాదమవు, వాణివి, జ్యోతివి, అఖండచిత్ స్వరూపిణివి. అయినను ఖండీభవచ్చిత్ స్వరూపిణివి గూడ నగుచున్నావు. కావున సర్వశక్తి సమష్టిస్వరూపవును ఆకాశ మునందు సిద్ధమగు శరీరముగలదానవును అగుచున్నావు. అట్టినీకు నమస్కరించుచుందును.

ప్ర భ:—కారణావస్థమును, ప్రణవరూపమును అగుశబ్దము నాదము. కార్య రూపమును, అభివ్యక్తమును అగుశబ్దము వాక్కు. అఖండచిత్ స్వరూపిణివనఁగా భేదరహితప్రజ్ఞవని యర్థము. ఖండీభవచ్చిత్ స్వరూపిణివనఁగా, అనేకఖండము లయిన చిత్తులుకూడ నీచిద్రూపము లేయని భావము.

అవ్యక్త-నాదాత్మవగు నీకువ్యక్తనాదాత్మకతవలె, అఖండచిత్తువగు నీకు ఖండ చిద్రూపత్వముకూడ కలదనిభావము. 'కావున' అనఁగా సకలలోక నిర్మాణసమ ర్థములగు నాద-వాగ్-విభా-ఖండ-అఖండ చిద్రూపములు గలుగుటవలన అని యర్థము. సర్వశక్తిసమష్టిస్వరూపవనఁగా నానాశక్తి సంహతిస్వరూపిణివనియర్థము. ఆకాశమునందు సిద్ధమగు శరీరముగలదాన వనఁగా నాద-జ్యోతిర్మయస్వరూపమున నంతరిక్షమున వ్యాపించినదానవని భావము.

శ్రీవేషవు- పరిచ్ఛిన్నశరీరవు అగు నిన్నిచట స్తుతించుచున్నాను. అయినను నీస్వరూపము జ్యోతిర్నాదమయము- సర్వవ్యాపకము అని యెఱుఁగుదును. కావున అట్టిస్వరూపముగల నీకే నమస్కరింతునని తాత్పర్యము.

మూ॥ విశ్వప్రసిద్ధవిభవాస్త్రిషు విష్టపేషు
యాః శక్తయః ప్రవిలసన్తిపరః సహస్రాః
తాసాం సమష్టిరతిచిత్రనిధానదృష్టిః
సృష్టి-స్థితి- ప్రలయ-కృద్, భువనేశ్వరి! త్వమ్. ౩

భువనేశ్వరీ! భూలోక-భువర్లోక-స్వర్లోకములయందు బ్రహ్మాండ విశ్రుత విభవములును, పరసహస్రములును అగు ఏశక్తులు విరాజిల్లుచున్నవో, ఆశక్తులయొక్క సమష్టియే స్వరూపముగాఁ గలిగిననీవు-అత్యద్భుతనిధానదృష్టివి. సృష్టి- స్థితి- ప్రలయకారిణివి.

ప్ర భ:—భువనేశ్వరి యనఁగా లోకరాజ్ఞియని యర్థము. విభవములనఁగా, సామర్థ్యరూపములగు నర్థములు. పరస్సహస్రములనఁగా సహస్రాధికములు. సృష్ట్యాదులయం దధికృతములగు విశ్వప్రసిద్ధ శక్తులన్నియుఁగూడ నీయొక్క తెయందే సమసించుటవలన నీవు శక్తి సమష్టిస్వరూపవు. సర్వసృష్టిసామగ్రీనిక్షేపభూతమగు నిధానము నీదృష్టియందే యుండుటవలన నీవు అతిచిత్రనిధానదృష్టివి. సర్జన-రక్ష[illegible]-సంహారములు నీయధీనమునం దుండుటవలన నీవే సృష్టి స్థితి ప్రలయకారిణివి అని భావము. "నీస్వరూపము కేవలమగు స్త్రీరూపముచేత పరిచ్ఛిన్నము (ఖండస్వరూపము గలది) కాదు" అని తాత్పర్యము.

మా॥ జానే న యత్తవ జగజ్జననయిత్రి! రూపం
సఙ్కల్పయే కిమపి తన్మనసో బలేన
సఙ్కల్పితస్య వపుషః శ్రితశోకహన్త్రి!
విన్యస్యతే తవ వచోఽతిగధామ నామ. ౪

ఓజగజ్జనయిత్రీ! నీరూపమేదో నేనెఱుఁగను. కనుకనే ఆరాధనకొఱకు నామనోబలముచేత ఏదోరూపమును కల్పించుకొనుచున్నాను. ఓయాశ్రితశోకహన్త్రీ! ఇట్లు భావనాకల్పితమగు నీరూపమునకొక పేరు కూడ పెట్టుకొన్నాను. ఆనామము- వచోఽతిగధామము.

ప్ర భ:—జగజ్జనయిత్రి యనఁగా లోకములను గన్నతల్లి. మనోబలమనఁగా, భావనాబలమని గ్రహించునది. ఆశ్రితశోకహన్త్రి యనఁగా, ఆశ్రయించిన ప్రజల దుఃఖములను తొలఁగించునది. 'ఆనామము' అనఁగా భావనచేత రచింపఁబడిన రూపముగల తల్లిని దెలుపుటకై ప్రయోగింపఁబడిన 'ఉమ' అను పేరు. 'వచోఽతిగధామము' అనఁగా, మాటలకందని ప్రభావముగలదియని యర్థము.

అమ్మా! నీయథార్థస్వరూప పరిజ్ఞానము లభింపకుండుటవలన భావనాబలముచేత కల్పించిన రూపము మితమేయయినను, పెట్టుకొన్న నామముయొక్క ప్రభావముమాత్రము వాచామగోచరమని భావము.

మూ॥ కాలుం వదన్తు వనితామితిహాసదక్షాః
త్వాం సర్వలోకజనయిత్రి! సదేహబన్ధామ్
సత్యంచ తద్భవతు సాతవకాఽపిలీలా
దివ్యం రజస్తు తవవాస్తవికం శరీరమ్. ౫

ఓ సర్వభువనప్రసూ! ఇతిహాసదక్షులగు పండితులు వారియభీష్టము ననుసరించి నిన్ను సదేహబంధవగు స్త్రీవని చెప్పనీ. ఆచెప్పినది సత్యమునుకానీ. అది (ఆ విగ్రహరూపము) నీకొకానొకలీల మాత్రమే. నీకు వాస్తవికమగు శరీరము దివ్యమగు (రజస్సే) సూక్ష్మరేణువేయగును.

ప్ర భ:—ఇతిహాసదక్షులనఁగా, పురావృత్త కథాకుశలులు.

ప్రశ్న-పరమేశ్వరి స్త్రీవిగ్రహవతి యగుట సత్యమా!

ఉత్తరము-సర్వశక్తి యుక్తయగు పరమేశ్వరి- స్త్రీ విగ్రహవంతురాలగుట లోకానుగ్రహ నిమిత్తకమగు విలాసవిశేషము కావచ్చును.

ప్రశ్న-పరమేశ్వరికి వాస్తవికమగు శరీరమేది!

ఉత్తరము-ఆకాశగతమగు (రజస్సే) సూక్ష్మరేణువే యామె శరీరము. భగవతియగు నుమకు వాస్తవికశరీరము. "సాతత్త్వతః సమస్తాత్" ఇత్యాదిశ్లోకముల యందు ప్రథమ శతకమున ప్రతిపాదింపఁబడి వ్యాఖ్యానింపఁ బడియున్నది.

మూ॥ భూజన్మపాంసుభిరగర్హితశుద్ధరూపా
యాకాఽపి పాంశుపటలీ విపులేఽన్తరిక్షే
సా తేతనుః సుమహతీవరదే! సుసూక్ష్మా
తామేవ దేవసరణిం కథయన్తి ధీరాః. ౬

అభీష్టవరదాత్రివగు జననీ! భూమినుండి జనించిన ధూళులచేత దూషితముకాని శుద్ధమగు ఒకానొక పాంశుపటలి (రేణుసంహతి) విశాలమగు నీయంతరిక్షమునందున్నది. ఆయాకాశముకంటెనుగూడ మిగులఁ పెద్దదియు, అన్నిటికంటెనుగూడ మిక్కిలి సూక్ష్మమైనదియు నగు నా రేణుసంహతి- నీశరీరమగుచున్నది. ధీరులగువిజ్ఞులు-ఆకాశగత

మగు ఆపాంశుపటలినే దేవసరణి (దేవయానమార్గము) అని చెప్పి యున్నారు.

ప్ర భ:—(పార్థివ)-భౌతిక సంపర్క-శూన్యమును, స్వతస్సిద్ధమును, స్థూలమగు బుద్ధిచేతను, ఇంద్రియములచేతను తెలియఁబడనిదియును, యోగిజనుల సూక్ష్మము లగు దృష్టులకుమాత్రమే గోచరమగునదియునగు ఆకాశగత సూక్ష్మాణుపటలియే ఉమాశరీరమని గ్రహింపనగును.

ధీసులనఁగా ప్రశస్తమగు బుద్ధిని గ్రహించినవారు. దేవయానమార్గమనినను అర్చిరాది మార్గమనినను ఒక్కటియే. ఈమార్గమున శరీరమునుండి యుత్క్రాంతుఁడగు విద్వాంసుఁడు- ఊర్ధ్వగతి నొందునని శ్రుతులయం దుగ్గడింపఁబడినది.

అవ:-దేవయానాత్మకమగు పరమేశ్వరీశరీరమును మరలవివరించుచున్నాఁడు.

మూ॥ యా దేవి! దేవసరణిర్భవమగ్నదుర్గా
వైరోచనీతికథితా, తపసాజ్వలన్తీ,
రాజీవబన్ధుమహసా విహితాఙ్గరాగా,
సా తే తనుర్భవతి సర్వసుపర్వవర్ణ్యే! ౭

సర్వసుపర్వవర్ణ్యవగు దేవీ! జననమరణరూపమగు సంసారమను సముద్రమున మునిఁగినవారికి దుర్గమమగు దేవసరణి- తపస్సు చేత జ్వలించునదియై వైరోచనియని చెప్పఁబడినది. వైరోచనియగు ఆదేవసరణియే- కమలబంధువగు సూర్యుని తేజస్సుచేత రచితమగు నంగరాగముగల నీశరీరమగుచున్నది.

ప్రభ:—సంసారనిమగ్నులకు దుర్గమమని చెప్పఁబడిన దేవసరణి-విద్వదేకగమ్యము. తపస్సనఁగా, ప్రాత్మయందుంచఁబడిన దృఢమగు దృష్టియొక్క-బలము.

"విశేషేణరోచతే ఇతివిరోచనః" అను వ్యుత్పత్తిచేత విశేషించి ప్రకాశించువాఁడగు సూర్యుఁడు విరోచనుఁడని చెప్పఁబడుచున్నాఁడు. జ్వలత్ప్రకాశుఁడగు సూర్యుఁడు సర్వేశ్వరుఁడు. తత్సంబంధినియగు దేవసరణి-వైరోచనియని చెప్పఁబడినది. దుర్గయు వైరోచనియునగు భగవతిని క్రిందిమంత్ర మెట్లు గానముచేయుచున్నదో చూడుఁడు.

"తామగ్నివర్ణాం తపసాజ్వలన్తీం వైరోచనీం కర్మఫలేషు జుష్టాం
దుర్గాం దేవీం శరణమహంప్రపద్యే సుతరసి తరసేనమః"

ఈలోకమునుండి యుత్క్రమించిన విద్వాంసుని స్వర్లోకమునకు గొనిపోవునదియు, దివ్యరజఃపటలముచేత నిండియున్నదియు, దేవయానమను పేరుగలదియు నగు అర్చిరాదిమార్గము దేవీశరీరమని చెప్పఁబడినది.

అంతరిక్షగతమగు దివ్యరజోరూప దేవీశరీరమునకు ప్రభాకరతేజస్సుచేత, అంగలేపము సంఘటింపఁబడినదని. తేజోఽంగరాగములకు తాదాత్మ్యము సంభావింపఁబడుటచేత ఇది గమ్యోత్ప్రేక్షయా, లేక

విషయ-విషయులగు తేజోఽంగరాగములలో విషయమగు తేజస్సును మరుగుపరచుటచేత విషయియగు అంగరాగముయొక్క అధ్యవసానమువలన అతిశయోక్తియా అనుసందేహము కల్గెడిని. కావుననిది-తత్సందేహ సంకరమగును.

మూ॥ ప్రాణాస్తవాత్ర హృదయంచవిరాజతేఽత్ర
నేత్రాణి చాత్రశతశః శ్రవణానిచాత్ర
ఘ్రాణానిచాత్ర రసనాని తథాత్వచశ్చ
వాచోఽత్ర దేవి! చరణానిచ పాణయోఽత్ర. ౮

దేవీ! దివ్యరేణుమయమనియు, దేవయానాఖ్యమనియు వెనుక చెప్పఁబడిన నీశరీరమగు అర్చిర్మార్గమునందు జగజ్జీవనధారణహేతుభూతములగు ప్రాణములును జ్ఞాన-క్రియావిలాసమూలమును, ఆత్మస్థానమును అగు ప్రాణులహృదయమును, అసంఖ్యాకములగు నారి నేత్రములును, శ్రవణములును, ఘ్రాణములును, రసనములును, త్వక్కులును, వాక్కులును, చరణములును, పాణులును విరాజిల్లుచున్నవి.

ప్ర భ:—పాణి- పాద- వాక్- ప్రాణ- చక్షుః శ్రోత్రాదులగు సమస్త కర్మజ్ఞానేంద్రియముల సమష్టి-ఈజగజ్జనని దివ్యరేణుమయ శరీరమునందే యున్నదని చెప్పఁబడియెను. హృదయమున కేకవచనమును, వాక్ప్రాణాదులకు బహువచనమును ప్రయోగింపఁబడినవి.

ఇట్లు ప్రయోగించుటచేత వ్యష్టిగతములగు వాగాదులనేకము లయినను ఈ సర్వవ్యష్టులకును, మూలమును, ఆత్మస్థానమును అగుహృదయము ఒక్కటియే అను నంశము వివక్షితము. తనచేతనుపనిబంధింపఁబడిన శ్రీరమణగీతయందు హృదయమును గురించి మహర్షి కావించిన యుపదేశము నీయాచార్యుఁ డిట్లుగ్గడించుచున్నాఁడుగదా!

శ్లో. "అణ్డం వపుషి నిశ్శేషం, నిశ్శేషం హృదయే వపుః
తస్మాదణ్డస్య సర్వస్య హృదయం రూపసఙ్గ్రహః"

సంపూర్ణమగు బ్రహ్మాండము, (భగవతియొక్క) శరీరమునం దున్నది. ఆశరీర మంతయు (ఆమెయొక్క) హృదయమునందున్నది. కావున బ్రహ్మాండమున కంతకును హృదయమే-రూపసంగ్రహము. (సూక్ష్మమగు మూలము)వాక్ ప్రాణ చక్షు రాదులన్నియుఁగూడ, పరమేశ్వరి శరీరమునందున్నవనుటవలన- ఇవియన్నియుఁగూడ స్థూల- సూక్ష్మ కారణావస్థలు మూడింటియందును తదనన్యములు (ఆమె కంటె వేఱుకానివి.) తదుపాదానములు(ఆమెనుండియే జనించినవి.) తదాధారములు (ఆమెయే ఆధారముగాఁగలవి)అనునర్థము ప్రతిపాదింపఁబడినదని గ్రహించునది.

మూ॥ సర్వత్రపశ్యసి, శృణోషిచ, సర్వతోఽప్య
సర్వత్రఖాదసి, విజిఘ్రసి, సర్వతోఽపి
సర్వత్రచ స్పృశసి, మాతరభిన్నకాలే
కః శక్నుయాన్నిగదిన్నిగదితుంతుంతవ దేవి! భాగ్యమ్. ౯

సార్వకాలికవగుటచే నిత్యవగునో దేవీ! నీవే అంతటను చూచుచున్నావు. అన్నిటను వినుచున్నావు. అంతటను భుజించుచున్నావు. అన్నిటను మూర్కొనుచున్నావు. అంతటను స్పృశించుచున్నావు. తల్లీ! నీభాగ్యమును చెప్పుటకు సమర్థుఁ డెవడున్నాఁడు.

ప్ర భ:-కడచినది, రాఁబోవునది, జరుగుచున్నది అనుభేదముచేత త్రివిధమగు కాలము లేకుండుటవలన నీవు కాలపరిచ్ఛేదము లేనిదానవను నర్థము 'అభిన్నకాలే' అనుపదముచేఁ దెలుపఁబడినది.

నీకన్నె-అన్నింటికిని కన్నైయుండుటవలన అంతటను జూచుదానవు నీవే యగుచున్నావు. ఇట్లే తదితర స్థలములం దెఱుంగునది. మఱియు 'చక్షుషః చక్షుః శ్రోత్రస్యశ్రోత్రమ్'. ఇత్యాదిగా శ్రుతులయందు బ్రసిద్ధవగు నీవు ఈప్రాణులచక్షుస్సులకు చక్షుస్సును, శ్రోత్రములకు శ్రోత్రము మొదలగునవి యగుదువు. కావున నీవే చూచుదానవు, వినుదానవు, భుజించుదానవు, మూర్కొనుదానవు, స్పృశించుదానవు అగుదువని యైనను జెప్పనగును.

ఇట్లంతటను జ్ఞానేంద్రియరూపమునమండి వ్యాపారముల నొనర్చుచున్న, నీయైశ్వర్యము నుగ్గడించుటకు శక్తుఁడగువాఁ డింకొకఁడు లేఁడనిభావము.

మూ. సర్వత్ర నన్దసి, విముఞ్చసి సర్వతోఽమ్బ!
సర్వత్ర, సంసరసి, గర్జసి, సర్వతోఽపి,
సర్వత్ర దేవి! కురుషే తవ కర్మజాల
వైచిత్ర్యమీశ్వరి! నిరూపయితుం క్షమః కః? ౧౦

ఈశ్వరీ! అంతటను ఆనందస్వరూపిణి వగుటవలన నీవే యానందించుచున్నావు. అన్నిటివలనను విడుచుచున్నావు, అంతటను సంచరించుచున్నావు. అన్నిటిమూలమునను గర్జించుచున్నావు, అన్నిటిమూలమునను గూడ (పని) చేయుచున్నావు. నీకర్మజాలవైచిత్ర్యమును నిరూపించుట కెవఁడు సమర్థుఁడు?

ప్ర భ:—మీఁది శ్లోకమునందలి 'సంసరసి' అనుపదమునకు సందర్భము ననుసరించి, సంచరింతువు అనునర్థము చెప్పఁబడినది.

ఇందు గర్జించుట వాగింద్రియ వ్యాపారము. చేయుట పాణీంద్రియవ్యాపారము, సంచరించుట పాదేంద్రియ వ్యాపారము. విడుచుట పాయ్వింద్రియవ్యాపారము, ఆనందించుట ఉపస్థేంద్రియవ్యాపారము అని యెఱుంగునది.

మూ॥ విశ్వామ్బికే! త్వయి రుచాంపతయః కియన్తో?
నానావిధాబ్ధికలితాః క్షితయః కియత్యః?
బిమ్బాని శీతమహసాం లసతాం కియన్తి?
నైతచ్చ వేద, యది కో విబుధో బహుజ్ఞః? ౧౧

ఓ విశ్వజననీ! ఆధారభూతవగు నీయందు సూర్యు లెంద ఱున్నారో, లవణేక్షుసురాదిసముద్రవలయితములగు దేశము లెన్ని కలవో, ప్రకాశించుచున్న చంద్రమండలము లెన్ని కలవో, ఈయంశ మునుగూడ తెలియనియెడల బహుజ్ఞుఁడగు విబుధుఁ డెవఁడున్నాఁడు?

ప్ర భ:—ఒక్కొక్క సూర్యకుటుంబమునకు నక్షత్రస్వరూపముననున్న సూర్యులనేకులు మూలభూతములగు భూములైయున్నారు. వారినాశ్రయించి చంద్రులనేకులు సంచరించుచున్నారు. ఈయర్థమును, ప్రథమశతకమునందలి ద్వితీయస్తబకమునందుగల 'పునర్విపాకతః' 'విసర్జనేన' అనుశ్లోకములందు పరిశీలించునది, లోకులందఱును కించిద్జ్ఞులే యనిభావము.

అవ:—తరువాత బ్రాహ్మి మొదలగు సప్తమాతృకల వైభవమును వేర్వే ఱుగ నేడుశ్లోకములచేఁ దెలుపుచున్నాఁడు.

మూ॥ అవ్యక్తశబ్దకలయాఖిల మన్తరిక్షమ్
త్వం వ్యాప్య దేవి! సకలాగమసంప్రణీతే!
నాదోఽస్యుపాధివశతోఽథ వచాంసి, చాసి।
బ్రాహ్మీంవదన్తి కవయోఽముకవైభవాం త్వామ్. ౧౨

సకలతంత్రశాస్త్రసంప్రణీతవగు నో దేవీ! అవ్యక్తమగు ప్రణవము యొక్క అంశముచేత అంతరిక్షమును నంతను వ్యాపించి నీవు నాదమవై యున్నావు. తదుపరి ఉపాధివశమువలన వాక్కులుగూడ నైయున్నావు, ఇట్లు కార్యకారణోభయవిధవాగాత్మకమగు వైభవముగలిగి యున్న నిన్ను పండితులు బ్రాహ్మివని (బ్రహ్మశక్తివని) చెప్పుదురు.

ప్ర భ:—అస్పష్టమును ప్రణవరూపమును నగు కారణశబ్దస్వరూపముతో ఆకాశమునందు వ్యాపించి నాదశబ్దవాచ్యవగు నీవు కారణవాగ్రూపవై యున్నావు. తరువాత కార్యోపకరణవశమున వ్యక్తవాగ్రూపిణి వగుచున్నావు. ఇట్లు కార్యకారణోభయ వాగ్రూపిణివగు నిన్ను కవులు బ్రాహ్మివని చెప్పుదురని భావము. "ఉపసమీపే ఆదధాతి" అను వ్యుత్పత్తివలన ఉపాధియనఁగా, కార్యమున కుప కరణమగు వస్తువని యర్థము.

అవ:—పిమ్మట వైష్ణవీమాతృకను వ్యాఖ్యానించుచున్నాఁడు.

మూ॥ నానావిధైర్భువనజాల సవిత్రి! రూపై
ర్వ్యాప్తైక నిష్కలగభీరమహస్తరఙ్గైః
వ్యక్తం విచిత్రయసి సర్వమఖర్వశక్తే!
సా వైష్ణవీ తవకలా కథితా మునీన్ద్రైః. ౧౩

జగజ్జాలజనయిత్రివగు నో యనల్పశక్తీ! వ్యాప్తము, ఏకము, నిష్కళము, గభీరము అగు జ్యోతిస్సుయొక్క తరంగములుగలిగిన బహువిధములగు రూపములచేత ప్రపంచగతమగు వస్తుసముదాయ

మంతయు వేర్వేరగురూపమున వ్యక్తమగునట్లు- విచిత్రముగాఁ జేయుచున్నావు. ఏకళచేత నీవిట్లుచేయుచున్నావో, ఆనీకళను తాపసోత్తములు వైష్ణవి (విష్ణుశక్తి) అని చెప్పుచున్నారు. కారణమగుజ్యోతికి కార్యావస్థయందు రూపాత్మకతాసిద్ధి ప్రసిద్ధము. వ్యక్తమగుసృష్టికి రూపసంపాదికయగు మాత విష్ణుశక్తియని తాత్పర్యము.

శ్లో॥ వ్యక్తిం త్వమమ్బ! హృదయే హృదయే తథాసి,
యేనప్రభిన్న ఇవబద్ధ ఇవాన్తరాత్మా
సేయం కలా భువననాటకసూత్రభర్త్రి!
మాహేశ్వరీతికథితా తవచిద్విభూతిః. ౧౪

ఓ భువననాటకసూత్రభర్త్రి! అంబా! ప్రతిహృదయమునందును వ్యక్తిత్వమును (వేర్వేరుగా నేను, నేను, అనుతలంపు గలిగియుండుటను) ధరింపఁజేయుచున్నావు. ఇట్లు వ్యక్తిత్వమును సంఘటించుటచేత, సర్వాంతరుఁడగు ఆత్మ- ఒక్కఁడేయయినను, ప్రభిన్నుఁడు (అనేకుఁడు వలెను, నిత్యముక్తుఁడయినను, బద్ధుఁడువలెను అగుచున్నాఁడు. ఇట్లు భేదభ్రమ నొదవించుచున్న యేకళచేత, అంతరాత్మ ఒక్కఁడేయయినను, అనేకుఁడువలెను,అవ్యక్తుఁడయినను వ్యక్తుఁడువలెను. స్వతంత్రుఁడైనను, బద్ధుఁడువలెను అగుచున్నాఁడో; ఆయీ నీకళయగు చిద్విభూతి- మాహేశ్వరి (మహేశ్వరశక్తి) అని చెప్పఁబడుచున్నది.

ప్రభ:—'నాదాత్మిక యగు వాగ్ విభూతి, బ్రాహ్మీకల' అనియు, "విశ్వరూప స్థితిసంపాదికయగు శోభావిభూతి వైష్ణవీకళ" అనియు కడచిన శ్లోకముల యందు ప్రతిపాదించి యీశ్లోకమునందు-అగణిత భేదభ్రమ భూయిష్ఠ జగన్నాటక సంవిధాత్రియు, హృదయస్థిత-ఈశ్వరమాయయుఅగు చిద్విభూతి'మాహేశ్వరీకళ' అని చెప్పఁబడినది. ఇందు హృదయ-ప్రభిన్న ఇవ- బద్ధఇవ-భువననాటకాది శబ్ద ప్రయోగమువలన

ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢానిమాయయా॥

"యంత్రారూఢములగు ప్రాణులను మాయచేత నాడించుచు నీశ్వరుఁడు వాని హృదయదేశమునందున్నాఁడు."

అను భగవద్గీతాశ్లోకార్థమనుసంధింపఁబడినదని తెలియుంగువది.

అ వ:—ఇప్పుడు 'కౌమారి' అనుమాతృకను తెలుపుచున్నాఁడు.

మూ॥ ఆహారశుద్ధివశతః పరిశుద్ధసత్త్వే
నిత్యస్థిరస్మృతిధరే వికసత్ సరోజే
ప్రాదుర్భవస్యమలతత్త్వవిభాసికా యా
సాత్వంస్మృతాగురుగుహస్యసవిత్రి! శక్తిః. ౧౫

సవిత్రీ! ఆహారశుద్ధివశమువలన నిర్మలమగు అంతఃకరణము గలిగినదియు, స్థిరమగు ప్రజ్ఞను ధరించునదియు, వికసించిన పుండరీకము (హృదయము) గలదియునగు జనమునందు శుద్ధసత్యమును ప్రకాశింపఁజేయుచున్న దానవై యావిర్భవించుచున్న నీవు-కౌమారి (కుమారశక్తి) వని స్మరింపఁబడుచున్నావు.

ప్రి భ:—ఆహారశుద్ధి- స్థూలరూపమునను సూక్ష్మరూపమునను ద్వివిధమగుచున్నది. అందు దేహాశ్రితమగు నంతఃకరణమునకు సాత్వికాహారముచేత సంపాదింపఁబడినది- స్థూలరూపముననగు ఆహారశుద్ధి యగుచున్నది. శబ్దాదులగు విషయములకు శ్రోత్రాదులగు నింద్రియములతోడి సంయోగము గలిగినపుడు

'గుణా గుణేషు వర్తన్తే' భగవద్గీత 3అ. 28 శ్లో.

(శ్రోత్రాదులే శబ్దాదులయందు ప్రసరించుచున్నవి.ఆత్మ ప్రవర్తించుటలేదు)

"ఇన్ద్రియాణీన్ద్రియార్థేషు" భగవద్గీత 5అ. 9 శ్లో.

(ఇంద్రియములగు శ్రోత్రాదులే. ఇంద్రియార్థములగు విషయములందు వర్తించుచున్నవి. ఆత్మనగు నేనేమియుఁ జేయుటలేదు.)

అని వ్యవసాయాత్మికయగు బుద్ధిచేత, వినుట, చూచుట, మొదలగు ప్రకృతి వ్యాపారములకంటె ఆత్మను వేరుగా నెఱిఁగి మెలఁగువానికిఁ గలుగునది- సూక్ష్మరూపముననగు నాహారశుద్ధి యగుచున్నది, ఆహరించుటయన స్వీకరించుట అని యర్థము. కావున ఆహ్రియమాణములు=స్వీకరింపబడినవి అగువిషయములు – 'ఆహారము' అని చెప్పఁబడును. కావున రాగాదులతోడి సంబంధము లేకుండునట్లు

గ్రహింపఁబడుచున్న విషయములయొక్క శుద్ధి-ఆహారశుద్ధియని ఇచటఁ జెప్పఁబడినది. గురుగుహుఁడనఁగా కుమారుఁడు (స్కందుఁడు).

ఛాందోగ్యశ్రుతియందుఁగల నారద సనత్కుమారాఖ్యాయిక యందీయంశమిట్లు చెప్పఁబడినది. "ఆహారశుద్ధి కలుగునపుడు అనఁగా, శబ్దాదివిషయవిజ్ఞానము రాగద్వేష మోహ దోషసంస్పృష్టము కానపుడు అంతఃకరణ శుద్ధికలుగును, అంతఃకరణము శుద్ధమగునపుడు తెలియఁబడిన భూమస్వరూపమగు నాత్మయందు ధ్రువమగు (అవిచ్ఛిన్నమగు)స్మృతి(మరపులేమి)కలుగును.స్మృతికలుగునపుడుహృదయాశ్రయములగు సర్వగ్రంథులును విడిపోవును. [సత్యము స్ఫురించును] అని మృదితకషాయుఁడగు (దోషరహితుఁడగు) నారదునకు భగవానుఁడగు సనత్కుమారుఁడు తమస్సునకావలనున్న పరమార్థ తత్త్వమును చూపించెను. ఆసనత్కుమారునే స్కందుఁడని తద్విదులు చెప్పుదురు." ఇట్లు ఛందోగులు- స్కందుఁడు- సనత్కుమారుఁడు- ఒకఁడేయని చెప్పుచున్నారు.

ఇట్లు ఆహారశుద్ధివలన నిర్మలాంతః కరణులకు మనుష్యులకు తన్మూలమున ధ్రువమగు స్మృతి కలుగునపుడు వారిహృదయములయందు పరమేశ్వరశక్తిచేత నిర్మలమగుసత్యము ప్రకాశింపఁ జేయఁబడునను నీయంశము కుమారునిచేఁ దెలుపబడుటవలన నాశక్తి- కౌమారి (కుమారశక్తి)అని ప్రవచింపఁబడిన'దనిగ్రహించునది.

అ వ:—పిమ్మట "వారాహి" అనుమాతృకను స్తుతించుచున్నాఁడు.

మూ|| హవ్యం యయా దివిషదో మధురంభజన్తే
కవ్యం యయా రుచికరం పితరో భజన్తే
అశ్నాతిచాన్నమఖిలోఽపి జనోయయైవ
సా తే వరాహవదనేతి కలామ్బ! గీతా. ౧౬

అమ్మా! దేవతలచేత మధురమగు హవ్యమును గ్రహింపఁజేయునదియు, పితరులచేత రుచికరమగు కవ్యమును స్వీకరింపఁజేయునదియు సర్వజనులచేతనుగూడ అన్నమును భుజింపఁజేయునదియు నగు; నీకళ-వరాహవదన (వారాహి) అని గానము చేయఁబడినది.

ప్ర భ:-దేవతలకొఱకీయఁబడు నన్నము- హవ్యమనియు పితృదేవతల కీయఁబడునన్నము- కవ్యమనియు చెప్పఁబడును. "హవ్యకవ్యే దైవపైత్రే అన్నే" అని అమరముగదా! సర్వమును భుజించునదియు (భోక్త్రి)యు) భుజింపఁజేయునదియు

నగు నీశక్తి - వారాహి. దీనిచేతనే దేవతలు, పితరులు, మనుష్యులుకూడ భోజన సామర్థ్యవంతులుగాఁ జేయఁబడుచున్నారని భావము.

అ వ:—అనంతరము 'ఇంద్రాణి' అను మాతృకను స్తుతించుచున్నాఁడు.

మూ॥ దుష్టాన్నిహంసి జగతామవనాయ సాక్షా
ద న్యైశ్చ ఘాతయసి తప్తబలై ర్మహద్భిః
దమ్భోళిచేష్టితపరీక్ష్య బలాబలారేః
శక్తి ర్న్యగాది తవ దేవి! విభూతి రేషా. ౧౭

దేవీ! లోకమును రక్షించుటకు నీవు స్వయముగానే దుష్టులను చంపుచున్నావు. ప్రతప్తబలులును; మహాసత్త్వులునునగు నితరులచేతఁ గూడ చంపించుచున్నావు. ఇట్లు చేయుచున్న నీవిభూతి- వజ్రాయుధముయొక్క చేష్టితముచేత పరీక్షింపఁదగిన బలముగలదై ఇంద్రాణి (ఇంద్రశక్తి) అని పేర్కొనఁబడుచున్నది.

ప్ర భ:—దుష్టులను స్వయముగా నిగ్రహించునదియు, ఇతరులచేత నిగ్రహింపించునదియునగు మాతృవిభూతి-ఇంద్రాణిఅనితాత్పర్యము. ఈశక్తియొక్క-బల నిర్ణయమున పరీక్షకము వజ్రాయుధమే యగును. అది బలారియగు నింద్రునికి సంబంధించినది. కావున నీశక్తి 'ఇంద్రాణి' అని పేర్కొనఁబడినది.

అ వ:-పిదప 'చాముండ' అనుసప్తమ మాతృక నభివర్ణించుచున్నాఁడు.

మూ॥ సఙ్కల్పరక్తకణపానవివృద్ధశక్త్యా
జాగ్రత్ సమాధికలయేశ్వరి! తే విభూత్యా
మూలాగ్ని చణ్డ శశిముణ్డ తనుత్రభేత్ర్యా
చాముణ్డయా తనుషు దేవి! నకింకృతం స్యాత్. ౧౮

ఈశ్వరివగు నోదేవీ! సంకల్పములను రక్తబిందువులను గ్రోలుటచేత మిక్కిలి వృద్ధినొందిన శక్తిగల జాగ్రద్దశయందగు సమాధియను కళచేత మూలాగ్నియను చండునియొక్కయు శశియను ముండుని యొక్కయు కవచభూతములగు గ్రంథులనుభేదించునదియగు చాముండ యనుపేరుగల నీయొక్క విభూతిచేత మాశరీరములయందు చేయబడనిదేమున్నది?

ప్ర భ:—సంకల్పములనఁగా; చిత్తవృత్తి విశేషములు. సమ్యగాధీయ తే మనోఽస్మిన్నితి సమాధిః అను వ్యుత్పత్తివలన దేని యందు మనస్సు చక్కగా నుంచఁబడునో అది సమాధియని చెప్పఁబడును. చండుఁడనువాఁడును, ముండుఁ డనువాఁడును, రాక్షసులు. మూలాగ్నియనఁగా కులకుండమను పేరుగల మూలాధా రమునందున్న యగ్ని.

విశే:-దేవీ మాహాత్మ్యమునందు చాముండాశక్తి, రక్తబీజాసురుని రుధిర మును పానము చేసినట్లును, చండ-ముండులను ఖండించినట్లును చెప్పఁబడియున్నది. ఆ కథాంశమునకు సంబంధించిన యాధ్యాత్మిక తత్త్వము నీమహాకవి యీశ్లోకమున రూపకాపదేశమున నుద్ఘాటించుచున్నాఁడు.

అదెట్లనిన:-దుర్గాసప్తశతియందలి యష్టమాధ్యాయమున దేవికి 'చాముండ' అనునామ మెట్లులభించినదియు నిట్లు చెప్పఁబడినది.

శ్లో. యస్మాచ్చణ్డంచ ముణ్డంచ గృహీత్వా త్వముపాగతా
చాముణ్డేతి తతోలోకే ఖ్యాతాదేవి! భవిష్యసి॥

(దేవీ! నీవు, చండుని, ముండుని నిగ్రహించుటవలన లోకమున నీవు 'చాముండ' అను పేరుగల దానవు కాఁగలవు)

మఱియు నవమాధ్యాయమున, రక్తబీజుఁడను నసురునిగూర్చి ప్రస్తావించు నపుడు క్రిందితీరునఁ జెప్పఁబడినది.

పలాయనపరాన్ దృష్ట్వా దైత్యాన్ మాతృగణార్దితాన్
యోద్ధుమభ్యాయయౌక్రుద్ధో రక్తబీజో మహాసురః॥
... ...
తస్యాహతస్య బహుధాశక్తిశూలాదిభిర్భువి
పపాత యోవైరక్తౌఘస్తేనాసఞ్ఛతశోఽసురాః॥
తైశ్చాసురాసృక్సమ్భూతైరసురైః సకలంజగత్
వ్యాప్తమాసీత్తతోదేవా భయమాజగ్మురుత్తమమ్॥
తాన్ విషణ్ణాన్ సురాన్ దృష్ట్వా చణ్డికాప్రాహ సత్వరా
ఉవాచ కాళీం చాముణ్డే! విస్తీర్ణం వదనంకురు॥
మచ్ఛస్త్రపాత సమ్భూతాన్, రక్తబీజాన్మహాసురాత్।
రక్తబిందూన్ ప్రతీచ్ఛత్వం వక్త్రేణానేన వేగినా ॥

మాతృ-గణముచేత మర్దింపఁబడి పలాయనము చిత్తగింపనున్న దైత్యులను చూచి రక్తబీజుఁడను మహాసురుఁడు క్రుద్ధుఁడై యుద్ధమునకువచ్చెను.........

శక్తిశూలాదులచేత వధింపఁబడిన రక్తబీజునియొక్క రక్తసందోహము బహు విధముల ప్రసరించెను. తన్మూలమున నసంఖ్యాకులగు రాక్షసులు బయలువెడలిరి.

మహాసుర రక్తసంభూతులగు నాయసురులచేత జగత్తంతయు వ్యాపించుటవలన దేవత లత్యధికమగు భయమునొందిరి. విషణ్ణులగు నాదేవతలనుజూచి యోదార్చి చండిక సత్వరయై కాళితో నిట్లనెను.

"చాముండా! నీనోరు విరివియగునట్లు తెరువుము. మచ్ఛస్త్రపాతమున రక్తబీజమహాసురునినుండి స్రవించుచున్న రక్తబిందువులను నీనోటితో వడిగాఁ ద్రావుము." మీఁది (౧౮౨) శ్లోకమున చాముండా విభూతి స్వరూపము- 'జాగ్రత్ సమాధికల' అని చెప్పఁబడినది.

జాగ్రద్దశయందే ఏకాగ్రధ్యానరూపమును, సహజమును, అగుసమాధి సిద్ధించును కాని సుషుప్తియందుఁగాని, అష్టాంగయోగ నిష్పాద్యమగు లయావస్థయందుఁగాని సిద్ధింపదు.

ఆజాగ్రత్ సమాధియను విచిత్రవిద్యయే చాముండా విభూతిస్వరూపమగుచున్నది. కాని ఆమెయొక్క- శక్తి- సంకల్పముల నుపహరించుటవలన వృద్ధినొందుచున్నది. ఈసంకల్పోపసంహరణమే - చాముండాకృతమగు రక్తబీజాసుర- రుధిర బిందుపానము. మూలాధారమునందలి అగ్నిని ప్రబోధించుటయే చండతనుత్రమును భేదించుట, యోగులు కానివారియందు మూలాధారమునందలి యగ్ని- తమోధూమావృతమగుటవలన, అసురునివలె ప్రతికూల మగునది- చండము (తీవ్రము) అగుచుండును. కావుననే ఆమూలాగ్ని- చండుఁడని చెప్పఁబడినది. చండ- కవచభేదన మనఁగా, మూలాగ్నియందలి గ్రంధులను భేదించుట. గ్రంధిభేదనము చేతనేగదా! మూలాధారమునందలి యగ్ని- ఆవరణములేకుండ ప్రజ్వలించును.

యోగి ప్రసిద్ధమగు సహస్రార (చక్ర)ము నందలి అమృతాంశు (చంద్ర) మండలమునకు ప్రావరణము (కప్పునది) అగు మనస్సే- ముండుఁడను అసురుఁడు. కావున మనస్సుయొక్క- నిగ్రహమే- ముండ- కవచభేదనము.

మనోనిగ్రహముచేతనే సహస్రార చక్రమునందలి అమృతకిరణఝురినిఆస్వాదించి యోగి- అమృతియగునది!

ఇట్లు రక్తకణ పాన- చండ- ముండ- కవచ భేదనరూపమగు సంకల్పోపసంహార- మూలాగ్ని ధూమావరణ- సహస్రారావరణ- ప్రభేదములు- ఏకళచేత నిర్వహింపఁబడుచున్నవో. అది- మహాశక్తియగు నుమాదేవియొక్క- చాముండా విభూతి అనుగహనమును, యోగిజనైకవేద్యమునునగు నంశమును సంక్షేపముగుతీరునసమన్వయింపఁబడినదని యెఱుంగునది. ఈశ్లోకము ఈమహాకవి ప్రతిభను దెల్పుచున్నది.

అవః-ఇట్లు సప్తమాతృకలను సంస్తుతించి, మహాశక్తియగుమాయ- స్థానభేదమువలన నాలుగువిధములగు వనుమన్నాఁడు.

మూ. త్వంలోకరాజ్ఞి! పరమాత్మని 'మూలమాయా'
శక్రే సమస్త సురభర్తరి 'జాలమాయా'
ఛాయేశ్వరాన్తర 'పుమాత్మని' 'యోగమాయా'
సంసారసక్తహృదయేష్వసి 'పాశమాయా'. ౧౯

లోకరాజ్ఞీ! నీవు పరమాత్మయందు మూలమాయవు. సురేశ్వరుఁడగు శక్రునియందు జాలమాయవు. ఛాయేశ్వరుఁడగు సూర్యుని మండలమునందున్న పురుషుఁడగు విష్ణునియందు యోగమాయవు. సంసారసక్తులగు మనుష్యుల హృదయములయందు పాశమాయవు.

ప్ర భ:—ఇంద్రజాలము లోకప్రసిద్ధము. అదియే జాలమాయయని యిచటఁ జెప్పఁబడినది.

"రూపం రూపం ప్రతిరూపో బభూవ
తదస్యరూపం ప్రతిచక్షణాయ
ఇన్ద్రో మాయాభిః పురురూపఈయతే" బృహ 2—5—19

ఆపరమేశ్వరుఁడు ఈయాత్మస్వరూపమును (తనస్వరూపమును) చెప్పుటకొఱకు నామరూపములను వ్యాకరించి, మనుష్యాది జాతులయందు ప్రతిరూపమనగను అనురూపమగు వేఱొకరూపము గలవాఁడు (మాతాపితరులకు సమానమగు రూపముగలవాఁడు) అయెను. (పరమేశ్వరుఁడగు) ఇంద్రుఁడు మాయలచేత (పారమార్థికములుకాని, నామరూప భూతకృత మిథ్యాభిమానములచేతగాని ప్రజ్ఞలచేతఁ గాని) అనేకరూపములుగలవాఁడగుచున్నాఁడు. (ఆ యింద్రుఁడు ఏకరూపుఁడైనను అవిద్యాప్రజ్ఞలచేత బహురూపుఁడగుచున్నాఁడని భావము.)

విష్ణువునకు యోగమాయ కలదనునంశము దుర్గాసప్తశతియందును, గీతలయందును ప్రసిద్ధము. పాశమాయయనఁగా బంధజననియగు మాయ. సంసారమనగా జననమరణరూపము. పరమాత్మకు కేవలమగు శక్తియు పరమేశ్వరుఁడగు ఇంద్రునకు విద్యాపేక్షమగుశక్తియు, బ్రహ్మాండ పితృ- భానుమండల మధ్యవర్తియగు విష్ణునకు యోగశక్తియు, సంసారికి ఆధ్యాత్మికశక్తియు నగు మాయలు నాల్గునుగూడ ఒక్కతెయేయగు పరమేశ్వరిరూపములేయని తాత్పర్యము.

అ వ:—ఇట్లు క్రియాధర్మమున చతుర్విధయు మాయాపదవాచ్యయునగు మహాశక్తిని స్తుతించి, సర్వక్రియాధారభూతయు, సముపసంహృత స్వాత్మవిలాసయు, స్వస్థయు, సమాహితే సర్వసామర్థ్యయు, లయస్వరూపయు, నిద్రాపదవాచ్యయునగు ఆమహాశక్తిని ప్రస్తుతించుచున్నాఁడు.

మూ. త్వం భూతభర్తరి భవస్యనుభూతినిద్రా
సోమస్యపాతరి బిడౌజసి మోదనిద్రా
సప్తాశ్వ బిమ్బపురుషాత్మని యోగనిద్రా
సంసారమగ్నహృదయేష్వసి మోహనిద్రా. ౨౦

నీవు భూతేశ్వరుఁడగు నీశ్వరునియందున్న అనుభూతినిద్రవు. సోమపాయియగు నిందునియందు మోదనిద్రవు. సూర్యబింబ పురుషాత్ముఁడగు విష్ణునియందు యోగనిద్రవు. సంసారమగ్నులగు ప్రజల హృదయములయందు మోహనిద్రవు.

ప్ర భ:—భూతములు=ప్రాణులు. భూతభర్త=ప్రాణులకధిపతి. అనుభూతి నిద్రయనఁగా అనుభవరూపిణియగు నిద్ర. పవమానమను పేరుగలరసము- సోమమని చెప్పఁబడును. మోదనిద్రయనగా, మోదరూపిణియగు ఆనందనిద్ర, యజ్ఞభోక్తయగు నిందునకు సోమపానము ప్రసిద్ధము, మోహనిద్రయనఁగా మోహాత్మికయగు నిద్ర.

విశే:— ఇచట నీయంశము తెలియుంగునది. నామరూపాధ్యాత్మికమగు నీజగత్తు సృష్టికిముందు, నామరూపముల చేత వ్యాకృతముకాని పరబ్రహ్మమగు సత్తేయగుచుండెను. అని శ్రుతులయందు గానముచేయఁబడినది. "అసద్వా ఇదమగ్రఆసీత్" సృష్టికిముందీజగత్తంతయు అసత్తేయగుచుండెను. 'ఇదమేవాసత్ తమ్మ' ఈయసత్తే తమస్సు. అని యొకమంత్రము చెప్పుచున్నది. సర్వాభావ రూపమగు నసత్తే తమస్సని చెప్పఁబడినది.

స్వాస్థ్యానుభూతిరూపమును, సర్వలయాత్మకమును, అగు నీమూలతమస్స- 'నిద్ర'అని చెప్పఁబడుచున్నది. ఈమహాశక్తినే తాంత్రికులు తామసియగు కాలరాత్రి యని గానముచేయుదురు.

ఒక్కటియేయగు ఆయీనిద్ర, భూతేశ్వరునియందు స్వస్థానుభూతిగను, యింద్రునియందు- ఆనందలహరిగను విష్ణునియందు యోగసంపత్తిగను, సంసారియగు పురుషునియందు మోహశక్తిగను అగుచున్నదని తాత్పర్యము.

అవ:— ఇప్పుడు- దేవీమాహాత్మ్యచరిత్ర- త్రయపాదితములగు దేవీమూర్తులు మూడింటియందును-ఆద్యయగు కాళిని ప్రస్తుతించుచున్నాఁడు.

మూ. విష్ణుశ్చకార మధుకైటభనాశనం య
న్ముక్తః సహస్రకల సమ్భవ సంస్తుతా సా
కాలీ ఘనాఞ్జన నిభప్రభ దేహశాలి
న్యుగ్రా తవామ్బ భువనేశ్వరి! కోఽపిభాగః. ౨౧

భువనేశ్వరివగు నంబా! ఏ యోగ నిద్రనుండి మేల్కొనిన విష్ణువు మధుకైటభులను రాక్షసులను నశింపఁజేసెనో, పద్మగర్భ సంస్తుతయు, దట్టమగు కాటుకనుబోలిన కాంతిగల దేహమున నొప్పుచున్నదియు, ఉగ్రయునగు; ఆ (యోగనిద్రయేయగు) కాళీమూర్తి నీకొకానొక భాగమగుచున్నది.

ప్ర భ:— ఉగ్రయనుపదమునకనుల్లఙ్ఘ్యబలయనునర్థము వ్యాఖ్యాతచేనిర్దేశింపఁబడినది. భాగమనఁగా కలావిశేషము. ఈయంశమున నుపయుక్తమగు సప్తశతీ ప్రథమాధ్యాయమునందున్న కొన్నిశ్లోకముల యర్థమిచట నెఱుఁగవలసియున్నది. కావున వానియర్థముమాత్రము క్రిందవ్రాయఁబడుచున్నది. కల్పాంతమునందు ఈజగత్తంతయు- సముద్రముగాఁ జేయబడియుండునపుడు భగవంతుఁడును ప్రభువును అగు విష్ణువు యోగనిద్ర నాశ్రయించి శేషునియందుండెను. అప్పుడు విష్ణుకర్ణమలోద్భూతులును భయంకరులును ప్రసిద్ధులును' అగు మధు-కైటభులను రాక్షసులిద్దఱు బ్రహ్మదేవుని వధించుట కుద్యుక్తులయిరి. ప్రజాపతియగు నాబ్రహ్మ, విష్ణుని నాభికమలమునందుండెను. అతఁడేకాగ్రహృదయుఁడై, ఆయోగనిద్రను స్తుతించెను.

తామసియగు నాయోగనిద్ర యిట్లు బ్రహ్మచే స్తుతింపబడియెను. ఆయోగనిద్రచేత విడువఁబడిన జగన్నాథుఁడగు జనార్దనుఁడపుడు మేల్కొనిలేచెను. కావుననే మీఁదిశ్లోకమున "యన్ముక్తః" అను పదము 'యయాయోగనిద్రయా ముక్తః'అని వ్యాఖ్యానింపఁబడియెను.

అవ:— ఇట్లు- మధు-కైటభదమనియగు కాళినిస్తుతించి, ద్వితీయచరిత దేవతయు మహిషాసురమర్దినియు దేవీమూర్తియునగు లక్ష్మిని ప్రస్తుతించుచున్నాఁడు.

మూ. విద్యుత్ప్రభామయ మఖర్వ్యతమం ద్విషద్భి
శ్చణ్డ ప్రచణ్డ మఖిలక్షయకార్యశక్తమ్
యత్తేవ వితి! మహిమన్యవధేన్వరూపం
తచ్చిన్తనాదిహ నరస్య న పాపభీతిః. ౨౨

జననీ! అఖిలక్షయకార్య శక్తియుక్తమును, చండప్రచండమును, శత్రువులచేత అనభిగమ్యతమమును; విద్యుత్ప్రభామయమును, మహిషాసుర వధోద్యుక్తమునునగు నీస్వరూపము ధ్యానించు నరునకు పాపభీతి కలుగదు.

ప్ర భ:—చండప్రచండమనగా నతితీవ్రమనియర్థము. అనభిగమ్యతమమనఁగా అత్యంతదుర్గమమని యర్థము. మహిషాసురవధోద్యుక్తమును, దుర్దర్శమును, వైద్యుత జ్యోతిర్మయమునగు నీజ్యోతిర్మయశరీరమును ధ్యానించుటచేత సర్వతమోరూప-పాప-ధ్వంసమగుననుటయందాశ్చర్యము లేదని తాత్పర్యము.

అవ:— తరువాత తృతీయచరితదేవతయు శుంభదమనియునగు సరస్వతీమూర్తిని స్తుతించుచున్నాఁడు.

మూ. శుమ్భం నిశుమ్భమపి యా జగదేకవీరా
శూలాగ్రశాన్తమహసా మహతీచకార
సా కౌశికీ భవతి కౌశయశాః కృశోద
ర్యాత్మోద్భవా తవ మహేశ్వరి! కశ్చిదంశః. ౨౩

మహేశ్వరి! ఏ నీమహామూర్తి జగదేకవీరులగు శుంభుని నిశుంభునిగూడ శూలాయుధాగ్రమున నిర్వీర్యముగాఁ జేయఁబడిన ప్రతాపము గలవారినిగాఁ జేసెనో ఆమహామూర్తి కాశపుష్పసదృశమగు కీర్తిగలదియు, నీశరీరమునుండి సంభవించినదియు, కృశోదరియునగు కౌశికీదేవియై యున్నది. కౌశికీనామ్నియగు నాదేవీమూర్తి నీకొకానొక యంశవిశేషము.

ప్ర భ:—కౌశికియనఁగా దుర్గయే. ఈయంశ మొకచోట నిట్లుఁ జెప్పబడినది. "కౌశికీ "నామసాదుర్గా హన్త్రీశుమ్భనిశుమ్భయోః" శుంభ- నిశుంభహన్త్రియగు నాదుర్గయే కౌశికి. ఇప్పుడు- ఇష్టదేవతయగు మహాశక్తిని, తత్ప్రసాదముకొఱకు శరణాగతిముఖమున కవి యాచించుచున్నాఁడు.

మూ. మాయే! శివే! శ్రితవిపద్వినిహన్త్రి! మాతః!
పశ్య ప్రసాదభరశీతలయా దృశా మామ్

ఏషోఽహమాత్మజకలత్రి సుహృత్ సమేతో
దేవి! త్వదీయచరణం శరణం గతోఽస్మి. ౨౪

కపటనాటక సూత్రభర్త్రివి, శ్రితవిపద్వినిహంత్రివి, సుంగళస్వ రూపిణివి అగుమాతా! ప్రసాదభరశీతలమగు దృష్టినినాయెడఁ బ్రసరింపుము. దేవీ! ఈనేను మదాశ్రిత పుత్ర- దారమిత్రులతోఁగూడ త్వదీయ చరణ శరణుఁడనై యున్నాఁడను.

ప్ర భ— శ్రితవిపద్వినిహంత్రివనఁగా: ఆశ్రితులయాపదలను తొలగించు దానవని యర్థము. ప్రసాదమన అనుగ్రహము. "చరణశరణుఁడనై యున్నాఁడను" అనగా, ప్రసన్నుఁడనగుచున్నాడనని యర్థము.

విశే:— భగవతియగు దుర్గ- అనిష్టమునుతొలఁగించి, అభీష్టమును కలిగించుచు నిజచరణాశ్రితుఁడగు జనుని అనుగ్రహించుటయే కాక, వానిని తదితరుల కాశ్రయునిగఁగూడ నొనర్చునుగావున నామెకుఁగల పరమ కారుణికత్వ-వదాన్యత్వములు, ప్రసిద్ధములేయగుచున్నవి. అదెట్లనిన; దుర్గాసప్తశతియందు " త్వామాశ్రితాహ్యాశ్రయతాంప్రయాన్తి" (నిన్నాశ్రయించిన ప్రాణులు, తదితరుల కాశ్రయులగుచుందురుగదా!) అని చెప్పఁబడినది.

అవ:— ఇట్లు వసంతతిలకావృత్త నిబద్ధములగు స్తోత్రముల చేత- దేవీప్రీణనమును, సజ్జనగణానందలాభమును, ప్రార్థించుచు స్తబకము నుపసంహరించుచున్నాడు.

మూ. ధిన్వన్తు కోమలపదాః శివవల్లభాయాః
చేతో వసన్తతిలకాః కవికుఞ్జరస్య
ఆనన్దయన్తు చ పదాశ్రిత సాధుసఙ్ఘం
కష్టంవిధూయ సకలంచ విధాయచేష్టమ్. ౨౫

కవికుంజరుడగు గణపతి రచించిన లలితపదములగు వసంత తిలకములు శివవల్లభయగు ఉమహృదయమును రంజింపఁజేయునుగాత! మఱియు కష్టమునుతొలఁగించి యిష్టమును కలిగించి త్వదీయపదాశ్రితమగు సాధుసంఘమును ఆనందింపఁజేయునుగాత!

ప్రభ:— కవికుంజరుఁడు= కవిశ్రేష్ఠుఁడు. మదీయములగు వసంతతిలకావృత్తులు- దేవీప్రీణనమును, సాధుజనానందమునుసంఘటించుఁగావుతమని తాత్పర్యము

ఇది- సవ్యాఖ్యమగు సప్తమ స్తబకము,

ఓమ్ తత్. సత్.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

ఉమాసహస్రము

(ద్వితీయ శతకమున - చతుర్థ స్తబకము)

(అష్టమ స్తబకము)

మూ. తమసా మభితో హన్త్రా చణ్డికాహాసవాసరః
సతాం హృదయరాజీవ వికాసాయ ప్రకల్ప్యతామ్. ౧

సర్వమునుండియు (సాకల్యముగా) తమములను తొలఁగించునది యగు చండికాహాస- వాసరము- సజ్జనహృదయ- రాజీవమును వికసింపఁ జేయునుగాత!

ప్రథ—మూలమునందలి "అభితః"అను పదమునకు "సాకల్యముగ" అనిగాని సర్వమునుండియు, అనిగాని అర్థమును జెప్పనగును.

హాస-వాసరము. అనఁగా "చిరునవ్వు"అను "హృదయ- రాజీవము" అనఁగా హృదయమను పద్మము, పగలు-పద్మమును, వికసింపఁజేయును. హాసము హృదయము నున్మీలింపజేయును. తమమనగా అజ్ఞానము-లేక అంధకారము. సర్వమునుండియు తమములను తొలగించుట ఉభయగతమగు నర్థశ్లేషము.

ఇందువిషయియగు వాసరముయొక్క- రూపముచేత విషయమగు హాసమునకు రంజనము కలిగినది. కావున నిదిరూపకాలంకారమగుచున్నది.

వాసరసాపేక్షమగు రాజీవవికాసమును, హాససాపేక్షమగు హృదయోన్మీలనము అను వస్తువు- మీఁదిరూపకముచేత అనుప్రాణితము- అనుప్రాణితమగు నా వస్తువుచేత- (సజ్జనహృదయవికాసము) దేవ్యనుగ్రహబలమువలననే సిద్ధించునను నర్థము ద్యోతితము.

ఇట్లు స్తబకప్రారంభమున కడచినస్తబకప్రారంభములయందు వలెనేహాస స్తుతి గర్భితమగు నాశీస్సు ప్రయుక్తము.

మూ. యా నిద్రా సర్వభూతానాం యోగనిద్రా రమాపతేః
ఈడ్యతాం సా మహాకాలీ మహాకాలసఖీ సఖే! ౨

సఖా! (మిత్రమా) ప్రాణులకందఱకును నిద్రయు, రమాపతి యగు విష్ణువునకు యోగనిద్రయు, మహాకాలసఖియు, దేవియునగు మహాకాలిని స్తుతింపుము.

ప్ర భ:— "సఖా" అనునది దేవతారాధకుఁడును, ఆస్తికుఁడునునగు ప్రియ స్నేహితునిగూర్చిన సంబోధనము. సర్వవిస్మరణరూపమగు లయావస్థ యిందు సర్వభూతనిద్రగాఁ జెప్పఁబడినది. మహాకాలుఁడన నీశ్వరుఁడు, ఆతనికి ప్రియురాలగు జగన్మాత మహాకాలసఖి. ఈస్తబకమున సప్తశతీచరిత్రత్రయప్రసిద్ధదేవతామూర్తులలో భగవతియగు మహాశక్తి, మధుకైటభాది సంహార ప్రస్తావద్వారమునస్తుతింపఁబడుచున్నది. కడచిన స్తబకమున యోగనిద్ర వ్యాఖ్యానింపఁబడినది.

మూ. విరిఞ్చినాస్తుతే! మాతః! కాలి! త్వంచేన్నముఞ్చసి
మధుకైటభసంహారం కరోతుకథ మచ్యుతః. 3

మాతా! విరించిస్తుతవగు నీవచ్యుతుని విడువనియెడల నచ్యుతుఁడగు నావిష్ణువు మధు- కైటభసంహారము నెట్లొనర్చును?

ప్ర భ:— విరించియనబ్రహ్మ. విష్ణుని నేత్రములయందువసించియున్న యోగనిద్రయగు ఏమహాకాళిని బ్రహ్మదేవుడు సంస్తుతించెనో ఆమహాకాళిచే విడువఁబడుటవలననే భగవానుఁడగు విష్ణుఁడుమధుకైటభులను సంహరించెనని తాత్పర్యము.

అవ:-ఇప్పుడు సప్తశతీ ద్వితీయచరిత దేవతయొక్క మాహాత్మ్యమును స్తుతింపఁగోరినకవి, ఆదేవీమూర్తి చేతఁ జంపఁబడిన మహిషాసురుని ప్రచండసాహసమును, ఆధిపత్యమును పండ్రెండుశ్లోకములచేత నభివర్ణించుచున్నాఁడు.

మూ. వాసవః కాశనీకాశయశోలఙ్కృత దిఙ్ముఖః
మహోగ్రవిక్రమాద్ యస్మాదాసీదాజౌ పరాఙ్ముఖః. ౪

మహోగ్రపరాక్రముఁడగు ఏ మహిషునివలన కాశపుష్ప సదృశమగు యశస్సుచేత నలంకరింపఁడిన దిఙ్ముఖములుగల వాసవుఁడు (గూడ) యుద్ధమున పరాఙ్ముఖుఁ డయ్యెను.

ప్ర భ:-మహోగ్రవిక్రముఁడన, నధికమును ప్రచండమునునగు పరాక్రమము గలవాఁడని యర్థము. వాసవుఁడు పూర్వదిక్పాలకుఁడు. మహాయశస్కుఁడగు దేవ రాజుకూడ పరాజయము నొందెనని తాత్పర్యము, 'యస్మాత్' ఎవనివలన అని

మూలశ్లోకమునందుఁగల యచ్ఛబ్దమునకు 'మహిషం తం మహావీర్యమ్' (మహావీర్యుఁడగు ఆమహిషుని) అను పమునైదవ శ్లోకమునందలి తచ్ఛబ్దముతో సంబంధము చెప్పఁబడినది. అయినను ఆంధ్రభాషా సంప్రదాయము ననుసరించి, యీయాంధ్రీకృతియందు యత్పదార్థము విడువఁబడియెనని గ్రహించునది.

మూ. యత్ ప్రతాపేన సంతప్తో మన్యే బాడబరూపభృత్
భగవాననలోఽద్యాపి సిన్ధువాసం నముఞ్చతి. ౫

మహిషుని ప్రతాపమున సంతప్తుఁడగు భగవంతుఁడనలుడు—బాడబరూపమును ధరించి యిప్పటికినిగూడ సముద్రనివాసమును విడువకున్నాఁడని తలంచెదను.

ప్ర భః—దక్షిణ- పూర్వ (ఆగ్నేయ) దిక్పాలకుఁడగు నగ్నిదేవుఁడే యిందుఁ దెలుపఁబడిన అనలుఁడు. బాడబాగ్నియన, ఔర్వమనునగ్ని. బడబయందుదయించిన బాడబాగ్నికి సముద్రవాసము పురాణప్రసిద్ధము. మహిషాసురునివలనఁ గలిగిన సంతాపము నుపశమింపఁజేసికొనుటకు, అగ్ని సముద్రమునందు నివసించినట్లు మీఁది శ్లోకమున సంభావింపఁబడినది. కాని యతఁడు సముద్రమున నివసించుటకది హేతువు కాదు. హేతువుకాని మహిషాసురజన్య సంతాపోపశమన మిచట హేతువుగా నూహింపఁబడుటవలన నిది హేతూత్ప్రేక్షాలంకార మగును. అగ్నికి సముద్రవాసము పురాణప్రసిద్ధమగుటవలన ఆహేతూత్ప్రేక్ష సిద్ధవిషయ మగుచున్నది.

మూ॥ కుర్వాణో భూతకదనం యస్మిన్ విస్మితచేతసః
ఏష ఏవాన్తకో నాఽహమిత్యాసీదన్తకస్య ధీః. ౬

మహిషుఁడు ప్రాణినాశము నొనర్చుచుండునపుడు విస్మయము నొందినమనస్సుగల అంతకునకు (యమునకు) "వీఁడే అంతకుఁడు (కాని) నేను కాను" అనుబుద్ధి కలిగెను.

ప్ర భః—అంతకుఁడనఁగా నాశము నొనర్చువాఁడు. ఇతఁడే దక్షిణదిక్పాలకుఁడగు యముఁడు. మహిషుఁ డొనర్చుచున్న ప్రాణివధమును వీక్షించుటవలన, తనకుఁగల అంతకత్వమును మరచిన యంతకునకుఁ వాఁడే యంతకుఁడను భ్రాంతి కలిగెను అని చెప్పుటవలన నిది పర్యస్తాపహ్నవ- భ్రాంత్యలంకార సంకరమగుచున్నది.

మూ. రణే యేనాతిరస్కృత్య త్యక్తో రాక్షసనైఋత:
చిరాయహరిదీశేషు కోణేశఃప్రస్థవాన్ యశః. ౭

రాక్షసుఁడగు మహిషుఁడు యుద్ధమునందు దక్షిణ పశ్చిమముల నడుమనున్న కోణమున కధిపతియగు నిఋతి యని రాక్షసుఁడను హేతువు వలన అవమానింపక విడువఁగా నతఁడు దిక్పాలకులయందు కొంతకీర్తి నొందెను.

ప్ర భః—రాక్షసుఁడను హేతువువలన=జాతి పక్షపాతమువలన.

ఇందు రాక్షసుఁడను సజాతీయ పక్షపాతమువలన మహిషునిచేత నిఋతి తిరస్కృతుఁడు కాఁడయ్యెనని సంభావింపఁబడినది. కాని ఉత్ప్రేక్షావాచకమగు ఇవాదిశబ్దము ప్రయోగింపఁబడలేదు. కావున నిది గమ్యమగు ఉత్ప్రేక్షాలంకార మగుచున్నది.

మూ. యన్నియన్తు మశక్తస్య కుర్వాణ మసతీః క్రియాః
నియన్తు రసతామాసీత్ పాశినోమలినం యశః. ౮

దుష్కార్యముల నాచరించుచున్న మహిషుని నియమించుట కశక్తుఁ డగుటవలన పాపనియంతయగు వరుణునికీర్తి మాలిన్యము నొందెను.

ప్ర భః—పాశయుక్తుఁడగు వరుణుడు- పశ్చిమ దిక్పాలకుఁడు. అతఁడు సర్వ పాపదమనుఁడని ప్రసిద్ధుడైయున్నాఁడు. మహిషుని నియమించుటయందశక్తుడగుట వలన నతనికీర్తికూడ మందమయ్యెనని భావము.

ఇందు "మహిషుని శిక్షించుటకు సామర్థ్యము లేకుండుట" అను హేతువు కవికల్పితము. (సంభావితము) ఆహేతువుచేత వరుణకీర్తికి మాలిన్యము సిద్ధించెనను వస్తువుచేత ఉత్ప్రేక్ష గమ్యమగుచున్నది. కావుననిది కవిప్రౌఢోక్తి సిద్ధమగువస్తువు చేత అలంకారము ధ్వనింపఁజేయఁబడుటకు లక్ష్యమగుచున్నది.

మూ. బాహువీర్యపరాభూతో యస్యప్రేయేణమారుతః
బభూవ క్షణదాన్తేషు రతాన్త పరిచారకః. ౯

మహిషభుజబల పరాజితుఁడగు వాయువు— క్షణదాంత (నిశాంత) సమయములందు ప్రాయశః, రతాంతపరిచారకుఁడగుచుండెను.

ప్ర భ:-వాయుదేవుఁడు పశ్చిమోత్తర (మధ్య) దిక్పాలకుఁడు. క్షణదాంతము లందు=రాత్రి ముగియు కాలములందు, రతాంతపరిచారకుఁడు = సురతశ్రమమును తొలగించు మందసంచారము గలవాఁడు.

మహిషపరాభూతుఁడగు వాయువు వానికి దాసుఁడై మెల్లగా వీవఁదొడఁగెననుటవలన నిదియు గమ్యోత్ప్రేక్షయే యగును.

మూ. నిధీన్యేనజితోహిత్వా రాజరాజః పలాయితః ।
స్పష్టంబభాణ మాధుర్యం ప్రాణానా మఖిలాదపి. ౧౦

మహిషహాతకునిచే జయింపఁబడిన రాజరాజు (మహాపద్మాదులగు) నిధులను వదలుకొని పలాయితుఁడై; అన్నిటికంటెనుగూడ ప్రాణములకుఁగల మాధుర్యమును (తీపిని) స్పష్టముగా వచియించెను.

ప్ర భ:-రాజరాజనగా; కుబేరుఁడు. ఉత్తరదిక్పాలకుఁడు. అల్పమో అధికమో యగుకష్టము కలిగినప్పుడెల్ల ఎట్లో ప్రాణములను రక్షించుకొనుటకు ప్రయత్నించు మనుష్యుని అధైర్యమును దెలుపుటకు 'వానికి ప్రాణములే తీపి' అనులోకోక్తి కలదుగదా!

ఆలోకోక్తిననుసరించి మీఁదిశ్లోకమున 'ప్రాణానాంమాధుర్యమ్' (ప్రాణములకుఁగల మాధుర్యమును) అని ప్రయోగింపఁబడినది. సామాన్య జనునకువలె మహిషునియెదుట ఉత్తర దిక్పాలకుఁడగు రాజరాజునకుఁగూడ నవనిధులకంటెనుగూడ, మానముకంటెను గూడ ప్రాణములే ప్రియతరము లయ్యెనను నంశము ద్యోతితము.

మూ. యస్మిన్నుత్తరపూర్వస్యా దిశఏకాదశాధిపాః
కుణ్ఠాబభూవు రాత్మీయకణ్ఠోపమితకీర్తయః. ౧౧

ఉత్తరపూర్వ దిక్పాలకులగు ఏకాదశరుద్రులు వానియెదుట కుంఠులయి (వ్యర్థులై) తమతమ కంఠములతో పోల్పఁదగిన కీర్తిగలవారయిరి.

ప్ర భ:-ఉత్తరస్యాః పూర్వస్యాశ్చ యదన్తరాలం సా ఉత్తరపూర్వా అను వ్యుత్పత్తిచేత ఉత్తరపూర్వదిక్కనగా, ఉత్తరపూర్వదిక్కుల నడుమనున్న ఈశాన్యదిక్కగుచున్నది. తద్దిక్పాలకులు ఏకాదశసంఖ్యాకులగు రుద్రులు. రుద్రుఁడు నీలకంఠుఁడుగా ప్రసిద్ధుఁడై యున్నాఁడు. ఏకాదశరుద్రుల యశస్సు తెల్లఁదనమును విడిచి నీలిమనాశ్రయించి, ప్రకాశరహితమై తమోవిగ్న మయ్యెనని భావము,

మూ. నిజశుద్ధాన్తకాన్తానా మాననైరేవ నిర్జితమ్
లలజ్జే యః పునర్జిత్వా శూరమానీ సుధాకరమ్. ౧౨

శూరమానియగు మహిషుఁడు నిజాంతః పురకాంతల ముఖముల చేతనే జయింపఁబడిన సుధాకరుని (చంద్రుని) తిరుగజయించి లజ్జించెను.

ప్ర భ:-తననే శూరునిగాఁ దలచువ్యక్తి 'శూరమాని' అని చెప్పఁబడును, నిజసుందరీ ముఖములచేత ఇంతకుముందే జయింపఁబడిన దౌర్భాగ్యుని మరల జయించుట శూరమానికి మిగుల లజ్జావహమని భావము.

మూ. బాలస్యేవ క్రీడనకైః ప్రవీరైర్యస్య ఖేలతః
లీలాకన్దుక ధీరాసీద్దేవే దీధితి మాలిని. ౧౩

క్రీడావస్తువులతో నాడుకొను బాలునికివలె ప్రకృష్టులగు వీరులతో నాడుకొనుచున్న మహిషునకు దీధితిమాలియగు దేవుడు సూర్యునియందు క్రీడాకంుకమను బుద్ధికలిగెను.

ప్ర భ:—క్రీడావస్తువన-ఆటవస్తువు. (బంతి మొదలగునది) బాలునకు బంతి మొదలగు ఆడుకొనువస్తువునందు, అది, తనది, వశపడినది, అడఁచగినది. అనుతలఁపు కలుగునట్లు ఆటవస్తువుల తోడనువలె మహావీరులతో నాడుచున్న మహిషునకు సూర్యునియెడల నది తనదియు, వశపడినదియునగు ఆటబంతి యనుతలఁపు కలిగెనని తాత్పర్యము. వాని పరాక్రమ-దర్పములు అట్టివని భావము.

మూ. త్రియామాచరశుద్ధాన్త భ్రూవిలాస నివారణమ్ ।
విష్ణోఃసుదర్శనంచక్రం యస్యానావశ్యదన్తరమ్. ౧౪

రాత్రించరులగు రాక్షసుల యంతఃపురమునందలి భ్రూవిలాసములను నివారించునదియగు విష్ణుసుదర్శనముకూడ మహిషునంతరమును జూడలేకుండెను.

ప్ర భ:—మహాప్రభావము, రక్షఃకులఘ్నము అగు విష్ణుచక్రముగూడ వానిని వధించుట కవకాశము నొందలేకపోయెనని తాత్పర్యము.

మూ. మహిషం తం మహావీర్యం యాసర్వాసుర దేహజా
అవధీద్దానవంతస్యై చణ్డికాయై నమోనమః. ౧౫

మహాపరాక్రముఁడగు దానవుఁడగు ఆమహిషుని సర్వసురదేహసంభూతయగు ఏదేవత వధించెనో, ఆదేవతయగు చండికకు నమస్కారము. నమస్కారము.

ప్ర భ:—దితివంశ సంభూతుఁడు దైత్యుఁడనియు, దనువంశసంభూతుఁడు దానవుఁడనియు చెప్పఁబడుదురు. 'నమోనమః' అనుచో నున్నదిరుక్తి - బహునమస్కారార్థము.

హరాది సురల తేజఃపుంజము చేత— ఆవిర్భవించిన దేవి 'మహిషాసురమర్దని' అనునంశము దుర్గాసప్తశతియందిట్లు చెప్పబడినది.

తతః సమస్తదేవానాం తేజోరాశి సముద్భవామ్
తాం విలోక్యముదం ప్రాపు రమరా మహిషార్దితాః.

(తరువాత సమస్తదేవతలయు తేజోరాశి సముద్భవయగు ఆదేవినివిలోకించి- మహిషుని చేత మర్దింపఁబడిన యమరులందఱును సంతోషము నొందిరి.)

మూ. ముఖం తవాసేచనకం ధ్యాయంధ్యాయం నిరన్తరమ్
మృగేన్ద్రవాహే కాలేనమృడస్త్వన్ముఖతాంగతః. ౧౬

సింహవాహనవగు మాతా! ఎంతచూచినను తనివితీఱని నీముఖమును నిరంతరమగునట్లు ధ్యానించి ధ్యానించి నీకాంతుఁడగు శంకరుఁడు కాలక్రమమున నీముఖమువంటి ముఖము గలవాఁడయ్యెను.

ప్ర భ—ధ్యాతకు (ధ్యానించువానికి) ధ్యేయ (ధ్యానింపదగినవస్తువుయొక్క) తాద్రూప్యసిద్ధియేగదా ధ్యానఫలము! కావుననే శివునిముఖమునందు అర్ధభాగము పార్వతీముఖమయ్యెనని ఉత్ప్రేక్ష గమ్యము.

మూ. కార్తికీచన్ద్రవదనా కాలిన్దీవీచిదోర్లతా
అరుణామ్భోజచరణా జయతిత్రిరుచిః శివా. ౧౭

కృత్తికానక్షత్రయుక్తమగు పూర్ణిమనాటి చంద్రునిబోలిన ముఖముగలదియు, యమునాతరంగమునుబోలిన భుజలతగలదియు, అరుణాంబుజములఁబోలిన చరణములు గలదియు నగుచు- ఇట్లు త్రిరుచియగు శివకాంత జయించుచున్నది.

ప్ర భ:—అరుణాంబుజములన- ఎఱ్ఱతామరపూవులు. శ్వేత- కృష్ణ- రక్త ప్రభలు గలదగుటవలన శివకాంత త్రిరుచి యగుచున్నది. చంద్రునితోఁబోల్పఁబడిన ముఖము తెల్లనిది. యమునా తరంగముతో సాటిచేయఁబడిన భుజలత- నల్లనిది. అరుణాంబుజముతో సరిచేయఁబడిన చరణములు ఎఱ్ఱనివి.

ఇట్లు లోహిత- శుక్ల- కృష్ణ యగుశివ-త్రివర్ణయు, త్రిగుణాత్మికయునగుచు "అజామేకాం లోహిత శుక్లకృష్ణామ్" అనుశ్రుతిచేత ప్రతిపాదింపఁబడిన బ్రహ్మ స్వరూపిణి యగుచున్నదని చెప్పఁబడినది.

మూ॥ యత్ తేకచభరః కాలో యద్బాహుర్లోకరక్షకః।
యుక్తం ద్వయం శివే మధ్యస్త్వసన్నాకో న నాకరాట్.౧౭

ఓ శివరమణీ! నీకచభరము కాలమును (కాలుఁడును) బాహువులోకరక్షకమును (విష్ణువును) అగుట యుక్తమైయున్నది. మధ్యము (అవలగ్నము) మాత్రము నాకరాజగుచున్నాఁడు. కాని యతఁడు అసన్నాకుఁడు(స్వర్గములేనివాఁడు)కాఁడు.(సత్ + నాకుఁడే.సన్నాకుఁడే).

ప్ర భ:—కచభరము=కేశాతిశయము. దట్టమగుజుట్టు. కాలము=నీలవర్ణము. కాలుఁడు=యముఁడు, దుష్టలోకశిక్షకుఁడు. బాహువు=భుజము. లోకరక్షకము= లోకములను రక్షించునది. లోకరక్షకుఁడు=విష్ణువు. అసన్నాకుఁడు= (నసత్— అసన్,సనాకః-స్వర్గః, యస్యసః-అసన్నాకః) నాకములేనివాఁడు. (కాఁడు) సన్నాకుఁడే-స్వర్గముగలవాఁడే.

ఇచ్చట నీయంశము చెప్పఁదగియున్నది:- సర్వాంతకర్తగు కృతాంతుఁడు దేవి- కేశపాశముగను, లోకరక్షకుఁడగు విష్ణువు తద్బాహురూపముగను ఉండఁగా నాకరాజగు నింద్రుఁడు మాత్రము తదవలగ్న రూపుఁడగుటవలన శూన్యస్వరూపుఁడు కావలసియున్నది. కచభరమగు కాలునిచేత నిగ్రహమును బాహువగు విష్ణునిచేత అనుగ్రహమును చేయఁబడుటవలన అవలగ్నమగు నాకరాజుచేత కావింపఁదగినకార్యము శూన్యమేయగును. కాని స్వర్గరాజ్యభోగముమాత్రము మిగిలియున్నది. కావుననే, అతఁడు అసన్నాకుఁడు కాఁడని నాకముగలవాఁడేయని చెప్పఁబడినది.

ఈయంశము-ఏతత్కవిచేత మీఁదిభాగమున 'నాకోఽవలగ్నమీశ్వరి' అను శ్లోకమున గానముచేయఁబడెను. దానియర్థ మిట్లున్నది.

స్వర్లోక-భూలోక పాతాళలోకములు- పరమేశ్వరి కుక్షియందున్నవి. అయినను తత్కుక్షియందే కాక బహిశ్శరీరమునందుఁగూడ నవికలవు. అదెట్లనిన, నాకము—నడుము. భూమి-కటిప్రదేశము. భోగిలోకము నాభి-ఇందు నాకమే నడుముగాఁ జెప్పబడినది. నడుము సూక్ష్మమని స్ఫురింపఁజేయుటకు, ఆకాశమధ్య అనియు, మధ్యశూన్యయనియు సుందరియగు కాంతను వర్ణించుట కవిసమయము గదా. కావున నిచ్చటఁగూడ లేనిదివలె నతిసూక్ష్మమైయున్న నడుమే నాకమని చెప్పఁబడియెనని యెఱుఁగునది. నడుము శూన్యమగునెడల, దానియం దారోపితమయిన నాకముగూడ శూన్యమను శంకకలుగును. గావున, నాకరాజు- అసన్నాకుఁడు కాఁడని, ఆశంక-నిరసింపఁబడినది. నడుములేకున్నను-నాకరాజ్యము ననుభవించుటకు నాకరాజు లేనివాఁడు కాఁడు.

మూ॥ స్వదేహాదేవ యా దేవీ ప్రదీపాదివదీపికా।
ఆవిర్బభూవ దేవానాం స్తువతాం హర్తుమాపదః. ౧౯

ఏ దేవత (కౌశికి) స్తుతించుచున్న దేవతల యాపదలను తొలఁగించుటకు ప్రదీపమునుండి దీపికవలె స్వదేహమునుండి యావిర్భవించెనో, (కౌశికియనునామమున ప్రసిద్ధురాలగు ఆ యుమాదేవికి నమస్కరించుచున్నాను).

ప్రభ:—మీఁది బ్రాకెట్టునందుఁ దెలిపిన యర్థము- ఇరువది మూఁడవశ్లోకమునఁగలదు. కావున మీఁదిశ్లోకార్థమునకును, 20, 21, 22 శ్లోకములకును దానితో నన్వయము గలదని యెఱుఁగునది. ఒక్కతెయే యగుదేవియొక్క శరీరమునుండి తద్దేవీమూర్తులగు శక్తులనేకములు, తద్విభూతినుండి సంభవించి, ఆమెయందే లీనములయ్యెనని తృతీయచరితమున నిట్లు స్పష్టీకరింపఁబడియెను. "తరువాత అతిభీషణయు, శతనినాదినియునగు చండికాశక్తి దేవీశరీరమునుండి బయలువెడలెను."

ఈయశంమునే దేవి శుంభునితో నిట్లుపలికెను. "ఈప్రపంచమున నేనొక్కతెనే యున్నాను. నాకంటె వేఱగు రెండవశక్తి లేదు. నేను నావిభూతిచే నిచట ననేకరూపములతో నుండి యిప్పుడు వానినుపసంహరించి మరల ఒక్కతెనే యయి యున్నాను. ఇప్పుడు నీవు స్థిరముగా నుండుము."

మూ॥ ధైర్య, చాతుర్య, గాంభీర్య, వీర్యసౌన్దర్యశాలినీమ్
రత్నం నితమ్బినీజాతౌ మేనిరేయాం సురాసురాః. ౨౦

ధైర్యముచేతను, చాతుర్యముచేతను, గాంభీర్యముచేతను, వీర్యముచేతను, సౌందర్యముచేతను వెలయుచున్న యే దేవిని స్త్రీజాతియందలి రత్నమని సురాసురులు తలంచిరో, (కౌశికీనామమున ప్రసిద్ధురాలగు నా యుమాదేవికి నమస్కారము).

ప్ర భ:—రత్నమన శ్రేష్ఠురాలని భావము.

మూ॥ యదీయహుంకృత్యనలే ధూమ్రాక్షోఽభవదాహుతిః।
సమాప్తిం భీషణాం యావన్నైవాపవికత్థనమ్. ౨౧

భయావహమగు నాత్మపరాక్రమకీర్తనము సమాప్తము కాకుండఁగనే ధూమ్రాక్షుఁడను శుంభాసురసేనాని యే దేవియొక్క హుంకారాగ్నియందు ఆహుతియయ్యెనో (కౌశికీనామమున ప్రసిద్ధురాలగు నా యుమాదేవికి నమస్కరించుచున్నాను).

ప్ర భ:—దేవియొక్క క్రోధప్రకాశకమగు హుంకారాగ్నియందు, తన యాత్మశ్లాఘనము ముగియకుండు లోపలనే ధూమ్రాక్షుఁడు హోమము చేయఁబడియెనని భావము. ఆరాక్షసుని వికత్థనవాగ్జాలమునకు దేవీహుంకారము ప్రత్యుత్తరమయ్యెను. "లోకాతిశయ సమ్పత్తి వర్ణనోదాత్తముచ్యతే" అను తల్లక్షణము ననుసరించి ఇచట లోకాతిశయ సంపత్తి వర్ణనమువలన నుదాత్తాలంకారమగును.

మూ॥ యస్యాః శూలే జగామాస్తం యశః శుమ్భ- నిశుమ్భయోః
నమామి విమలశ్లోకాం కౌశికీం నామ చోమామ్. ౨౨

ఏ దేవియొక్క శూలాయుధమునందు శుంభ- నిశుంభులకీర్తి యస్తమించెనో కౌశికీనామమున ప్రసిద్ధురాలగు ఆ యుమాదేవికి నమస్కరించుచున్నాను.

ప్ర భ:—శుంభ నిశుంభులు సహోదరులు. శుంభ- నిశుంభహన్త్రియగు మూర్తి కౌశికి అనునది ప్రసిద్ధము. "కౌశికీనామ సా దుర్గా హన్త్రీ శుమ్భ- నిశుమ్భయోః" అని వెనుక చెప్పఁబడినదిగదా!

మూ॥ యశోదాగర్భజననాద్ యశోదాం గోకులస్య తామ్।
వన్దే భగవతీం నన్దాం విన్ధ్యాచల నివాసినీమ్॥ ౨౩

నందుఁడను గొల్లవానికి భార్యయగుయశోదయొక్క గర్భమున జనించుటవలన గోకులమునకు యశోదయు (కీర్తినొసగినదియు) వింధ్యపర్వతనివాసినియు భగవతియునగు నందాదేవికి వందన మొనర్చుచున్నాను.

ప్రభ:—గోకులము=శ్రీకృష్ణుని బాలక్రీడలకు వాసస్థానమగు గొల్లపల్లె.

“కంసునివలని భయమువలన దేవకీపుత్రుఁడగు శిశువు (కృష్ణుడు) గోకులమునకును, నందునిశిశువగు నంద, దేవకీ గృహమునకును తీసికొని రాఁబడియెను. ఆమహామాయాస్వరూపిణియగు ఈనందాదేవి కంసుని వెఱపించి యదృశ్యయయ్యెను” అని భాగవతమునఁ జెప్పఁబడియున్నది. ఆయీనంద వింధ్యాచలాధిష్ఠాత్రియగు భగవతి యని గానము చేయఁబడినది. దేవీమహాత్మ్యమునందలిమూర్తి రహస్యమునని ట్లున్నది.

“నన్దా భగవతీనామ యాభవిష్యతినన్దజా
సాస్తుతా పూజితా ధ్యాతా వశీకుర్యాజ్జగత్ త్రయమ్”

నందునకుదయించి నంద అనునామమున ప్రసిద్ధురాలు కాకున్న భగవతిని స్తుతించినవారికిని, పూజించినవారికిని, ధ్యానించినవారికిని గూడ- ఈజగత్త్రియము వశీకరింపఁబడును.

మూ॥ అమ్బికా ముపతిష్ఠన్తా మేతాశ్చణ్డీమనుష్టుభః।
ప్రసన్నాః సాధ్వలఙ్కారాః సిద్ధపద్మేక్షణా ఇవ. ౨౪

ఈ యనుష్టుప్పులు = అనుష్టుప్ ఛందోబద్ధము లగు ఈస్తుతులు ప్రసన్నలు- సాధ్వలంకారలు- అగుచు, సిద్ధపద్మాక్షులవలె, అంబికయగు చండిక నుపాసించి సేవించునుగాక !

ప్రభ:—దేవయోని విశేషులు-సిద్ధులు. సిద్ధపద్మాక్షులు = సిద్ధసుందరులు. అనుష్టుప్పుల పక్షమున ‘ప్రసన్నలు’ అనఁగా శబ్దార్థప్రసాదగుణ విశిష్టలు (అక్లిష్టలు) అనియు సిద్ధసుందరులపక్షమున నిర్మలస్వభావలనియు నట్లే సాధ్వలంకారలనఁగా సమీచీనములగు ఉపమాద్యలంకారములు గలవనియు, శోభనములగు భూషణములు గలవారనియు నర్థము తెలియుంగునది.

అనుష్టుప్పులకును- సిద్ధసుందరులకును ఇట్లు శేషోత్థాపితమగు సాధర్మ్యము వలన నిచట ఉపమ-అలంకారమగుచున్నది.

ఆంధ్రభాషయందుఁగూడ "అనుష్టుప్" అనుశబ్దమునకు స్త్రీత్వమును వివక్షించుటవలన ప్రసన్నములు సాధ్వలంకారములు అనుటకుమారుగ– ప్రసన్నలు–సాధ్వలంకారలు అని ప్రయోగింపఁ బడియెనని పాఠకులు గ్రహింపఁగోరెదను.

(పం. ల. నా. శాస్త్రి)

మీఁదిస్తబకమున— సప్తశతీప్రోక్తమగు దేవీమహిమ కీర్తింపఁబడినది. దేవీమాహాత్మ్యమున ప్రతిపాదింపఁబడిన యాదేవి చండీనామమున ప్రసిద్ధయగుటవలన– ఆమె యిచట 'చండికగా' ఉపసేవింపఁబడినదని గ్రహించునది.

ఇతి శ్రీమహర్షి రమణభగవత్ పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నారసింహసూనోః గణపతిమునేః కృతౌ వుమాసహస్రే
అష్టమః స్తబకః సమాప్తః।

సమాప్తంచ ద్వితీయమ్ శతకమ్.

ఇది శ్రీమహర్షి–రమణభగవత్పాదశిష్యుడు, శతమర్షణసగోత్రుడు,
శ్రీమత్పంతుల పేరయశాస్త్రి పౌత్రుడు, వేంకటరామ
బుధేంద్రపుత్రుడు అగు లక్ష్మీనారాయణశాస్త్రిచే
నాంధ్రీకరింపఁబడిన యుమాసహస్రమను స్తోత్ర
కావ్యమున ద్వితీయశతకము.

శ్రీ. శ్రీ. శ్రీ.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

ఉమాసహస్రము

(తృతీయ శతకమున - ప్రథమ స్తబకము)

(నవమ స్తబకము)

అవ:—ఈస్తబకమున-మహాప్రభావమును, సర్వాతిశాయిరామణీయకమును అగు ఉమాదేవీమందహాసము-భంగీభేదమున స్తుతింపఁబడుచున్నది.

మూ॥ శారదవలక్షపక్షక్షణదావైమల్యశిక్షకోఽస్మాకమ్।
జాగర్తు రక్షణాయ స్థాణుపురన్ధ్రీముఖవికాసః. ౧

శరత్సమయమందలి శుక్లపక్ష రాత్రులకు వైమల్యశిక్షకమగు (నిర్మలతను గఱపునదియగు) స్థాణుపురంధ్రీ ముఖవికాసము- మమ్ము రక్షించుటకు జాగరూకమగుఁగాత!

ప్ర భ:—వైమల్యశిక్షకమన, నైర్మల్యమును బోధించునది (అధ్యాపకము) అనియర్థము.

జ్యోత్స్నవైమల్యముకంటెనుగూడ ముఖవికాసప్రకాశ మధికమని భావము.

స్థాణుపురంధ్రీముఖవికాసమన, శివసుందరీమందహాసమని యర్థము.

ఇందలి శిక్షకశబ్దము సాదృశ్యసూచకము. కావున వెన్నెలయొక్క వైమల్యమునకును, ఉమాముఖవికాసమునకును గల ప్రకాశకతాసాధర్మ్యమువలన నిది యుపమాలంకారమగుచున్నది. దండ్యాచార్యుఁడు ప్రతిపక్షాదిశబ్దములు సాదృశ్యసూచకములనియు, కవుల బుద్ధిసౌఖ్య ప్రదములగునవి ఉపమయందు ప్రయోగార్హములనియు చెప్పియుండుటవలన- ఇందలి శిక్షకశబ్దము సాదృశ్యసూచకమగుటయు, తత్ప్రయోగమువలన నిది యుపమయగుటయు సంగతమేయని యెఱుంగునది.

మీఁదిశ్లోకమునందలి "జాగర్తు" (జాగరూకమగుఁగాత!) అనుపదము-ముఖవికాసముచే జేయఁదగినరక్షణక్రియను ప్రకర్షింపఁజేయును. తత్పదార్థసామర్థ్యమువలన 'ముఖవికాసము - బోధరూపము' అనునర్థము ఆక్షేపింపఁబడును;

(తీసికొని రాఁబడును) చీకటియందుఁగాని, జడతయందుఁగాని భయమువలన రక్షింపఁదగిన భక్తులకు ఉమాముఖవికాసముయొక్క జాగరణమే (మేలుకొని యుండుటయే) గొప్పత్రాణముగదా!

అశ్లేషార్థము:- గాఢాంధకారము వ్యాపించియుండునపుడుగాని లోకము నిద్రించియున్నపుడుగాని చరాచరశత్రువగు భయముకలుగునపుడు దానిని తొలఁగించుటకు వెలుతురుగాని, ఒకానొక బలవంతుని జాగరణముగాని సమర్థమగుచుండును. అశ్లే- చరాచర శత్రువులగు భయములనుండి రక్షింపఁదగినభక్తులను, రక్షించుటకు భగవతియొక్క చిత్ప్రకాశాత్మకమగు ముఖవికాసముయొక్క జాగరణ మాత్రమే చాలియుండునని భావము. అయమ్మయేగదా చరాచరనియంత్రణ సమర్థయై యెల్లయెడలను మేలుకొనియున్నది!

ఈయంశము శివశతకము నందీయాచార్యునిచేతనే ఇట్లు చెప్పఁబడినది.

"సర్వస్మిన్నచరేచరేచ విభవాదేకాపరా జాగ్రతీ ।
శక్తిః కాచన సావిచార రసికై రారాధ్యతే నాథతే."

'ప్రభూ! చరాచరమగు నీవిశ్వమున అనిర్వాచ్యయగు నీపరాశక్తి మహావైభవముతో మేల్కొనియున్నది. ఆనీశక్తిని విచార రసికులు సమారాధింతురు.'

మూ. వ్యాఖ్యానం హర్షస్య ప్రత్యాఖ్యానం శరత్సుధాభానోః
దిశతు హృదయప్రసాదం గౌరీవదన ప్రసాదోనః. ౨

హర్షమును వ్యాఖ్యానించునదియు, శారదచంద్రుని ప్రత్యాఖ్యానించునదియు, అగు గౌరీముఖప్రసాదము మాకు హృదయప్రసాదము నొసఁగుఁగాత!

ప్రభ:—హర్షమును వ్యాఖ్యానించునది యనఁగా, ఆయుమకు సహజమగు సంతోషమును వివరించునదియని యర్థము. ప్రత్యాఖ్యానించునదియన, తిరస్కరించునదియని యర్థము. శరచ్చంద్రునికంటెనుగూడ నిర్మలమని భావము.

మీఁది విశేషణద్వయమువలన- ఉమాముఖప్రసాదమునకు సంతోషావహత్వము- నైర్మల్యావహత్వము చెప్పఁబడినవి. తదుభయప్రదానముచే హృదయప్రసాదలాభము సిద్ధమగును. కావున- సంతోషావహత్వ- నైర్మల్యావహత్వ- ప్రదానసమర్థమగు. ఉమావదనప్రసాదము ప్రార్థింపఁబడినది.

ఇందు ఒక్కటియేయగు ఉమాముఖప్రసాదము హర్షమును వ్యాఖ్యానించునదిగను, శారదచంద్రుని ప్రత్యాఖ్యానించునదిగను, (ద్వివిధముగ) ఉల్లేఖింపఁబడుటవలన నిది ఉల్లేఖాలంకార మగుచున్నది.

మూ. అన్తర్గతస్య హర్షక్షీర సముద్రస్య కశ్చనతరఙ్గః
హాసో, హారహారిణదృశో గతపఙ్కం మమకరోతుమనః. ౩

హృదయాంతర్గతమగు హర్షక్షీరసముద్రముయొక్క తరంగవిశేషమగు పార్వతీహాసము నామానసమును గతపంకముగా- పాపములేనిదిగా; లేక బురదలేనిదిగా, నొనర్చునుగాత!

ప్రతి: —'హర్ష క్షీరసముద్రమన' సమ్మోదమనెడి క్షీరమయమగు సముద్రము. గతపంకము=పాపము లేనిది.

ఇందు ఆరోపవిషయ- విషయులగు హర్ష- సముద్రములకును, హాస- తరంగములకును అభేదాధ్యవసాయమువలన రూపక మలంకారమగుచున్నది. 'పాపము- బురద' అను నర్థములు గలది కావున పంకము శ్లిష్టార్థము గలిగియున్నది. సముద్రపు కెరటములచేత బురద తొలఁగువట్లు, పార్వతి చిరునవ్వుచేత పాపము తొలఁగునని భావము. పంకపదమునకుఁగల శ్లిష్టార్థ సామర్థ్యమువలన మనస్సు - పంకిలమగు (బురదతోఁగూడిన) సరస్తటమువంటిదనునర్థ మాక్షేపింపఁబడుచున్నది.

మూ. దిశిదిశివిసర్పదంశు ప్రశమితతాపం పరాస్తమాలిన్యమ్
కుశలాని ప్రదిశతు నః పశుపతిహృదయేశ్వరీహసితమ్. ౪

సర్వదిశలయందును ప్రసరించుచున్న కిరణములచేత తాపము నడఁగించునదియు, (శిశిరీకరించునదియు) మాలిన్యమును తొలఁగించునదియునగు పశుపతి హృదయేశ్వరీహసితము- మాకు కుశలముల నొసఁగును గాత!

ప్రతి: —పశుపతియన భూతముల కధిపతియగు నీశ్వరుఁడు. అతని హృదయేశ్వరి పార్వతి. ఆమె చిరునవ్వు- పశుపతి హృదయేశ్వరీహసితము. కుశలములన క్షేమములు. తాపప్రశమన- మాలిన్యపరాసనముల చేత, హసితమునకు అమృతకిరణత్వము- వ్యంజింపఁజేయఁబడుచున్నది. దానిచేత నిచట- ఉపమ- ధ్వనించుచున్నదని తెలియునది.

మూ. అన్తర్గతంచతిమిరం హరన్తి, విహసన్తి రోహిణీకాన్తమ్।
హసితాని గిరిశసుదృశో మమపరిబోధాయకల్పన్తామ్. ౫

హృదయగతమగు తిమిరమునుగూడ హరించునవియు, రోహిణీకాంతునిగూడ విహసించునవియునగు కైలాసనాథసుందరి హసితములు మమ్మున్ ప్రబోధించునుగాత!

ప్ర భ:—తిమిరము=చీకటి. రోహిణీకాంతుఁడు=చంద్రుఁడు. చంద్రుఁడు వెలుపలనున్న చీకటినే తొలఁగించునుగాని హసితములు- లోపలనున్న చీకటిని గూడ తొలఁగించును గావుననే, హసితములు వానిని పరిహసించునని భావము.

ఇచట ఉపమానమగు రోహిణీకాంతునికంటె నుపమేయములగు హసితముల కాధిక్యము వర్ణింపఁబడియెను. "ఉపమానముకంటె నుపమేయమున కాధిక్యముగాని న్యూనతగాని చెప్పఁబడినయెడల నది వ్యతిరేకాలంకార మగును" అను సాహిత్యదర్పణోక్తమగు లక్షణమున నిది వ్యతిరేకాలంకార మగునని గ్రహించునది.

మూ. భూషాతుషారదీధితి దీధిత్యానహావిహాయసోరఙ్గే
విచరన్పురహరతరుణీ దరహాసో మేహరత్వేనః. ౬

శివశిరోభూషణమగు చంద్రుని చంద్రికతోఁగూడి ఆకాశరంగమున విహరించుచున్న పురహరతరుణీదరహాసము నాపాపమును బాపునుగాత!

ప్ర భ:— ఆకాశరంగమున, అనుచోట ఆకాశమేయగు రంగస్థలమున, (నాట్యస్థలమునందు) అను నర్థము నెఱుఁగునది. (రాహువేయగు శిరస్సు-రాహువుయొక్క- శిరస్సని చెప్పఁబడినట్లు, ఆకాశమేయగు రంగస్థలము- మూలమున "విహాయసోరఙ్గే"="ఆకాశముయొక్క- రంగస్థలమున" అని చెప్పఁబడినదని యెఱుంగునది.

ఆకాశరంగమున కాంతునిగూడి విహరించుచున్న ఉమామందహాసము- హరశిరోభూషణ- బాలచంద్ర- చంద్రికతోఁగూడ విలసిల్లుచు నాపాపమును తొలఁగించునుగాత యని ప్రార్థింపఁబడినది.

ఇచట అనురూపములగు ఉమామందహాసబాలచంద్రికలు వర్ణింపఁబడినవి, కావున నిది సమాలంకారమగుచున్నది.

మూ. రుద్రాణ్యా దరహసితాన్యస్మాకం సంహరన్తు దురితాని
యేషాముదయో దివసో భూషాపీయూష కిరణస్య. ౭

ఏ దరహసితోదయము - హరశిరోభూషణమగు నమృతకిరణు నకు దివసమగుచున్నదో (చంద్రుని తిరస్కరించునో) ఆ రుద్రాణీ దరహసితములు మాదురితములను హరించుఁగాత!

ప్ర ధః—దివసము=పగలు. పగటియందు చంద్రప్రభ- తగ్గిపోవుట ప్రసిద్ధము. కావున ఆచిరునవ్వు— పగలుగానే, శివశిరశ్చంద్రిక- తిరస్కరింపఁబడినట్లు చెప్పఁబడినది.

"దివసము" అనుపదముయొక్క- అర్థసామర్థ్యమువలన హసితములకు, ప్రతాపగర్భమగు ఉష్ణరశ్మిత్వము (సూర్యత్వము) ఆక్షేపింపఁబడినది. తదానుగుణ్యమున దురిత- సంహరణ- ప్రార్థనకూడ నౌచిత్యమును పోషించుచున్నది.

ఉమాహసితములకును- శిరోభూషణ బాలచంద్రునకును గూడ కాంతి- సమానమేయయినను దివసపదముచేత హసితప్రభకుత్కర్షమును, బాలచంద్రప్రభకు నికర్షమును గమింపఁజేయఁబడుటవలన బాలచంద్రప్రభకు తిరోధానము చెప్పఁబడినది. కావున "నికృష్టమగు వస్తువున కుత్కృష్టమగు వస్తువుచే నగు తిరోధానము మీలితము" అనులక్షణముచేత నిది-మీలితాలంకారమగుచున్నది.

మూ. స్కన్దజననీముఖేన్దో రస్మాన్పుష్ణాతు సుస్మితజ్యోత్స్నా
మునిమతికైరవిణీనా ముల్లాసకథా-యదాయత్తా. ౮

ముని-మతులను (హృదయములను) కుముదినులకు (కలువలకు) వికాసమును గలిగించుట- దేనికధీనమై యున్నదో సుబ్రహ్మణ్యుని తల్లియగు పార్వతియొక్క- ముఖచంద్రునికిసంబంధించిన శుభప్రదమగు ఆచిరునవ్వువెన్నెల మమ్ముపోషించుఁగాత!

ప్ర ధః—ఇందలి యలంకారము- రూపకము. స్కందజననియన, కుమారస్వామియొక్క- తల్లి, మతిశబ్దమున కిచటనుమాత్రము హృదయమని యర్థముఁ జెప్పవగును. ఇందు పార్వతీముఖము- చంద్రస్థానీయము. చిరునవ్వు- జ్యోత్స్నాస్థానీయము. మునిమతులు- కైరవిణీస్థానీయములు.

ఉల్లాసమునుగలిగించుట- స్మితాధీనము- ఉల్లాసశబ్దస్వారస్యమువలన విూది శ్లోకమునందలి మతిశబ్దము హృదయమునకుపలక్షకమని యెఱుంగునది.

"సనత్కుమారుఁడు" అను నామాంతరముగల స్కందుఁడు మృదితకషాయులగు మునులందఱికంటెనుగూడ జ్ఞానదాత" అనుప్రసిద్ధి యున్నది. కావున మునిహృదయోల్లాసప్రసంగమువలన, పార్వతిని దెలుపుచున్న స్కందజననీపదమిచట నౌచిత్యపోషకమగుచున్నది.

మూ. కమనీయకణ్ఠమాలా ముక్తామణితారకావయస్యోనః
కామాన్వితరతు గౌరీదరహాసోనామ ధవలాంశుః. ౯

మనోజ్ఞమగు కంఠమాలయందలి ముక్తామణులను తారలకు వయస్యుఁడగు గౌరీదరహాసమను ధవలాంశుఁడు, మాకు వాంఛితముల నొసఁగునుగాత!

ప్రభ:— తారలకు=నక్షత్రములకు, ధవలాంశుఁడు=చంద్రుడు, (తెల్లనికిరణములుగలవాఁడు) కంఠమాలాముక్తామణులయందు ప్రభాతరలతాసాధర్మ్యమువలన తారకారోపణము ! చేయఁబడినది. దరహాసము- ముక్తామణులకువయస్యుఁడు (సహచరుఁడు) చంద్రుఁడు- తారావయస్యుఁడు (కాంతుఁడు)

శోభావహత్వము- అహ్లాదకత్వము మొదలగునది- దరహాస- ధవలాంశువులకు సమానధర్మము. కావున నిది యిట్లు- సావయవరూపకాలంకారమగునని గ్రహించునది.

మూ. అనవద్యకణమాలా ముక్తావలికిరణ నివహసహవాసీ
హరదయితాదరహాసోహరతుమమాశేషమజ్ఞానమ్. ౧౦

కంఠమాలయందున్న నిర్దుష్టమగు ముక్తావలియొక్క కిరణసమూహమునకు సహవాసియగు (మిత్రమగు) హరదయితాదరహాసము నాయజ్ఞానమునంతను హరించుఁగాత!

ప్రభ:- హరదయితయన శివకాంతయని యర్థము. భక్తుల యజ్ఞానమునుగాని ఆర్తినిగాని హరించును గావున శివుఁడు హరుఁడగుచున్నాఁడు.

ఇచట నిశ్శేషమగు- అజ్ఞానహరణము- ప్రార్థింపఁబడినది కావున పార్వతిని హరదయితగా కీర్తించుట- ఔచిత్యపోషకమగుచున్నదని గ్రహించునది.

మూ. ఞ ఇవజ్ఞదృశ్యేఉత్తమ - ఇలాధరాధీశనన్దినీహాసః ।
పూర్ణం కరోతుమానన మభిలాషం సర్వమస్మాకమ్. ౧౧

జ్ఞ దృశ్యమగు (జకార ఞ కారసంయోగమగు 'జ్ఞ' అనుదాని యందు జూడఁదగిన) ఞ కారమువలె ఉత్తమమగు (ఉత్కృష్ట మగు) పర్వతరాజపుత్రీహాసము. మాయొక్క మానసమగు అభిలాషమును సర్వమును పూర్ణము గావించుఁగాత

ప్ర భ:—మూలమునందలి "ఇలాధరాధీశ నన్దినీహాసః" అనుపదమునకు తెలుఁగున, పర్వతరాజపుత్రీహాసమని యర్థము చెప్పఁబడినది.

( ) (జ్ఞ) అను లిపియందు ( ) (ఞ) కారము సరిగా గుర్తింపఁబడనేరదు:, కాని అత్యంతమును సూక్ష్మమగు దృష్టి చేతఁ జూడఁబడును.

ఇట్లు- అవిస్పష్టముగను సూక్ష్మముగను గుర్తింపఁదగిన ( )(ఞ) వర్ణమువలె సరిగా గుర్తింపబడకుండుటవలనను సూక్ష్మమగుటవలననుగూడపార్వతీహాసము- ఉత్తమమని చెప్పఁబడినది.

తైత్తిరీయప్రాతిశాఖ్యమున ( ) (ఞ) కారము— "ఉత్తమము" అనుసంజ్ఞ గలదని యిట్లు పఠింపఁబడినది.

సూ॥ 10, వర్ణానామానుపూర్వ్యేణ పఞ్చ పఞ్చ వర్గాః।

సూ॥ ప్రథమ- ద్వితీయ- తృతీయ- చతుర్థ- ఉత్తమాః.

ఇట్లు ఉత్తమసంజ్ఞమగు ( ) ఞ వర్ణము- ( ) జ్ఞదృశ్యము=ప్రాతిశాఖ్యజ్ఞులచేఁ దెలియఁదగినది. అట్లే- ఉత్తమమగు పార్వతీహాసముకూడ జ్ఞదృశ్యము= పండితులచేఁ దెలియఁదగినది.

మూ. ఆలోకమాత్రతో యః శఙ్కరమసమాస్త్రకిఙ్కరం చక్రే
ఆల్పోఽప్యనల్పకర్మా హాసోనః పాతు న శివాయాః. ౧౨

ఆలోకమాత్రమున శంకరుని విషమాస్త్రకింకరు నొనర్చునదియు అల్పమయినను అనల్పమగు కర్మగలదియునగు పార్వతి చిరునవ్వు- మమ్ము రక్షించునుగాత.

ప్ర భ:—ఆలోకమాత్రమున=చూచినంతమాత్రము చేతనే, విషమాస్త్రకింకరుఁడు=పంచబాణుఁడగు మన్మథునకు వశపడినవాఁడు, అనల్పమగు=అధికమగు,

వి వ:— పార్వతీహాసమును దర్శించినంతమాత్రముచేతనే శంకరుఁడు మదనవశంగతుఁడయ్యెనని భావము.

హాసము- స్వల్పమైనను, స్వదర్శనమాత్రమున శంకరుని కామకింకరుని జేయుట- అనల్పమగు కర్మమై యున్నది. కావున నిట్లు- అసంభావ్యత్వవర్ణనము వలన అసంభవమును వర్ణించుటవలన నిది- అసంభవమను అలంకార మగుచున్నది.

మూ. స్మర- మతరతమీశం యః కరోతిభావప్రసఙ్గచాతుర్యా।
ద్విజగణపురస్కృతో౽వ్యాత్ న శివాహాసప్రవక్తానః. ౧౩

భావ- ప్రసంగ- చాతురిచేత ఈశ్వరుని కామతంత్రరతు నొనర్చినదియు, ద్విజగణముచేత పురస్కరింపఁబడినదియు, నగు పార్వతియొక్క హాసమను ప్రవక్త మమ్ము రక్షించుఁగాత.

ప్ర భ:—బ్రాహ్మణవర్గమును ముందుంచుకొని (పూజించి) నిజాభిప్రాయమును స్ఫుటీకరించు చాతుర్యముగలిగి- ఉపన్యాసమును జెప్పువాఁడగు ప్రవక్తవలె- దంతపంక్తిని వెనుక నుంచుకొని- విభావాదులచేత నిష్పాదింపఁదగిన రతిభావమును దెలియఁజేయు చాతుర్యముగలిగి- ప్రకాశించుచున్న పార్వతిచిరునవ్వు మమ్ము రక్షించుఁగాత మని భావము.

ప్రవక్తయన బాగుగా చెప్పువాఁడు (ఉపన్యాసకుఁడు) ఇందు పార్వతీహాసము ప్రవక్తగా నారోపింపఁబడినది. కావున మీఁది విశేషణములు హాసపక్షమునను ప్రవక్తృపక్షమునను గూడ క్రమముగా నిట్లు సమన్వయింపఁదగియున్నవి.

భావప్రసంగచాతురిచేత = రసాదినిష్పాదకమగు రత్యాదిభావముయొక్క ప్రస్తావవిషయమునందలి నిపుణతచేత, లేక అభిప్రాయముయొక్క ఆవిష్కారమునందలి చతురతచేత- ద్విజగణముచేత పురస్కరింపఁబడినది=దంతపంక్తికి ముందుగా స్థాపింపఁబడినది-లేక బ్రాహ్మణగణమును ముందుగా పూజించినది.

ఈశ్లోకము- ఇట్లు శ్లిష్టార్థము కావున నిందలియలంకారము- శ్లేషోత్థాపితమగు సావయవ రూపకమగుచున్నది. 'భావప్రసంగ చాతురిచేత' అనిచెప్పుటచేత "శృంగారరస నిష్పాదకములగు- ఆలంబన- ఉద్దీపనవిభావ- అనుభావాదులచేత నిష్పాదింపఁదగిన రతిభావము- కామేశ్వరీ మందహాసగర్భము" అనునంశము ద్యోతింపఁజేయఁబడుచున్నది.

"పురస్కృతః=ముందుంచుకొనఁబడినది" అనుటచేత వెనుకనున్న దంతపంక్తి, స్పష్టము కాని, దర్శనముగలదనియు ముందున్నహాసము (స్వల్పమైనను)

సుస్పష్టమగుదర్శనము గలదనియు గమ్యమగుచున్నది. హాసమునందు ప్రవక్తృత్వము నారోపించుటవలన ప్రవచన కార్యమంతయునుగూడ వాగ్విరహితమగు హాసము చేతనే నిర్వహింపఁబడినదని విశదమగుచున్నది.

మూ. రదవాససా రథీ నః శరీ కరైః పాతు పార్వతీహాసః
పావకదృశం జిగీషోః పఞ్చపృషత్కస్య సేనానీః. ౧౪

దంతపంక్తిని గప్పుచున్న యధరముచేత— రథియు (రథముగలదియు) కిరణములచేత— శరియు (బాణముగలదియు) జ్వాలననేత్రుఁడగు శివుని జయింపఁగోరిన పంచబాణునకు సైనికాధిపతియు, అగు పార్వతీ హాసము— నన్ను రక్షించునుగాత!

ప్రభ:—ఇందు— అధరమను రథముగలదియు, కిరణములను బాణములుగలదియు— అనిసమానవిభక్తులచేఁగాక "అధరముచేత-రథియు, కరములచేత-శరియు" అని భిన్నవిభక్తులచేనగు అభేదాధ్యవసాయమువలన నిది— వైయధికరణ్యముచేత నగు రూపకమగుచున్నది. అనలనేత్రుఁడగు శివుని జయించుటకు మన్మథుఁడు ప్రయత్నించునపుడు భగవతియగు పార్వతియొక్క— సుందరహాసమే యుద్ధసన్నాహమొనర్చి సైన్యాధిపతివలె విజయమును నిర్వహించినది. కావున నది సైనికాధిపతియని చెప్పఁబడినది. అధరము-హాసమును వహించినది, ఆయధరమున ధరింపఁబడిన హాసమయూఖములే- బాణములయినవి. హాసము-రథియయినది. రథియగుహాసమే మన్మథుని సేనాధిపతి యయినది.

ఇట్లు— వర్ణింపఁబడిన మందహాసమహిమ— (రూపకసామర్థ్యమున) సర్వోత్తరమగు రామణీయకమును పోషించుచున్నది.

మూ. శివహృదయమర్మభేది స్మితం తదద్రీశ వంశముక్తాయాః ।
దశనద్యుతి ద్విగుణితశ్రీకం శోకం ధునోతు మమ. ౧౫

మహేశ్వర హృదయమర్మమును భేదించునదియు, దంతకాంతులచే ద్విగుణితమగు శోభగలదియు, నగు పర్వతరాజవంశముక్తామణి ముఖమునందలి యాచిరునవ్వు మాశోకమును పోకార్పుఁగాత!

ప్రభ:-మర్మమన, గూఢమగు జీవస్థానము. ద్విగుణితమన, రెట్టింపుచేయఁబడినది. వంశమన- కులము, వెదురు. (వెదురునందు ముక్తికముదయించుననునది కవి సంప్రదాయము. ప్రగాఢమగు శివహృదయమునందుఁగూడ చొరఁబడిన పార్వతీ

స్మితము, అస్మదాదుల హృదయమునఁ బ్రవేశించి, తద్గతమగు శోకమును తొలఁగించుటకు శక్తము కానేరదా! అనిభావము.

మూ. బ్రహ్మాణ్డరఙ్గ భాజో నట్యాః శివసూత్రధారసహచర్యాః ॥
శ్రీవర్ధనోఽనులేపో ముఖస్య హాసః పునాత్వస్మాన్. ౧౬

బ్రహ్మాండమను రంగస్థలమున ప్రవేశించిన శివుఁడను సూత్రధారునకు సహచరి (సఖి) యగు పార్వతియొక్క శ్రీవర్ధనమగు అనులేపమేయగు హాసము మమ్ము పవిత్రులఁ జేయుచుండుఁగాత!

ప్ర భ:-రంగమన, నాట్యస్థలము. సూత్రధారుఁడన భరతాచార్యుఁడగు నటుఁడు. సూత్రధార సహచరి యన నతని ననుసరించునటి. శ్రీవర్ధనమన, శోభా ప్రకర్షకము. అనులేపనమన లేపనద్రవ్యము-ముఖమునకుఁ బూసికొనునంగు (పౌడరు) బ్రహ్మాండము—రంగస్థలము. శివుఁడు—సూత్రధారుఁడు. తత్ సహచరియగు పార్వతి—నటి. పార్వతీముఖహాసము—నటీముఖశోభను వృద్ధినొందించు పౌడరు. అని యెఱుంగునది. సావయవమగు రూపకము—అలంకారము.

మూ. అధరప్రవాళశయనే నాసాభరణ ప్రభావిలాసిన్యా
రమమాణో హారరమణీ హాసయువా హరతు నః శోకమ్. ౧౭

అధర- ప్రవాళ- శయనమునందు నాసాభరణప్రభావిలాసినితోఁ గూడి- రమించువాఁడగు హారరమణీ- హాసయువకుఁడు మాశోకమును తొలఁగించునుగాత!

ప్ర భ:—అధరప్రవాళశయనమునందు—మోవియను చిగురాకుచేతఁ గూర్పఁబడిన పాన్పునందు, నాసాభరణప్రభావిలాసినితోఁ గూడి=ముక్కు ముత్తెపు కాంతి యను విలాసవతితోఁ జేరి, హారరమణీహాసయువకుఁడు= పార్వతీహాస మను యువకుఁడు రమించుచున్నట్లు చెప్పఁబడినది. ఇందు- రూపకమలంకారము. కవిప్రౌఢోక్తి సిద్ధమగు ఈయలంకారముచేత- నాసాభరణప్రభావిలాసినీ- హాసయువకులకు- అధరశయనమున, అన్యోన్యమగు కలయిక- లోకోత్తరశోభావహమను నంశము వ్యంజింపఁజేయఁబడుచున్నది.

మూ. అధరోష్ఠవేదికాయాం నాసాభరణాంశుశాబకైః సాకమ్
కులముఖిలమవతు ఖేలన్నద్రిసుతాహాసబాలో నః. ౧౮

అధరోష్ఠమను వేదికయందు నాసాభరణకాంతులను శాబకులతోఁ గూడి యాడుచున్న హైమవతీహాసమను బాలుఁడు మాకులమును సకలమును రక్షించుఁగాత!

ప్రభ:—అధరోష్ఠమన, క్రింది పెదవి. శాబకులన, శిశువులు. వేదికయన, గృహద్వారమున కీవల నించుక యెత్తుగా నిర్మింపఁబడిన యరుగు. అది బాలుర కాటస్థలమగుచుండును. ఈరూపకమునందుఁ గ్రిందియంశము లెఱుఁగఁదగియున్నవి. నాసాభరణకాంతులు=ఆడుకొనుటకు వచ్చిన యితరశిశువులు. అధరోష్ఠము-క్రీడాస్థలమగు వేదిక. ఇట్లు-కవిప్రౌఢోక్తి సిద్ధమగు రూపకముచేత- బాలుఁడు-శిశువులకంటె నధికుఁడు. కావున బాలుఁడుగాఁ జెప్పఁబడిన హాసము శిశువులుగాఁ జెప్పఁబడిన భూషణాంశువులతోఁగూడి యథేచ్ఛముగా విలసిల్లుచున్నను "దానిశోభ—సర్వోత్తరమే" అనువస్తువు ధ్వనితమని తెలియునది.

మూ. అనులేపనస్య వీప్సా ద్విర్భావః కుచతటీదుకూలస్య ।
హరతుహృదయవ్యథాం మే హసితంహరజీవితేశ్వర్యాః. ౧౯

అనులేపమునకు ద్విరుక్తియు, కుచతటీదుకూలమునకు ద్విరావృత్తియునగు హరజీవితేశ్వరియొక్క హసితము- నాహృదయవ్యథను తొలఁగించునుగాత.

ప్రభ:—పార్వతియొక్క చిరునవ్వు సొంపును గూర్చునదియగు మంచిగంధము మున్నగు లేపనద్రవ్యమునకు మీఁద నింకొక అనులేపనమును ఉత్తరీయమునకుమీద నింకొక యుత్తరీయమును అగుచున్నదని తాత్పర్యము.

మూలమునందు 'వీప్సా' అనుపదమునకు ద్విరుక్తియని యర్థమగుచున్నది. మూలమునందలి ద్విర్భావపదమునకు ద్విరావృత్తి యర్థమగును. అనులేపనమన మంచిగంధము మొదలగు శోభాదాయకమగు లేపనద్రవ్యము. శుభ్రత్వసాధర్మ్యమువలన ఉమాహసితము- అనులేపనముమీఁద అనులేపనముగను ఉత్తరీయము మీఁద ఉత్తరీయముగను ఆరోపింపబడుటవలన నిది అభేదరూపకాలంకారమగుచున్నది. ఆత్మశోభచేత ముఖ-వక్షోజములను వ్యాపించియున్న తెల్లని చిరునవ్వుయొక్క ప్రసన్నత- హృదయవ్యథను తొలఁగించుటకు సమర్థమగునని భావము.

మూ. గిరిశాఙ్గరాగ భసితం స్వాగతవచసాభినన్దదాదరతః
గిరిజాలీలాహసితం గరీయసీం మే తనోతు ధియమ్. ౨౦

శివాంగరాగమగు (శివుని మెయిపూతయగు) భస్మమును-స్వాగతవచనముతో నాదరపూర్వకముగా అభినందించుచున్న పార్వతీ లీలాహసితము నాయొక్క-బుద్ధిని గొప్పదిగా విస్తరించునుగాత!

ప్ర భ:—శివదేవుఁడు తన దేహమునకుఁ బూసికొన్న భస్మమును "దయ చేయుఁడు— మీకువిజయమగుఁగాక" అను స్వాగతవాక్యముతో నామోదించు చున్నది వలెనున్న పార్వతీ విలాసస్మితము- నాబుద్ధిని విస్తరింపఁజేయుఁగాతమని ప్రార్థింపఁబడినది. భర్తయగు శివునియొక్క- బూదిపూతచేనగు శరీరధవళిమను జూచి- శుభ్రమగు పార్వతీహాసముకూడ నిజధవళిమతోడి పోలికవలన దానియం దాదరమును జూపుచున్నదను వస్తువుచేత నిచట- భసిత- హసితములకు నుపమ ధ్వనింపఁ జేయఁబడుచున్నది.

మూ. అయి తే నను సల్లపన్త్యాః, సహ తుహినమరీచి శిశు కిరీటేన।
వాగమృతబుద్బుదో౽వ్యాదలసో మామగభువో హాసః. ౨౧

బాలచంద్రకిరీటియగు భర్తతోఁగూడి సల్లాపములాడుచున్న పార్వతీదేవియొక్క- వాగమృతబుద్బుదమగు అలస (మంద) హసితము నన్ను రక్షించునుగాత!

ప్ర భ:—మూలమునందలి "తుహినమరీచి శిశుకిరీటేన" అనుపదమునకు "శిశుః=బాలః, తుహినమరీచిః=హిమాంశుః=తుహినమరీచిశిశుః, మయూరవ్యంసకాదివత్ సమాసః" అని ప్రభావ్యాఖ్యాతచేత వ్యుత్పత్తి చెప్పఁబడినది.

కాంతుఁడగు చంద్రచూడునితో ప్రియభాషణము నొనరించుచున్న దేవీ వాక్కునుండి బయలువెడలుచున్న మందహాసము- అమృతబుద్బుదమేయను నభేదాధ్యవసాయమువలన రూపక మలంకారమగుచున్నది. మథించుటవలన అమృతమునకు బుద్బుదాకారములు కాన్పించును. బుద్బుదమను పదముయొక్క- అర్థసామర్థ్యమువలన సల్లాపమును విడువనిహాసము ఆక్షేపింపఁబడుచున్నది. స్పష్టముగాఁ గనుపించుచున్నను గూడ బుద్బుదము మథింపఁబడుచున్న యమృతము నాశ్రయించి యుండునట్లు- సల్లాపించుచున్న తత్కాలమున నిర్గతమగు మందహాసము- సల్లాపశ్లిష్టమగుచుండునని గ్రహించునది.

మూ. శుద్ధః కుచాద్రినిలయా దపి ముక్తాహారతో హారపురంధ్ర్యాః
వదనశ్రీప్రాసాదే విలసన్ హాసోఽలసోఽవతుమామ్. ౨౨

హారపురంధ్రియగు పార్వతియొక్క కుచాద్రినిలయమగు ముక్తాహారముకంటెను గూడ స్వచ్ఛమును, వదనశ్రీ ప్రాసాదమునందు విలసిల్లునదియు, అగు మందహాసము నన్ను రక్షించును గాత!

ప్ర భః—హారపురంధ్రియన శివకాంత. కుచాద్రినిలయము=స్తనమను పర్వతము నివాసస్థలముగాఁగలది. వదన శ్రీప్రాసాదమునందు= ముఖలక్ష్మి యొక్క మందిరమునందు, లేక ముఖపద్మమునందు. పర్వతముమీఁదనున్న మేడయే అసాధారణమగు రామణీయకమును పోషించుచుండగా ఆమేడయందు విలసిల్లుచున్న లావణ్యాతిశయమును గురించి చెప్పవలయునా! వక్షోజగతమగు ముక్తాహారముకంటెను గూడ శుద్ధమగు శోభచేత పార్వతీ ముఖపద్మమునందలి హాసము మిక్కిలి గొప్పదగుచున్నదని భావము.

మూ. వ్యర్థీభూతే చూతే గతవతి పరిభూతి మసిత జలజాతే
అనితే సిద్ధిమశోకే కమలేఽపి గలజ్జయశ్రీకే. ౨౩

మన్మథపంచబాణములయందలి బాణ పుష్పమగు రసాలము విఫలముకాఁగా, నీలోత్పలము తిరస్కృతినొందఁగా, అశోకము లక్ష్యభేదసిద్ధిని సంపాదింపక పోఁగా, కమలము గలజ్జయశ్రీకము (జయశ్రీనుండి జారినది) కాఁగా

ప్ర భః—గలత్=జారిన, జయశ్రీకము=విజయలక్ష్మిగలది— విజయమునొందలేనిది. మీఁది శ్లోకముతో నన్వయము.

మూ॥ బహుధా బిభేద హృదయం హరస్య బాణేన యేన సుమబాణః
తదుమాలీలాహసితం మల్లీసుమ మస్తు మే భూత్యై. ౨౪

సుమబాణుఁడగు మన్మథుఁడు ఏ బాణముచేత హరుని హృదయమును బహువిధమగునట్లు భేదించెనో, ఆ ఉమాలీలాహసితమగు మల్లీసుమము నాకైశ్వర్యము నొసఁగుఁగాత!

ప్ర భః—మల్లీసుమము=మల్లెపూవు, చూతాదులగు బాణపుష్పములు నాలుగును హారహృదయభేదనమున విఫలములు కాఁగా, ఉమాహసితమే అయిదవబాణ

మగు మల్లెపూవుయొక్క కార్యమును నిర్వహించెనని కవిప్రౌఢోక్తి. పూవులయి దింటిలోను గూడ మల్లెపూవునకే అల్పమగు నాకృతిచేతను, శుభ్రతచేతను మంద మును శుభ్రమును అగు ఉమాహసితముతోడి యభేదము నభ్యపదించుట యుక్త మగును.

మూ. అమలదరస్మితచిహ్నా స్సా ఏతా, సర్వమఙ్గలా ఆర్యాః
కమనీయతమాస్స్వసమా ముపతిష్ఠ న్తా ముమాం దేవీమ్. ౨౫

నిర్మల దరహసితచిహ్న(ము)లును, సర్వమంగల(ము)లును; అగు ఆయీయార్యలు— కమనీయతములగు స్త్రీలయందు అద్వితీయయగు ఉమాదేవి నుపాసించుఁగాత!

ప్రభ:-సర్వమంగల(ము)లు=స్తబక శ్లోకములంవంతటను కల్యాణముగలవి. కలవారు ఆయీయార్యలు=ప్రస్తుతస్తబకమునం దుపక్రమింపఁబడిన ఆర్యావృత్తనిబద్ధములగు స్తుతులు. ఆర్యలగు స్త్రీలు స్తబకమునందలి శ్లోకములన్నిటియందును మందస్మిత మునుగూర్చియే ప్రస్తావించుటవలన నీయార్యలకు మందస్మితమే చిహ్నమగుచున్నది. అంతటనుగూడ మాంగల్యమునే ఆశాసించుటవలన నీయార్యలు సర్వమంగల లగుచున్నవి.

తృతీయ శతకమునందలి ప్రథమస్తబకము ఇట్లు-ఆర్యలచేత ఉమాదేవతనుపాసించి యుపసంహరింపఁబడి ముగిసినది.

ఇది సవ్యాఖ్యమగు ఉమాసహస్ర తృతీయశతకమునందలి
ప్రథమ స్తబకము. శ్రీ. శ్రీ. శ్రీ.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

ఉమా సహస్రము

(తృతీయ శతకమున - ద్వితీయ స్తబకము)

దశమ స్తబకము

అ॰:— ఈ దశమ స్తబకము భగవతియొక్క కేశాది-పాదాంత స్తుతిపరము.

మూ॥ సజ్క్షాలనాయహరితాం, విభూతయే
లోకత్రియస్య, మదనాయ ధూర్జటేః,
కాత్యాయనీవదనతః శనైః శనైః
నిర్యాన్తి శుభ్రహాసితాని పాన్తు నః. ౧

దిశలను విమలీకరించుటకును, లోకత్రియమునకును, విభూతి నిచ్చుటకును, ధూర్జటికి కామముఁగలిగించుటకును కాత్యాయనీవదనమునుండి మెల్లమెల్లగా బయలువెడలుచున్న తెల్లనిచిరునవ్వులు- మమ్ము రక్షించుఁగాత !

ప్ర భ:—విభూతియన నైశ్వర్యము. ధూర్జటియన శివుఁడు. నైర్మల్య-ఐశ్వర్య సాహచర్య సంపాదకములగు భగవతీ మందహాసములు- అస్మద్రక్షకములుగాఁ బ్రస్తుతింపబడినవి. ఇందు- హేతుమండలములగు దిశలను విమలీకరించుట మున్నగు కార్యములతోఁగూడ హేతువగు శుభ్రహసితములను వర్ణించుటవలన నిది హేతువను నలంకారమగుచున్నది. మఱియు - అశుభ్రహసితములు దిశలను విమలీకరించునవిగను, లోకత్రయమునకు విభూతి నిచ్చునవిగను, ధూర్జటికి కామము కల్పించునవిగను, బహువిధముల నుల్లేఖింపఁబడుటవలన ఉల్లేఖాలంకారముగూడ నగుచున్నది. తిలతండుల న్యాయమున స్ఫుటముగాఁ దెలియఁదగిన భేదముగల- హేతు- ఉల్లేఖములతోఁ గూడియుండుటవలన నిది 'సంసృష్టి' అనునలంకారమగును.

మూ॥ స్వల్పోఽపి దిక్షుకిరణాన్ ప్రసారయన్
మన్దోఽపి బోధమమలం దధత్ సతాన్
శుభ్రోఽపి రాగకృదనఙ్గవైరిణో
హాసః పురాణసుదృశః పునాతు నః ॥ ౨

మిక్కిలి యల్పమైనదయినను దిక్కులన్నిఁటియందును కిరణములను ప్రసరింపఁజేయునదియు, మందము అయినను సజ్జనులకు నిర్మలమగు జ్ఞానమును గలుగఁజేయునదియు, శుభ్రమయినను, అనంగవైరియగు శివునకు రాగమును జనింపఁజేయునదియునగు, పురాణసుందరియగు నుమయొక్క హాసము మమ్ము పవిత్రుల నొనర్పుఁగాత!

ప్రి భ:—మందము=అలసము లేక అల్పప్రజ్ఞగలది. శుభ్రము=తెల్లనిది లేక పరిశుద్ధమయినది. రాగము=ఎఱుపు లేక అనురాగము. స్వల్పమగుహాసము అంతటను ప్రసరించుట విరుద్ధము. అది యుమాహాసమునకు స్వాభావికము కావున పరిహరింపఁబడును. అట్లే మందమగుదానికి సద్బోధనము. విరుద్ధము. అదికూడనుమాహాసమునకు స్వాభావికము. కావున పరిహరింపఁబడును. శుభ్రమగునది (తెల్లనిది) రాగమును (ఎఱ్ఱఁదనమును) జనింపఁజేయుట విరుద్ధము. ఇచట రాగపదమునకు శ్లేషమూలకమగు అనురాగము నర్థముగాఁ జెప్పుకొనుటవలన మీఁదివిరోధముకూడ పరిహరింపఁబడును. మీఁదిశ్లోకమునందంతటను గూడనిట్లు విరోధము కాన్పించినను అది ఆభాసము (లేనిదేయున్నట్లు తోఁచునది) కావున నిది విరోధాభాసమను నలంకారమగుచున్నది.

మూ॥ చేతోహరోఽప్యతిజుగుప్సితో భవేత్
సర్వోఽపి జీవకలయాయయావినా
సావర్ణ్యతాం కథ మపారచారుతా
పీయూష సిన్ధురఖిలేన్ద్రసున్దరీ. 3

ఏ జీవకళను (జీవనాధాయినియగు నుమను) విడిచినయెడల మనోహరమయిననుగూడ నీలోకమంతయునుగూడ మిక్కిలి జుగుప్సావహమగుచుండునో అపారసుమమామృతసాగరమగు ఆసర్వేశ్వరసుందరి యెట్లు వర్ణింపఁబడును?

ప్రభ:—జీవశబ్దము బృహస్పతియందును, ప్రాణమునందును, జీవనమునందును, ఆత్మయందును, పక్షియందును వర్తించునని నానార్థరత్నమాల చెప్పుచున్నది. కావున నిచట జీవశబ్దమునకు జీవన మర్థమగుచున్నది. కలాశబ్దము, అంశమాత్రమునందును, మూలవృద్ధియందును, సుషమ (గొప్పసౌందర్యము) యందును, విద్యయందును వర్తించునని త్రికాండశేషము చెప్పుచున్నది. సర్వేశ్వరసుందరీవిశేషణానురూపతవలన కలాశబ్దముచేత నిచట సుషమ యర్థమగుటకు యుక్తమగుచున్నది. కావున జీవకల యన జీవసుషమ యనునర్థము గ్రహింపఁదగుచున్నది.

అవ్యయ-లావణ్యామృతరాశియగు భగవతియే-ఆజీవకళ. అది (భగవతియగు జీవకళ) లేనియెడల లోకమంతయుఁగూడ భీభత్సరసావహమగును- మూలకళయగు ఆసుషమ (సౌందర్యము) ఉండిననే జీవనము సంభవించును. అజీవన ముండిననే యితరములగు నంగములు రమణీయములై వెలుంగును.

కావున అంగసౌందర్యముల కన్నిఁటికిని మూలము- అంగిసౌందర్యమే యగును- ఆయంగిసౌందర్యము- జీవకళయే యని గ్రహించునది. మూలసౌందర్యము (జీవకళ) శరీరమునుండి తొలఁగినపుడు, మరణించిన శరీరమునందలి యంగముల సౌందర్యములు ఎవ్వనికైనను ఎట్లు రుచించును? రుచింపకపోవుట యటుండ వైరస్యమునే కలిగించును. అంగి- జీవకలాసంపన్నమగునపుడే అంగములు సరసము లగుచుండును. జీవకళావంతమగు అంగితోడి సంవాదము వలననేఅయంగములలో నొక్కొకదానికిని, అన్నింటికినిగూడ రామణీయకతానిష్పత్తియగుచున్నది. మరణించిన దంతయు- అసుందరమే యగుటవలన విరసమగును. సమరసమును సరసమును అగుసౌందర్యము జీవనభూతమగు నమృతము. అది (జీవనమను ఆయమృతము) అఖిలేంద్రసుందరీ స్వరూపమేయని తెలియునది.

అవ:—ఈస్తబకమున పార్వతీకేశపాది వర్ణనము నారంభించుచు, సర్వసౌందర్యమూలకలయగు నాయమ్మను వర్ణించుటకు సమర్థుఁడెవ్వడును లేఁడని యుపక్రమించుచున్నాఁడు.

మూ॥ అత్యల్పదేవవనితాంచ పార్థివై
ర్భావైర్వ్యయం తులయితుం నశక్నుమః
తాం కిం పునః సకలదేవ సున్దరీ
లోకాక్షిపారణ తనుప్రభ'ముమామ్. ౪

మానుషకవులమగు మేము సామాన్యయగు దేవాంగననుగూడ పార్థివములగు భావములతో సమీకరించుట (ఉపమించుట)కు శక్తులము కానేరము (అట్టియెడల) దేవసుందరీనయనపారణమగు శరీరప్రభగల ఆ యమ నుపమించుట కెట్లు శక్తులమగుదుము?

ప్రభ:—పార్థివములగు భావములతో=భూలోకగతములగు రమణీయవస్తువులతో, నయనపారణమగు=నేత్రములకు వ్రతాంతమునందగు భోజనమగు (సంతర్పణమగు) సామాన్య సురసుందరినిగూడ వర్ణించుట కశక్తులము, భూమిస్థులము, అగు మాకు— సర్వసురసుందరీ నయనామృతాయమానదేహ కాంతియగు భగవతి నిట్టిదని వర్ణించుటకు శక్తియెక్కడిదని తాత్పర్యము. అర్థాపత్తి-అలంకారము.

మూ॥ వర్షా పయోద పటలస్య సాన్ద్రితా
సూర్యాత్మజోర్మిచయ నిమ్నతుఙ్గతా
కాలాహి భూమిపతి దీర్ఘతాచ తే
కేశేషు భర్గభవనేశ్వరి! త్రియమ్. ౫

ఓ శివగృహిణీ! వర్షాకాలమున మేఘపటలమునందగు సాంద్రతయు, యమునాతరంగసందోహమునందగు నిమ్న - తుంగతయు, కాలాహిలోకపతియందగు దీర్ఘతయు, అను నీమూడును గూడ నీ కేశములయందున్నవి.

ప్రభ:—సాంద్రత=నిబిడత-దట్టమైయుండుట. నిమ్న-తుంగత=ఎత్తుపల్లములు గలిగియుండుట (భంగిమత్త్వ) దీర్ఘత=ఆయతత్వము - పొడవై యుండుట కాలాహిలోకపతి=కృష్ణవర్ణముగల నాగరాజు. ఇట్లనేకములగు నుపమాధర్మము లన్నియుఁగూడ ఒక్కటియేయగు కేశపాశమున సమావేశించుటవలన ఇది-మాలోపమాలంకార మగుచున్నది. "మాలోపమా యదేకస్యోపమానం బహు దృశ్యతే" ఒకే యుపమేయమునకు అనేకములగు నుపమానములు కాన్పించునెడల నది-మాలోపమయగును. అని సాహిత్యదర్పణమున లక్షణము చెప్పఁబడినది.

మూ॥ ఈశానసున్దరి! తవాస్య మణ్డలా
న్నిర్ణిక్తాన్త మమృతాంశు మణ్డలమ్
కోవాన కీర్తయతి లోష్టపిణ్డకమ్
లోకే నికృష్టమిహ మానవీ ముఖాత్. ౬

ఈశ్వరసుందరీ! నీముఖమండలముకంటె చంద్రమండలము మిగుల నికృష్టము. ఈలోకమున మానవీముఖముకంటె మృత్పిండమును అధమముగా నెవఁడు చెప్పకుండును?

ప్రభ:-మానవీముఖముకంటె=మనుష్యస్త్రీ ముఖముకంటె. మృత్పిండము= మట్టిముద్ద. మట్టిముద్ద-మానుషీముఖముకంటె నికృష్టమని యందఱును జెప్పుదురు. జీవించియున్న సుందరియొక్క- ముఖమునకును, మట్టిముద్దకును, ఎంత భేదముండునో, ఉమాముఖమండల- చంద్రమండలముల కంతభేదము గలదనిభావము.

ఇచట- బింబములగు- ముఖమండల- చంద్రమండలములకు, మానుషీముఖ- లోష్టపిండకముల యందగు ప్రతిబింబభావము చెప్పఁబడినది. కావున నిది దృష్టాంతాలంకారమగుచున్నది. మీఁది దృష్టాంతముచేత ప్రస్తుతమును, సమర్థనీయమును నగు- చంద్రమండలముయొక్క- నికృష్టతను సమర్థించుటవలన అర్థాంతరన్యాసము అలంకార మగుచున్నది.

ప్రకృతార్థసమర్థనముగల అర్థాంతరన్యాసమునకుఁ గలప్రధానతవలన, తదుపయోగియగు దృష్టాంతము అంగమగుచున్నది. ఇట్లు-అంగమగు దృష్టాంతమునకును, అంగియగు అర్థాంతరన్యాసమునకును గల అంగాంగిభావమున నిది సంకరాలంకారమగుచున్నది.

మూ॥ బిభ్రత్యమర్త్య భువనస్థ దీర్ఘికా
పఙ్కేరుహాణి వదనాయ తే బలిమ్
నోచేత్ కథం భవతి సౌరభం మహద్
భిన్నే సుమేభ్య ఉరుకేశి! తే ముఖే. ౭

పృథులమగు కేశపాశముగల జగజ్జననీ! స్వర్లోకస్థితములగు దీర్ఘికలయందలి పంకేరుహములు నీముఖమునకుపహారమును సమర్పించుచున్నవి. అట్లు సమర్పింపనియెడల పుష్పభిన్నమగు నీముఖమునందు గొప్పదగు సౌరభమెట్లు కలుగును!

ప్రభ:-దీర్ఘిక=వాపి (బొడ్డనబావి). ఉపహారము-బలి. పూజాద్రవ్యము. సౌరభము-సౌగంధ్యము-పరిమళము. “సురలోకవాపీగతములగు పద్మములు- నీముఖమునకు బలిగా తమ్మె యర్పించుకొనుచున్నవి. కావుననే పుష్పముకంటె వేరగు

నీముఖమునకు గొప్ప పరిమళము గలుగుచున్నది.” అని హేతుత్వమును సంభావించుటవలన నిది హేతూత్ప్రేక్షాలంకార మగుచున్నది. వాచ్యము కాకుండుటవలన నీ హేతూత్ప్రేక్ష- గమ్యమని చెప్పఁబడును.

మూ॥ గీర్వాణలోకతటినీ జలేరుహామ్
గన్ధే శుభే భవతు తే మనోరతిః
లోకాధిరాజ్ఞి! తవ వక్త్రసౌరభే
లోకాధిరాజ మనసస్తు సమ్మదః. ౮

ఓ విశ్వేశ్వరీ! దేవలోకనదీజలేరుహములశోభనగంధమున నీమనః ప్రీతియగుఁగాక, నీకాంతుఁడగు విశ్వేశ్వరుని మనస్సమ్మదము మాత్రము నీముఖసౌరభమునందే యగుచున్నది.

ప్రభ:-జలేరుహములు-పద్మములు. సకలమనోహర- సురలోకసుమనస్సౌభాగ్యాతిశాయియు, లోకాధిరాజ మనస్సమ్మోదకమును, అగు అటువంటి ముఖపరిమళము- ఉత్తమ- పద్మినీజాతి సుందరివగు నీకుఁ గలదని భావము.

మూ॥ కో భాషతాం తవ సవిత్రి చారుతాం
యస్యాః స్మితస్య ధవలద్యుతిర్లవః
యస్యాః శరీరరుచిసిన్ధువీచయః
శమ్పాలతాః పృథులదీప్తి భూమయః. ౯

జననీ! ఏ నీ స్మితలవము- ధవలద్యుతియో (చంద్రుఁడో) ఏ-నీ దేహప్రభానదీతరంగములు- విపులదీప్తిభూములగు శంపాలతలో, ఆ నీ చారుత్వమును, ఎవఁడు భాషించును?

ప్రభ:—లవము=లేశము - ధవలద్యుతి=తెల్లని కాంతిగలచంద్రుఁడు. శంపాలతలు=మెరుపుతీఁగలు. భగవతియొక్క స్మితలేశమే చంద్రుఁడు. తరంగిణీభంగోపమ- దేహప్రభయే- విపుల ప్రకాశక దేశములగు విద్యుల్లతలు. అని ఉభయత్ర- స్మిత- చంద్రులకును, దేహ ప్రభా- విద్యుల్లతలకును, తాదాత్మ్యము నిశ్చయింపఁబడుటవలన రూపకములంకారము. భగవతీహాసలేశము- చంద్రరూపమనియు, తద్దేహప్రభలు- విద్యుద్రూపములనియుఁ జెప్పఁబడుటవలన “ఆజగజ్జనని-బ్రహ్మాండశరీర” అనునం

శము వ్యంజితము. ఈయాచార్యునిచే గానముచేయఁబడిన శివశతకమునందుఁగూడ నీయంశమిట్లు చెప్పఁబడినది.

"బిమ్బం మేచకతోయజాతసుహృదో మన్దస్మితం సున్దరమ్."

'దేవిశరీరప్రభయే- మెఱపు - మెరుపే-దేవీశరీరప్రభ.' అనికూడనీగ్రంథమునందే యింకొకచోటఁ జెప్పఁబడినది. ఈ యంశమింద్రాణీ సప్తశతియందుఁగూడ శాన్పించుచున్నది.

మూ॥ లోకామ్బికే! నవిలసన్తి కేపురో
మన్దస్మితస్య తవరోచిషాం నిధేః
యే తు వ్యధాయిషత తేన పృష్ఠతో
హన్తైషు కాఽపి తిమిరచ్ఛటా భవేత్. ౧౦

లోకాంబికా! రోచిస్సులకు నిధియగు (కాంతులకు పుట్టినిల్లగు) నీచిరునవ్వున కెదుటనున్నవారు- ఎవరు ప్రకాశింపరు? ఆచిరునవ్వుచేత అధఃకరింపఁబడినవారియందుమాత్రము- పాపము! ఒకానొక తిమిరచ్ఛట క్రమ్మియుండును!

ప్ర భః:—అధఃకరింపఁబడినవారు=వెనుక నుంచఁబడినవారు. తిమిరచ్ఛట= తమః పరంపర- తెరలుతెరలుగా క్రమ్మినచీకటి.

"సర్వతేజోనిధియగు దేవిస్మితమునకు ముందున్నవారు తేజస్వులగుదురు. అస్మితరేఖ సోకనివారు- అనిర్వచనీయమగు అంధకారపరంపరలో మగ్నులగుదురు" అని భావము. ఇట్లనుటచేత- భగవతీమందస్మితము- నిగ్రహానుగ్రహసంపన్నమను నంశము-సూచింపఁబడుచున్నది.

మూ॥ కిం వారదావలిరుచిర్ముఖస్య కిం
సమ్ఫుల్లతా వరధియః కిమూర్మికా
సన్తోషపాదపసుమం ను శఙ్కర
ప్రేమస్వరూప ముత దేవి! తే స్మితమ్. ౧౧

దేవి! నీ చిరునవ్వు ముఖదంతపంక్తి ప్రభయా? ముఖసంఫుల్లతయా? వర-ధీతరంగమా? సంతోషపాదప-సుమమా? శంకరప్రేమస్వరూపమా?

ప్రభ:—ముఖ- సంఫుల్లతయా=ముఖముయొక్క వికాసిత్వమా? వర- ధీ- తరంగమా?=ప్రశస్తమగు బుద్ధియొక్క వీచికయా? సంతోషపాదప- సుమమా?= సంతోషమను వృక్షముయొక్క పూవా? శంకర- ప్రేమస్వరూపమా=శివునియందు నీకుఁగల ప్రేమకుస్వభావమా? దేవీస్మితమిట్లు వితర్కింపఁబడినది.

"సా దృశ్యమూలము, భాసమానా విరోధకము. సమబలము -నానాకోట్య వగాహిని, ధీరమణీయము అగునది ససందేహాలంకారము." అను పండితరాజలక్షణము ననుసరించి యిది ససందేహాలంకృతియని తెలియునది.

మూ॥ దిక్షు ప్రకాశపటలం వితన్వతా
కోటిప్రభాకర విభక్త తేజసా
నేత్రేణ తే విషమనేత్ర వల్లభే!
పఙ్కేరుహం కఉపమాతి పణ్డితః. ౧౨

ఓవిషమనేత్రివల్లభా! ప్రకాశపటలమును సర్వదిక్కులయందును విస్తరించునదియు, కోటిసంఖ్యాకులగు సూర్యులచేత విభక్తమగు తేజముగలదియు, నగు నీనేత్రముతో పంకేజమును (బురదయందు పుట్టినతామరపూవును) ఏపండితుఁడు సాటిచేయును?

ప్రభ:- విషమనేత్రివల్లభా=త్రినేత్రి కాంతా! సర్వదిగ్వ్యాపియగు ప్రసారము గలదియు, కోటిసూర్యులకు విభజించి యీయఁబడిన స్వతేజోభాగములు గలదియు, నగు నీనేత్రమెక్కడ? బురదయందు పుట్టినకమలమెక్కడ? పండితుఁడెవ్వఁడు తథావిధమగు నీనేత్రముతో పంకజమును సమము చేయును! అనఁగా చేయఁడని యర్థము. "విషమం వర్ణ్యతే యత్రఘటనాఽననురూపయోః" "అనురూపములు కానివానికి సంబంధము వర్ణింపఁబడినయెడల విషమమగును." అను లక్షణమువలన నిది విషమాలంకార మగుచున్నది.

మూ॥ శ్రీకర్ణ ఏష తవలోచనాఞ్చలే
భ్రాన్త్యా దయాదయితయా ప్రబోధితః
ఏతం సవిత్రి! మమకఞ్చనస్తవం
శ్రుత్వాతనోతు భరతావనేః శ్రియమ్॥ ౧౩

సవిత్రి! నీలోచనాంచలమున వెలయుచున్న దయాయను ప్రియు రాలిచేత మేలుకొల్పబడిన యీనీ శ్రీకర్ణము ఈ నా స్తోత్రవిశేషము నాలించి—భరతఖండమునకు సంపద నిచ్చుగాత.

ప్ర ః— సవిత్రి=జననీ! లోచనాంచలమున=కటాక్షమున, కడకంటిచూపు నందు. శ్రీకర్ణము=కర్ణమున- చెవి. నామాఖ్యానముకంటె ముందు- మానార్థమగు శ్రీశబ్దము ప్రయోగింపఁబడినది, శ్రీయుక్తమగుకర్ణము-శ్రీకర్ణమనికూడ విగ్రహ వాక్యమును జెప్పనగును. అట్లయిన శ్రీకర్ణమునకు భరతశ్రీసంధానము యుక్తమే యగును. ఇచట నీయంశము గుర్తింపఁదగినది:—

ఖిలములగు కవికృతులయందును, పద్యములయందును ఈపద్యము కాన్పించు చున్నది. "నేత్రాదపి తే శ్రోత్రం సుమశరశత్రోః పురన్ధ్రి! ముఖ్యంనః! శ్రోత్రే స్తోత్రాద్విముఖే నేత్రం నతగాత్రి! కింయురుతామ్".

పుష్పబాణునకు శత్రువగు శివునికాంతవగు జననీ! నీనేత్రముకంటె నీశ్రోత్రము మాకు ముఖ్యము. ఓ నతగాత్రి! శ్రోత్రము-స్తోత్రవిముఖమగునెడల నేత్రమేమి చేయును? కావుననే కడకంటిచూపునందున్న దయాదయితచేత ప్రబోధితమగు కర్ణము- ఈస్తవము నాలించుఁగాత! అని చెప్పఁబడినది. ఆశ్రోత్రము-శ్రీమయము. కావున వినినంతమాత్రముననే భరతఖండశ్రీవిధానము సుకరమగును.

మూ॥ స్వానాసికాభవతి యుఞ్జతాంసతాం
సంస్తమ్భినీచలతమస్య చక్షుషః
త్వన్నాసికా పురహరస్య చక్షుషః
సంస్తమ్భినీ భవతి చిత్ర మమ్బికే! ౧౮

అంబికా! యోగసాధనము నొనర్చుచున్న సత్పురుషులకు స్వీయమగునాసిక, చంచలతమమగు స్వనేత్రమునకు- సంస్తంభిని (స్థిరతనిచ్చునది) యగుచుండును. నీనాసికమాత్రము- పురహరుఁడగు శివునియొక్క నేత్రమునకు సంస్తంభిని (స్థిరత నిచ్చునది) యగుచున్నది. ఇది యాశ్చర్యముగ నున్నది.

ప్రతిభ:—ముక్కుకొనయందు దృష్టినుంచి ధ్యానించుచున్నయోగికి, తనముక్కు తనదృష్టిని వశీకరించుటకే సమర్థమగుచుండును. నీనాసమాత్రము- ఇంకొకని నయనమును వశీకరించుటకు సమర్థమగుచున్నది. ఇదే చిత్రమనితాత్పర్యము.

హారునిదృష్టి- భగవతీ నాసాగ్రరామణీయక నిమగ్నమని భావము.

"విరుద్ధం భిన్నదేశత్వం కార్యహేతోఽరసఙ్గతిః"

"కార్య- కారణములకు- విరుద్ధమగు భిన్నదేశత్వము- అసంగతి" అనులక్షణముచలన ఇచట కార్యమగు పురహర చక్షుస్సు ... యమనముచకును, దానికి హేతువగు, అంగీకారార్థకమగు భిన్నదేశస్థితివలన (కార్యమొకచోట- కారణమొకచోట- ఉండుటవలన) ఇది అసంగతియను నలంకారమగుచున్నది.

మూ. బిమ్బప్రవాల నవపల్లవాదితః
పీయూషసార భరణాద్ గుణాధికః
గోత్రస్యపుత్రి! శివచిత్తరఞ్జకః
శ్రేష్ఠో నితాన్త మధరాధరోఽపి తే. ౧౫

పార్వతీ! బింబము, ప్రవాళము, నవపల్లవము మొదలగువానికంటె అమృతసారభరణమువలన గుణాధికమై, శివహృదయ రంజకమగు నీ, అధర- అధరముకూడ మిక్కిలి శ్రేష్ఠమగుచున్నది.

ప్ర భ:—బింబము=ఎఱ్ఱని దొండపండు. ప్రవాళము. ఎఱ్ఱని రత్నవిశేషము పగడము) నవపల్లవము=ఎఱ్ఱని క్రొంజివురాకు. అమృతసారభరణమువలన=అమృతరసమును భరించుటవలన. అధరాధరము=కెమ్మోవి (క్రిందిపెదవి) లేక మిక్కిలి నీచము. నీకెమ్మోవి- అమృతధరము. కావున అరుణ, బింబ, ప్రవాళ- నవకిసలయములకంటె నధికమగు గుణముగలది. కావుననే శ్రేష్ఠమని భావము. అధర + అధరమైనను=మిక్కిలి నీచమయినను, శ్రేష్ఠము=ఉత్తమము అనువిరోధమున్నది. ఆకెమ్మోవి శివచిత్తరంజకమగుటవలన మీఁదివిరోధము పరిహరింపఁబడుచున్నది కావున నిది విరోధాభాస మగుచున్నది.

ఇందు- ఉపమానములగు బింబాదులకును- ఉపమేయమగు కెమ్మోవికిని- రక్తిమయందును, మార్దవము మొదలగువానియందును సాధర్మ్యమున్నను, ఉపమేయమగు కెమ్మోవియందు అమృతరసభరణరూపమగు విశేషముండుటవలన వ్యతిరేకమలంకారమగుచున్నది. ఇట్లు వ్యతిరేక విరోధాభాసములకుఁగల అంగాంగిభావమువలన నిది సంకరమగుచున్నది.

మూ. దోర్వల్లికే జనని! తే తటిత్ప్రభా
మన్దారమాల్య మృదుతాపహారికే
సంశ్లేషబన్ధదమనన్య ధూర్జటే
ర్బన్ధాయ భద్రచరితే బభూవతుః. ౧౬

జననీ! భద్రచరిత్రా! విద్యుత్ప్రభయొక్కయు, మందార మాల్యముయొక్కయు, మృదులతో నవహరించునవియగు నీబాహులతికలు నిశ్శేషబంధదమనుఁడగు (బంధమునంతను తెంపుకొనినవాఁడగు). ధూర్జటిని బంధించివైచినవి.

ప్ర థ:—విద్యుత్ ప్రభ=మెఱుపుయొక్క కాంతి. మందారమాల్యము=సురలోకమందలి మందారపుష్పము. బాహులతికలు=బాహువులను తీగలు. నిశ్శేషబంధదమనుఁడు=సమస్తబంధములను తొలఁగించువాఁడు. ధూర్జటి=శివుఁడు. మెఱుఁపు మెఱుఁగుకంటెను, మందారపుష్పముకంటెను మిక్కిలి మెత్తనిదగు నీభుజలతికలు—సర్వబంధనివారకుఁడయినను హరునకు బంధమును ఘటించినను విరోధము—అబంధము ప్రేమకృతమగుటవలన పరిహరింపఁబడుచున్నది. (ఆభాసమగుచున్నది) కావున నిది విరోధాభాసమను నలంకార మగుచున్నది.

మూ॥ హస్తాబ్జయో స్తవ మృదుత్వమనుద్భుతం
గృహ్ణాతి యే సదయమేవ ధూర్జటిః।
అత్యద్భుతం జనని! దార్ఢ్యమేతయోః
శుమ్భాది దర్పవిలయాయ యోరభూత్. ౧౭

అమ్మా! హరుఁడు వేనిని దయతో గ్రహించుచున్నాఁడో ఆనీహస్తాబ్జముల మృదుత్వము—అద్భుతమగుచున్నది. అయినను వీనిదృఢత్వము— అత్యద్భుతమగుచున్నది. ఇవియే (హస్తాబ్జములే) శుంభాదులగు నసురుల దర్పమును నశింపఁజేసినవి.

ప్ర థ:—మృదులములగు పాణులు— దృఢములగుట విరుద్ధము. మీఁదివిరోధము— ఆహస్తములకుఁగల స్వాభావికమగు ప్రభావముచేత పరిహరింపఁబడుచున్నది. కావున నిదియు విరోధాభాసమేయని గ్రహించునది.

మూ॥ రాజన్తు తే కుచసుధాప్రపాయినో
లోకస్య మాత రనఘాః సహస్రశః।
ఏ తేషు కశ్చన గజాననః కృతీ
గాయన్తియం సకలదాయి సత్కరమ్. ౧౮

జగన్మాతా! నీయొక్క స్తన్యసుధాప్రవాహములును, పవిత్రులును అగుపుత్రులు వేలకొలందియు లోకమునందుండవచ్చును. వీరి యందొకఁడగు గజాననుఁడు కృతియగుచున్నాఁడు. విద్వాంసు లితనిని సకలమునుగూడ దానముచేయు స్వభావముగల శోభనమగు హస్తము (తొండము) గలవాఁడని గానముచేయుదురు.

ప్రతి భ:—స్తన్యసుధాప్రవాహములు=తల్లి చనుబాలు ప్రవాహములు. కృతి=సుకృతి. విద్వాంసుఁడు. గజాననుఁడు=గజముఖుఁడు—గణపతి. గజాననునిహస్తము (తొండము)నందే—సర్వదాన సమర్థత యున్నది. కావున నాగజముఖుఁడే—ధన్యతముఁడని భావము. మూలమున 'సకలధాయి సత్కరమ్' అను పాఠముగూడఁ గలదు. అపుడు సకలముధరించు స్వభావముగల హస్తముగలవాఁడనునర్థము నెలుఁగునది. నీకుచసుధా ప్రభావ మట్టిదని భావము.

మూ॥ త్వన్నాభికూపపతితాం గృశం ప్రభో
　　ర్నేతుం వినిర్మలగుణే పునస్తటమ్।
　　సౌమ్యత్వదీయ హృదయపరిసారితః
　　పాశః సవిత్రి! తవ రోమరాజికా. ౧౯

విశిష్టమగు పవిత్రగుణములుగల సవిత్రీ! నీరోమరాజిక (లోమరేఖ) నీనాభికూపమున—పతితమయిన ప్రభువగు హరుని యొక్క దృష్టిని—తిరుగ తటమునకుఁ జేర్చుటకు, సౌమ్యమగు నీహృదయముచేత ప్రసారితమయిన పాశము.

ప్ర భ:—రోమరాజియే రోమరాజిక. నాభికిమీఁద హృదయమువఱకునుగల లోమరేఖయే యిచట రోమరాజికఅని చెప్పఁబడినది. కూపము=నూయి. తటము—తీరము (ఒడ్డు) పాశము=త్రాడు. నీహృదయము—నీనాభియందాసక్తమయిన హరుని దృష్టిని తనకుసమ్ముఖముగునట్లాకర్షించెనను భావమును చమత్కరించుటకు, నాభియందుకూపమును, వక్షోజమధ్యమగు హృదయమునందు తటమును రోమరాజియందు పాశమును, తాదాత్మ్యముచేత సంభావించుచున్నాఁడు. నాభియనుకూపము—హృదయమనుతటము, రోమరాజియను పాశము అని తాదాత్మ్యమాత్రమునం బొచిత్యమగు నెడల రూపకప్రతిపత్తి (రూపకజ్ఞానము) మన్నివానమే యగును. (రూపక

మను తెలివిని వారించుట కష్టసాధ్యమగును) 'నాభి' మున్నగువానికి కూపాదుల తాదాత్మ్యమును సంభావించుటయం దౌచిత్యమునంగీకరించి-ఆరూపక ముత్ప్రేక్ష యందు పర్యవసించునని చెప్పనగును. 'చిత్రమీమాంస' అనునలంకార శాస్త్రమున అప్పయ్యదీక్షితులవారు "ఔచిత్యమువలన ఉపమాలంకారము— ఉత్ప్రేక్షయందు పర్యవసించును" అనిచెప్పి రూపకప్రతీతిస్థలమునందుఁగూడ తాదాత్మ్యసంభావన మూచితమగునపు డిట్టే దానికి ఉత్ప్రేక్షయందు పర్యవసానము- అవగంతవ్యమను టకు క్రిందియుదాహరణము నిచ్చియున్నారు.

శ్లో. రక్షన్తుత్వామసితజలజై రఞ్జలిర్గ పాదమూలే
మీనా నాభీసరసి హృదయే కౌస్తుభాఖ్యా మురారేః
హారాః కణ్ఠే హరిమణిమయా వక్త్రపద్మే ద్విరేఫాః
పిఞ్ఛచూడాశ్చికురనికరే ఘోషయోషిత్ కటాక్షాః.

కృష్ణుని పాదమూలమున- నల్లకలువపూవుల యంజలియు, నాభీసరస్సున మీనములును, హృదయమున- కౌస్తుభమును, కంఠమున- ఇంద్రనీలమణిమయహార ములును, ముఖపద్మమున- తుమ్మెదలును చికురనికరమున- నెమరిపురిసిగలును అగు గోపస్త్రీ కటాక్షములు నిన్ను రక్షించునుగాత. ఇందు- గోపస్త్రీ కటాక్షములకు నీలోత్పలాంజల్యాది తాదాత్మ్యసంభావన ముచితమగుటవలన రూపకమిచట నుత్ప్రేక్షయందు పర్యవసానము నొందినది. మూలశ్లోకమున ఇవాదివాచకము ప్రయోగింపఁబడకుండుటవలన నీయుత్ప్రేక్ష గమ్యమైనను మిక్కిలిస్పష్టమై వాచ్యాయమాన మగుటవలన అలంకారధ్వని కాక అలంకారమే యగుచున్నదని గ్రహించునది.

మూ॥ త్వన్మధ్యమో గగనలోక ఏవచేత్
త్వద్దివ్య వైభవవిదో న విస్మయః
ప్రాజ్ఞైర్హి సున్దరి! పురత్రయ ద్విషః
త్వం దేహినీ త్రిభువనేన గీయసే.
౨౦

పురత్రయశత్రువగు హరునిసుందరివగు భగవతీ! నీవుముల్లోకము లును దేహముగాఁగలదానవని ప్రాజ్ఞులు గానముచేయుచుందురు. కావు వనే నీదివ్యవైభవము నెఱిఁగిన పండితునకు "నీనడుము అంతరిక్షమే" అగునెడల (ఈవిషయమున ఆశ్చర్యము కలుగనేరదు.

ప్ర భ:—ఉత్తమ కాంతల నడుము— ఆకాశమనునది కవిసమయము. అవాద మిచట చమత్కృతిజనక మగుచున్నది. "నీకు త్రిభువనమే శరీరము. అందు మధ్యమ లోకమగు నంతరిక్షము— నీనడుము" అనునంశము— నీమహాప్రభావము నెఱింగిన వానికి విస్మయమును గలిగింపదని భావము.

ఇచట— మధ్యమము— గగనలోకము ని యుపన్యసించుట దుష్కరవిషయము కావున సమర్థనము నపేక్షించును. అనడుము న త్రిభువనేన దేహినీ (ముల్లోకములును దేహముగాఁ గలదానవు) అని ముల్లోకములకును నడుముగాగల అంతరిక్ష లోకము గా వ్యవహరించి సమర్థించుటవలననిది వాక్యార్థహేతుక మగు కావ్యలింగాలంకార మగుచున్నది. "హేతోర్వాక్య పదార్థత్వే కావ్యలిఙ్గం నిగద్యతే" అనునది దాని లక్షణము

మూ॥ నాభిహ్రదాద్ విగలితః కటిశిలా
భఙ్గాత్ పునః పతతికిం ద్విధాకృతః।
కాన్త్యోరుయుగ్మమిషతః సవిత్రి! తే
భా వారిపూర ఇభశుణ్డయోః సమః. ౨౦

జననీ! నాభియే యగు తటాకమునుండి బయలు వెడలి, కటియే యగు శిలయందగు భంగమువలన తిరుగ ద్వివిధముగా ఖండింపఁబడిన. నీకాంతిప్రవాహము— గజతుండములకు సదృశమగుచు, కమనీయమగు ఊరుయుగళమను మిషచేత ప్రసరించుచున్నదా?

ప్ర భ:—మీదిప్రశ్నము సంభావనార్థకము. నాభి—హ్రదములకును, కటీ—శిలలకునుగల తాద్రూప్యమువలన రూపక మలంకార మగుచున్నను తాదాత్మ్యసంభావనయందలి యౌచిత్యమువలన ఉత్ప్రేక్షయందు పర్యవసించును. అది 'ఊరుయుగళమను మిషచేత' అను, అపహ్నవము (కప్పిపుచ్చుట) వలన, సాపహ్నవ—స్వరూపోత్ప్రేక్ష యగును. ఇవాదివాచకము లేకుండుటవలన, ఈయుత్ప్రేక్ష—గమ్యమగును.

మూ॥ జఙ్ఘాయుగం తవ మహేశనాయికే!
లావణ్యసిన్ధురి జగద్ విధాయికే
అన్తః పరిస్ఫురదగుప్తసుప్రభా
బాణాఢ్యతూణయుగలం రతీశితుః ౨౧

జగద్విధాయికా! మహేశనాయికా! నీవు లావణ్యనిర్ఝరివి! నీజంఘాయుగలము- లోపల పరిస్ఫురింపుచు, అగుప్తములగు (దాచఁబడనివగు) సుకాంతి బాణముల చేత సంపన్నమగు రతీశ్వరుని తూణయుగలము- (అమ్ములపొదుల జంట),

ప్ర భ:—లావణ్యనిర్ఝరివి=రామణీక ప్రవాహముగలదానవు. జంఘాయుగలము=కాలి వెనుకటిభాగములు (పెండెకిక్కలు) అగుప్తములు=దాచఁబడనివి, సుకాంతి-బాణములు=శోభనములగు కాంతులను బాణములు. ఇచటి యలంకారము కూడ గమ్యోత్ప్రేక్షయే. "నీజంఘలు-మన్మథుని అమ్ములపొదులవలెనున్నవి" అని భావము.

మూ॥ పుష్పాస్త్రశాసననిశాన్తరాజ్ఞి! తే
లోకత్రయస్ఖలకమ్పనం బలమ్
శ్రోణీభరేణ గమనే కిలశ్రమం
ప్రాప్నోషి కేన తవ తత్త్వముచ్యతామ్. ౨౩

పుష్పాస్త్రుఁడగు మన్మథుని శాసించిన శివుని గృహమునకు రాజ్ఞివగు జననీ! నీబలము- ముల్లోకములయందునుగల దుర్జనులను కంపింపఁజేయునది. అయినను నీవు నడచునపుడు నీశ్రోణీభరముచేత నగుశ్రమము నొందుచుందువట! దీనికి హేతువగు తత్త్వమును చెప్పుము.

ప్ర భ:—"నీబలము- త్రిలోక దౌర్జన్య దమనమైయున్నను, అల్పమగు శ్రోణీభారమునకు నీకు శ్రమము కలుగుచున్నది. ఇందలి రహస్యమేమి?" అని భావము. "విభావనా వినాఽపిస్యాత్ కారణం కార్యజన్మచేత్" కారణము లేకున్నను గూడ కార్యముదయించు నెడల నది విభావనయగును. అను లక్షణమువలన, ఇచట- శ్రమ గలిగించు కారణము లేకున్నను శ్రమమను కార్యము కలుగుటవలన విభావన- అలంకారమగుచున్నది.

మూ॥ యత్రైవ నిత్యవిహృతే రభూద్ రమా
రాజీవ మన్దిర చరితి నామతః।
తన్మే సదా భణతు మఙ్గలం శివా
పాదామ్బుజమ్భవ మమేయ వైభవమ్. ౨౪

ఏ యుమాపాదపద్మమునందు- నిత్యమును విహరించుటవలన రమ- నామముచేత రాజీవమందిరవిహారిణి యయ్యెనో ఆమేయవైభవ మగు ఆయుమాపద్మము-నాకు మంగళమును తెలుపుఁగాత (ఘటించుఁగాత!)

ప్ర భ:— రాజీవమందిరవిహారిణి=పద్మమును భవనముగాను విహరించునది. అమేయవైభవము=ఊహింపనలవికాని (ప్రమాణరహితమైన) ఐశ్వర్యముగా విభూతిగలది. లక్ష్మీదేవి-- పద్మాలయ యనుటకు హేతువు- ఉమాపాదపద్మమునందుండుటయే అని యిచట వ్యంగ్యముగా సంసూచితము.

మూ॥ కేశాదిపాదకమలాన్తగాయినీః
కస్తుప్రశాసననిశాన్తనాయికా।
అస్తీర కరోతు లలితా ఇమాః కృతీ
గౌరీ కవేశ్చరణకఞ్జసేవినః॥ ౨౫

మహేశ్వరపట్టమహిషియగు గౌరి- నీ కేశములనుండి ప్రారంభింపఁబడి పాదకమలములవఱకును స్తుతించునవియు, లలితములును (లలితావృత్తముచే బంధింపఁబడినవియు) చరణకమలసేవియగు కవినగు నాచే రచింపఁబడినవియు. నగు ఈకృతులను స్వీకరించుఁగాత!

ప్ర భ:— లలితములు = సౌందర్యముగలవి లేక లలితయను పేరుగల వృత్తములు.

ఇది సవ్యాఖ్యమగు ఉమాసహస్ర తృతీయశతకమందలి ద్వితీయస్తబకము.

శ్రీ శ్రీ శ్రీ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

ఉమా సహస్రము

(తృతీయ శతకము)

ఏకాదశ స్తబకము

అవ:- ఈపదునొకండవ స్తబకమున_ వెనుకటిస్తబకమునందు వలెఁగాక, పాదాది కేశాంతముగుస్తుతి కావింపఁబడుచున్నది. ఇచటఁగూడ యథాపూర్వకముగా, ప్రథమశ్లోకము- హాసస్తుతి పరమగుచున్నది.

మూ. ఝషకేతునా ప్రయుక్తః, సమ్మోహనచూర్ణముష్టిరీశానే
దరహాసోధరమహితుః కరోతుభువనంవశేఽస్మాకమ్. ౧

పార్వతీదరహాసము- మీనధ్వజుఁ డీశ్వరునియందు ప్రయోగించిన సమ్మోహన చూర్ణముష్టి. ఆదరహాసము- మామనుష్యలోకమును మావశమునం దుంచుఁగాత!

ప్ర భ:—మీనధ్వజుఁడు = ఝషకేతుఁడు-మన్మథుఁడు. సమ్మోహనచూర్ణముష్టి=సమ్మోహింపఁజేయు చూర్ణసంగ్రహము. ఈశ్వరుని తనయధీనమున నిలుపుకొనుటకు మదనునిచేత ప్రయోగింపఁబడిన సమ్మోహన చూర్ణముష్టియగు పార్వతీమందహాసము_ ఇతరులగు వసువులచేత ఆక్రమింపఁబడిన మాలోకమును మాయధీనమునం దుంచుటకు మిక్కిలి సమర్థమని భావము.

ఇచట-దరహాసము-సమ్మోహన చూర్ణముష్టియని సంభావింపఁబడుటవలన నిది గమ్యోత్ప్రేక్షయగును.

మూ. ఉపజీవద్భిః కాన్తే ర్లేశాంస్తే జగతి సున్దరైర్భావైః ।
ఉపమితుమఙ్గానితవప్రియో లజ్జేఽమ్బ! యతమానః. ౨

అమ్మా! ఈలోకమున నీయొక్క కాంతిలేశముల నాశ్రయించి జీవించుచున్న సుందరములగు పదార్థములతో, నీయంగములనుపమించుటకు ప్రయత్నము గలవాఁడనయినను నేను మిక్కిలిలజ్జించుచున్నాఁడను

ప్ర భ:—లోకమునందలి కవులు- ముఖాదులయందు- ఆహ్లాదకత్వాది ధర్మములను స్ఫురింపఁజేయుటకు, ముఖాదులకంటె వేరయి. స్వతఃసిద్ధమగుచున్న చంద్రాదులతో వానికి ఔపమ్యమును జెప్పుదురు. ప్రస్తుతమగు నీయంగసౌందర్యవర్ణనమునందు మాత్రము- ఈలోకమునందలి సుందరవస్తువులన్నియు- నీయొక్క- కాంతివలననే ఉనికిఁగలిగి వేఱొక కాంతి లేనివగుటవలన స్వతస్సిద్ధములు కానివగుచున్నవి. విషయియగు ఉపమానమును- విషయమగు ఉపమేయమునుగూడ- వేఱయియుండునప్పుడే గదా వానికి సాధర్మ్యమును వర్ణించుటవలన ఉపమ యేర్పడును! కావుననే అసంభవమగు నీయంగసౌందర్యోపమానకథనకర్మయందు ప్రవర్తించిన నాకు సిగ్గుకలుగుచున్నది. అయినను ప్రయత్నమును విడుచుటలేదు. కావుననే అపుడపుడు లజ్జించుచున్నాను. అని భావము. "నీకాంతికంటె భిన్నమగు కాంతి లేకుండుటవలన నీకుపమానము గలుగదు." అను నీయర్థము- ద్వితీయసదృశవ్యవచ్ఛేదఫలకవర్ణన విషయీభూతము. కావున నిది- అనన్వయాలంకార ధ్వనియగును. "నీకాంతితో పోల్పఁదగిన రెండవ వస్తువు లేదు." అనుటవలన- అన్వయము కుదురుటలేదు. కావున అన్వయములేని యీయలంకారమునకు అనన్వయమని పేరుకలిగినది.

మూ॥ అవతంసపల్లవతులాం బిభ్రాణం శ్రుతినతభ్రువః శిరసి
చరణం వ్రజామి శరణం వామం కామారి లలనాయాః. 3

శ్రుతిసుందరీ! శీర్షమునందు (వేదాంతమునందు) అవతంసపల్లవ సామ్యమును భరియించుచున్న హరసుందరియొక్క వామ-చరణమును శరణముగా భజించెదను.

ప్ర భ:—వేదాంతము - ఉపనిషత్తులు. అవతంసపల్లవసామ్యమును=అలంకారము కొఱకగు కిసలయముతోడి సమానత్వమును. వామచరణము=సుందరమగు పాదము. ఎడమపాదము. దేవి శివుని వామార్థముగావున వామచరణము వర్ణింపఁబడినది. కిసలయోపమమగు దేవీపదము- వేదశిరస్సునందగు భూషణమగుచున్నది.

"సర్వే వేదాయత్ పద మామనన్తి"

అని కఠశ్రుతియందుగ్గడింపఁ బడినదిగదా! ఇట్లు శ్రుతిశిరోభూషణమగు దేవీచరణమే నాకు శరణమని భావము.

మూ॥ శఙ్కరనయనోన్మాదన- మతిమధురం భాతిమతిమతా వర్ణ్యే
జఙ్ఘాయుగం భవత్యాః కుసుమపృషత్కస్య సర్వస్వమ్. ౪

బుద్ధిమంతునిచేత స్తుతింపఁదగినజననీ! శివనయనసమ్మోహనమును, అభ్యంతరమణీయమును అగు నీజంఘాయుగము— పుష్పబాణునకు సర్వస్వమై సాధనమై రాజిల్లుచున్నది.

ప్ర ధ:—జంఘాయుగము=ప్రపదద్వయము - పిక్కలజంట. ఇచట పార్వతీజంఘాయుగము మన్మథునకు సర్వస్వముగా సంభావింప బడినది.

మూ॥ ఏకైకాలోకే నేద్యోరనయోరన్యోన్యస్మరణ హేతుతామేతి
దేవి! భవదూరుః తుండశ్చ గజేంద్రాననస్య. ౭

మహేశమహిషీ! నీయూరువును, గణపతితొండమును, ఇవి రెండును గూడ, ఏకైకదర్శనమున పరస్పరమును స్మరణమునకు హేతువులగుచున్నవి.

ప్ర ధ:—ఊరువు- తొండము అను నీరెండింటిలోను ఊరువును జూచునపుడు తొండముయొక్క స్మృతి కలుగుచున్నది. అట్లే తొండమును జూచునపుడు ఊరువుయొక్క స్మృతి కలుగుచున్నది. ఇట్లే రెండునుగూడ- అన్యోన్యస్మారకము లగుచున్నవని భావము.

“సదృశానుభవాద్ వస్తుస్మృతిః స్మరణముచ్యతే”

అను సాహిత్యదర్పణ లక్షణమువలన నిచటియలంకారము స్మరణమని తెలియునది.

మూ॥ నాకోఽవలగ్నమీశ్వరి! కటిరవనిర్భోగినాం జగన్నాభిః
కుక్షావ కేవలం తే బహిరపివపుషిత్రయోఽలోకాః. ౮

ఈశ్వరీ! నీకు నాకము— నడుము. భూమి- కటి. పాతాళము- నాభి. ఇట్లు ముల్లోకములును నీకుక్షియందుమాత్రమేగాక వెలుపలి శరీరమునందుఁగూడ నున్నవి.

ప్ర ధ:—నాకము=స్వర్గలోకము. కటి=శ్రోణి. భోగిలోకము=పాతాళము. నీకుక్షియందు స్వర్గ- భూమి- పాతాళము లున్నవి. అవి కేవలము నీకుక్షియందే కాక బహిశ్శరీరమునందుఁగూడ, అవలగ్న- కటి- నాభిరూపములై యున్నవని భావము.

మూ॥ మన్యే మహాకృపాణం తవ వేణీమచలపుత్రి! మదనస్య
అసిధేనుకాం విశఙ్కే నిశితాగ్రాంతరోమాలిమ్. ౭

అచలపుత్రివగు పార్వతీ! నీ వేణిని (జడను) మదనునికి మహాకృపాణముగా తలంచెదను. రోమాళి మాత్రము — మిక్కిలి వాడియగు నట్లు సానరాతియందు పదును వేయబడిన, అసిపుత్రికనుగా (చిన్నకత్తినిగా) విశంకించుచున్నాను.

ప్ర భ:— మహాకృపాణము — గొప్పఖడ్గము. రోమాళి = నూగారు. [illegible] స్వహాపోత్ప్రేక్ష [illegible] యున్నది.

మూ॥ ద్విరదవదనేన పీతం షణ్ముఖవదనేనాథ సకలభువనేన
అక్షయ్యక్షీరామృతమమ్బాయాః కుచయుగం జయతి. ౮

ద్విరద — వదనునిచేతను, షట్ — వదనునిచేతను, తరువాత సకల లోకవదనముల చేతనుగూడ క్రోలఁబడినను, అక్షయ్యమగు క్షీరామృతముగలదియగు అమ్మ స్తనయుగము — జయించుచున్నది.

ప్ర భ:— ద్విరదము = రెండు దంతములుగల యేనుఁగు. ద్విరదవదనుఁడన గజముఖుఁడగు గణపతి. షట్‌వదనుఁడు — ఆరుముఖములు గలవాఁడు — సుబ్రహ్మణ్యుఁడు. అక్షయ్యము = క్షీణింపఁజేయుటకు శక్యము కానిది.

మూ॥ జగదమ్బ లమ్బమానా పార్శ్వద్వితయే తవాగలాద్భాతి
సాద్ధ్రిగ్రథితమనోజ్ఞప్రసూనమాలేవ భుజయుగలీ. ౯

ఓజగదంబా! నీభుజయుగళి — గళమునుండి మొదలుకొని యుభయపార్శ్వములయందును వ్రేలాడుచున్నదై. దట్టముగాఁ గూర్పఁబడిన మనోజ్ఞమగు ప్రసూనమాలవలె భాసిల్లుచున్నది.

ప్ర భ:— భుజయుగళి = బాహుద్వయము. ప్రసూనమాల = పూలదండ. కంఠము నుండి ఉభయపార్శ్వములను పొందిన బాహుయుగళి పుష్పమాలవలె నున్నట్లు సంభావించుటచేత ఉత్ప్రేక్ష అలంకారమగుచున్నది.

పుష్పమాల — [illegible] [illegible], [illegible] మృదులమైనను దృఢమైన [illegible] [illegible] గమ్యము.

మూ॥ జానన్తి శక్తిమసురాః, సుషమాంసఖ్యోవదాన్యతామృషయః
మృదుతాం తవామ్బ! పాణేర్వేదస దేవః పురాంభేత్తా. ౧౦

అమ్మా! అసురులు నీశక్తిని తెలిసికొనుచుందురు. సఖులు నీసుషమను (గొప్పశోభను) తెలిసికొనుచుందురు. ఋషులు వదాన్యతను గ్రహించుచుందురు. పురవైరియగు ఆశివుఁడు నీపాణిమృదులత నెఱుఁగును.

ప్రి భ:—(అసురులు-శక్తియుక్తవనియు, సఖులు - సుషమామయివనియు, ఋషులు, వదాన్యవనియు, శివుఁడు, మృదులపాణివనియునిన్ను గుర్తింతురని భావము.)

మూ॥ కమ్బుసదృగమ్బ! జగతాం మణివేషోడునక్షత్రాకల్పః
కణ్ఠోఽనఘస్వరస్తే ధూర్జటిదోర్నయనకర్ణహితః. ౧౧

ఓ జగదంబా! నీకంఠము- కంబుసదృశము, అలంకారార్థమగు మణియను వేషము (రూపము)తో నున్న నక్షత్రమాలచేత విరచితమగు భూషణముగలది. నిర్దుష్టమగు స్వరముగలది. (కావుననే) ధూర్జటియొక్క బాహువులకును, దృష్టికిని, కర్ణమునకును హితమయినది.

ప్రి భ:—కంబుసదృశము=శంఖముతో సాటియగునది. మణి...భూషణము గలది=రత్నములను మిషతో నున్న నక్షత్రములే మాలగాగలది. ఆలింగన సుఖకరమగుటవలన కంఠముయొక్క శంఖసాదృశ్యము-శివుని బాహువులకును, నయనసుభగమగుటవలన, నక్షత్రమాలారచన, శివునిదృష్టులకును, శ్రుతిసుఖకరమగుటవలన నిర్దుష్టమగు తద్ధ్వని శివుని శ్రవణములకును హితమగునని భావము.

'యథాసఙ్ఖ్యం క్రమేణైవ క్రమికాణాం సమన్వయః'
అను లక్షణమువలన నిది యథాసంఖ్యమను నలంకారమగుచున్నది.

మూ॥ హరకాన్తే! వదనం తే దర్శం దర్శం వతంస శీతాంశుః
పూర్ణోఽప్యవాప కృశతాం ప్రాయేణాసూయయా శుష్కః. ౧౨

హరసుందరీ! శివశిరోభూషణ-చంద్రుఁడు నీయాననమునుచూచి చూచి, పూర్ణుడయినను, ప్రియశః, నీముఖప్రభను సహింపలేకుండుటవలనఁ గలిగిన అసూయచేత నీరసుఁడై కృశత్వము నొందెను.

ప్ర భ:—శివుని శిరస్సునందున్న అర్ధచంద్రుఁడు– అర్ధచంద్రుఁడగుటకు హేతువు– "పార్వతీముఖ దర్శనజాతమగు అసూయయే" అని సంభావింపఁబడినది. కావున నిది ఉత్ప్రేక్షయగుచున్నది.

మూ॥ చన్ద్రం రణాయ సకలాచపలాక్షి వదనజాతి రాహ్వాయతాం
తం తు మహసా ముఖం తే మహేశకాన్తే! జిగాయైకమ్. ౧౩

మహేశ్వరకాంతా! చపలాక్షులగు సుందరుల ముఖజాతియంతయును గూడ చంద్రుని యుద్ధమున కాహ్వానించుగాక! (సకలస్త్రీవదనములచేతను గూడ నెదుర్కొనఁబడినను గూడ జయింపఁబడని) ఆచంద్రుని మాత్రము నీముఖ మొక్కటియే– కాంతిచేత జయించినది. "నీముఖమునందలి మహస్సు– అటువంటి సర్వశోభాతిశాయి" అని భావము.

మూ॥ వదనకమలం తవేశ్వరి! కమలజయాద్దర్పితం సుధాభానుమ్
నిర్జిత్య కమలజాతే రమలం మహదాజహార యశః. ౧౪

ఈశ్వరీ! నీవదనకమలము– కమలజయమువలన గర్వించిన అమృతాంశు నిజయించి, కమలజాతికి మిగుల శుభ్రమగు యశమును సంపాదించెను.

ప్ర భ:—కమలములను జయించుటచేత దర్పించిన చంద్రుని దమించుటవలన మహేశ్వరకాంతాముఖము– కమలజాతికే యశస్సు ఘటించెను. కావుననే కమలమునకు ముఖముతోడి యుపమ ప్రఖ్యాతమయినది. ఇట్లు కమలజాతికి, ముఖోపమానతారూపమగు యశస్సు సంపాదింపఁబడినదని కమలమునకు ముఖోపమానతాలాభహేతువును సంభావించుటవలన నిది గమ్యమగు ఉత్ప్రేక్ష యగుచున్నది.

మూ॥ లావణ్యమరన్దాశాభ్రమద్భవాలోకబమ్భరం పరితః
ముగ్ధం ముఖారవిన్దం జయతి నగాధీశనన్దిన్యాః. ౧౫

అంతటనుగల లావణ్యమను మరందమునందలి యాశచేత (అధికమగు నపేక్షచేత) భ్రమించుచున్న శివదృష్టులను భ్రమరములుగలదియు– ముగ్ధమును, అగు నగాధీశనందినియొక్క ముఖారవిందము జయించుచుండును. (ఉత్కర్షచే వెలయుచున్నది).

ప్ర భః— లావణ్యము=సౌందర్యము, మరందము=తేనె. భ్రమరములు=తుమ్మెదలు. నగాధీశనందిని=పార్వతి. ముగ్ధము=సుందరము. ఇచట–లావణ్య–మరందములకును భవాలోక–భ్రమరములకును, ముఖ–అరవిందములకునుగూడ తాద్రూప్యము చేయుట రంజనమువలన రూపకాలంకారమగుచున్నది. 'సర్వేశ్వరదృష్టి–భగవతీవదనామృతగ్రహణలాలస.' అని భావము.

మూ. శుద్ధేనసారనిర్మిత, మూర్ధ్వార్ధం తే భవాని భాలమయమ్
సకల రమణీయసారైర్నిర్మిత మర్ధాన్తరం విధినా. ౧౬

భవానీ! భాలమయమగు నీముఖమునందలి మీఁదియర్ధభాగమును విధాత, శుద్ధమగు చంద్రునిసారమగు నమృతముచేత నిర్మించెను. క్రిందియర్ధభాగమును సకల రమణీయవస్తువులయొక్కయు సారములచేత నిర్మించెను.

ప్ర భః— భాలమయము=ఫాలమయము. విశాలమగు నుదుటితోఁగూడినది. విధాత=బ్రహ్మ. సారములచేత=స్థిరములగు నంశములచేత. నీముఖమునందలి మీఁది భాగము– ప్రభామయమగు అమృతఖండము. క్రిందిభాగము–ఘనమగు సకలసౌందర్యఖండము. అని భావము. సర్వజీవన–ధారణ– సకలభోగసాధన బలవిధానము– నీముఖము అని భావము.

మూ. వదనం తవాద్రిదుహిత ర్విజితాయ నతాయ శీతకిరణాయ
ద్వారపపదవీం ప్రదదావయమిహ దరహాసనామధరః. ౧౭

పార్వతీ! నీముఖము–శీతల ప్రభాదులచేతవిజితుఁడును, కావుననే నతుఁడును [నమ్రీభావము నొందినవాఁడును] అగు శీతకిరణునికి ద్వారపాలపదవినిచ్చెను. ఇతఁడు [ఈచంద్రుఁడే] ఇచ్చట (నీముఖమునందు) దరహాసమను నామమును ధరించుచున్నాఁడు.

ప్ర భః— విజితుఁడు=పరాజితుఁడు– ఓడింపఁబడినవాఁడు భవన్ముఖవిజితుఁడగు చంద్రుఁడు ద్వారపాలకుఁడై నీముఖమున మందహాసమను నామమున స్థాపింపఁబడియెనని భావము. కవిప్రౌఢోక్తి సిద్ధమును సహేతుకమును, అసిద్ధవిషయమును అగు స్వరూపోత్ప్రేక్ష– అలంకారము.

మూ. తే తేనదన్త సన్తో నయనం, తాటఙ్కమాలయం ముకుటమ్
కనమో నయాంగ ధామః సితమహాసం దేవి తే హాసమ్. ౧౮

దేవీ! సజ్జనులగు ఆయా పురాణకవులు, శుభ్రమగు కాంతిగల చంద్రుని నీకు, నయనముగను, తాటంకముగను, ఆవాసముగను, కిరీటముగను చెప్పిరి. మేము మాత్రము- ఆచంద్రుని- హాసమని చెప్పుదుము.

ప్ర భ:— తాటంకము=కర్ణభూషణము. త్రినేత్రునికి వామనేత్రముగ చంద్రుడు లోచనముగా నయ్యెను. కావున దేవికి చంద్రుడు నయనమగుననుట పురాణ ప్రసిద్ధము.

'తాటంక యుగళీభూత తపనోడుపమణ్డలా'

దేవి సూర్య- చంద్రమండలములు కర్ణభూషణములుగాఁగలది. అని లలితా సహస్ర నామావళియందున్నది. కావునఁ గొందఱు చంద్రుని దేవికి తాటంకమని చెప్పిరి. అంతే "చన్ద్రమణ్డలమధ్యగా" "చంద్రమండల మధ్యమునందుండునది" అని చెప్పఁబడుటవలన దేవి నివసించు స్థలముకూడ చంద్రమండలమని చెప్పుదురు. ఆమె- 'చంద్రచూడ' అను ప్రసిద్ధివలన=ఆమెకు చంద్రుని, కిరీటముగాఁగూడఁ జెప్పుదురు. ఇట్లు పూర్వులగు సత్కవులు నాలుగు తెఱఁగులఁ జెప్పుదురు గాక! మేము మాత్రము అసితకిరణుని హాసముగనే చెప్పుదుమని తాత్పర్యము. ఇట్లు—ఇచట పర పక్షములయందు అనంగీకారము నుపన్యసించి, చంద్రుని హాసరూపముగా సంభావించుటవలన నిది సాపహ్నవోత్ప్రేక్షయగునని తెలియునది. "నయనం తాటఙ్కమాననం ముకుటమ్" అను పాఠాంతరము దీనికిఁగలదు.

మూ. బిమ్బాధరస్య శోభా మమ్బ యయాః కోను వర్ణయితు మీష్టే.
అన్తరపి యా ప్రవిశ్య ప్రమథపతే ర్వ్యతను తే రాగమ్. ౧౯

అంబా- బింబాధరముయొక్క శోభను వర్ణించుటకు సమర్థుఁ డెవ్వఁడున్నాఁడు? ఆశోభ- ప్రమథపతియగు రుద్రుని యంతరంగము నందుఁగూడ ప్రవేశించి రాగమును (అనురాగమును) విస్తరింపఁజేయు చున్నది.

ప్ర భ:— బింబాధరము=ఎఱ్ఱని దొండపండువంటి మోవి. శోభను- కాంతిని, (రక్తకాంతిని) రాగమును-రక్తవర్ణమును, అనురాగమును మహావిరక్తుఁడగు భగవానుని

దురవగాహమగు హృదయమునఁగూడ ప్రవేశించి, రక్తవర్ణముగుదానిని ననురక్తముగాఁ జేయుచు, బింబమువలె నెఱ్ఱనిదగు, పార్వతి యధరశోభ నెవ్వఁడును వర్ణింపఁజాలఁ డని భావము.

మూ. గణపతయే స్తనఘటయోః పదకమలే సప్తలోకభక్తేభ్యః
అధరపుటే త్రిపురజితే దదాసిపీయూషమమ్బ! త్వమ్. ౨౦

అమ్మా! నీవు నీపుత్రుఁడగు గణపతికి స్తనఘటముల యందలి యమృతమును (స్తన్యరూపమును) సప్తలోకములయందున్నగల భక్తులకు పాదారవిందమునందలి యమృతమును (మకరందరూపమును) త్రిపురములను జయించిన కాంతుడగుహరునికి, అధరపుటమునందలి యమృతమును (రసరూపమును) ఇచ్చుచున్నావు.

ప్ర భ:—ఇట్లు పుత్రునికొఱకును- భక్తులకొఱకును- భర్తకొఱకును- వారి వారికిఁ దగినరూపముగల అమృతము నిచ్చెదవని భావము.

మూ. దృక్పీయూషతటిన్యాం నాసాసేతౌ వినిర్మితేవిధినా
భాసాంభవతి శివే తే ముఖేవిహారో నిరాతఙ్కః. ౨౧

ఓ శివా! దృష్టియను పీయూషనదియందు నాసయను సేతువు బ్రహ్మచేత నిర్మింపఁబడియుండ, నీముఖమునందు కాంతి-విహారము నిరాతంకమగుచున్నది.

ప్ర భ:—పీయూషనది=అమృతనది. నాస=ముక్కు. సేతువు=గట్టు. నిరాతంకము=అడ్డులేనిది-నిర్భయము.

సేతువు లేనియెడల నదీప్రవాహ భయమువలన విహారము నిశ్శంకము కాక పోవును. కావుననే బ్రహ్మ- నాసను సేతువుగానిర్మించి, "ప్రవహించుచున్న దృష్టి యందు ముఖకాంతులు మగ్నములు కాఁగూడదు." అనిదృష్టియనుదేశమునకు మర్యాదను (హద్దును) ఏర్పరచెను. ఇచట దృక్-తటినులకును, నాసా- సేతువులకును గల తాదాత్మ్యమువలన రూపక మలంకారమగుచున్నది. అది- హేతువగు సేతు నిర్మాణమునకు కాంతులయొక్క- నిరాతంకవిహారమే- ఫలముగా సంభావించుటచే నగు ఫలోత్ప్రేక్షకు- అంగమగుచున్నది. ఇట్లు-రూపక- ఉత్ప్రేక్షలకు- అంగాంగి భావముచేత నిది- సంకరమగుచున్నది.

మూ॥ కమలావిలాసభవనం కరుణాకేలీగృహంచ కమనీయే
హారదయితే తే, వినతహితే, నయనే, జనని! విజయేతే. ౧౨

జననీ! కమలావిలాసభవనమును, కారుణ్యలీలాభవనమును అగుచు కమనీయములగు నీనయనములు- హారప్రియములును, వినతహితములును అగుచు విజయము నొందుచున్నవి.

ప్ర భ:—కమలా విలాసభవనము=లక్ష్మీవిహారగృహము. వినతహితములు= నమ్రతగలవారికి అనుకూలములు.

మూ॥ సర్వాణ్యప్యఙ్గాని శ్రీమన్తి తవేన్దుచూడకులకాన్తే!
కవినివహవినుతిపాత్రే శ్రోత్రే దేవి! శ్రియావేవ. ౧౩

చంద్రశేఖర కులకాంతవగు దేవీ! నీయంగములన్నియుఁగూడ శ్రీమంతములు, కవినివహవినుతిపాత్రములునగు శ్రోత్రములు-శ్రీలే.

ప్ర భ:—శ్రీమంతములు=శ్రీగలవి- సంపదగలవి. కవి-నివహవినుతిపాత్రములు=కవిసమూహముయొక్క స్తుతుల కాస్పదములు.

వినుతులు- ఆధేయములును, శ్రోత్రములు-ఆధారములును, అగుటవలన శ్రోత్రము- పాత్రమగుచున్నది. శ్రోత్రముకంటె ఇతరములగు నంగములు శ్రీమంతములని చెప్పఁబడినవి. శ్రోత్రము మాత్రము శ్రీయేయని విశేషింపఁబడినది.

ప్రశ్న:-శ్రోత్రము-శ్రీయేగాని శ్రీమంతము కాదని యేల చెప్పఁబడినది?

ఉ:—"శ్రీకర్ణపేషః" అను పూర్వోక్తశ్లోకమును వ్యాఖ్యానించునపు డీయంశము కొంచెము ప్రదర్శింపఁబడినది. శ్రోత్రము- శ్రీయేయనుచోట శ్రీశబ్దమునకు సంపద- అర్థము. ఛాందోగ్యమునందలిపంచమప్రపాఠకమున "యోహ వై జ్యేష్ఠంచ శ్రేష్ఠంచవేద" అని యారంభించి, "అథ హైనం శ్రోత్రమువాచ. యదహంసమ్పదస్మి త్వం తత్ సమ్పదసి" అని శ్రోత్రము శ్రేష్ఠమగు ప్రాణముతో చెప్పెను. అని వినఁబడుచున్నది. లోకమునందు సంపన్నములగు విద్యలన్నియు శబ్దాత్మకములగుటచేత శ్రోత్రమునందే అంతస్సన్నిహితములు. కావున శ్రోత్రము- సంపద-(శ్రీ) యగుచున్నదని భావము.

మూ॥ అపికుటిలమలినముగ్ధస్తవ కేశః పుత్రిగోత్రనుతాత్రిస్థః
బిభ్రత్ సుమానికాన్యపి హృదయం భువనప్రభోర్హరతి. ౧౪

పర్వతేంద్రపుత్రీ! నీకేశము- కుటిల- మలిన- ముగ్ధము. అయినను, ఏవో (సామాన్యములగు) పూవులను ధరించినది అయినను, భువనప్రభువగు భవునిహృదయమును హరించుచున్నది. (ఆకర్షించుచున్నది)॥

ప్రభ:—కుటిల- మలిన-ముగ్ధము=వక్రము (తిన్నదనములేనిది) నల్లనిది (శుభ్రముకానిది) మూఢము (జడము)

ప్రశ్న:—కౌటిల్య మాలిన్యాదులగు- అపకర్షకగుణములతోఁగూడిన కేశము- హృదయము నాకర్షించును అనునది లోకవిరుద్ధము.

ఉ:—విరుద్ధముకాదు. ఉన్నతనము, ఆనతమునగుచు వంకరలుగలిగినదియు, నల్లనిదగుటవలన జలద- మయూరాది వర్ణము గలిగినదియు, నగుకచమే దర్శనీయము. కావునవది- కుటిల- మలినమని చెప్పఁబడినది. ముగ్ధమన సుందరమని యర్థముగలదు. కావుననది- ముగ్ధమని చెప్పఁబడినది.

ఇట్లు- విరోధము- పరిహరింపబడుటవలన నిది విరోధాభాసమా? లేక అపి (అయినను) శబ్దస్వారస్యమువలన, జగత్ప్రభుహృదయాకర్షకమగు కారణము లేకున్నను హృదయమునుహరించుట యనుకార్యమును జెప్పుటవలన విభావనయా? అను సందేహమును గలిగించుటవలన విభావనా-విరోధాభాస- సంకరమగునిది- సందేహసంకరాలంకార మగుచున్నది.

మూ॥ చరణాదికున్తలాన్తపరికౢప్తసౌన్దర్యగాయినీ రేతాః
అఙ్గీకరోతు శమ్భోర్గమ్భోజదృగాత్మజస్యార్యాః॥ ౨౫

శివసుందరియగు నుమాదేవి-చరణాది-కుంతలాంతమగు- అంగముయొక్క- పరికౢప్తసౌందర్యమును గానముచేసిన, ఆత్మజుఁడగు గణపతికి సంబంధించిన యీయార్యల (ఆర్యావృత్తకలితములగుస్తుతుల)ను స్వీకరించునుగాక!

ఇది- సవ్యాఖ్యామగు ఉమాసహస్రమునందలి
ఏకాదశస్తబకము.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

శ్రీ భారతీ దేవ్యై నమః.

ఉమా సహస్రము.

ద్వాదశ స్తబకము

(తృతీయశతకమున చతుర్థస్తబకము)

అవ:—పార్వతీ- పరమేశ్వరశృంగారరసముల్లసితమగు పండ్రెండవస్తబక మారంభింపఁబడుచున్నది. అందు మొదట— మందహాసము ప్రస్తుతింపఁబడుచున్నది.

మూ॥ శర్వధైర్యగుణశాతశస్త్రికా
శమ్బరారిజయ కేతుపట్టికా
మన్దహాసకలికా, మదాపదం
పర్వతేన్ద్రదుహితుర్వ్యపోహతు. ౧

శర్వుని ధైర్యగుణమునకు శాతశస్త్రికయు, మన్మథునకువిజయ ధ్వజపతాకయు, అగు పర్వతేంద్ర—పుత్రి-మందహాసకలిక-నాయాపదను తొలగించుగాక!

ప్ర థ:—శర్వుని=శివునియొక్క, ధైర్యగుణము=మనోవికారములనుతొలఁగి యుండుట ధైర్యము-ఆధైర్యమే యగుగుణము=రజ్జువు 'ధైర్యగుణము' అని చెప్ప బడును. శివుని ధైర్యగుణమను త్రాటిని తెగఁగోసినదియు, మన్మథునకు జయపతాకయు అగు పార్వతీ మందహాసకలిక- నాయాపదను బాపుఁగాతమని ప్రార్థింపఁ బడినది. శాతశస్త్రిక=వాడియగు చిన్నకత్తి, మందహాసకలిక=మొగ్గవంటి చిరునవ్వు. పూర్వపదార్థమగు మందహాసమే- ఆపన్నివారణసమర్థము. కావుననదియే ప్రధాన మగుటవలన నిది యుపమితసమాసమగుచున్నది. ఇచట 'కలిక' అనుపదముయొక్క సమర్థతవలన- హాసము మన్మథునిచే ప్రయోగింపఁబడిన బాణరూపమగు పుష్పమను నంశము- ఆక్షేపింపఁబడి వ్యంజింపఁజేయఁబడుచున్నదని గ్రహింపనది.

మూ॥ ముక్తభోగికటకేన పాణినా
ముగ్ధగాత్రి! పరిగృహ్య తేకరమ్
ఏకదా శశికిశోర శేఖరః
సఞ్చచార రజతాద్రిభూమిషు. ౨

ముగ్ధగాత్రీ! ఒకానొకప్పుడు శశి-కిశోరశేఖరుఁడు ముక్తభోగికటకమగు పాణితో నీపాణిని పరిగ్రహించి- రజతాద్రిభూములయందు విహరించెను.

ప్ర భ:—ముగ్ధగాత్రీ!=సుందరాంగివగు జననీ! శశికిశోరశేఖరుఁడు=బాలచంద్రచూడుఁడు. ముక్తభోగికటకము – విడువఁబడిన సర్పమను వలయముగలది. రజతాద్రిభూములయందు=కైలాసప్రదేశములయందు.

భూషణసర్పమునువిడిచి, సుందరమూర్తియగు చంద్రశేఖరుఁడు- పరిణయమయినవెనుక పార్వతితోఁగూడి కైలాసపర్వతోపాంతములయందు విహరింపఁబూనెనని భావము. భూషణమగు నాగమునేకాక, భీతి-జుగుప్సావహములగు జటలను, గజచర్మాదులనుగూడ పరిత్యజించి- శృంగారభావానుగుణమగు శశికిశోరధరవేషముతోఁ గూడిన భగవానుఁడు-శుభ్రమగు స్వహస్తముతో భగవతీకోమలహస్తమును గ్రహించి విహరించెనను నర్థమిచట స్పష్టముగాఁ దెలియునది.

ద్వితీయశతకమునందలి ప్రథమస్తబకమున పురారికి-జ్వలత్కపర్దత్వాదికమగు ప్రసిద్ధభయంకరరూపము సమయాంతరముల యందగునని తెలిపి, "భగవానుఁడు నీతోఁగూడి విహరించునపుడు మాత్రము, కాంతమగుశరీరమును, కాంతతరములగు లీలలను ధరించును". అని చెప్పఁబడినదిగదా!

అవ:—ఇప్పుడు దేవితోఁగూడి, కమనీయభావమున విహరించుచున్న పరమేశ్వరుని కామెయెడఁగలిగిన యభిలాషమును (అభిలాష శృంగారము) దెలుపుటకు తుమ్మెదలతోఁగూడిన పూలతోటలు, చక్కనిపొదరిండ్లు, కోకిల కలకలలుఁ మొదలగు ఉద్దీపనవిభావములను పంచశ్లోకములచే వర్ణించుచున్నాఁడు.

మూ॥ తస్య తత్ర పరితః పరిభ్రమన్,
వల్లభాం వకులపుష్పచుమ్బినీమ్
పార్వతి! త్వదలకోపమద్యుతి
ర్భృఙ్గరీక తరుణో మనోఽధునోత్. ౩

పార్వతీ! ఆ కైలాసభూములయందు, వకుళపుష్పచుంబినియగు ప్రియురాలిచుట్టును దిరుగుచు, నీముంగురులతో నుపమింపఁదగి కాంతులుగలిగిన చంచరీకయువకుఁడు పరమేశ్వరుని మనస్సు చలింపఁ జేసెను.

ప్ర భ:—వకులపుష్పచుంబిని= పొగడపూఁదేనె నానునది. ప్రియురాలిని= ఆడుతుమ్మెదను, చంచరీకతరుణుఁడు=భ్రమరయువకుఁడు. భ్రమరవిలసితమగు పుష్పసమృద్ధిని వీక్షించుటచేత పార్వతీకాంతుని మనస్సు కంపితమయ్యెనని భావము. ఇచ్చట 'ప్రతీపముపమేయస్యోపమానత్వప్రకల్పనమ్" ఉపమేయము నుపమానముగా ప్రకల్పించునెడల ప్రతీపము" అను లక్షణమునను సరించి ఉపమేయములగు అలకములను (ముంగురులను) ఉపమానముగాఁ జెప్పుటవలన నిందలియలంకారము ప్రతీపమగుచున్నది.

మూ॥ ప్రేయసీం చపలచారులోచనా
ముల్లిఖన్ వపుషి శృఙ్గకోటినా
త్వద్విలోకితనిభైర్విలోకితైః
ధూర్జటేః రమదయన్ మనో మృగః. ౪

చపలచారులోచనయగు ప్రేయసిశరీరమును (హరిణియొక్క శరీరమును) శృంగకోటిచేఁ గోఁకుచున్న హరిణము(మగలేడి) నీచూపులకు సరియగుచున్న చూపులచేత ధూర్జటి హృదయమును మదింపఁజేసినది.

ప్ర భ:—చపలచారులోచన=చంచల సుందరములగు నయనములు గలది. ఆడులేడియెడల మగలేడి వెలార్చు ప్రేమవిలాసముల దర్శనము పరమేశ్వర మనోమాదకమయ్యెనని భావము. "నీచూపులకు సరియగుచున్న" అని యుపమేయములగు పార్వతిచూపుల నుపమానముగా ప్రకల్పించుటవలననిదియు ప్రతీపమేయగును.

మూ॥ మఞ్జుకుఞ్జభవనాని మాలతీ
పుష్పరేణుసురభిః సమీరణః
పేశలా చ పికబాలకాకలీ
మోహమీశ్వరి! హరస్య తేనిరే. ౫

ఈశ్వరీ! మంజుకుంజభవనములును, మాలతీసుమపరాగసుగంధి యగు సమీరణమును, పేశలమగుబాలకోకిలకాకలియు. హరునకు మోహము ఘటించినవి.

ప్రభ:—మంజుకుంజభవనములు=మంజులములగు లతాగృహములు. సమీరణము=గాలి, పేశలము=రమణీయము. కాకలి=అవ్యక్తమధుర సూక్ష్మధ్వనివిశేషము. తీవియజొంపము- పూఁదావిగాలి-బాలకోకిలపాట- శివునికిమోహము నుదయింపఁజేసినవని భావము.

మూ॥ అగ్రతః కుసుమశోభితాలతాః
పార్శ్వత స్త్వ మగపాలబాలికే!
సర్వతో మదన శిఞ్జినీధ్వనిః,
ధీరతా కథమివాస్య వర్తతామ్. ౬

ఎదుట- కుసుమశోభితలు లతలు, పార్శ్వమున- నగరాజబాలికవునీవు, అంతటను- మదనశింజినీధ్వని. అతనికి ధీరత యెట్లుండును?

ప్రభ:—మదనశింజినీధ్వని=మన్మథుని యల్లెత్రాటిచప్పుడు (అది కోకిలకాకలియేయని గ్రహించునది) అతనికి=నీకాంతుఁడగుశివునకు. ఎదుటను-ప్రక్కను అంతటను- ఉత్తేజకములగు వస్తువులు దాపురించునపుడు- ధీరత- పలాయితయే యగునని భావము.

మూ॥ కీరకూజితసమాకులేవనే
శమ్భుమమ్బ! తవపార్శ్వవర్తినమ్
ఆజఘాన మకరధ్వజశ్శరై
రర్ధయా స్త్యవసరేహి శత్రవః. ౭

వనము- కీరకూజితసమాకులమగుచుండునపుడు, శంభుఁడు నీపార్శ్వమునందుండెను, అప్పుడే మీనకేతనుఁడు నీప్రభువుపై బాణముల నేయఁదొడఁగెను. అవసరము ప్రాప్తించునప్పుడేగదా శత్రువులు పీడింతురు.

ప్రభ:—కీరకూజిత సమకూలము=శుకకూజిత పరీతము- చిలుకపలుకులతో నిండినది. ఇచట—ప్రకృతమగువిశేషము- అప్రకృతమగు సామాన్యముచేత సమర్థింపఁబడినది. కావుననిది అర్థాంతరన్యాసమను నలంకారమగుచున్నది.

మూ॥ తాడితో మకరకేతునాశ్శరై
రంసదేశమవలమ్బ్య పాణినా
ఏకహాయనకురఙ్గలోచనా
త్వామిదం కిల జగాద శఙ్కరః ౮

మదనశరతాడితుఁడగు శంకరుఁడు—నిజపాణిచేత నీయంసదేశము నవలంబించి, ఏకహాయనకురంగనయనవగు నీతో నిట్లు పలికెనట!

ప్రభ:—అంసదేశము= స్కంధప్రదేశము. ఏకహాయన కురంగలోచన= ఒకసంవత్సరము వయస్సుగల లేడియొక్క కన్నులవంటి కన్నులుగలది. శివుఁడు మన్మథబాణపాతమువలన నొదవిన వేదనను సహింపలేక నీస్కంధప్రదేశము నూతగాగొని లజ్జావిచలిత నయనవగు నీతోనిట్లనియెనని భావము.

మూ॥ కాకలీకలకలం కరోత్యసౌ;
బాలచూతమధిరుహ్య కోకిలా
వాచ ముద్గిర సరోజలోచనే?
గర్వమున్నతమియం విముఞ్చతు. ౯

ఎదుట గాన్పించుచున్న యీకోకిల— బాలరసాలమునం గూర్చుండి కాకలీధ్వనితో కలకలమనుచున్నది. ఓపద్మాక్షీ! ఒక్క మాటనాడితివా దాని యున్నతమగు గర్వమును విడుచును.

ప్రభ:—కోకిల=పికవధువు. కాకలీధ్వని=సూక్ష్మము, మధురము, అస్ఫుటము, అగు ధ్వనివిశేషము. శ్రవణసుభగమగు స్వరసంపత్తిచేత గర్వించిన పికాంగన— ఎదుటనున్న తీయమామిడి గున్నయందుండి యెట్లు కలకలమనుచున్నదో వింటివా! నీస్వర మింతకంటెను చాలతీయనిది. కావున నీకంఠధ్వనిచేత నాకర్ణములయం దమృతము నింపుము'' అనుభావము వ్యంజితము.

మూ॥ ఫుల్లకున్దమకరన్దవాహినో
మల్లికా ముకులధూలిధారిణః
కమ్పయన్తి శిశవః సమీరణాః
పల్లవానిహృదయంచ తన్వి! మే. ౧౦

సుందరీ! వికసించినమల్లెపూవుల తేనియలను భరించునవియు (మోయునవియు), మల్లెమొగ్గలపరాగమును ధరించునవియునగు, శిశుసమీరణములు– (పిల్లగాలులు గాలిపిల్లలు) నాహృదయమును– పల్లవములనుగూడ కంపింపఁజేయుచున్నవి.

ప్ర భ:—శిశుసమీరణములు=మందమారుతములు. మందమారుత కార్యమగు హృదయ– పల్లవముల కంపనము– ఇచట– మూలమున– 'పల్లవాని హృదయంచ' అనుచో నున్న చ కారముచేత, సహార్థము (తోడ) వాచ్యము చేయఁబడుటవలన నిది సహోక్తియను నలంకారమగుచున్నది.

మూ॥ వర్ణనేన హృతచక్షుషః శ్రియః
సుప్రసన్న మధురాకృతీని తే
అఙ్గకానిదయితే! భజేఽర్భకః
స్వేదబిన్దుహరణేన వాఽనిలః. ౧౧

ప్రియా! సుప్రసన్నమధురాకృతులగు నీఅంకములను స్వేదబిందుహరణముచేత– అర్భకుడగుననిలునివలె నాదృష్టి నాకర్షించుచున్న శోభయొక్క వర్ణనముచేత నేనుగూడ సేవింతును.

ప్ర భ:—అంగకములను=లేతవగు అవయవములను, స్వేదబిందుహరణముచేత= ఘర్మాంబుబిందువులను తొలఁగించుటచేత, అర్భకుడగు ననిలుఁడు=మందమారుతము చల్లగాలి– స్వేదాంబుకణములను తొలఁగించుటచేత నీయంగములందలి శ్రమతొలగు చేనట్లు సేవించువిధమున, నేనుగూడ మధురాకృతి సంపన్నములగు నీయంగముల శోభను కీర్తించుటచేత– నీహృదయమున ప్రీతికలుగునట్లు సేవింతునని భావము.

మూ॥ తావదేవ మమచేతసోముదే
బర్హమేత దనఘార్ఘ్యబర్హిణః
యావదక్షిపథమేష విశ్లథో
గాహతే న కబరీబరీభరస్తవ. ౧౨

అనవద్యగాత్రీ! నాపార్శ్వమున– విశ్లథమైయున్న యీ నీ కబరీభరము– నాదృక్పథమును ప్రవేశింపకుండునంతవఱకును మాత్రమే ఈబర్హిబర్హము– గొనుక్క మనస్సునకు ప్రీతినిచ్చుచుండును.

ప్రతి.:— విశ్లథమా = ముక్తబంధము = దిగజారుచున్నది. కబరీభరము = కేశపాశము. దృక్పథము = నేత్రమార్గము. బహిర్బహిరము = చెమలిక్షించుము. నీకేశపాశ సౌభాగ్యము వీక్షించువఱకును చెమరించెదమను జూచి ఇది నా పెన్నియని కబరీభారము వలె నున్నదని సంతోషించుచుండునని భావము.

చెమలింపించెదను కంటెనుగూడ కబరీభరమే చిత్తరంజకమును, రుచిరతరమును, అగుచున్నదను నంశము వాచ్యము కానిదగుటవలన నీయలంకారము గమ్యమగు ప్రతీపమై యున్నది.

మూ॥ రాగవానధర ఏషనన్తతం
నిర్మల ద్విజసమీపవర్త్యపి
ఏభిరస్య సహవాసతః ప్రియే
నైషదప్యపగతో నిజోగుణః. ౧౩

ప్రియురాలా! యీకెమ్మోవి- నిర్మలద్విజసమీపవర్తి యగుచున్నను సంతతమును రాగవంతమగుచున్నది. వీనితోడి సహవాసమువలన నీష న్మాత్రమునుగూడ దీని నిజగుణము పోయినదికాదు.

ప్ర భ:— నిర్మల- ద్విజ- సమీపవర్తి = శుభ్రములగు దంతముల సమీపమునం దున్నది, లేక శుద్ధ సత్త్వగుణులగు బ్రాహ్మణుల సన్నిధియం దుండునది. రాగవంతము = రక్తవర్ణముగలది, లేక రాజసముగలది- అనురాగి.

శుద్ధసత్త్వగుణులగు బ్రాహ్మణుల సన్నిధియందున్నను రజోగుణమును విడువని జనమువలె తెల్లనిదంతముల చేరువనున్నను ఈయధరము రక్తవర్ణమును విడువకున్నదని తాత్పర్యము. ఇందు శ్లిష్టములగు నిర్మల- ద్విజ- రాగశబ్దములు- వాచ్యతాదశయందు ఒకేయర్థమును దెలుపుచు రెండవయర్థమును దెలుపుటను (పరివృత్తిని) సహింపవు. కావున శబ్దశక్తిమూలమగు ధ్వనన వ్యాపారముచేతనే ద్వితీయార్థము ధ్వనింపఁజేయఁ బడుచుండును. కావున నిది శబ్దశక్తిమూలమును, సంలక్ష్యక్రమమును, అగు ఉపమాలంకార ధ్వనియగుచున్నది. సహజగుణము- సహవాసముచేనయినను తొలఁగదను నంశము- అర్థద్వయమునందును సమానమగును.

'సంసర్గజా దోషగుణాభవన్తి'

'సహవాసమువలన దోషగుణములు కలుగును' అను న్యాయము నైసర్గికము లగు గుణములయందు సంభవింపదు'' అను హేతువువలన అధరము రాగమును విడువకున్నదను వాక్యార్థము సమర్థింపఁ బడుటవలన నిచటి యలంకారము- కావ్యలింగ మని గ్రహించునది.

అమ్మాయీ! పర్వతేంద్రకుమారీ! దేవమాలిలాలనీయమును, సుకుమారమును, అగు నీచరణపల్లవద్వయమును కర్కశమగు నీపత్రిదేశము బాధించుటలేదుగదా?

ప్రభ:- దేవమాలిలాలనీయము=దేవతల కిరీటముల చేత కోరఁదగినది.(భజింపదగినది) చరణపల్లవద్వయము=పల్లవమృదులమగు పాదయుగళము. పర్వతచక్రవర్తి పుత్రిక యొక్క కోమల పాదయుగళి- శిలా కార్కశ్యమున బాధింపఁబడ వచ్చునని యాశంకించి శివుఁడామెనోదార్చుటకు ప్రశ్నించుచున్నాఁడు. ప్రేయసియగు కాంతకు నిజముగా నించుక వేదన కలిగియున్ననుగూడ, ప్రియునిచేగావింపఁబడిన యీదృశములగు ప్రశ్నోపచారములవలన ఆవేదనలేనిదివలెనయి ప్రీతియే జనించునుగదా!

మూ॥ ఏవమాదివదతి త్రిలోచనే
త్వన్ముఖేలసతి మౌనముద్రయా
ఆతతాన జలచారికేతనో
నర్తనం నగమహేన్ద్రబాలికే. ౧౮

ఓనగరాజపుత్రికవగు జననీ! ఇది (పూర్వోక్తము) యాదిగాఁగల వాక్యమును త్రిలోచనుఁడగు శివుఁడు పలుకుచుండునప్పుడు నీవచనము, మౌనముద్రచే విలసిలుచుండ- మీనకేతనుఁడగు మన్మథుఁడు స్వీయమగు నర్తనమును విస్తరింపఁజేసెను.

ప్ర భ:- మౌనముద్ర=మాటాడకుండుటయే స్వరూపముగాఁగలది. ప్రతివచనమునీయక నీపూరకున్ననుగూడ నీముఖమున నేదో (అనిర్వచనీయమగు) విలాసము కలుగుటయు, ప్రత్యుత్తరము నీయకుండుటచేతనే నీప్రియునకు నీయందలి యనురాగము ప్రవృద్ధమగుటయు, నీక్షించి- ఇదియే సమయమని మన్మథుఁడు శివునియందావేశించి, యతఁడింకను నీకుపచారములను గావించునట్లొనర్చెనని భావము.

మూ॥ దేవి! తే పురజితావతంసితః
పారిజాత కుసుమప్రజాకచః
మానసం పురజితోఽమునాహృతం
న్మర్యతే క్వ మలినాత్మ నాకృతమ్. ౧౯

దేవీ! పురారియగు శివుఁడు పారిజాతపుష్పమాలచేత నీశిరోజము నలంకరించెను. ఈశిరోజము— పురజితుఁడగు నతని మానసము నపహరించెను. మలినాత్మ- చేసిన మేలుస్మరించునా?

ప్ర భ:—శిరోజము=కచము-జుట్టు. మలినాత్మ=అశుభ్రము, లేక పాపాత్ముఁడు. పాపాత్ముఁడు సర్వవిధముల చేతనుగూడ కృతఘ్నుఁడగునని భావము. శిరోజము-నల్లనిది కావునను జడరూపము కావునను దానిస్వరూపము మలినము.

ఇచట:—"ప్రభువగు పరమేశ్వరునిచేత శిరోజమునకు పారిజాతపుష్పాలంకారము చేయఁబడినది. ఆశిరోజముచేత అతని మానసాపహరణము కావింపఁబడినది." అనుటచేత దేవీశిరోజ ప్రసాధన కైంకర్యలాభమునకు- స్వమనోదానమే మూల్యమయ్యెనను నర్థము వ్యంజింపఁజేయబడినది. దానివలన పరివృత్తి అనునలంకారము ధ్వనింపఁజేయఁబడుచున్నది. 'మలినాత్మ- కృతఘ్నుఁడు' అను సామాన్యమగు వేఱొకయర్థముచేత- "పురంజయుని మానసమును (మలినాత్మయగు) శిరోజము- దొంగిలించెను" అను ప్రస్తుతమగు విశేషము- సమర్థింపఁబడుటవలన నిది అర్థాంతరన్యాసాలంకార మగుచున్నది.

మా॥ బ్రహ్మచర్య నియమాదచఞ్చలా
నాయికాయది లులాయమర్దినీ
నాయకశ్చ సుమబాణసూదనో
వేద కో రతి రహస్యమానయోః. ౨౦

లులాయమర్దినియగు నాయిక— అస్ఖలితబ్రహ్మచర్యనియత. నాయకుఁడు— సుమబాణసూదనుఁడు. అగుచుండునపుడు- వీరల "రతి రహస్యమును" ఎవ్వఁడెఱుఁగును?

ప్ర భ:—లులాయమర్దిని=మహిషమర్దిని. సుమబాణ సూదనుఁడు - మన్మథనాశనుఁడు. అప్రాకృతమగు (దివ్యమగు) శరీరముఁగలిగి నిత్యమగు బ్రహ్మచర్యవ్రతమునుండి చ్యుతినొందని మహిషాసురమర్దిని-: నాయికయు, పుష్పబాణునిజయించిన పరమేశ్వరుఁడు నాయకుఁడును అగునెడల ప్రపంచమాతాపితరులగు ఆపార్వతీపరమేశ్వరుల యప్రమేయమగు రతిస్వరూపము నెఱుఁగుటకు సమర్థుడెవ్వఁడును లేఁడని భావము. కడచిన శ్లోకములయందు పార్వతీపరమేశ్వరుల విషయమున శృంగార ముపన్యసింపఁబడినది. పామరస్త్రీ-పురుషోచితమగు మదనవిలాసము-

పార్వతీపరమేశ్వరులయందారోపింపఁబడఁగూడదను నభిప్రాయమున మీఁది శ్లోకము చెప్పఁబడినదని గ్రహించునది.

మూ॥ లోచనోత్సవవిధౌ విశారదే
వారిదావరణదోషవర్జితే
మర్దయత్యపి నభోగతం తమః
శ్యామికారహిత సున్దరాకృతౌ. ౨౧

భాతిశీతకిరణస్తనన్ధయే
ప్రాణనాయక జటాకుటీజుషి
శుభ్రపర్వతతటే శుభాఙ్గి! తే
సమ్మదాయ నబభూవ కానిశా. ౨౨

శుభాంగివగు (దివ్యమంగళవిగ్రహవగు) జననీ! నయనోత్సవమును గావించుటయందు విశారదుఁడును, మేఘాచ్ఛాదనదోషవర్జితుఁడును, నభోగతమగునంధకారమును మర్దించువాఁడయినను, శ్యామికా (కళంక) రహితమును సుందరమును అగు నాకృతిగలవాఁడును, ప్రాణ నాయకుఁడగు పరమేశ్వరుని జటాకుటీరమున వసించువాఁడును అగు శీతకిరణస్తనంధయుఁడు— విలసిల్లుచుండఁగా, శ్వేతగిరిప్రదేశమున (విహరించుచున్న) నీకు— సమ్మదముఁగూర్పని రాత్రి యొక్కటియయి నను గలదా? (రాత్రులన్నియుఁగూడ నీకానందదాయకములే)

ప్ర భ:—విశారదుఁడు=విచక్షణుఁడు-కుశలుఁడు. నేర్పరి- మేఘాచ్ఛాదన దోషవర్జితుఁడు=మేఘపటలముయొక్క ఆవరణమను దోషములేనివాఁడు. శీతకిరణ స్తనంధయుఁడు=బాలచంద్రుఁడు. శ్వేతగిరి ప్రదేశమున=కైలాసప్రాంతమున. ప్రసి ద్ధుఁడగు చంద్రుఁడు- ఎల్లప్పుడును కన్నులకు పండుగ చేయఁడు. ఒక్కొక్క సమయ మున మేఘావృతిదోషము నొందియుండును. ఆకాశమునందలి చీకటిని తొలఁగించు చున్నను, దాని స్పర్శవలన నొదవిన కళంకముతోఁ గూడుటవలన నసుందరమగు రూపము గలిగియుండును. పరమేశ్వర జటాకుటీరము నందుండడు. బాలచంద్రుఁడు నిత్యమును నేత్రోత్సవము నొనర్చును. మేఘాచ్ఛాదన దోషము లేకుండును. ఆకా శము నందలి యంధకారమును మర్దించుచున్నను దానిస్పర్శవలని కళంకము లేకుం

డుటవలన అలౌకికసుందరమూర్తి యగుచుండును. పరమేశ్వర జటావాసమున విలసిల్లుచుండును అని భావము.

ఇట్లు ప్రసిద్ధచంద్రునికంటెను వ్యతిరిక్తుఁడగు బాలచంద్రుని వైభవమును స్తుతించుటవలన పార్వతికి ప్రాణనాయక విషయమునందగు రతిభావము ధ్వనింపఁజేయఁబడుచున్నది.

మూ॥ నస్తభూషణ సుధాంశుదీధితి
వ్యక్తముగ్ధముఖశోభయోర్మిథః
తాని తాని గిరిజా- గిరీశయోః
క్రీడితాని జగతో విభూతయే. ౨౩

శిరోభూషణ- చంద్రదీధితులచేత స్పష్టములగు ముగ్ధముఖ శోభలుగల గిరిజా- గిరీశ్వరుల పారస్పరికములగు ఆయాక్రీడితములు- లోకమునకు విభూతి నొసఁగుఁగాక !

ప్రి భ:—దీధితులచేత= కాంతులచేత. ముగ్ధముఖశోభలు = సుందరములగు ముఖప్రభలు. గిరిజా-గిరీశ్వరులు=పర్వతమునకుఁ బుట్టిన పార్వతి (కైలాస) పర్వతమున కధిపతియగు పరమేశ్వరుఁడు. పార్వతీ-పరమేశ్వరుల-అనిర్వాచ్య రహస్య-రతివిలసితములు-లోకశ్రేయః ప్రదములగుఁగాత. అను నీయాశీస్సు- శృంగారవర్ణనోప సంహారసందర్భ అని గ్రహించునది.

మూ॥ మోదకాదనపరస్య సృష్టయే
క్రీడితం జనని! వాంకి మప్యభూత్
శక్తిభృత్ తనయరత్న జన్మనే
కిఞ్చిదీశ్వరి! బభూవ ఖేలనమ్. ౨౪

తల్లీ! యీశ్వరీ! మోదకములను (జిల్లుడుకాయలను పిండివంటలను) భుజించుటయే ప్రధానముగాఁగల లంబోదరుఁడగు గణపతిని సృజించుటకును, శక్తిధరుఁడును, కుమారశ్రేష్ఠుఁడును అగు సుబ్రహ్మణ్యుని జనింపఁజేయుటకును, మీరొనర్చిన (వేర్వేరగు) క్రీడితవిశేషములు- అనిర్వచనీయములు. (తెలియరానివి)

ప్ర భ:—క్రీడితవిశేషములు=రతివిలసిత విశేషములు. గణపతి- సుబ్రహ్మణ్యులను ప్రభవింపజేయుటకు మీకు ద్వివిధమగు రతివిలసితముకలిగెను. అదినిరూపించుటకు శక్యము కానిది. కావుననే ఆపుత్రులిద్దరును ఏకస్వభావులు కాకుండిరి. అందొకఁడు భోజన ప్రియుఁడు. ఇంకొకడు-శక్తిధరుఁడు. మహేశ్వర స్త్వాం పరిణీయ లేభే (2శ. 1స్త. 24శ్లో.) అనుశ్లోకముయొక్క- యర్థము నిచట గుర్తించునది.

మూ॥ మాధురీ రసపరిప్లుతా ఇమాః
కావ్యకర్ణ విదుషో రథోద్ధతాః
ఆదధత్యచలనాథనన్దినీ
మానసే కమపిమోదముత్తమమ్. ౨౫

విగలిత వేద్యాంతరమును, అనుభవైక వేద్యమును, అగు మాధుర్యమేయగు రసముచేత పరిప్లుతములు. కావ్యకంఠపదలాంఛనుఁడగు విద్వాంసునిచేత విరచితములు- అగు నీరథోద్ధతములు- నగరాజనందిని మనస్సునందు. ఒకానొక యానందవిశేషమును గలిగించునుగాత!

ప్ర భ:—విగలితవేద్య + అంతరము=తెలియదగిన వేరొకవస్తువు లేనిది. పరిప్లుతములు=వ్యాప్తములు. రథోద్ధతలు=రథోద్ధతయను పేరుగల వృత్తముల చేత రచింపఁబడిన నుతులు.

ఈస్తబకము- కుమార సంభవమునందలి యష్టమసర్గమునందలి ధోరణినవలబించి, నింబధింపఁబడినదను నంశము- కాళిదాసకావ్యజ్ఞులగు పండితులకు స్పష్టముగాఁ దెలిసియే యుండును. ఉ॥ అందును- ఇందునుగూడ రథోద్ధతావృత్తమే ప్రయోగింపఁబడినది. శృంగారమే విషయము. పార్వతిని సంబోధించి 'వ్యాజహార సహధర్మచారిణీమ్' 'పద్మకాన్తి మరుణ త్రిభాగయోః' (కు. సం. 8, స, 3శ్లో ఇత్యాదులచేత-కుసుమితోపవన- సంధ్యాకాల- రాత్ర్యాది- శృంగారోద్దీపన విభావవర్ణనమును పరమేశ్వరుఁడు కావించిన సంవిధానమందున్నది. ఇందుగూడ "త్వామిదంకిల జగాదశఙ్కరః" ఇత్యాదులచేత తాదృశమగు వర్ణనము పరమేశ్వర కృతమైయున్నది. ఈరెండింటికిని గలభేదమును మాత్రము పాఠకులు గుర్తింపవలయును. అద్వితీయుఁడగు కాళిదాసకవిసార్వభౌముని కవితయందు- ఉమాసహస్రికవియగు కావ్యకంఠమునికి- నిత్యసంజాతము,అపారము, అగుభక్తి కలదనునదిమాత్రము సత్యము. అయినను- ప్రపంచమాతాపితరులగు పార్వతీ- పరమేశ్వరుల

సురతమును కాళిదాసునివలె వర్ణింపక, ఎట్లోయొకవిధమున తద్వర్ణనము విడువఁదగినదను తలంపున స్వీయరచనమును సంగ్రహించెను. కావుననే రత్యుత్పాదకమగు శృంగారవర్ణనము నారంభించి "బ్రహ్మచర్య నియమాదచఞ్చలా" అనుశ్లోకమున "వేదకోరతి రహస్యమావయోః" అని తానొనర్చిన ముగింపును సమర్థించెను. వేద- వేదాంత- మంత్ర- తంత్ర- జ్ఞాన- యోగ- ఉపాసనాదులచేత- ఉపబృంహితము- భక్తిపరము-గురుతరముఅగు నీస్తోత్ర కావ్యమున కనురూపముగునట్లు ఉమా మహేశ్వర-రతిరహస్యము- అప్రమేయమనిచెప్పి యుపసంహరించుట నవకవి పండితామోదదాయక మగుచున్నది.

ఇతి శ్రీమహర్షి రమణ భగవత్ పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః గణపతిమునేః కృతావుమాసహస్రే
ద్వాదశః స్తబకః సమాప్తః.
సమాప్తంచ తృతీయం శతకమ్.

ఇది- శ్రీమహర్షి- రమణభగవత్పాదశిష్యుఁడు- శతమర్షణసగోత్రుఁడు-
శ్రీమత్ పంతుల పేరయశాస్త్రి పౌత్రుఁడు వేంకట రామ
బుధేంద్రపుత్రుఁడు అగు లక్ష్మీనారాయణశాస్త్రిచే
నాంధ్రీకరింపఁబడిన ఉమాసహస్రమను స్తోత్ర
కావ్యమున పంద్రెండవ స్తబకము
(తృతీయశతకము).

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

శ్రీ భారతీ దేవ్యై నమః.

ఉమా సహస్రము.

త్రయోదశ స్తబకము

(చతుర్థ శతకమున ప్రథమ స్తబకము)

అవ:_ ఈస్తబకమున భగవతీకటాక్షమహిమానువర్ణనము చేయఁబడినది. అందు మొదట పూర్వోక్తప్రకారమున హాసమును స్తుతించుచున్నాఁడు.

ము॥ భవామ్బుధిం తారయతాద్ భవన్తం
హాసోఽద్భుతః కుఞ్జరవక్త్రమాతుః
యో హన్తి బిమ్బాధరలఙ్ఘనేఽపి
వ్యక్తాలసత్వో హరితాం తమాంసి. ౧

బింబఫలోపమమగు అధరోష్ఠము నతిక్రమించినను గూడ, వ్యక్తమగు నలసతగలదియగుచు, దెసలందున్న కారుచీకటులను చీల్చుచున్నదియగు గజానన జనని- అద్భుతహాసము-నిన్ను- సంసారాంబుధినుండి తరింపఁజేయును గాత!

ప్రభ:__ బింబఫలోపమము=దొండపండుతో నుపమింపఁదగినది. వ్యక్తమగు అలసత గలది=స్పష్టమగు మందత్వముగలది. ముఖద్వారము నందున్నదియు, సమీపవర్తియునగు అధరమును అతిక్రమించినను గూడ హాసము మందమేయని భావము. ఇట్లు మిక్కిలి మందమగుచున్నను- ఉమాహాసము సర్వదిశలందును గల తిమిరమును తొలఁగించుటయందు సమర్థమగుటవలన అద్భుతమని చెప్పఁబడినది.

ఇచట- మందహాసము- దిక్తమోహరణరూపమగు అమందమగు కార్యమును నొదవింపఁ జేయుటవలన అసంభావ్యత-గమ్యమగుచున్నది. కావుననిది యసంభవాలంకార ధ్వనియగుచున్నది. ఇందు- అద్భుతపద ముండుటవలన విశేషోక్తియని శంకింపఁగూడదు.

మూ॥ సక్తః సదా చన్ద్రకలాకలాపే
సర్వేషు భూతేషు దయాం దధానః।
గౌరీకటాక్షో రమణో మునిర్వా
మదీయమజ్ఞాన మపాకరోతు. ౨

చంద్రకలాకలాపునియందు, సక్తిగలదియు, ప్రాణులందఱి యందును దయవహించునదియు, నగు గౌరీకటాక్షము (అపాంగదృష్టి) 'మహర్షి' అని ప్రసిద్ధుఁడగు రమణమునివలె నాయజ్ఞానమును తొలఁగించునుగాత!

ప్ర భ:—చంద్రకలాకలాపుఁడు=చంద్రకళయే భూషణముగాఁగల శివుఁడు. చంద్రచూడుఁడు. సక్తి=ఆసక్తి లేక అనురక్తి. కటాక్షము=కడకంటిచూపు. చంద్రశేఖరునియందు సక్తి- అనురాగమువలన గౌరీకటాక్షమునందును, ఏకాంతభక్తివలన రమణమహర్షియందును యుక్తమగుచున్నది. జగన్మాతకు సహజమగు సర్వభూతదయయు తత్కటాక్షము ధరించును. సర్వప్రాణులయందును గూడ ఆత్మదర్శనము వలన రమణమునికిఁగూడ భూతదయ సహజమేయగును. గురువగు రమణమహర్షి నా అజ్ఞానమును తొలఁగించినట్లు గౌరీకటాక్షముగూడ, నాయజ్ఞానము నపాకరించుఁగాతమని భావము. అలంకారము-పూర్ణోపమ.

మూ॥ కృపావలోకో నగకన్యకాయాః
కరోతు మే నిర్మలమన్తరఙ్గమ్।
యేనాఙ్కితః శఙ్కర ఏకతత్త్వం
విశ్వంవిలోకే జగతే జగౌ చ. 3

ఏకృపావలోకమున, అంకితుఁడగు శంకరుఁడు- (శంకరభగవత్పాదుఁడు) సమస్తమును- ఏకతత్త్వముగా కనుఁగొని, తన దర్శనమును లోకమున కుపదేశించెనో, ఆనగకన్యాకృపావలోకము- నాయంతరంగమును నిర్మలమొనర్చుఁగాత!

ప్ర భ:—కృపావలోకము=కరుణతోడి దృష్టిపాతము. అంకితుఁడు=ముద్రింపఁబడినవాఁడు. శంకరుఁడు-'ఆనందలహరి' మున్నగు గ్రంథములను రచించి, యంబిక నారాధించి తత్ప్రసాదమునొంది, శారీరక (బ్రహ్మసూత్ర) భాష్యకారుఁడై యద్వైతమును బోధించిన శంకరాచార్యుఁడు.

ఏకతత్త్వముగా=అద్వితీయమగు సత్యముగా (అద్వైతముగా) కనుఁగొని=చూచి (తెలిసికొని) తనదర్శనమును=బ్రహ్మమొక్కటియే సత్యము'' అను అద్వైత జ్ఞానమును, అంతరంగమును=అంతఃకరణమును, నిర్మలము=పరిశుద్ధము.

మూ॥ కాళీకటాక్షో వచనాని మహ్యం
దదాతు మోచామద మోచనాని।
యత్పాతపూతం రఘువంశకారం
నరాకృతిం ప్రాహురజన్యనారీమ్. ౪

ఏకటాక్షపాతముచేత- పవిత్రుఁడగు రఘువంశకారుని (కాళిదాసమహాకవిని) నరాకృతియగు సరస్వతియే యని పండితులు చెప్పుచుందురో, ఆ కాళీకటాక్షము- మోచామదమోచనములగు వచనములను నాకొసఁగుఁగాత!

ప్ర భ:—నరాకృతి=మనుష్యుని యాకృతివంటి యాకృతిగలది. మోచామదమోచనములు - ఒకానొక (మంచితీపిగల) యరటిపండుయొక్క దర్పమును పోఁగొట్టునవి. ఆయరటిపండు కంటెనుగూడ రసవత్తరము లగునవి.

కాళిదాసుఁడు సరస్వతి యవతారమనియు, కాళీప్రసాదలాభమున నతఁడు మహాకవి యయ్యెననియు, ప్రాచీన పండిత ప్రోక్తమగు నైతిహ్యము ననుసరించి మీఁదియంశము చెప్పఁబడినది. కాళిదాసుని కృతులలో కుమారసంభవము మహాకావ్యమును, సుప్రసిద్ధములగు శాకుంతలాది నాటకములును గలవు. అయినను కాళిదాసు డిచట- రఘువంశకారుఁడను పదమున నిర్దేశింపఁబడుటవలన- అద్వితీయమగు శోభగల తత్కృతులన్నిఁటి లోపలనుగూడ రఘువంశమే ప్రధానమని యీకవి యభిమానించెనను నంశము- గుర్తింపఁదగియున్నది.

శ్లో. యుష్మాక మగ్ర్యాం వితనోతువాణీ
మేణీదృగేషా, గిరిశస్య యోషా
యస్యాః కటాక్షస్య విసారివీర్యం
గిరామయం మే వివిధో విలాసః. ౫

ఏపరమేశ్వరియొక్క నర్వతః ప్రసరణశీలమగు వీర్యము- నానావిధమగు మదీయవాగ్విలాస మగుచున్నదో, ఏణీవిలోచనయగు ఆగిరీశ్వరయోష- మీకు శ్రేష్ఠమగువాణిని విస్తరింపఁజేయుఁగాత!

ప్ర భ:—వీర్యము=బలము—ప్రభావము. ఏణీవిలోచన = ఆడులేడివంటి కన్నులుగలది. గిరీశ్వరయోష=పరమేశ్వర సుందరి. భగవతియగు నుమాదేవియొక్క కటాక్షప్రభావమే వివిధమగు నావాగ్విలాసమై యున్నదని యర్థము. మూలమునం దలి వివిధపదప్రయోగమువలన- నాకవిత్వము కేవలమును ఆశుధారారూపమును, అష్టావధానాది రూపమును మాత్రమే కాదు. సర్వతోముఖమగు నాసారస్వత వైభవము- మద్విరచితములగు నిగమాగమ విమర్శనములయందును, నానాశాస్త్రగ్రంథములయందునుగూడ విభాసించుచు ధీమంతులకు సంతోషదాయక మగుచుండునను నర్థము తెలియఁదగియున్నది.

“హేతు హేతుమతో రైక్యం హేతుంకేచిత్ ప్రచక్షతే”

అనుచంద్రాలోకోక్తివలన-ఇచట పార్వతీకటాక్షప్రభావమును హేతువునకును గిర్విలాసమును హేతుమంతమునకు (కార్యమునకును) ఏకత్వము (కటాక్షబలమే-వాగ్విలాసమని) చెప్పుటవలన నిది హేత్వలంకార మగుచున్నది.

మూ॥ నగాత్మజాయాః కరుణోర్మిశాలీ
దృగన్తసన్తానధునీప్రవాహః।
భీష్మేణ తప్తాన్ భవనామకేన
గ్రీష్మేణ యుష్మాంఛ్ఛిశిరీకరోతు. ౬

‘నగరాజతనయకరుణ’ అను తరంగములచేత వెలయుచున్న కటాక్షవిస్తారమను నదీప్రవాహము—భీష్మమగు ‘భవ’నామకమను గ్రీష్మముచేత తపించుచున్న మిమ్ము శిశిరీకరించుఁగాత!

ప్ర భ:—భీష్మము=భయంకరము. భవనామకము=జననమను పేరుగలది (సంసారము అను పేరుగలది) గ్రీష్మము=నిదాఘము- మండువేసవి. భగవతియగు పార్వతియొక్క- కరుణాపూర్ణమగు కటాక్షము. భయంకరమగు సంసారతాపమును తొలఁగించి మిమ్ము సుఖుల నొనర్చుఁగావుతమని తాత్పర్యము. కరుణా- దృగంత సంతానమున- ఊర్మి- ధునీప్రవాహము లారోపితములు. భవమున- గ్రీష్మము ఆరోపితము. భీష్మమను విశేషణము- భవమునందును, గ్రీష్మమునందునుగూడ వర్తించును. తపించుట- సంసారులకు దుఃఖముచేతను, బాటసారులకు ఎండచేతను కలుగును. కావుననిది సావయవమగు రూపకాలంకార మగుచున్నది.

మూ॥ అజస్రమార్ద్రా దయయాఽన్తరఙ్గే
యథాభవో నిమ్నగయోత్తమాఙ్గే।
సన్తాపశాన్తిం భవసున్దరీ మే
కరోతు శీతేన విలోకితేన. ౭

భవుఁడు- ఉత్తమాంగమున గంగచేత- ఆర్ద్రుఁడగునట్లు అంతరంగమున, నెల్లపుడును దయచేత, ఆర్ద్రయగుచుండు భవసుందరి- శీతమగువిలోకితముచేత, నాసంతాపమును శాంతింపఁజేయుఁగాత!

ప్ర భ:-భవుఁడు=శివుఁడు. ఉత్తమాంగము=శిరస్సు. ఆర్ద్రుఁడు=చల్లదనము గలవాఁడు. అంతరంగమున=హృదయమునందు. భవసుందరి=శివప్రియ. శివుని శీర్షమునందు- సంతతమును స్రవించుచున్న గంగ- అతని నచట నార్ద్రుని గావించునట్లు పార్వతిహృదయమునందు- సంతతమును ప్రవహించుచున్న దయ- ఆమెనచట యార్ద్ర నొనర్చుచున్నదని తాత్పర్యము. అలంకారము—ఉపమ.

మూ॥ పుణ్యా సదాపీశ్వరసంసక్తా
పతివ్రతా సామ్యమితా తవేక్షా
కులాచలాధీశ్వర కన్యకే మే
సంహారమం హో విత తేర్వితత్తామ్. ౮

కులాద్రిరాజకన్యవగు దేవీ! నీ యీక్షు (దృష్టి) నిరంతరమును గూడ పవిత్రము, ఈశ్వరసంగవతి, కావుననే పతివ్రతతోడి సామ్యమును పొందినది., ఆదృష్టి, నాపాపవిస్తృతిని సంహరించుగాత!

ప్ర భ:—పతివ్రత- పతికంటె నితరునియందు చలింపనట్లు, నీదృష్టి- యీశ్వరునుండి తొలఁగదు. కావున పతివ్రతా సామ్యము నొందినదని చెప్పఁబడినది. కావున నిది యుపమాలంకార మగుచున్నది. పతివ్రత- పతికంటె నితరుని జూడకున్నను, తత్పాతివ్రత్య ప్రభావమున పాపమును సంహరించునట్లు నీయీక్షకూడ యీశ్వరునికంటె నన్యునియందు ప్రసరింపకుండినను, పాపమును సంహరించునని భావము.

మూ॥ శర్వాన్వరామే నియమేః హీనా
శ్యామా తవేక్షా గణికాఙ్గనేవ
నీచేఽపి మర్త్యే నిపతత్యనర్ఘా
బిభర్తి నా షోడశ యః సువర్ణాన్. ౯

ఓశర్వసుందరీ! శ్యామయగు- నీయీక్ష-గణికాంగనవలె నియతాచారశూన్యయగుచున్నది. షోడశ- సువర్ణములను ధరించిన నీచుఁడగుమర్త్యునియందుఁగూడ- అనర్ఘమై ప్రసరించుచున్నది.

ప్ర భ:—శ్యామ=నల్లనిది లేక సౌందర్యముగలది. షోడశసువర్ణములను=పదునారుసంఖ్యగల అక్షరములను అనఁగా షోడశాక్షరియగు మంత్రమును, లేక పదునారు బంగారునాణెములను, అనర్ఘము=అమూల్యము-గొప్ప వెలగలది. వేశ్యాంగన-స్వర్ణధనయుక్తుఁడగు మనుష్యుఁడు నీచుడయినను గూడ వానియందు అనురక్తయగునట్లు నీయీక్ష- షోడశాక్షర మంత్రధరుఁడగు పురుషునియందుఁగూడ అనుగ్రహముగలది యగుచుండునని భావము. శ్లిష్టోపమ-అలంకారము.

మూ॥ పద్మాయతాక్షి! క్షితిధారికన్యే
కటాక్షనామా తవ కాలసర్పః!
యం సన్దశత్యేవ జగత్సమస్తమ్
విస్మృత్య చాహో న దధాతి మోహమ్. ౧౦

పద్మాయతాక్షివగు భూధరబాలా! నీకటాక్షమను పేరుగల కాలసర్పము- ఎవనిని బాగుగ కఱచునో, వాఁడు- విశ్వమునంతను విస్మరించినవాఁడయినను మోహమును వహింపఁడు. ఆశ్చర్యము!

ప్ర భ:—పద్మాయతాక్షి=కమలములవలె విశాలములగు నేత్రములు గలది, మోహము=మూర్ఛ. కటాక్ష- కాలసర్పములకు- అభేదానురంజనమువలన రూపకమలంకారమగుచున్నది. మోహము కలుగుటకు కారణమున్నను, కార్యమగు మోహము కలుగనట్లు చెప్పుటవలన విశేషోక్తి యలంకారమగుచున్నది. ఆవిశేషోక్తి రూపకముచేత అనుప్రాణితము. కాలసర్పముకంటె కటాక్షము-అధికగుణమని చెప్పబడుటవలన వ్యతిరేకము గమ్యమగుచున్నది. ఇచట రూపక- విశేషోక్తులకుమాత్రము సమానమగు ప్రాధాన్యముండుటవలన నిది సమప్రధాన సంకరమగుచున్నది.

మూ॥ ఈశద్విషా శైలమహేన్ద్రకన్యే
కరోతి మైత్రీం విషమాయుధేన
ప్రభాషతే పాతకి నశ్చపక్షే
కుతః కటాక్షోన తవామ్బ ముగ్ధః. ౧౧

శైలేంద్రకన్యవగు జననీ! నీకటాక్షము- ఈశ్వరద్వేషియగు విషమాయుధునితోడి మైత్రి నొనర్చుచున్నది. పాతకియగు నతనిపక్షమున పరిభాషించుచున్నది. కావున నది ముగ్ధము (మూఢము) కాదా?

ప్ర భః—విషమాయుధుఁడు=సమసంఖ్య గలవి కాని అయిదు బాణములు గల మన్మథుఁడు. పాతకి=పాపముగలవాఁడు. పక్షము=సహాయము. ముగ్ధము కాదా?= మూఢమేయగును. ప్రాణనాయకుఁడగు పరమేశ్వరుని శత్రువునకు పక్షబలమునిచ్చి పాపాత్ముఁడగువానికి సహాయమగుటవలన నీకటాక్షము మూఢమేయని భావము. "నీకటాక్షము-పరమేశ్వర ద్వేషియందుఁగూడ పరమకారుణికము" అనునిది స్తుతి పర్యవసాయిని యగునింద యగుచున్నది. "ఉక్తిర్వ్యాజస్తుతి ర్నిన్దాస్తుతిభ్యాం స్తుతి నిన్దయోః" నిందచేతస్తుతియు స్తుతిచేత నిందయు చెప్పఁబడినయెడల నది వ్యాజస్తుతియగును. అనులక్షణమువలన నిది వ్యాజస్తుతియను నలంకారమగుచున్నది.

మూ॥ కృపాన్వితః కర్ణసమీపచారీ
శ్రీమాన్ సదా పుణ్యజనానుకూలః
సామ్యం కురూణామధిపస్య శమ్భోః
ప్రాణప్రియే! తే భజతే కటాక్షః. ౧౨

శంభుని ప్రాణప్రియవగు పార్వతీ! నీకటాక్షము- కృపాన్వితము! కర్ణసమీపచారి, శ్రీమంతము, నిత్యము, పుణ్యజనానుకూలము, అగుచు కురుదేశాధిపుఁడగుదుర్యోధనుని సాదృశ్యము నొందుచున్నది.

ప్ర భః—కృపాన్వితము=దయతోఁగూడినది. కర్ణసమీపచారి=శ్రోత్రాంతవిశ్రాంతము. శ్రీమంతము=శోభగలది. పుణ్యజనానుకూలము=పావనులకనుకూలము. దుర్యోధనునిపక్షమున మీఁది విశేషణముల యర్థమును క్రమముగా నిట్లుండును. ధనుర్విద్యాచార్యుఁడగు కృపునితోఁ గూడినవాఁడు, కర్ణునిసమీపమున నుండువాఁడు, రాజ్యలక్ష్మీయుక్తుఁడు, రాక్షసుల కనుకూలుఁడు, పవిత్రులగు జనుల కనుకూలమగు

కారుణ్యవైభవముగల కటాక్షమునకు దుర్యోధనసామ్యమును వర్ణించుట విరుద్ధము. మీఁది విరోధము మీఁది విశేషణములందున్న శ్లిష్టార్థము చేత పరిహరింపఁడినది. కావున నిది - విరోధాభాసాలంకార మగుచున్నది.

మూ॥ కర్ణాన్తికస్థోఽపిన ధర్మవైరీ
కృష్ణోఽపి మాతర్నకులం నపాతి
శీతోఽపి సన్దీపయతి స్మరాగ్నిం
హారస్య తే శైలసుతే! కటాక్షః. ౧౩

శైలకుమారివగు జననీ! నీకటాక్షము— 1 కర్ణాంతికస్థము అయినను ధర్మవైరికాదు. 2 కృష్ణమయినను (కృష్ణుఁడయినను నకులరక్షకముకాదు. 3 శీతమయినను శివునికి స్మరాగ్నిని సందీపింపఁ జేయునది.

ప్రభః—కర్ణాంతికస్థము=కర్ణుని సమీపమునందుండునది, లేక కర్ణముల సమీపమునందుండునది. ధర్మవైరి=ధర్మరాజునకు శత్రువు: లేక శ్రోత్రధర్మమగు శ్రవణమునకు విరోధించునది. కృష్ణము=కృష్ణరూపము, లేక నల్లనిది. న (అ)కులరక్షకము=నకులుని రక్షించునది. లేక అకులమును రక్షించునది. శీతము=చల్లనిది. స్మరాగ్నిని=కామాగ్నిని. సందీపింపఁజేయునది=వృద్ధినొందించునది.

ఇందలి ప్రథమ ద్వితీయవాక్యములయందు శబ్దశ్లేషము చేతను, తృతీయవాక్యమునందు- స్వభావము చేతను, విరోధ-పరిహారములు చెప్పబడుటవలన నిది విరోధాభాసాలంకార మగుచున్నది. ఇందు విరోధమున్నట్లు- అభాసించును (తోఁచును) కాని నిజమగు విరోధముండదు. కావున దీనికి విరోధాభాసమను పేరుకలిగినది.

ఇందలి ప్రథమవాక్యమున నీకటాక్షము- దుర్యోధనపక్షపాతియగు కర్ణుని సమీపము నందుండునది యయినను ధర్మరాజునకు విరోధి కాదు అని చెప్పబడినది. కర్ణుఁడు ధర్మపుత్రునకు ప్రతిపక్షుఁడనునది ప్రసిద్ధము! కావున నిదియిచట విరోధ మగుచున్నది. శ్రోత్రసమీపము నందున్నను శ్రోత్రధర్మమగు వినికిని ప్రతిబంధించునది కాదు. అను నింకొకయర్థముగూడ మీఁదివాక్యమునకు గలదు. కావున నీయర్థము చేత మీఁది విరుద్ధార్థము పరిహరింపఁబడుచున్నది. ద్వితీయవాక్యమున కృష్ణరూపమయినను పాండవుఁడగు నకులుని రక్షించునది కాదు. అను నితిహాసవిరోధము కలిగినది. నల్లనిదయినను (మాలిన్యముగలదానివలెఁ గనఁబడుచున్నను) అకులమును

రక్షించునది కాదని చెప్పఁబడినది. అనఁగా కులమును రక్షించునదియేయని చెప్పఁబడినది. కావున మీఁదివిరోధము నిది పరిహరించుచున్నది. ఇట్లీ రెండు వాక్యముల యందును శబ్దశ్లేషమువలన విరోధము పరిహరింపఁబడినది. తృతీయవాక్యమున చల్లనిదయినను కామాగ్నిని సందీపింపఁ జేయునది అని విరోధము చెప్పఁబడినది.(చల్లనిది- అగ్నినివృద్ధినొందించుటవిరుద్ధముగదా! శివునికి కామాగ్నినిసందీపింపఁజేయుప్రవృత్తి- కటాక్షప్రభావమునకు స్వభావసిద్ధమగుటవలన నిది పరిహరింపఁబడినది. ఇట్లు- ఇది విరోధాభాసమగుచున్నది.

మూ॥ అయం కటాక్ష స్తనతోయవాహః
కారుణ్యకాలే పరిజృమ్భమాణః।
గృహేషు లీనాన్ సుఖినో విహాయ
నిరాశ్రియాన్ సిఞ్చతి విశ్వమాతః. ౧౪

ప్రపంచజననీ! ఈ- నీకటాక్షమను తోయవాహము- (నీటి మేఘము) కారుణ్య (వర్షా) కాలమునందంతటను వ్యాపించి, గృహములయందు లీనులగు సుఖవంతులను విడిచి- నిరాశ్రియులను సిక్తులనొనర్చుచున్నది.

ప్ర భ:—తోయవాహము=జలమును వహించుచున్న మేఘము. కారుణ్యకాలము=కరుణాప్రదర్శన సమయము. నిరాశ్రయులను=అనన్యాశ్రయులను. ఇతరమగు నాధారము లేనివారిని, లేక ఆవాసగృహము లేక వెలుపలనున్నవారిని. గృహములయందు=భార్యలయందు, లేక నిజగృహములయందు. లీనులు=తగులుకొనినవారు,లేక, మిగుల నడఁగియుండువారు. 'కారుణ్యకాలమునందు' అనుచోట రూపకబలమున వర్షాకాల మాక్షేపింపఁబడుచున్నది. గృహశబ్దముచేత గృహ- పుత్ర- విత్తాదులు గ్రాహ్యములు. గృహ- పుత్ర- ధనాదుల నాశ్రయించి వానిచేత ఆత్మనావరింపఁజేసికొనినవారికి- ఉచితకాలమున దేవీకరుణాకటాక్షము ఉపస్థితమయినను ఫలప్రదము కానేరదు. ఏవస్తువునుగూడ స్వకీయముగా నాశ్రయింపక నిరావరణులగువారు మాత్రమే నీకటాక్షమున కాస్పదమగుచుందురని భావము. కటాక్ష- తోయవాహములకును, కారుణ్య-వర్షాకాలములకును, అభేదము చేసగురంజనమువలన నిది=రూపకాలంకార మగుచున్నది.

మూ॥ కస్యాపి వాచా వపుషా బలేన
సమస్య స్సర్వైరపి యన్ని దేశాః।
అమ్భోధివేలాస్వపి నస్ఖలన్తి
శమ్భోః ప్రియేఽయం త్వదృక్ ప్రసాదః. ౧౫

శంభుప్రియా! వాక్కుచేతను, శరీరముచేతను, బలముచేతను గూడ సర్వమానవులతోడను సమానుఁడని ఒకానొకపురుషుని శాసనములు-కల్లోలితములగు సముద్రజలములయందుఁగూడ స్ఖలితములు కాకుండుటయనునది నీదృక్ప్రసాదము. శ్రీరాముఁడు సేతువును బంధించుట. నీప్రసాదముచేతనే అనిభావము.

ప్ర భ:—బలముచేతను=వీర్యముచేతను- మూలమునందలి వేలాశబ్దమునకు- సముద్రజలవికారము, అనగా ప్పెనఅని యర్థము. స్ఖలితములు=విఫలములు. దృక్ప్రసాదము=దృష్టియొక్క అనుగ్రహము. వాక్- శరీర- వీర్యములచేత- తదితర మనుష్యులకు సమానుఁడగుటవలన బాహ్యదృష్టికి సాధారణునివలెఁ గనఁబడు పురుషుఁడుగూడ నీప్రసాదముచేత కల్లోలితములగు అధృష్యగంభీరసాగరములను నియమించుచుండునని భావము. ఇచట- సేతుబంధాదికము నిదర్శనమైయున్నది.

మూ॥ ద్వారేషు తేషాం విచరన్తి శూరాః
సౌధేషు సారఙ్గదృశస్తరుణ్యః
ప్రగల్భవాచః కవయః సభాసు
శర్వాణి తేయేషు కృపాకటాక్షః. ౧౬

శర్వాణీ! నీకృపాకటాక్షము కలిగినవారియొక్క- గృహద్వారములయందు శూరులును, సౌధములయందు, సారంగనయనలగు తరుణులును, సభలయందు ప్రగల్భవచనులగు కవులును విచరించుచుందురు.

ప్రభ:—కృపాకటాక్షము=కరుణావాహినియగు కడకంటిచూపు. సారంగనయనలు=ఆడులేడి చూపులవంటి చూపులుగల సుందరులు, ప్రగల్భవచనులు=అతిప్రౌఢములగు వాక్కులుగలవారు. కవులు=కావ్యబ్రహ్మలు. ఇందు శూరులుగలవారు రాజులనియు, సుందరులుగలవారు శ్రీమంతులనియు, కవులుగలవారు సరసులనియు గ్రహింపనగును. కాళివలన శౌర్యమును, లక్ష్మివలన సంపదయు, సరస్వతివలన విద్యయు క్రమముగా ప్రాప్తములు [illegible] చెప్పఁబడెను. ఈ మూఁడును [illegible]

భవత్కటాక్షవంతుఁడగు పురుషునిచేత లభ్యములగునని యర్థము. ఇట్లనుటచేత— 'శర్వాణీకటాక్షము— కాళీ— లక్ష్మీ— సరస్వతీ విభూతిగర్భితము' అనునంశము గమ్యమగుచున్నది.

మూ॥ యత్రామ్బ తే కోఽపి కటాక్షలేశః
న దుర్జయః సఙ్గరసీమ్ని శూరః।
పూర్వం దివం పూరయతి ద్విషద్భి
స్తతో యశోభిర్భువమిన్దుగౌరైః. ౧౭

అమ్మా! అనిర్వచనీయమగు నీకటాక్షలేశము సోకిన మనుష్యుఁడు యుద్ధరంగమున దుర్జయుఁడైన శూరుఁడై మొదట స్వర్గలోకమును శత్రువీరులచేత నిండించి, తమపరి— భూలోకమును, సితాంశుగౌరములగు యశస్సులచేత పూరించును.

ప్ర భ:—దుర్జయుఁడు=మిక్కిలి శ్రమచేతగాని జయించుటకు వీలుకానివాఁడు. సితాంశుగౌరములు=చంద్రునివలె శుభ్రములు. (తెల్లనివి) కటాక్షవంతుఁడగు జనునికి మహోన్నతశౌర్యప్రాప్తి ప్రస్తావముచేత కటాక్షమునకుగల కాళీవిభూతి చెప్పఁబడినది. మొదట శత్రువులను స్వర్గమునొందించుటయు, తరువాత భూమిని శుభ్రకీర్తులచేత పూరించుటయు, నిచటఁ జెప్పఁబడుటవలన ఇది కార్యముయొక్క— శీఘ్రతాప్రత్యాయనార్థమగు అతిశయోక్త్యలంకారమగుచున్నది.

మూ॥ యం తారకాకాన్త కలాపకాన్తే!
న లోకసే కోఽపి న లోకతే తమ్।
యం లోకసే తేన విలోకితోఽపి
శ్రియం సమృద్ధాం సముపైతి లోకః. ౧౮

చంద్రకలాభూషణుఁడగు శివుని కాంతవగు భగవతీ! నీవు చూడనివానినెవ్వఁడునుగూడ చూడఁడు. (వాడు పేరులేనివాఁడయి, సర్వజనులచేతనుగూడ నుపేక్షింపఁబడును.) నీ వెవ్వనిని విలోకింతువో వానిచేత విలోకింపఁబడినవాఁడుకూడ సమృద్ధమగు సంపదనొందును

ప్ర భ:—సమృద్ధము=పుష్కలము. నీదృష్టిసంపర్కము సాక్షాత్తుగాను, పరంపరగాను కూడ లోకులకుఁ గలుగుచుండును. కావున నీదృష్టినాశ్రయించినవాని

నాశ్రయించినవారికిఁగూడ పుష్కలమగు శ్రీవిభూతి కలుగునని భావము. దీనిచేత కటాక్షమునకుగల లక్ష్మీవిభూతి ప్రస్తుతింపఁబడినది.

మూ॥ సుధాంహసన్తి మధుచాక్షిపన్తి
యశోహరన్తి వనితాధరస్య
పరిష్కరోత్యస్య కవిత్వధారా
ముఖం హరప్రేయసి! లోకసేయమ్. ౧౯

శివప్రేయసీ! నీవు- ఎవనిని వీక్షింతువో. వానిముఖమును- అమృతము నుపహసించునదియు, మధువు నాక్షేపించునదియు, వనితల యధరోష్ఠమునకుఁగల కీర్తినిగూడ నపహరించునదియౌనగు కవిత్వధార పరిష్కరించును.

ప్ర భ:—మధువు=తేనె, కవిత్వధార=కావ్యసంపాతము. ఆక్షేపించునది= నిషేధించునది. పరిష్కరించును=అలంకరించును. కవిత్వధార- అమృతముకంటెను గూడ నధికమగు నికోత్కర్షమువలన అమృతమునుజూచి నవ్వునదియు, "సుందరుల కెమ్మోవి- లోభనీయమును శ్రేష్ఠమును అగు మాధుర్యముగలది'' అని యధరము నకుఁగల కీర్తినిగూడ నపహరించుననియు, భావము. దీనిచేత "కటాక్షము సరస్వతీ విభూతిమంతము'' అనునంశము చెప్పఁబడినది. హసించుట- ఆక్షేపించుట- అపహ రించుట— ఉపమావాచకములని యింతకుముందే చెప్పఁబడినవి. ఇందు-ఒక్కటియే యగు కవితాధార కనేకములగు నుపమానములు కాన్పించుటవలన మాలోప మాలంకార మగుచున్నది.

మూ॥ సర్వేన్ద్రియానన్దకరీ పురన్ధ్రీ
విద్యానవద్యా విపులాచ లక్ష్మీః।
ఇయం త్రిరత్నీ పురుషస్యయస్య
దుర్గే! త్వయా దృష్టమిమంతు విద్మః. ౨౦

దుర్గా దేవీ! సర్వేంద్రియానందకరియగు పురంధ్రియు, అన వద్యయగు విద్యయు, విపులయగు లక్ష్మియు, అను నీత్రిరత్ని- ఎవనికిఁ గలదో, ఆపురుషుని నీచేత అవలోకితుఁడని ఎఱుఁగుదుము.

ప్ర భ:—సర్వేంద్రియానందకరి=భోగసాధనములగు నింద్రియములకుసమ్మ దముఁ గూర్చునది. పురంధ్రి=సర్వలక్షణ సంపన్న శరీరాంతరంగములు గలదియగు

రమణి. అనవద్య=నిర్దుష్ట. విపుల=బహుల. త్రిరత్ని=మూడురత్నములకలయిక (రత్నములనఁగా శ్రేష్ఠవస్తువులని యర్థము) అవలోకితుఁడు=బాగుగాఁ జూడఁబడిన వాఁడు. త్వదీయ కరుణాకటాక్షము లేనియెడల ఏయొక్కనికిగూడ నీమూడును లభింపవని భావము.

మూ॥ ముధాక్షిపన్త్యద్రిసుతే! కటాక్షా
న్కైలాసకాన్తార మహీరుహేషు
ఇతః కిరేషత్ తవనాస్తిహానిః,
సిధ్యత్యభీష్టంచ సమస్తమస్య. ౨౧

అమ్మా! పర్వతపుత్రీ! కైలాసకాంతారమహీరుహములయందు నీదృగంతదృష్టుల నేలవ్యర్థముగా విరియఁజిమ్మెదవు? ఇక్కడ వానినించుక ప్రసరింపఁజేయుము, (తన్మూలమున నీకుహానిలేదు- సరిగదా) ఈ వ్యక్తియొక్క యభీష్టమంతయును సిద్ధించును.

(ప్రభ:- కైలాసప్రాంతమునందలి యరణ్యమునందున్న వృక్షములయందుఁ బ్రసరించి, నీకటాక్షములు వ్యర్థములగుచున్నవి. నీవు నాయందాకటాక్షములను కొంచెముగనైనను ప్రసరింపఁజేయుము. తత్కటాక్షపాతమున నీకేమియు నష్టము లేదు కాని నాకు గొప్పలాభమున్నది. కావున యాచించుచున్నానని తాత్పర్యము.

మూ॥ శీతాచలాధీశకుమారి! శీతః
సంరక్షణే సంశ్రితమానవానామ్
దుర్ధర్ష దుష్టాసురమర్దనేషు
నితాన్త ముష్ణశ్చ తవావలోకః. ౨౨

శీతాచలాధీశ్వరకుమారీ! నీయవలోకము- సంశ్రితమానవ సంరక్షణమునందు శీతలమును (దయార్ద్రమును) దుర్ధర్ష- దుష్టాసుర మర్దనములందు, మిగుల నుష్ణమును (తాపమునిచ్చునదియు) అగుచున్నది.

(ప్రభ:—దుర్ధర్ష- దుష్టాసుర మర్దనములయందు=దుర్జయులును దుష్టులును అసురాక్షసులను మర్దించుటయందు. శీతలము=చల్లనిది. ఉష్ణము=వెచ్చనిది. నిమిత్త భేదమువలన- ఒక్కటియేయగు దృష్టిపాతము- శీతలమును, ఉష్ణమునుగూడ నగు

మున్నదని యర్థము. ఇట్లు ఒకే వస్తువును ద్వివిధముగా వర్ణించుటవలన ఇది శ్లేషాలంకారమగుచున్నది.

మూ॥ రుషాసమేతం విదధాతి నాశం
కరోతి పోషం కృపయా సనాథమ్।
అమ్బౌషధస్యేవ తవేక్షితస్య
యోగస్య భేదేన గుణస్య భేదః. ౨౩

జననీ! రుషాసమేతమగు నీ యీక్షితము- నాశమును, కృపాసనాథమగు నీయీక్షితము- పోషమును గావించుచున్నది. ఔషధయోగముయొక్క భేదముచేత (వాత,పిత్త, కఫ,నాశాది) గుణము భేదించునట్లు నీయీక్షితయోగముయొక్క భేదముచేత (వినాశాది) గుణము భేదించును.

ప్రభ:-రుషాసమేతము=కోపముతోఁ గూడినది. కృపాసనాథము=దయతో గూడినది. ఈక్షితము-చూపు. (దృష్టిపాతము) యోగము=ప్రమాణవేదాదులచేత సాధింపఁదగిన వస్తువిశేషముల కలయిక, లేక కోపాదులతోడి సంబంధము. గుణము= వాత పిత్త కఫములను పోగొట్టుట మున్నగునది, లేక నశింపజేయుట మున్నగునది. నీయీక్షితము- రోషయోగముచేత, వినాశము నొనర్చును. కృపాయోగముచేత, పోషము నొనర్చును అను నీయర్థమును- 'యోగవిశేషముచేత గుణభేదమువలె' అను నుపమ చమత్కరించుచున్నది. ఇందలి యోగ- గుణ- శబ్దములు శ్లిష్టార్థములు.

మూ॥ నాశాయ తుల్యోద్ధత కామలోభ
క్రోధత్రిదోషస్య భవామయస్య
శివప్రియే! వీక్షితభేషజం తే
క్రీణాని భక్త్యా వద భోః కియత్యా. ౨౪

శివప్రియవగు దేవీ! సమోద్ధతములగు (సమానముగా గర్వించునవియగు) కామ- క్రోధ- లోభములనెడి త్రిదోషములు(అనఁగా, వాత, పిత్త కఫములు) గల జన్మమను రోగమునకు, నీవీక్షితమను భేషజమును-ఎంతభక్తితో కొనఁగలనో చెప్పుమా!

ప్ర భ:—ఉద్ధతములు=గర్వించినవి, ప్రకోపించినవి. వీక్షితమను భేషజము= నీదృష్టిపాతమను మందు. ఎంత భక్తిమూల్యమునిచ్చిన నీవీక్షితౌషధము లభించునో చెప్పుమని భావము. సమానముగా నుద్ధతములగు కామ- క్రోధ- లోభములు-తుల్యమగు ధాతుప్రకోపము స్వరూపముగాఁగల సన్నిపాతముతోఁగూడిన (వాత, పిత్త, కఫములను) త్రిదోషములుగను, జన్మము- రోగముగను, వీక్షితము- ఔషధముగను, భక్తి- మూల్యముఁ (వెల)గను చెప్పఁబడుటవలన నిది సావయవ తాద్రూప్య రూపకాలంకార మగుచున్నది.

మూ॥ అభిష్టుతాం చారణసిద్ధసఙ్ఘైః
త్రిష్టుబ్విశేషా అపిమర్త్యశూనోః
కృపాకటాక్షైర్వినతాన్ పునానాం
కపర్దినః సమ్మదయన్తు కాన్తామ్. ౨౫

మానవపుత్రునిచే రచింపఁబడిన త్రిష్టుప్ ఛందః ప్రస్తారగతములగు వృత్తవిశేషములుగూడ-చారణసిద్ధ- సంఘములచేత-అభి-స్తుతయగుచు వినతులఁగు ఆశ్రితులను పవిత్రీకరించుచున్న శివకాంతను ఆనందింపఁ జేయుఁగాత!

ప్రభ:—చారణాదులు దేవతలలో నొకతెగకు సంబంధించినవారు- వినతులు=ప్రణతులు. ఈస్తబకమున- ఉపజాతి వృత్తములును ఉపేంద్రవజ్రావృత్తములును నిబంధింపఁబడినవి. ఇవి రెండునుగూడ, త్రిష్టుప్ఛందస్సును ప్రస్తరించుట వలన నేర్పడుచున్నది. కావుననే మూలమున "త్రిష్టుబ్విశేషాః" త్రిష్టుభ్ ఛందము నందలి భిన్నవృత్తములని చెప్పఁబడినవి. పాదమునకు పదునొకటి యక్షరములుగల ఛందమునకు త్రిష్టుప్పను పేరుగలదు. పాదపాదమునకునుగూడ మీఁదిసంఖ్యగల యక్షరములచే శ్రవణరంజకములగుచున్న యీవృత్తములు రెండునుగూడ త్రిష్టుప్ ఛందమున నుదయించినవి. కావున నివి- త్రిష్టుప్ఛందః ప్రస్తారగతములగు వృత్తవిశేషములని చెప్పఁబడినవి. పరమేశ్వరి- దేవవిశేషులగు చారణాదులచేత లెస్సగా స్తుతింపఁదగినది. నేను మనుష్యుఁడను. అయినను యీత్రిష్టుబ్వృత్తములచేతఁగూడ నామె స్తుతింపఁబడి యానందింపకపోదను దృఢవిశ్వాసముచే నీయాశంస కావింపఁబడినది.

సవ్యాఖ్యమగు త్రయోదశస్తబకము సమాప్తము.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ,
శ్రీ భారతీ దేవ్యై నమః.

ఉమా సహస్రము.

చతుర్దశ స్తబకము

(చతుర్థ శతకమున ద్వితీయ స్తబకము)

అవ:– దేశ, కాల, రూప, అవస్థానముల ననువ్యాపించుటచేత–యోగానుభవదానదక్షయు, 'కాళి, గౌరి, కుండలిని' అని ప్రసక్తయునగు దేవి– యీపదునాలుగవ స్తబకమున పరిస్తుతింపఁబడుచున్నది.

మూ. కారణమఖిలమతీనాం। వారణమన్తర్లసత్ తమసః।
మన్దస్మితం మహేశ్వర। సుదృశో మే శ్రేయసే భవతు. ౧

సకలములగు బుద్ధులకు కారణమును, అంతర్వ్యాప్రియమాణమగు తమస్సునకు వారణమును, అగు మహేశ్వరసుందరీమందస్మితము నాకు శ్రేయము నిచ్చుఁగాక!

పరి భః–అంతః + వ్యాప్రియమాణము=హృదయమున వ్యాపించియున్నది. తమస్సు=చీకటి, అజ్ఞానము. కారణము=మూలము– వారణము=నివారించునది. సర్వజ్ఞానములకును కారణమగుచున్న మహేశ్వరీమందస్మితము— లోనున్న చీకటివంటి మూలాజ్ఞానమును నివారించుననునది యుక్తమేగదా! కావున–జ్ఞానలాభ–అజ్ఞానధ్వంసములకంటె వేరగు పరమశ్రేయమేదియును లేదు. కావున, తదుభయసాధకమగు మహేశ్వరీమందహసితము– స్తుతింపఁబడినది.

మూ. విశ్వతనుస్తనుగాత్రీ, వజ్రిమయీ పుష్పసుకుమారీ
సర్వస్యశక్తిరబలా కాళీగౌర్యమ్బికా జయతి.

అంబిక:– విశ్వశరీరయు–కృశాంగియు, వజ్రిమయియు– పుష్పసుకుమారియు, సర్వశక్తియు– అబలయు, కాళియు గౌరియు అగుచు వెలయుచున్నది.

పరి భః— విశ్వశరీర=బ్రహ్మాండమే శరీరముగాఁగలది. కృశాంగి=తనుగాత్రి గాత్రి=అల్పమగు శరీరముగలది. వజ్రిమయి=వజ్రమువలె కఠోరమయినది. పుష్ప

సుకుమారి=పూవువలె మెత్తనిది, సర్వాశక్తి=సర్వమగు పరమేశ్వరునిశక్తి, అబల= బలములేనిది, కాలి=కాలవర్ణముగలది (నల్లనిది) గౌరి=గౌరాంగి (తెల్లనిది). దేవీ శరీరము= విశ్వాత్మకము- కావున బృహద్రూపమయినది. ఆమె తనుగాత్రి యను ప్రసిద్ధి యుండుటవలన అల్పమగుచున్నది. వజ్రమువలె దృఢమయినను స్త్రీదేహ ముగలది కావున కుసుమకోమలయగుచున్నది. సర్వాశక్తియయినను స్త్రీరూపిణి యగుటవలన "అబల" అని ప్రసిద్ధయగుచున్నది. కాలి- గౌరి. అనుప్రసిద్ధివలన శ్యామలయయినను శ్వేతవర్ణయగుచున్నది. ఇట్లు- భగవతియగుదేవి-, అన్యోన్యవిరుద్ధ -లక్షణయు, అప్రమేయస్వరూపయు నగుచున్నదని భావము. వస్తుతః, ఆమెస్వరూ పమునందీవిధమగు విరోధము లేదనునంశము ముందుచెప్పఁబడును. మనకు పూర్వో క్తవిధమున భాషచేతఁ గనఁబడుచున్న విరోధము- పరమేశ్వరి, సర్వవిధములచేతను గూడ విభాసించునది యగుటవలన స్వభావముచేతనే పరిహరింపఁబడుచున్నది. కావున నిది విరోధాభాసాలంకారమగుచున్నది. "అపి" ఇత్యాద్యర్థముగలది "అయినను"ఇత్యాదులచేత నిచటవిరోధమువాచ్యము కాకుండుటవలన నిదివ్యంగ్యమే యగుచున్నదని గ్రహించునది. "శర్వస్యశక్తిః" అనుపాఠాంతరము- మూలమునఁ గలదు. 'శివునిశక్తి' అనునది దానియర్థము.

మూ. తామాహుర్జగదమ్బాం గౌరీం కేచిత్ పరేకాలీమ్।
సాగౌరీమహిలాతను రమ్బరతను రుచ్యతేకాలీ. 3

(విద్వాంసులు) కొందఱు- ఆజగదంబను 'గౌరి' అనియు మఱి కొందఱు 'కాళి' అనియు చెప్పుదురు. ఆమె మహిలాశరీరయై గౌరి యగుచున్నది. ఆకాశశరీరయై 'కాళి' అని చెప్పఁబడుచున్నది.

ప్రి భః- ఆమె ఉభయవిధములచేతనుగూడ ఒక్కతెయేయగును. కావున నామరూపభేదమున్నను స్వరూపముచేతమాత్రము ఆజగన్మాతకు భేదములేదని భావము.

అ వః- స్త్రీ శరీరయగు- జగన్మాత యింతకుముందే స్తుతింపఁబడినది, ఇక్కడ, కాళీతత్త్వమును వ్యాఖ్యానించి- తరువాత-- తద్వైభవమును వ్యాఖ్యా నింపనున్నాఁడు.

మూ, పాచకశక్తేః కాల్యాః। కేవలలిఙ్గే నభిద్యతేకాలః।
యత్ పాకతో గభీరాద్ భువనేసర్వేఽపిపరిణామాః. ౪

భూత- భవిష్యద్- వర్తమానరూపమగుకాలము (సంస్కృత భాషయందు) పుంలిఙ్గము. కాలి- స్త్రీలింగము. (ఆ) కాలము- పాచక శక్తియగు కాలికంటె, లింగమాత్రముచేతనే వేరగుచున్నది. గంభీర మగు ఆకాలమునొక్క పాకమువలన లోకమునందు పరిణామము లన్నియుఁ గూడనగుచున్నవి.

వి వః—పాచకశక్తి=పరిపక్వము నొనర్చువాఁడు పాచకుఁడు- అతఁడే మహాకాలుఁడగు రుద్రుఁడు. వానిశక్తియే పాచకశక్తి. కాలము పుంలింగము- కాలి- స్త్రీలింగము. కావున కాలీ—కాలములకు లింగభేదమే కాని వస్తుభేదము లేదు. పరిణామములనఁగా; పరిపాకములు. అగాధమగు నేకాలమునొక్క పరిపాక కార్యమువలన లోకమునందలి పరిణామములు (మార్పులు) అన్నియుఁగలుగు చున్నవో, ఆకాలము- పాచకశక్తియగు కాలికంటె భిన్నము కాదు. లింగభేద మున్నను వస్తుభేదము లేదు. కావున, కాలమే కాలియగుచున్నదని భావము. సృజింపఁబడిన సర్వమునకుఁగూడ- ఒకరూపమునుండి వేఱొకరూపమునొక్క మార్పు కలుగునని యర్థము.

మూ. సర్వభువనాశ్రయత్వాత్ కాలీనామ్నా దిగన్యైవ
లోకేతువ్యవహారణం విదుషాం దిక్కాలయోర్భాక్తమ్. ౫

కాళి- సర్వభువనాశ్రయ. కావున నామె యింకొకనామముచేత దిశ (దేశము) అగుచున్నది. లోకమునందలి విద్వాంసులు దిక్- కాల వ్యవహారముల నొనర్చుచున్నారు. కాని యది భాక్తము.(ముఖ్యముకాదు)

ప్ర భ:—దిశ=దిక్కు—దేశము. కడచినశ్లోకమున, కాలి- కాలస్వరూపిణి. యని చెప్పఁబడినది. ఈశ్లోకమున నామెయే దేశస్వరూపిణిగాఁ జెప్పఁబడినది అట్లయినచో పండితులచేఁ గాలింపఁబడు దేశ-కాలవ్యవహార మెట్లుకుదురును! అనిన "ఆవ్యవహారము గౌణమే కాని ముఖ్యము కానేరదు". అనిసమాధానము చెప్పఁబడినది. ఆరెంటికినిగూడ మూలరూపము కాలియే యనుసిద్ధాంతమువలన ఇట్లు దేశకాల వ్యాపారమును వివరించుటచేత- పరమేశ్వరినొక్క తెరయే యనునంశము స్పష్టమగు చున్నది.

మూ. దిగదితిరగాద్యఖణ్డా, పరిణమయిత్రీ న్మృతాకాలీ।
దక్షస్యైకాదుహితా, సాద్వేగుణభేద ముగ్ధదృశామ్ ౫౬

దిశ-అఖణ్డయగు అదితియని చెప్పఁబడుచున్నది, కాళి పరిణామము నొనర్చునదని స్మరింపఁబడినది. ఇట్లు దక్షప్రజాపతియొక్క పుత్రియగు సతీదేవి యొక్కతెయే- గుణభేదజ్ఞానముచేత విమోహితులగు దృష్టులుగలవారికి, అదితి, కాళి, అని యిద్దరగుచున్నది.

ప్ర భః- "దో అవఖణ్డనే" అనుధాతువువలన నిష్పన్నమగుటవలన దితి శబ్దము ఖండార్థకము. దేశము- వ్యాపకమును, పరిచ్ఛేదములేనిదియు, నగుటవలన అదితి యనుపేరుగలదగుచున్నది. కావుననే అది అఖణ్డయగునదితియని చెప్పఁబడినది. పరిణామము=పరిపాకము, పాచకశక్తియని వెనుక చెప్పఁబడుటవలన కాళి-పరిపాకవిధాత్రియగుచున్నది. ఇట్లు- ఇద్దఱునుగూడ నొక్కతెయే యగుచున్నను- సర్వమునకును ఆధారమగు స్థైర్యగుణముగలదగుటచేత అదితియనియు సర్వమును పరిణమింపఁజేయుగుణముగలదగుటచేత కాళియనియు దక్షపుత్రియగు సతినే ద్వివిధగా మూఢులు తలంతురని భావము.

మూ, దేహే దేహే సేయం కుణ్డలినీనామ జగదమ్బా ।
సాస్వపితి సంసృతిమతాం యోగినాం ప్రబుద్ధాస్యాత్. ౭

అదితియనియు, కాలియనియు. నామభేదముచేఁ జెప్పఁబడిన యాజగదంబ- ప్రతిదేహమునందునుగూడ కుండలినియని ప్రసిద్ధయగుచున్నది. సంసారులగు పామరుల శరీరముల యందాకుండలిని నిద్రించుచున్నది. యోగుల శరీరములయందు మేల్కొనుచున్నది.

ప్రథః- కుండలినినిగుఱించిప్రథమశతకమునవ్యాఖ్యానింపఁబడినది.(చూచునది)

మూ. మూలాధారాదగ్నిర్జ్వలతి శిరస్తః శశీద్రవతి
కుణ్డలినీమయిమన్యే వీణాశయనాత్ ప్రబుద్ధేయమ్. ౮

ఆధారచక్రము లాఱింటిలోపలను మొదటిదగు మూలాధారమునుండి అగ్ని- ప్రజ్వలించుచున్నది. శిరస్సునందలి సహస్రారమునుండి శశి స్రవించుచున్నది. (కావుననే, ఈకుండలినీశక్తి- వీణాశయనము నుండి మేల్కొనినదని యూహించుచున్నాను.

ప్రభ:- శశి=సోమము-అమృతము. సహస్రారము- సోమనిలయమనియు, మూలాధారము- అగ్నికుండమనియు, యోగులయందు ప్రసిద్ధములు. కుండలిని మేల్కొనునప్పుడే యోగియందు- అగ్ని- జ్వలించుటయు, సోమము= స్రవించుటయు సంభవించును. మస్తకము మొదలుకొని మూలాధారమువఱకునుగల అస్థిపంజరిక- వీణాదండమువలె నుండును కావున వీణయని చెప్పఁబడుచున్నది. అస్థియనుశయనము. వీణాశయనమని యిచటఁజెప్పఁబడినది.

"యాతాయాతవిహారే" నృతనుషు విహరన్తీంత్వామ్ (4 స్తబ- శ్లోక-6.7) అనుశ్లోకద్వయమును- వ్యాఖ్యానించునపుడు ప్రథమశతకమునందే యీయంశము ప్రదర్శింపఁబడినది.

మూ. యద్ద్రవతి తత్రకింత్వం కింతత్రత్వమసి యజ్జ్వలతి
కిముతత్రాసి మహేశ్వరి! యదుభయమేతద్విజానాతి.

శిరస్సునుండి ఏది స్రవించుచున్నదో, అచ్చట నీవున్నావా! మూలాధారమునుండి యేది జ్వలించుచున్నదో అచ్చట నీవున్నావా! లేక, ఓమహేశ్వరీ! సోమద్రవణమునకును, అగ్నిజ్వలనమునకును మూలమగుచు, నారెండింటినిగూడ నేది తెలియుచున్నదో అచ్చటనీవున్నావా!

ప్రభ:—సోమము (అమృతము) శిరస్సునుండి స్రవించుచుండును. అగ్ని మూలాధారమునుండి జ్వలించుచుండును. ఆధారచక్రముల కన్నింటికిని ఆధారమగుచు, దహరమనుపేరుగల హృదయాకాశమునందు- ఈసోమాగ్నులు ప్రతిష్ఠింపబడినవి. కావున వానికిమూలమగు నీదహరాకాశము వానిని తెలియుచుండును. కావున నీవు సోమమునందున్నావా! అగ్నియందున్నావా! సోమాగ్నిమూలమగు హృదయమునందున్నావా! అని ప్రశ్నింపఁబడినది.

మూ. ఏతావగ్నీషోమౌ- జ్వాలాభిశ్చన్ద్రికాభిరపి
ఆవృణుతస్తనుమనయోర్వ్యక్తిత్వం మేవశుర్భవతు. ౧౦

(త్వగింద్రియముచేతఁ దెలియఁబడుచున్న). ఈయగ్నీషోములు- జ్వాలలచేతను, చంద్రికలచేతనుగూడ నాశరీరమునుఆవరించుచున్నారు. ఈయగ్నీషోములకు నావ్యక్తిత్వము- (అహంకారసహితమగు పృథగాత్మత్వము)పశువు అగుగాత. (హింసింపఁదగిన మేకమున్నగుజంతువువంటిది అగుఁగాత!)

ప్రభ:- అగ్నిషోములు=మూలాధారమునందలి యగ్నియు, సహస్రారమునందలి సోముఁడును, జ్వాలలచేతను=ఉష్ణదీప్తులచేతను, చంద్రికలచేతను=శీతదీప్తులచేతను, మూలాధారమునందలియగ్ని- జ్వాలలచేతను, సోముఁడు- వెన్నెలచేతను యోగినగు నాశరీరము నావరించుచున్నారు. లోకులకందఱకును- "నేను" తదితరులకంటె వేఱగు స్వరూపాదికము గలవాడను" అనువ్యక్తిత్వముగలదు. ఇదియే సంసారబంధహేతువు. కావున- ఈవ్యక్తిత్వము నశించుటయే ముక్తియగుచున్నది. కావున నావ్యక్తిత్వము- అగ్నిషోములకు పశువగుగాతయని కోరఁబడినది- యజ్ఞమునందుక పశువును చంపుదురు. ఇట్లు చంపుటకు ఆలంభము అనిపేరు. "జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత" అగ్నిష్టోమమున (అగ్నికిని సోమునకును సంబంధించిన యజ్ఞమునందు) పశ్వాలంభమొనర్చెదరు. మానవునియందుఁగల వ్యక్తిత్వము పశువువంటిది. కావున, అగ్నిష్టోమమునందొనర్పఁబడు పశ్వాలంభము- వ్యక్తిత్వనాశనమునకు చిహ్నమని తెలియవలయును. ప్రథమస్తబకమున దక్షయాగకథయొక్క- రహస్యము తెలుపఁబడినది. ఇచట కవి స్వానుభవమును ప్రసంగించి అగ్నిష్టోమముయొక్క- యాథార్థ్యమును వ్యాఖ్యానించెనని గ్రహించునది. (యజ్ఞమునందొనర్పఁబడు పశ్వాలంభము- వ్యక్తిత్వనాశమే అని తెలియనపుడదిస్వర్గకామమును సంపాదించునని తెలియునది.)

మూ. అగ్నిస్త్వం సోమస్త్వం త్వమధోజ్వలసి ద్రవస్యూర్ధ్వమ్।
అమృతమనయోః ఫలంత్వం తస్యచభోక్త్రీచిదమ్బ త్వమ్.౧౧

అమ్మా! అగ్నివినీవు. సోముఁడవు నీవు. నీవుక్రిందినుండి(మూలాధారమునుండి) జ్వలించుదానవు. నీవుమీఁదినుండి (సహస్రారమునుండి) ద్రవించుదానవు. నీవు అగ్నిషోమకార్యములగు జ్వాలనద్రవణములకు ఫలమును భోగ్యమును అగు నమృతముకూడ నీవే. ఆయమృతమును భుజించునదియగు చిత్తు (చితి) కూడ నీవే.

ప్రభ:- ఇట్లు భోక్త్రియగుచిత్తు, భోగ్యమగు అమృతము, జ్వలన- ద్రవణాత్మకయగు- భోగక్రియ, భోగకరణభూతులగు అగ్నిషోములు, అనుసర్వమునుగూడ నీవే యగుదువని భావము.

మూ. కిన్ను సుకృతంమయాకృత మఖిలేశ్వరి! కింతప స్తప్తమ్।
క్రీడయసి మాం ప్రతిక్షణ మానన్దసుధానిధావన్తః. ౧౨

నేను ఏమి సుకృతము నొనర్చితినో, వ్రతము నాచరించితినో నన్ను ప్రతిక్షణమునందును ఆనందామృత సాగరాంతరమున క్రీడింపఁ జేయుచున్నావు.

ప్ర భ:- సుకృతమనగా: సత్కర్మానుష్ఠానము. తపమనఁగా: కాయక్లేశ జనకమగు చాంద్రాయణాదివ్రతముగాని, అనన్యవిషయమగు ధ్యానముగాని యగును. విచ్ఛేదము లేకుండ, ప్రతిక్షణమునందును నన్నానందసుధానిధియం దోలలాడించుచున్నావు. నేనొనర్చిన యేసుకృతమునకు లేక యేతపమునకు ఫలముగా, నాయందీయసాధారణమగు ప్రసాదము నొనర్చుచున్నావో నేనెఱుఁగనని భావము.

మూ. క్షాన్తం కిం మమ దురితం, శాన్తం కిం దేవి! తే స్వాన్తమ్।
అనుగృహ్ణాసి విచిత్రం మామప్యపరాధినాం ప్రథమమ్. ౧౩

దేవీ! నాపాపము- క్షాంతమయినదా? నీస్వాంతము శాంతమయినదా! అపరాధులలో ప్రథముఁడనగు నన్నుఁగూడ అనుగ్రహించుచున్నావు. ఆశ్చర్యము!

ప్ర భ:— క్షాంతము=సహింపఁబడినది. స్వాంతము=మనస్సు, శాంతము= శాంతినొందినది. నాపాపములను సహించి, తొలగించి నన్ను క్షమించి ప్రసన్నరాలవైతివా? అనిభావము. అమ్మా! దోషులలో మొదటివాఁడనగు నన్నుఁగూడ అనుగ్రహపాత్రు నొనర్చుచున్నావు. ఇది యాశ్చర్యదాయకమగుచున్నది. కావున నిన్ను ప్రశ్నించుచున్నాను. "నీవు నాపాపములను క్షమించి, వానిని తొలగించి నన్ను క్షమించి ప్రసన్నరాలవైతివా!"

ప్రశ్న—అయ్యా! ఉమాసహస్రకర్తయగు మహాకవి- ఇచట- అపరాధులలో తానేప్రథముఁడనని యేల చెప్పెను!

ఉత్తరము—లోకమందలి పాపము సమస్తమును స్వీయమే (తనదే) అని అభిమానించి— నేనే పాపాత్ములలో నగ్రణినని చెప్పుచున్నాఁడు. కావుననే యిందలి ప్రథమశబ్దము ప్రథమగణ్యత్వమును స్ఫురింపఁజేయుచున్నది.

దానిచేత—"ఉదారచరితానాంతు వసుధైవ కుటుమ్బకమ్" ఉదారమగు ప్రవర్తనగలవారికీజగత్తే కుటుంబము. అనునూక్తిననుసరించి, ఇచట నీకవియొక్క— "మహాసత్త్వత" వ్యంజింపఁజేయఁబడుచున్నది

మూ. కాలేకాలే సన్ధ్యారూపా నోపాసితా భవతీ।
విచ్ఛిన్నః స్మార్తాగ్నిస్త్రేతాకుతవవహీన్నానామ్. ౧౪

శ్రౌత- స్మార్త కర్మానుష్ఠానముకొఱకు విధివిహితములగు కాలములయందు సంధ్యారూపయగు పరమేశ్వరినుపాసింపనయితిని. స్మార్తాగ్నినికూడ విచ్ఛిన్నమొనర్చితిని. (దాక్షిణాత్య-గార్హపత్య ఆహవనీయములను) అగ్నిత్రేత (త్రియము) యింకెక్కడ? అదియు విచ్ఛిన్నమేయయినది.

ప్ర భః— శ్రౌతకర్మలనగా, శ్రుతిరూపమగు వేదమునందుఁ జెప్పఁబడిన కర్మలు. స్మార్తకర్మలనఁగా స్మృతిరూపములగు ధర్మశాస్త్రములయందుఁ జెప్పఁబడినకర్మలు. సంధ్యారూప=అహోరాత్రముల సంధియందుదయించిన కాలముసంధ్య అదియే రూపముగాఁగల పరమేశ్వరి- సంధ్యారూప. "నేను- సాయంప్రాతస్సంధ్యావందనమునుగూడ చేయుటలేదు. వివాహమయినతరువాత నుంచఁబడి విచ్ఛిన్నమయిన, ఔపాసనాగ్నియగు స్మార్తాగ్నినిగూడ- మరల సంధింపనయితిని. స్మార్తాగ్నియే విచ్ఛిన్నమగునపుడు శ్రౌతాగ్ని= విచ్ఛిన్నమయినదని వేఱుగా చెప్పనక్కఱయేలేదుగదా:- ఇట్లు విధివిహితములగు శ్రౌత- స్మార్త కర్మలనొనర్పకున్నను, నాయందనుగ్రహించుచున్నావని భావము.

మూ. దాతుం నార్జితమన్నం బహు దేవేభ్యశ్చ భూతేభ్యః
యత్కిఞ్చిదార్జితం వా కలత్రపుత్రాన్వితోఽశ్నామి. ౧౫

దేవతలకొఱకును, భూతములకొఱకును ఇచ్చుటకు బహులమగు నన్నము నార్జింపనయితిని. ఏ కొంచెమో సంపాదించినను దానిని కలత్రపుత్ర సహితుఁడనై నేనే భుజించుచున్నాను. (అనుభవించుచున్నాను.)

ప్ర భః- గృహస్థులకు కర్తవ్యములగు పంచమహాయజ్ఞములు- దేవ- పితృ- భూత- బ్రహ్మ- మనుష్య యజ్ఞములు.

"పూజా- సపర్యాఽధ్యయనం బ్రహ్మయజ్ఞస్తుతర్పణమ్।
హోమోదైవో బలిర్భౌతో నృయజ్ఞోఽతిథిపూజనమ్."

నేను వేదపాఠ పితృతర్పణములను విడిచి యితరములగు యజ్ఞములను అనఁగా వైశ్వదేవమును, భూతబలిని, అతిథిపూజనమునుగూడ చేయని స్వార్థపరుఁడనయితినని భావము.

మూ. కశ్చిదపి పాపహారీ సపురశ్చరితశ్చ తే మన్త్రః

కం గుణ మభీక్ష్య మమ ప్రబుద్ధ్యసే౽న్తర్గతస్వాన్తః. ౧౬

పాపహారియగు నీయొక్క మంత్రమును దేనినిగూడ పురశ్చరణము నొనరింపనయితిని. (యథోక్తసంఖ్యచే జపింపనయితిని.)

జగజ్జననీ! నాయందుఁగల యేగుణము నభిలషించి (వీక్షించి) నాలో మేల్కొనుచున్నావు?

ప్రభ:— పాపహారి=పాపములనణింపఁజేయునది. పురశ్చరణము= ఒకానొకమంత్రమును దేనినయినను శాస్త్రోక్తమగు సంఖ్య ననుసరించి జపించుట. నేను మంత్రములనేకముల నెఱుఁగుదును. అయినను తంత్రశాస్త్రములయందుఁ జెప్పఁబడిన విధిననుసరించి జప పురశ్చర్యను గావింపనయితిని. నాయందెట్టి సుగుణమును గాన్పింపకున్నను నీవు నాహృదయమున మేల్కొనుచునే యున్నావు. ఇది యాశ్చర్యము గానున్నదని భావము.

మూ. తవమయి పృథక్ తనూజప్రేమా చేత్ పక్షపాతో౽యమ్।

అథవా సతాం నిసర్గః సో౽యం త్వయి చామ్బ! సమ్భావ్యః. ౧౭

అమ్మా! నీకు- నాయందు ప్రత్యేకమగు పుత్రప్రేమ యుండిన యెడల నది పక్షపాతము కావలయును. లేక (పక్షాంతరమున) సజ్జనుల కది స్వభావము కావచ్చును. (కావున) ఆపక్షపాతము నీయందుఁగూడ సంభవింపవచ్చును.

ప్రభ:— అమ్మా! లోకమునందున్న వారలందఱును నీకుదయించినవారే అయినను నీవు నాయందు విశేషించి ప్రీతిగలిగియుండుటకు పక్షపాతమే హేతువు కావలయును. అందఱకునుగూడ నీవొక్కతెవేగదా తల్లివి! (అనిచెప్పి) ఒకవేళ పక్షపాతముగూడ దోషము కాకపోవచ్చును. లోకమునందున్న సజ్జనులకుఁగూడ తమకుఁగల యనేక పుత్రులలో నొకనియందు పక్షపాతము కాన్పించుచున్నది, కావున నది నీయందును సంభావ్యమేయగునని యర్థాంతరన్యాసము చేయఁబడినదని గ్రహించునది.

ఇప్పుడు నేననుభవించుచున్న యత్యద్భుతమగు నీయోగానుభవ విశేషమునకు హేతువు- నీకు నాయందుఁగల పక్షపాతమేగాని, నాయొక్క- గుణ- కర్మాది- యోగసాధనవిశేషములు (హేతువు) కావనిభావము.

మూ. లక్ష్యం వినైవమన్త్రః కిం సిద్ధ్యతి కోటిశోఽప్యుక్తః
దధ్మస్తద్యదిలక్ష్యం తవరూపం గలతిహా! మన్త్రః, ౧౮

ఒకమంత్రము కోటిమార్లు జపించినను గూఢ ధ్యానగమ్యమగు నొకానొకలక్ష్యమును విడిచినయెడల నేమిసిద్ధించును. ఆకారణమువలన లక్ష్యమగు నీరూపమును మనస్సుచేత ధరించితిమా! అయ్యో! (జప్యమానమగు) మంత్రమే తొలగిపోవుచున్నది.

ప్ర భ :— వెలుపలనున్న దేవవిగ్రహాదులయందుఁగాని, లోనున్న, ఆధారచక్రాదులయందుఁగాని ధ్యానముచే వెలుఁగఁదగిన లక్ష్యమేదో యొకదానిని గుర్తింపక, ఊరకమంత్రమును వల్లెవేయుటవలన లాభములేదు. (లక్ష్యములేనిదే మంత్రసిద్ధి కలుగదు) అలాగని నీరూపమగు నాలక్ష్యమునే మనస్సుచేత ధ్యానించునెడల, జపించుచున్న మనస్సుచేత మంత్రము విడువఁబడుచున్నది. ఇది మహత్తరమైన కష్టమగుచున్నది.

మూ. సఙ్కల్పానాం వాచామనుభూతీనాం చయన్మూలమ్।
యత్రప్రాణో బద్ధస్తల్లక్ష్యం దేవి! తేరూపమ్. ౧౯

దేవీ! సంకల్పములకు- వాక్కులకు- అనుభూతులకు- మూలము (ఉదయస్థానము) ఏదో, ఎక్కడ ప్రాణము బంధింపబడినదో, ఆ నీరూపము- (ధ్యానగోచరమగు) లక్ష్యము.

ప్ర భ:— వాక్, ప్రాణ, మనోఽనుభూతులకు మూలస్థానమగు నీరూపమే గమ్యస్థానమగు లక్ష్యభావము.

మూ. నైసర్గికస్వవృత్తే రహఙ్కృతేర్మూలమన్విష్య
త్వాంకిల సాక్షాత్కురుతే రమణమహర్షేరియందృష్టిః. ౨౦

స్వాభావికియగు ఆత్మీయవృత్తిగల అహంకృతియొక్క మూలమును- అన్వేషించి, చిత్స్వరూపిణివగు నిన్ను సాక్షాత్కరించుకొనెనట! ఇది (నాయొక్క గురుఁడగు) రమణమహర్షియొక్క దృష్టి (సాక్షాద్దర్శనము)

ప్ర భ:— స్వాభావికి=స్వభావసిద్ధము. ఆత్మీయవృత్తి=నిజవ్యాపారము. మూలము=ఉత్పత్తిస్థానము. అన్వేషించి=వెదకి. అహంకార మూలాన్వేషణమువలన మూలస్వరూప సాక్షాత్కారము కలుగుననునది శ్రీరమణమహర్షియొక్క స్వాను

భవ పూర్వకమగునుపదేశమని భావము. భగవానుఁడగు రమణమహర్షి ఉపదేశసార
నందిట్లు ప్రవచించియున్నాఁడు.

అహమయం కుతో భవతి చిన్వతః
అయిపతత్యహం నిజవిచారణమ్.
అహమ పేతకం నిజవిభానకమ్
మహదిదం తపో, రమణవాగియమ్.

మూ॥ మన్యేపర్వతకన్యే, మదునేయమహఙ్కృతిర్మహతీ
అవతరతా వర్షగణై- రపి తన్మూలం నలబ్ధమహహో, ౨౧

పర్వతకుమారీ! ప్రస్తుతమగు ఈనాయహంకారము- బలిష్ఠ
మని తలంచెదను. ఏల? అనిన; బహువర్షములనుండియు శిరస్సునుండి
హృదయమునకు అవతరించుచున్ననుగూడ నాకాయహంకృతిమూలము
లభించినది కాదు. ఆశ్చర్యము! లేక లోకాంతరమునుండి యవతరించి
ఎన్నోసంవత్సరములనుండియు ప్రయత్నించుచున్నను నా కాయహం
కృతిమూలము లభింపకున్నది. ఆశ్చర్యము!

ప్ర భ:— మనోవృత్తిస్థానమగు శిరస్సునుండి హృదయమునకుఁ (యోగము
చేత) పలువర్షములనుండియు అవరోహించుచున్నాను (లేక) వేఱొకలోకమునుండి
యిచ్చటికివచ్చి చాల కాలమునుండియు ప్రయత్నించుచున్నాను, అయినను నాకా
యహంకృతిమూలము లభించినది కాదు. కావున నాయహంకారము బలిష్ఠమయిన
దని భావము. "క్షీణేపుణ్యేమర్త్యలోకం విశన్తి" అని చెప్పుదురు. స్వర్గమునందున్న
వారు- అహంకృతి మూలస్వరూపజ్ఞానమువలన మోక్షమునొందుటకు మానవ
జన్మము నొందుదురనునది తత్త్వరహస్యము కావుననే శ్రుతియిట్లనుచున్నది.

"ఇహ చేద వేదీదథ సత్యమస్తి నచేదిహావేదీన్మహతీ వినష్టిః"

ఈ మనుష్యజన్మమునందే తెలిసికొన్నయెడల సత్యము లభించును. అట్లు తెలిసి
కొననియెడల గొప్పవినాశము కలుగును.

"మధ్యే వామనమాసీనం విశ్వేదేవా ఉపాసతే."

"శరీరమునందున్న హృదయమునం దాసీనుఁడయిన వామనుని (పరమాత్మను)
అందఱు దేవతలునుగూడ ఉపాసించెదరు." కావున అహంకారమూలమును బడ
యుటకు పరలోకమునుండి నేనీలోకమున మానుషజన్మమునందితిని. ఇట్లవతరించినను
ఇంత కాలమునకుఁగూడ అహంకారమూలస్వరూపము నొందనయితినని తాత్పర్యము.

మూ. ఏష ప్రౌఢో భగవతి! బహులం గర్జత్యహఙ్కారః।
ఏతస్మిన్నయి కాలే భవతీ చాబోధి కుణ్డలినీ. ౨౨

భగవతీ! మిగులబలిసిన నాయీయహంకారము- అధికముగా గర్జించుచున్నది. తల్లీ! ప్రౌఢమగు నహంకారము గర్జించుచున్న యీ సమయమునందు కుండలినీశక్తివగు నీవుకూడ మేల్కొనుచున్నావు.

ప్ర భ:— గర్జించుచున్నది. దర్పముతో శబ్దించుచున్నది, ప్రౌఢము= ప్రవృద్ధము. మిక్కిలిబలిసినది, కుండలిని- ప్రబుద్ధమగునపుడు- అహంకారమునకు ప్రాబల్యముండఁగూడదు. అయినను అది- ప్రబలమేయగుచున్నది- కావున నది హంతవ్యమని ముందు చెప్పనున్నాఁడు.

మూ. తవ పశ్చాత్ సమ్భూతిం జానాతి న సోఽయమద్యాఽపి
ప్రాగివ గర్జతి ధీరం బిభేతి మృత్యోర్న నేదిష్ఠాత్. ౨౩

ఆ యీ యహంకారము- నీపశ్చాత్ప్రాదుర్భావమును (నీవు తరువాత ప్రాదుర్భవించుటను) ఇప్పటికిని తెలిసికొనకున్నది. కావుననే పూర్వమునందువలెనే ధీరముగా గర్జించుచున్నది. అత్యంతసమీపమగు మృత్యువువలనఁగూడ భయపడకున్నది.

ప్ర భ:— యోగసాధనమున పశ్చాన్మార్గమనియు, పురోమార్గమనియు- రెండుతెరువులు రాజయోగసారమను గ్రంథమునఁ బ్రతిపాదింపఁబడినవి. "అంశే నావిశ్యాదౌ" 'యాతాయాతవిహారే' అను ఉమాసహస్ర ప్రథమశతకమునందలి నాల్గవస్తబకమునందున్న 5, 6వ శ్లోకములయందుఁగూడ- ఈపశ్చాన్మార్గ- పురోమార్గద్వయము విస్తరింపఁబడినది. (ఈయంశమును ప్రథమశతకమునఁ జూచునది.) అహంకారము తెలివిలేనిది. కావున తనవెనుక నీవావిర్భవించుచున్నావని యది యెఱుఁగదు. (అహంకారము నశించినతరువాతనే కుండలినీప్రాదుర్భావము పూర్ణమగునని యర్థము.) అహంకారము ముందుండఁగా, భగవతియగు కుండలిని వెనుక మేల్కొని ప్రకాశించును. ఇదియే కుండలినివగు నీయొక్క పశ్చాత్ప్రాదుర్భావము. ఈనీ ప్రాదుర్భావమును- ముందుండి గర్జించుచున్న యహంకారమెఱుఁగదు. కావుననే వెనుక గర్జించినట్లే యిప్పటికిని గట్టిగా గర్జించుచున్నది. మృత్యువు తన్ను మిక్కిలియు సమీపించినదను భయముకూడ దానికిఁగలుగుటలేదు. (దానికి మృత్యుభీతికూడ లేదు) అని తాత్పర్యము. కావుననే నీకాయహంకారమును బలిగా నిచ్చెదననుచున్నాఁడు.

మూ. అతిపుష్టమహఙ్కారం పశుమేకం తుభ్యమర్పయతే
ప్రమథపతిప్రాణేశ్వరి! గణపతిరేకాన్తభక్తోఽయమ్. ౨౮

ప్రమథగణపతిప్రాణేశ్వరివగుజననీ! ఏకాంతభక్తుఁడగు ఈగణపతి- నీకొఱకు- అతిపుష్టమగు (బాగుగాబలిసిన) ఈయహంకారపశువును సమర్పించుకొనుచున్నాఁడు.

ప్ర భ:— ప్రమథగణములనఁగా, భూతసమూహములు. వానిప్రభువగు ఈశ్వరుని ప్రాణములకు నీవీశ్వరివి. "నేను వేఱొకదేవతను విశ్వసింపని నీయంతరంగభక్తుఁడను. తెగబలసిన యీ నాయహంకారపశువును నీకు బలిగానిచ్చుచున్నాను. బలిసినపశువేగదా! హోమమున కుపయుక్తమగు ద్రవ్యము. ఈబలిని స్వీకరించి కర్తవ్యమును నిర్వహింపుము" అని భావము.

మూ. ఉపగీతయో గణపతేః, ఉపతిష్ఠన్తామిమాః ప్రీత్యా।
ఉత్సవసహస్రలోలా ముకారవాచ్యస్యగృహనాథామ్. ౨౯

గణపతి కవికృతములగు- ఈ యుపగీతులు:—
ఉత్సవసహస్రలోలయు, ఉకారవాచ్యుఁడగు శివునియొక్క గృహిణియునగు పార్వతిని ప్రీతితో సమీపించి సేవించుఁగాత!

ప్ర భ:—ఉపగీతులు=ఉపగీతివృత్తరచితములగు స్తుతులు. ఉత్సవసహస్రలోల=కుండలినీశక్తియొక్క సంతతములగు విలాసములు- ఉత్సవసహస్రములు (ఉత్సేకములు) వానియందు చలించునది. ఉకారవాచ్యుఁడు ఉకారపదముచేఁ దెలియఁదగిన స్వరూపముగఁ గలవాడు.

ఇది సవ్యాఖ్యమగు చతుర్దశ స్తబకము.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ,

శ్రీ భారతీ దేవ్యై నమః.

ఉమా సహస్రము.

పంచదశ స్తబకము

(చతుర్థ శతకమున తృతీయ స్తబకము)

అవ:— పదునేడవదియగు నీస్తబకమున దేవీవైభవమును పరిసంగించి ఇపుడు- తద్ధ్యాన ప్రకారమును ప్రస్తావించుచున్నాఁడు. [ఈయంశములు- శ్రీగణపతిమునీంద్రుల స్వానుభవములని తెలియునది]

మూ. ఆపదామపహరన్తు తతింనః
సమ్పదామపి దిశన్తు సమృద్ధిమ్ ।
దన్త కున్దరుచి దత్తబలాని
వ్యోమ కేశ సుదృశో హసితాని.

శివుఁడు వ్యోమకేశుఁడు. ఆవ్యోమకేశుని కాంత- పార్వతి. మల్లెపూవులనుబోలినదంతముల కాంతులుగల శ్రీపార్వతీహసితములు మా యాపదలనన్నిటిని తొలఁగించుఁగాక! సంపదలనన్నిటిని సంఘటించుఁగాక!

ప్రభ:- వ్యోమమనఁగా, ఆకాశము. ఆకాశమే జుట్టుగాఁగల శివుఁడు వ్యోమకేశుఁడు. ఆవ్యోమకేశుని కాంతయగు ఉమాదేవి దంతములు మల్లెపూవులవలె నుండును. ఆదంతముల కాంతులు మాకు బలమునిచ్చునని చెప్పుటచేత- ఆహసితములు- శుభ్రములనియు, శోభావహములనియు, స్ఫురింపఁజేయఁబడుచున్నవి. "హసితములు" అనుచోటనున్న బహువచనముచేత- అవి క్షణక్షణమునందును విలసిల్లుచుండుటయు, మందములగుచుండుటయు, ధ్వనితము. ఆపదలనునివారించి, సంపదలను సంఘటించునవియగు దేవీమందహసితములు- ఈస్తబకముయొక్క ప్రారంభమునందుఁగూడ నిట్లుస్తుతింపఁబడినవని తెలియునది.

మూ. అల్పమప్యధికశక్తి సమృద్ధమ్
మన్దమప్యధిక సూక్ష్మవిసారమ్।
సుస్మితం స్మరవిరోధి రమణ్యాః
కల్పతాం మమకులస్య శుభాయ. ౭

అల్పమయినను- అనల్పశక్తిసమృద్ధమును, మందమయినను- అధికసూక్ష్మ విసారమును, అగు కామారిరమణీ సుస్మితము- మాకులమునకు శుభము నొసంగుఁగాత!

ప్రభ:-అనల్పశక్తిసమృద్ధము=అనల్పమగు=ఎక్కువయగు శక్తిచేత, పూర్ణము మందము—అలసము. అధికసూక్ష్మవిసారము=మిక్కిలి సూక్ష్మమగుచున్న నప్రబలమగు వేగముచేత స్థూలదృష్టికిఁగూడ గోచరమగు ప్రసారముగలది. కామారిరమణీ, సుస్మితము=కామునకు శత్రువగు శివునిరాణియగు పార్వతియొక్క సుస్మితము= శోభనమందహాసితము. అల్పమయినను-అనల్పశక్తిగలదియు, మందమయినను అమందమయిన ప్రసారముగలదియు అగుచు సకలకుల మంగళాధాన సమర్థమగు దేవిమందస్మితము ప్రార్థింపఁబడినది. ఆసుస్మితము- కామ- విరోధికిఁగూడ- కామాధాయిని యనునర్థమువలన మూలమునందలి 'స్మరవిరోధిరమణీ' పదము (కామారి రమణిఅగు పదము) సాభిప్రాయమగుచున్నది. ఇట్లు- అంతటనుగూడ అన్యోన్యవిరోధమే చెప్పఁబడినది. మీఁదివిరోధము- సుస్మితప్రభావమువలన పరిహరింపఁబడుచున్నది. కావున నిది విరోధాభాసాలంకారమగును.

"హేతూనామసమగ్రత్వే కార్యోత్పత్తిశ్చ సా మతా,

సంపూర్ణమగు హేతువులేకున్నను కార్యము కలిగినట్లు చెప్పఁబడినయెడల నది కూడ విభావనయే యగును.'' అను చంద్రాలోకలక్షణము ననుసరించునెడల నిది విభావనాలంకారమగును.

మూ. పుష్కరాద్ రవిమతో భువమేతాం
భూమితశ్శశధరం క్రమమాణా
నైవ ముఞ్చతి పదం బత పూర్వం
నోత్తరం వ్రజతి నేశపురన్ధ్రీ.

ఈశ్వర పురంధ్రియగు జగన్మాత- పుష్కరమునుండి (పరమవ్యోమమునుండి) సూర్యమండలమునకును సూర్యునినుండి భూమికిని

భూమినుండిచంద్రమండలమునకును పాదముచేత వెళ్లుచున్నను ముందుంచిన పదమును విడువనే విడువదు. ఉత్తరపదమునకు వెళ్ళఁగమానదు. ఇది యాశ్చర్యమగుచున్నది.

ప్ర భః-పరమేశ్వరి- సృష్టికాదియగు పరమాకాశమునుండి బయలువెడలి సూర్యునియందు పాదమునుంచును. అక్కడనుండి భూమియందు పాదమునుంచి అచ్చటనుండి చంద్రునియందు పాదన్యాసము నొనర్చుచుండును. ఇట్లు పాదవిక్షేపము నొనర్చునపుడు, మొదట రవియందుంచిన పదమును విడువకయే, ఉత్తరపాదమును భూమియందుంచుచున్నది. ఈరెంటియందును ఉంచిన పదక్రమమును విడువకయే యెల్లప్పుడును చంద్రమండలమునందుఁగూడ పాదన్యాసము నొనర్చుచుండును. లోకులందఱును పూర్వపదమును విడిచియే ఉత్తరపదము నుంచుదురు- పరమేశ్వరి- అసాధారణమగు పదక్రమము కలది. కావున మాకాశ్చర్యము నుదయింపఁజేయుచున్నదని భావము. "భగవతి- ఒకవస్తువును సృజించి, ఇంకొకవస్తువును సృజించునపుడు పూర్వపూర్వసృష్టిని విడువదు. ఉపేక్షింపదు. అది యామహేశ్వరి యొక్క- అసామాన్యమగు విభూతి" అని తాత్పర్యము.

మూ. భూషణేష్వివ సవిత్రి! సువర్ణం
మృత్తికామివ ఘటేష్వఖిలేషు
విశ్వవస్తుషు నిరస్తవిశేషాం
దేవి! పశ్యతి సతీంవిబుధస్త్వామ్. ౪

దేవీ! సవిత్రీ! భూషణములయందు సువర్ణమునువలెను, ఘటములయందు మృత్తికనువలెను; సర్వవస్తువులందును నిరస్తవిశేషవగు (నిర్విశేషవగు) నిన్ను- పండితుఁడు- సతినిగా (అభిన్నమగు సత్తామాత్రముచేత నున్నదానిగా) చూచును.

ప్ర భః—హార- కేయూరాద్యులగు నాభరణములకు సువర్ణమే స్వరూపమగునట్లు, ఘటాదులకు మన్నే స్వరూపమగునట్లు 'సతి' అను పేరుగల నీవే సర్వమునకును గూడ స్వరూపమైయున్నావు. "వాచారమ్భణం వికారో నామధేయం మృత్తికేత్యేవసత్యమ్" "కుండ, మొదలగు వస్తువులన్నియు వికారములు. అవి మట్టియొక్క పరిణామములు. కావున నవియన్నియు వాక్కుచేఁ దెలుపఁదగిన నామములేకాని సత్యము కావు. వానికి మూలమగు మట్టియే సత్యమయినది" అని ఛాందోగ్యోప

నిగత్తు వాక్యాముచున్నది. కావున విశ్వమునందలి వస్తువులన్నియుఁగూడ సతి(సత్తా రూపిణి) వగుటవలన సర్వమయివగు నీకంటె వేఱు కావేరవు. కావున పండితుఁడు నిన్ను భేదములేనివానవగు సతివని తెలియునని భావము. "నిర్విశేషము నిరస్త విశేషః" అను వేఱొక పాఠముగూడ గలదు. సర్వవస్తువులయందును నిరసింపఁబడిన భేదముగల (అభేదము నవలోకించు) పండితుఁడు- సతిగా, అనఘా. ఈనికియే స్వరూపముగాఁగలవానినిగా నిన్ను సాక్షాత్కరింపఁజేసికొనునని వాని యర్థము.

మూ. కిట్టభూత మఖిలేశ్వరజాయే!
దృశ్యజాతమఖిలఁ నిజపాకే
ప్రాణ- బుద్ధి- మనసా మిహావర్గః
సారభూత ఇతి సూరిజనోక్తిః. ॥౨౬॥

సర్వేశ్వర సహధర్మిణివగుజననీ! స్వీయమగు (నీచేఁ జేయఁ బడుచున్న) పచనక్రియ (వంట) యందు- దృగ్గోచరమగు స్థూలవస్తు జాతమంతయుఁగూడ కిట్టభూతము (అసారాంశభూతమగు మలమువలె నున్నది) అగుచున్నది. ఇచట, ప్రాణ- బుద్ధి- మనోవర్గము- సార భూతము అని పండితవచనముగలదు.

ప్రి భ:—"కిట్టభూతము" "కిట్టం మలేఽస్త్రియామ్" అని యమరము. కావున కిట్టమనగా మలము. భూతపదమిచట స్వరూపవాచకము కాని సాదృశ్య పరము కాదు. కావున కిట్టభూతమనఁగా మలమువలె నున్నది అనియర్థము. ప్రాణ- బుద్ధి - మనోవర్గము = ప్రాణముల యొక్కయు, బుద్ధుల యొక్కయు, మనస్సులయొక్కయు సమూహము. సారభూతము = సారత్వమునొందినది. స్థూలమగు వస్తువంతయుఁగూడ—సారాంశము నావరించి మలమువలె నుండుచున్నది. దానిని వండునపుడు ఒక్కొక్కవస్తువునుగూడ దానియందలిసారమును విసర్జించు చుండును. స్థూలము—మలమువంటి స్వరూపముగలదనియు, దానికంటె సూక్ష్మ మగునది తత్సారమనియు నభిప్రాయపడియిట్లు శ్రుతులుద్ఘోషించుచున్నవి. కావుననే మూలమున "సూరిజనోక్తిః" (పండితవచనముగలదు) అని చెప్పఁబడినది.

అ చె ట్లని న:—

"పృథివ్యా ఓషధయః, ఓషధీభ్యోఽన్నం, అన్నాత్ పురుషః స వా ఏష పురుషోఽన్నరసమయః" "పృథివినుండి, దానిసారమగు ఓషధులును, ఓషధుల నుండి తత్సారమగు అన్నమును, అన్నమునుండి తత్సారమగు పురుషుఁడును, విస

ర్జింపఁబడుచున్నారు. ఆ యీ పురుషుఁడు- అన్నరసమయుఁడు'' అని తైత్తిరీయశ్రుతియందు పురుషునకు సారభూతత్వము జెప్పఁబడినది. పృథివ్యా ఆపోరసః అపామోషధయోరసః, ఓషధీనాం పురుషోరసః పురుషస్యవాగ్రసః, వాచఋగ్రసః, ఋచః సామరసః సామ్న ఉద్గీథోరసః'' పృథివికి సారము- జలము. జలమునకు సారము- ఓషధులు. ఓషధులకుసారము- పురుషుడు. పురుషునకుసారము-వాక్కు వాక్కునకుసారము-ఋక్కు. (స్తుతి) ఋక్కునకుసారము సామము (అనుభూతి ప్రకటనసమర్థమగు గానము) సామమునకు సారము- ఉద్గీథము, అని ఛాంధోగ్యము నందలి ఉద్గీథవిద్యాప్రస్తావమునఁ జెప్పఁబడినది. దీనివలన స్థూలమునుండి సూక్ష్మమును, సూక్ష్మమునుండి సూక్ష్మతరమును, సారాంశమను నంశము శ్రుతి ప్రోక్తమగుచున్నది. "అన్నమశితం త్రేధావిధీయతే'' అని యుపక్రమించిన ఛాందోగ్యమునందలి ఆరవప్రపాఠకమున అన్నముయొక్క సారాంశము మనస్సనియు, జలముయొక్క సారాంశము ప్రాణమనియు, తేజస్సుయొక్క సారాంశము వాక్కనియుఁ దెలుపఁబడినది. దృశ్యమగు నీబ్రహ్మాండమంతయుఁగూడ మనస్థూల దృష్టికి స్థిరమగువస్తువువలె భాసించుచున్నను, సర్వేశ్వరియగు మహాశక్తిచేత పరిపచ్యమానమై స్వసారమగు ప్రాణాదిరూపమున పరిణమించుచునే యుండుననునది కవి హృదయమని గుర్తించునది.

మూ. సారమీశ్వరి! తిలేష్వివతైలం
విగ్రహేషు నిఖిలేషునిగూఢమ్
యేధియా మథనతోవిదురేశం
తే భవన్తి విబుధాస్త్వయిలీనాః. ॥౬

ఈశ్వరీ! తిలలయందు (నూవులయందు) తైలమువలె సకల శరీరములయందును, నిగూఢమగు (అంతర్గతమగు) సారమును అనఁగా, స్థిరాంశమగురసమును సూక్ష్మమగుబుద్ధిచేత మథించుటవలన తెలిసికొనిన విద్వాంసులు- నీయందుఁలయించి, నీస్వరూపమునొందుచుందురు.

వి భః:—నిగూఢము=గుప్తము, దాచబడినది. తిలేషుతైలం, దధనీవసర్పి, రాపఃస్రోతస్వరణీషుచాగ్నిః ఏవమాత్మాఽత్మనిగృహ్యతేఽసౌసత్యే నైనంతపసా యోఽనుపశ్యతి॥
(శ్వేతాశ్వతరోపనిషత్ 1 అ 15 శ్లో)

నువ్వులయందు నూనెవలెను, పెరుగునందు నేయివలెను, నదులయందు జలమువలెను, అరణులయందు అగ్నిహోత్రమువలెను, ఎవ్వఁడు ఈయాత్మను

(తను) సత్యముచేతను, తపస్సుచేతను, మాంచుచుండునో, వానిచేత నీయాత్మ-తనదేహమునందే యీవిధముగ గ్రహింపఁబడును. తనశరీరమునందే, అన్నమయమును ప్రాణమయమునందును, ప్రాణమయమును మనోమయమునందును, మనోమయమును విజ్ఞానమయమునందును విజ్ఞానమయమును ఆనందమయమునందును, ప్రవిలాపనము (ఉపసంహారము) చేయుటవలన పూర్ణానందరూపమయిన స్వాత్మరూపము తెలియఁబడుచుండును. మనస్సునకును- ఇంద్రియములకునుగూడ ఏకాగ్రత కలుగుటయే తపము. యథార్థము, ప్రాణిహితమునగువచనము సత్యము- ఈతపమును, సత్యమునుగలవాఁడే- తనశరీరమునందే ఆత్మసాక్షాత్కారమును బడయునని తెలియునది.

మూ. ఆయసంత్రిభువనేశ్వరి! పిణ్డమ్
సహ్నినేవ తపసా తను పిణ్డమ్।
యస్యచిజ్జ్వలన జాలమయం స్యాత్
తప్తముస్య! స శివాలయ భూతిః. ॥౭॥

త్రిభువనేశ్వరీ! అగ్నిచేత తప్తమగు. అయఃపిండమువలె, తపస్సుచేత తప్తమగునెవ్వని తనుపిండము- చిదగ్నిజాల (సమూహ) మయమగుచుండునో, వాఁడు, నీకు- ఆవాసస్థానమగును.

ప్ర భ:—అయఃపిండము=ఇనుపగుండు, తనుపిండము=శరీరమను ఘనపదార్థము. చిదగ్నిజాలమయము=చైతన్యమనునగ్ని సంహతియొక్క వికారము. అగ్ని జ్వలితమగు లోహపిండము- జ్వలనమయమగునట్లు తపస్తప్తమగు యోగిశరీరము- జ్ఞానజాలమయమగును. ఏయోగికి- ఇట్లు జ్వలితమగు చిన్మయశరీరముండునో అతఁడే ధన్యుఁడై, నీకు- ఆవాసస్థానమగునని తాత్పర్యము.

మూ. యోఽరణేర్మథనతోఽతి పవిత్రమ్
వీతిహోత్రమివ వీతకలఙ్కః।
ప్రాణముజ్జ్వలయతిస్వశరీరాత్
త్వామసావభయ దేహఽతియష్టుమ్. ॥౮॥

అభయప్రదవగు దేవీ! అపహతకళంకుఁడగు నేపురుషుఁడు- అరణిని మథించుటవలన- అతిపవిత్రమగు అగ్నినివలె, స్వశరీరము నుండి (జీవనహేతువగు) ప్రాణమును, మీఁదికి జ్వలింపఁజేయుచుండునో, అతఁడు- నిన్ను యజించుటకు (పూజించుటకు) అర్హుఁడగుచుండును.

ప్ర. భ:— యజమానుఁడు— అరణిని మథించి, అగ్నినుజ్జ్వలింపఁజేసి, యజ్ఞము నొనర్చుటకు— అర్హుఁడగునట్లు— యోగి— తపోబలమువలన శరీరమునుండి ప్రాణమునుజ్జ్వలింపఁజేసియే నిన్ను పూజించుట కర్హుఁడగునని తాత్పర్యము— ఇదియే అంతర్యాగము. భగవతియగు నీశ్వరి— ఈయంతర్యాగముచేతనే సమారాధింపఁదగినదని ప్రతిపాదింపఁబడినది. శరీరమే— అరణి. తపోధ్యానాదికమే—మథనము. కుండలినీప్రేరితమగు ప్రాణజ్వాలయే— అగ్ని అని— ఉపమానోపమేయముల నెఱుఁగునది.

స్వదేహమరణిం కృత్వాప్రణవంచోత్తరారణిమ్
ధ్యాననిర్మథనాభ్యాసాద్దేవం పశ్యే న్నిగూఢవత్॥

(శ్వేతాశ్వతరోపనిషత్తు 1-14)

"విద్వాంసుఁడగుయోగి— తనశరీరమును— అధరారణిగాను, వేదాదియందును, వేదాంతమునందును ప్రతిష్ఠితమగు ఓంకారమును— ఉత్తరారణిగాను, చేసి, ధ్యానమను మథనముయొక్క— అభ్యాసముచేత, అరణియందు గూఢమగు అగ్నినివలె, ఆత్మస్వరూపమును సమీక్షింపవలయును."

మూ. ప్రాణతా శ్వసితమేవవిచార్యమ్
కుర్వతా కరణమేవ నిభాల్యమ్
గచ్ఛతా గమన మేవ విశోధ్యమ్
తత్తనా మథన మాగమ బోధ్యమ్. |౯|

ప్రాణనమునొనర్చుచున్న (శ్వాసమునొనర్చుచున్న) జనుఁడు. (యోగి) శ్వసితమునే (ఊర్పునే) విచారించునది. పనిచేయుచున్నవాఁడు— పనినే సమీక్షించునది. గమించుచున్నవాఁడు— గమనమునే పరీక్షించునది. ఇదియే— (ప్రాణన— కరణ— గమనవిచారణమే) శరీరమునందు— ఆగమబోధ్యమగు మథనమగును. [ఊపిరితీయునపుడు— ఊపిరిని, పనిచేయునపుడు పనిని, నడచునపుడు నడకను, పరీక్షించుటయే— వేదోక్తమగు యోగమథనము]

ప్ర. భ:— పూర్వశ్లోకమునందు మథనప్రసక్తి కలిగినది, కావున దానిస్వరూపమీశ్లోకమున వ్యాఖ్యానింపఁబడినది. ఊపిరిగొనునపుడు ఎట్లుశ్వసించుచున్నాను? ఊర్పుచున్నవాఁడెవ్వఁడు? అని విచారింపవలయును. ఇట్లే, పనిచేయుచున్నపుడు— ఎవఁడు పనిచేయుచున్నాఁడు— ఎట్లుచేయుచున్నాఁడు? అని బుద్ధిచేత నెఱుఁగ

వలయును. నడచునపుడు- ఎవఁడు గమించుచున్నాఁడు! ఎట్లుగమించును! అని యాలోచింపవలయును. ఈ మూఁడింటినిగూడ నిట్లు పరీక్షించుటయే దేహమున ప్రాణము నుజ్జ్వలింపఁ జేయునదియగు మథనమగునని నిగమాగమ తాత్పర్యము. ఇది యొక్కటి గుర్తింపఁదగియున్నది. ఒకఁడు- పనిచేయుచున్నను, ఎచటికైనిపోవుచున్నను గూడ- ఊపిరిపీల్చుట మానఁడు. అట్లూరక యున్నప్పుడుగూడ ఊర్పును సమీక్షించుచుండుట మథనమేయగును. కావున, ఊరక యున్నప్పుడును, పనిచేయుచున్నప్పుడును పోవుచున్నప్పుడునుగూడ- సర్వవిధముల చేతను మథనము నొనర్పవలయు నని భావము.

మూ. యోరసం పిబతి మూర్ధసరోజాత్
సోమపోఽయమనఘః ప్రయతాత్మా
అగ్నిహోత్రిమఖిలేశ్వరి! నిత్యం
మూలకుణ్డ దహనస్థితి రస్య. ॥౧౦॥

ఏయోగి- శిరస్సునందున్న సహస్రారకమలమునుండి స్రవించుచున్న రసమును- ఆస్వాదించునో, ప్రయతాత్ముఁడగు నాయీ యనఘుఁడు- సోమపుఁడు (సోమరసపాయి) అగుచున్నాఁడు. అఖిలేశ్వరీ! ఈసోమపునకు- మూలాధారమను కుండమునందలి యగ్నిస్థితి- నిత్యమగుటవలన నితఁడు- నిత్యాగ్నిహోత్రుఁడగును.

ప్ర భ:—ప్రయతాత్ముఁడు=నియతమగు, అంతఃకరణము లేక, స్వభావము లేక శరీరముగలవాఁడు. అనఘుఁడు=పాపములేనివాఁడు. సోమపుఁడు=సోమముమ రసము త్రాగువాఁడు. (లోకమునం దొనర్పఁబడు బహిర్యాగమున- నియత కాలమునందు, పరిశుద్ధమగు నాచారముగల యజమానుఁడు. కుండమునందలి యగ్నివలన సోమమునువండి- దాని నాస్వాదించి సోమపుఁడై పవిత్రుఁడగును. ఈయంతర్యాగమున మాత్రము కాలనియమములేక మూలాధారమను కుండమునందలి యగ్ని (ప్రాణాగ్ని) నిత్యమును జాగరూకమై యుండుటవలన- యజమానుఁడగుయోగి ముందే పవిత్రుఁడై, శిరస్సునుండి స్రవించుచున్న సోమరసము నాస్వాదించి, సోమపుఁడగునని భావము.)

మూ. చిన్మయీ పిబసి సోమమిమం కిమ్
సోమ ఏవ కిమసా వసి మాతః!
పీయసే పిబసి చ స్వయమేకా
పేయపాత్ర్యయుగలం కిము భూత్వా. ౧౧

మాతా! చిన్మయివై (భోక్త్రివై) నీవు ఈసోమమును త్రావు చున్నావా? (లేక) త్రాగఁబడుచున్న యీసోమమే నీవా? ఒక్కతెవే యగు నీవు స్వయముగా పేయమవై (త్రాగఁబడు రసమై) త్రాగఁ బడుచు, పాత్రివై (త్రాగుదానవై) త్రాగుచు, ఉన్నావా? (నీవు త్రాగుదానవా? త్రాగఁబడురసమవా? లేక రెండును నీవా?)

ప్ర భ:—సోమము=సహస్రారమునుండి స్రవించుచున్న రసము. (నీవే 'పాత్రివి', 'పేయమవు' అగుచు ఉభయధర్మము నవలంబించుచున్నావా?) చిన్మయి వగు నీకొక్కతికే భోక్తృత్వము-భోగ్యత్వము కలుగుచున్నదా? అని భావము.

మూ. తైజసం కనక మగ్నివితప్తం
తేజ ఏవ కనకాఙ్గి! యథా స్యాత్
మోదరూపకలయా తవ తప్తం
తన్మయం భవతి మోదజ పిణ్డమ్. ౧౨

కనకాంగీ! అగ్నిచే విశేషించి తప్తమైన తైజసమగు (తేజోమయమగు) కనకము— తేజమేయగునట్లు— నీ యానందస్వరూపాంశముచేత తప్తమగు (తపస్సుచేత సాధింపఁబడి సంస్కరింపఁబడిన) ఆనందజాతశరీరము— ఆనందమయమేయగును.

ప్ర భ:—గనియందు పుట్టిన తేజస్సే- కనకమని చెప్పుదురు. కావున తైజసమగు కనకము అగ్నిచేత బాగుగా కాల్పఁబడి (మరల) తేజస్సేయగునట్లు—

"ఆనన్దాద్ధ్యేవఖల్విమాని భూతానిజాయన్తే"

"ఆనందమునుండియే యీప్రాణులు పుట్టుచున్నారు" అను శ్రుతివలన, ఆనందమునుండి జనించినశరీరము- నీయానందకలచేతనే సంస్కరింపఁబడి ఆనందమయమే యగునని తాత్పర్యము. (యోగానుభవ సంపన్నుఁడగు మహాకవి పూర్వోక్తశ్లోకములందువలె నిందును, మీఁదిశ్లోకముల యందును గూడ స్వానుభూతిని ప్రదర్శించుచున్నాఁడని తెలియుచున్నది. ఇదియంతయు యోగిదృష్టమేయగును.

మూ. కాఽపి మోదలహరీ తవ వీచి
స్సిన్నధా దశశతారసుధాబ్ధేః
పూరయత్యఖిలమమ్బ! శరీరం
నేహ వేద్మి యదమే జడభాగమ్. ౧౩

ఉత్తమురాలవగు ఓ అమ్మా! (దశశతారసుధాబ్ధినుండి) సహస్రారమను సుధాసాగరమునుండి వెలికివచ్చిన నీయొక్క ఆనందలహరియొక్క, నాకానొకతరంగము— (నా) శరీరమును సకలమునుగూడ (ఆత్మచేత) నిండించుచున్నది. నేను— ఈ దేహమునందు జడమగుభాగమును (అచేతనాంశమును) తెలిసికొనకున్నాను.

ప్ర భ:—దశశతారసుధాబ్ధి=సహస్రారమను నమృతసముద్రము. సహస్ర + అర + కమలము=పదివందలరేకులు గలది. ఆసహస్రారకమలమునుండి నిర్గమించి, నాశరీరము నంతనుగూడ ఆత్మచేత నింపుచున్న నీ యానందసుధావీచికవలన— 'నా శరీరమంతయు చిన్మయమే' అను అనుభవముకలిగించు అనిర్వచనీయమగు దశ నాకు గలిగినదని భావము. (సహస్రారచక్రమునుండి ఇట్టిదని చెప్పుటకు వీలుపడని యేదోయొక ఆనందతరంగము నాశరీరమునంతను స్వరూపానందముతో నింపుచున్నపుడు అమృతానందప్రపూర్ణమయిన యీశరీరమునందు— ఏదిజడమో, ఏది చేతనమో, తెలిసికోరాని తన్మయస్థితి గలుగుచున్నదని భావము)

మూ. సేయ ముత్తమతమా నిపతన్తీ
శీతలాద్ దశశతార పయోదాత్
ప్రేరితాదఖిలరాజ్ఞి! భవత్యా
బుద్ధిసస్యమవతాద్రసవృష్టిః. ౧౪

అఖిలరాజ్ఞీ! నాచేత నిప్పుడనుభవింపబడుచున్న ఉత్తమోత్తమమగు రసవృష్టి— భగవతివగు నీచేత ప్రేరణముచేయబడినదై, శీతలమగు సహస్రారపయోదమునుండి క్రిందికి ప్రసరించుచున్నది. ఈ రసవృష్టి— బుద్ధిసస్యమును (బోధమనుధాన్యమును) రక్షించుగాత!

ప్ర భ:—శరీరమను క్షేత్రమునుండి యుదయించిన జ్ఞానమనుసస్యమును, సహస్రారమేఘమునుండి నిపతితమగుచున్న రసమనువర్షము— కాపాడుగాత మనియర్థము.

శరీరమును క్షేత్రముగాను, జ్ఞానమును సస్యముగాను, రసమును వర్షముగాను చెప్పుటవలన నిందు రూపకము స్పష్టమగుచున్నది.

మూ. దుగ్ధ సిన్ధు మథనా దమృతంవా
శబ్దసిన్ధు మథనాత్ ప్రణవోవా
లభ్యతే సుకృతిభి స్తవవీచి
ర్మూర్ధకఞ్జమథనాద్రసవర్షః. ॥౧౫॥

క్షీరసాగర మథనమువలన అమృతముపలెను శబ్దసాగరమథనమువలన ప్రణవమువలెను శిరః కమల మథనమువలన నీయానందవీచి యగు ఈరసము, పుణ్యవంతులకు లభించుచున్నది.

ప్ర భా:—శిరఃకమలము =సహస్రారము. క్షీరసముద్ర మథనమువలన, తత్సారభూతమగు నమృతము లభించునట్లును, శబ్దసమూహపరిశోధనమువలన తత్సారమగు ఓంకారము లభించునట్లును, సహస్రారమథనమువలన నీయానందకలయగు సోమరసము లభించునని భావము.

మూ. అస్థిషు ప్రవహతి ప్రతివేగం
మజ్జసారమమృతం విదధానా
బిభ్రతీ మదమనుష్ణ మదోషం
మూర్ధకఞ్జ నిలయే తవధారా. ॥౧౬

శిరఃకమలనిలయవగు జననీ! నీసోమరసధార— అస్థులందున్న మజ్జసారమగు (ఎముకలయందలి సారమగు నేయియొక్క సారమగు) అమృతమును విస్తరింపఁజేయుచు, అనుష్ణమును, అదోషమును అగు మదమును (బోధవిశేషమును) ధరించుచు, ప్రతివేగమునందును ప్రవహించుచున్నది.

ప్ర భా:— శిరఃకమలనిలయ = సహస్రారమను కమలమున నివసించునది. మజ్జనశబ్దము నకారాంతమును, ఆకారాంత స్త్రీలింగమునుగూడ నగుచున్నది. మజ్జత్యస్థిషు ఇతి మజ్జా=అస్థిసారః' అనునదివ్యుత్పత్తి. "మదము"=బోధవిశేషము, లేక మత్తు. లోకసామాన్యమగుమదము— మరపునుకలిగించుట యను దోషముతోఁ గూడినదియు, తాపమును గలిగించునది యగు ఉష్ణము (వేడి)తోఁ గూడినదియు

నగుచున్నది. యోగాభ్యాసమువలన కుండలినీశక్తి-ప్రబోధింపఁబడినపుడు, సోమరసధారాసముదితమగు మదము— ఒకానొకజ్ఞానవిశేషమై యున్నది. కావున నది-దోషయుక్తముగాని, ఉష్ణసహితముగాని కానేరదు. కావున నింపైన భావము నిశ్చలముంగునది. "నీయానందాంశమగు నీసోమరసధార- తాను ప్రవహించుచున్నంతకాలమును మజ్జయొక్క సారభూతమగు నమృతమును విస్తరింపఁజేయుచు, నిర్మలమును, సుశీతలమును నగుచు, బోధవిశేషరూపమగు మదమును ప్రవహింపఁజేయుచుండును."

మూ. తైత్తిరీయకథితో రసలాభః
సోఽయమేవ సకలాగమవర్ణ్యే!
ఏతదేవ శశిమణ్డలనాథే!
తన్త్రభాషితపరామృతపానమ్. ॥102॥

సర్వవేదస్తుత్యవగు జననీ! ఇదియే (ఇప్పుడనుభవింపఁబడుచున్నదియు, మజ్జయందు ప్రవహించుచున్నదియునగు సహస్రారసోమమే) తైత్తిరీయశ్రుతియందు కథితమగు రసలాభమగుచున్నది. ఓసోమమండలనాయికా! ఇదియే- తంత్రశాస్త్రములయందుఁ దెలుపఁబడిన, శ్రేష్ఠమగు అమృతపానమైయున్నది.

ప్ర భః- తైత్తిరీయోపనిషత్తునందు, "రసో వై సః, రసం హ్యేవాయం లబ్ధ్వాఽఽనన్దీభవతి" "రసమే-పరబ్రహ్మము. ఈపురుషుఁడీరసమునే పొంది యానందముగలవాఁడగుచున్నాఁడు" అని చెప్పఁబడిన రసము- సహస్రారమునందలి సోమరసమే అని తెలియునది. ఈసోమరసాస్వాదనమే రసలాభమనియు సోమరసాస్వాదియగు పురుషుఁడే- ఆనందియనియు తెలియవలయును. వైదికులు- బహిర్యాగమున-సోమమను లతను దంచి, ఆ సోమరసమును పానము చేయునట్లు, తాంత్రికులలో నొకతెగకు సంబంధించినవారగు కౌలాచారులు- దేవికి, బహిర్నివేదితమగు సురామృతమును(కల్లును) పానము చేయుదురు. లోకమునందిట్లు వైదికులు యజ్ఞమునందు చేయుచున్న సోమరసపానమును, కౌలాచారులు చేయుచున్న దుష్టమగు సురాపానమును, తాత్త్వికములు (పారమార్థికములు) కావు. ఈరెంటియొక్కయు తత్త్వము-అదోషమును, అనుష్ణమును అగు, మదమును ఆనందలహరిని ప్రవహింపఁజేయునదియగు సహస్రారమునందలి సోమరసముయొక్క ఆస్వాదనమే యనునది సిద్ధాంతము.

మూ. మూర్ధసోమమజరామర రూపే
యుక్తవీక్షణకరేణనిపీడ్య
శమ్భు సున్దరి! సునోమిధినోమి
త్వాం ప్రదీప్తకులకుణ్డ నిశాన్తామ్ ౧౮

అజరామరరూపిణీ! శివసుందరీ! (రసాంతమగు) శిరస్సునందలి సోమమును, యోగస్థితమగు వీక్షణమను హస్తముచేత పిండి—సవమును (యజ్ఞమును) చేయుదును. ప్రదీప్తమగు కులకుండాగ్నియందు నివసించుచున్న నిన్ను తృప్తినొందఁజేయుదును.

ప్ర భ:—(సవము) "సూయతే సోమోఽస్మిన్నితిసవః" దీనియందు సోమము తడుపఁబడును_గావున యజ్ఞము_సవమని చెప్పఁబడును. కులకుండాగ్ని=మూలాధారమునందలి యగ్ని. యజమానుఁడు-యాగము నొనర్చునపుడు, అభిషవణఫలకమునందు (సన్నికంటియందు) సోమమును నూరి, రసమునుపిండి- సవము (యజ్ఞము) నొనర్చునట్లు, నేను శిరస్సునందలి సోమమును యోగదృష్టిచేత గదలించి. తదుపరి రసమునుగొని, సవమునొనర్చి, మూలాధారస్థితవగు నిన్నుతృప్తినొందింతునని భావము. హస్తము బహిర్యాగమున నిష్పీడనసాధనమగునట్లు యోగదృష్టి—యీ యంతర్యాగమున నిష్పీడనసాధనమగుచుండును. ఇట్లు- అగ్నీషోమీయమను అంతర్యజ్ఞము-నాచేఁ గావింపఁబడుచున్నదని తాత్పర్యము.

మూ. దృష్టిరేవ రవిదీధితి రుగ్రా
శీర్షకఞ్జ శశినం ప్రవిశన్తీ
శీతలామృతమయీఖలుభూత్వా
యోగినోద్రవతి మోదకలా తే. ౧౯

యోగదృష్టియను ప్రచండమగు సూర్యదీధితి— సహస్రారకమలస్థుఁడగు సోముని:ంందు ప్రవేశించి శీతలామృతమయియై నీయానందకళయగుచు స్రవించుచుండును.

ప్ర భ:—దీధితి=కాంతి. చంద్రునకు స్వయంప్రకాశములేదు. ఉష్ణమగు సూర్యకాంతియే, చంద్రబింబమునందు ప్రతిఫలించి శీతలమై వెన్నెలయగుననునది-జ్యోతిశాస్త్రసిద్ధాంతము. దేవియే- మొదట యోగియొక్క- యోగదృష్టియై సహస్రారమునందుఁ బ్రవేశించి, తరువాత, శీతలామృతమయి యగు ఆనందలహరిని ధరింపఁజేయునని భావము.

మూ. మూర్ధని ద్రవసి యోగ యుతానాం
చక్షుషి జ్వలసి శఙ్కరభామే!
తిష్ఠసి స్థిరపదా కులకుణ్డే
శాహ్యతేఽస్ఖలసి నైవ కదాఽపి. ౨౦

ఓశివప్రియా! యోగయుతుల (నిత్యయోగుల) శిరస్సున (సోమ స్వరూపిణివై ద్రవించుచుందువు వారిదృష్టియందు, దీప్తివై) జ్వలించుచుందువు. కులకుండమునందు స్థిరపదవై యుందువు.

(ఈ స్థానములకంటె) వెలుపల నెప్పుడునుగూడ చ్యుతినొందవు.

ప్రి భ:- స్థిరపదవై=స్థిరమగు స్థానముగలదానవై. కులకుండము=మూలాధారము. చ్యుతినొందవు=తప్పివసింపవు. నిత్యయోగుల శిరోఽక్షి మూలాధారముల యందు స్థిరపడిన నీవు వానినుండి యెన్నఁడును తొలగవని భావము.

మూ. సా యది ద్రవతి మోదకలా స్యాత్
సా యది జ్వలతి చిత్ కలికా స్యాత్
సా పరా స్థిరపదా యది తిష్ఠ
త్యక్షరా భవతి కాచన సత్తా. ౨౧

ఆదేవి- ద్రవించునెడల ఆనందకలయగును. ఆదేవి- జ్వలించునెడల చిత్ కలిక యగును. ఆపరదేవత- స్థిరపద యగునెడల అక్షర యగు నొకానొక సత్త యగును.

ప్రి భ:—ఆనందకల=ఆనందాంశము- ఆనందమయి. చిత్ కలిక=చిత్తేయగుకలిక- చిన్మయి. సత్తా=ఉనికిగలది. సతి. ఒక్కతెయేయగు పరమేశ్వరి సోమాత్మికయై- ఆనందమయి, తేజోరూపిణియై చిన్మయి, అక్షరస్థితియై సతి, అగువని, క్రియా-స్థాన భేదముచేత త్రిత్వము చెప్పఁబడినను- చిదానందమయియగుసతి- సర్వమునుగూడ తానేయగునని భావము.

మూ. పశ్యతా నయన మణ్డలవృత్తిం
గృహ్యసే త్వ మచలాధిప కన్యే!
జానతా దశశతార విలాసం
స్పృశ్యసే విదితమమ్బ! రహస్యమ్. ౨౨

అచలేంద్రకుమారీ! మండలాకారములగు నేత్రములవృత్తిని (దర్శనక్రియను)చూచుచున్న యోగికి నీవు లభించుచుందువు. (రసవర్ణాత్మకమగు) దళశతార విలసితమును (సహస్రార విలాసమును) గ్రహించుచున్న యోగి నిన్ను స్పృశించును. అమ్మా! రహస్యము తెలిసినది!

ప్ర భ:—రసవర్ణాత్మకము=సోమరసమును వర్షించుట స్వరూపముగా, గలది. దళశత + అర + విలసితము=పదివందల దళములుగల సహస్రారము యొక్క విలాసము. దృష్టికి దర్శితయగు యోగికి నీవులభింతువని యర్థము. దృష్ట్యుపాసనము చేత చిన్మయివగు నీయొక్క సాక్షాత్కారమును, సహస్రారామృతదానము చేత ఆనందమయివగు నీయొక్క ప్రాప్తియు, యోగికి సిద్ధించును. ఈ రహస్యమును నే నిప్పుడెఱిగితినని భావము.

మూ॥ వ్యాప్తశక్త్యా నుబలేన లసన్తీ
భానుబిమ్బ నయనేన తపన్తీ
చన్ద్రబిమ్బ మనసా విహరన్తీ
సా పునర్జయతి మూర్ధ్నివసన్తీ. ౨౩

వ్యాపించిన శక్తియగు ప్రాణబలముచేత వ్యాపారము నొనర్చునదియు, భానుబింబమగు నేత్రముచేత తపము నొనర్చునదియు; చంద్రబింబమగు మనస్సుచేత విహారము నొనర్చునదియు నగుదేవి— మరల దేహమునందలి సహస్రారమున వసించుచు జయించుచున్నది.

ప్ర భ:—పరమేశ్వరికి బ్రహ్మాండమున వ్యాపించిన శక్తియే— ప్రాణము. సూర్యుఁడే—కన్ను. చంద్రుఁడే—మనస్సు. "చన్ద్రమా మనసోజాతః చక్షోః సూర్యో అజాయత" అను శ్రుతిచేత, సూర్యుఁడు నయనస్వరూపుఁడనియు, చంద్రుఁడు మానసస్వరూపుఁడనియుఁ దెలియుచున్నది. ఏతత్ కవికూడ స్వవిరచితమగు శివ శతకము నందీయంశము నిట్లు తెలిపియున్నాఁడు. "సౌరం మణ్డలముజ్జ్వలంతవతపః, శ్వాసశ్చరన్ మారుతః." సూర్యమండలము— ఉజ్జ్వలమగు నీతపస్సు. చరించుచున్న వాయువు— నీశ్వాసము. ఆదిత్యుఁడు—తపస్సు— చక్షుస్సు— కూడ నగుననుఅంశము శ్రుతియందుఁగూడ ప్రతిపాదింపఁబడినది. ఇట్లు— బ్రహ్మాండశరీరయగు భగవతి పిండాండమగు సహస్రారమునందుఁగూడ విలసిల్లుచుండునని భావము.

మూ. స్వాగతం సకలలోకనుతాయై
స్వాగతం భువనరాజ మహిష్యై
స్వాగతం మయిభృశం సదయాయై
స్వాగతం దశశతార మితాయై. ౨౪

సకల జగద్ వందితయగు దేవికి- స్వాగతము. సర్వేశ్వరహృదయేశ్వరికి-స్వాగతము. నాయందు సదయమగు పరమేశ్వరికి- స్వాగతము. సహస్రారనివాసినియగు జననికి— స్వాగతము.

ప్ర భ:—స్వాగతము= (మహాదేవియొక్క శుభాగమన విషయము గోరునది యగు (ప్రీతిగౌరవవచనము) దయచేయుము అను గౌరవము. సదయా=కరుణతోఁ గూడినది. ఈ వృత్తములకు యోగానుభూతుల ననుగ్రహించి స్వీయకృపను ప్రదర్శించిన పరమేశ్వరికి స్వాగతము అని యర్థము. సర్వలోక సంస్తుతయు, సర్వేశ్వర నాయికయునగు పరమేశ్వరియే నాయందు దయబూని, నాసహస్రారమున విలసిల్లుచు, విజయము నొందుచున్నదని భావము. యోగియగుకవి పరమేశ్వరి- తన యందు శాశ్వతముగా నిలుచుటకీస్వాగతవచనమును స్తబకమును ముగించునపుడు సమర్పించెనని తెలియునది.

మూ. సత్కవిక్షితిభుజో లలితాభిః
స్వాగతాభి రనఘాభి రిమాభిః
స్వాగతం భణితమస్తు భవాన్యై
ఖేలనాయ శిర ఏతదితాయై. ౨౫

సత్ (ప్రశస్త) కవిలోకరాజునకు సంబంధించిన దోషరహితలు, లలితలునగు ఈ స్వాగతలచేత ఈశిరస్సు (సహస్రారకమలము) నందాడుకొనుటకు వచ్చిన భవానికి స్వాగతము చెప్పఁబడుఁగాత!

పరి భ:—దోషరహితలు = దోషములేనివి, లేక లక్షణసంపన్నలు, లలితలు= కోమలపదములు లేక సుందరగాత్రులు. స్వాగతలు=స్వాగతవృత్తములు లేక అనయాసముగా వచ్చిన స్త్రీలు. ఇచట పరికృతార్థపరములగు పదములచేత సూచ్యార్థమగు స్తబకవృత్తమును సూచించుటవలన ఇది శ్లేషోత్థాపితమగు ముద్రాలంకారమగుచున్నది.

ఇది సవ్యాఖ్యమగు పంచదశ స్తబకము.

ఓం నమోభగవతే శ్రీ రమణాయ,
శ్రీ భారతీ దేవ్యై నమః.

ఉమా సహస్రము.

షోడశ స్తబకము

(చతుర్థ శతకమున చతుర్థ స్తబకము)

అవ:- పదునారవదియగు, కుమారలలితావృత్తనిబద్ధమును, అగు స్తబకము- ప్రారంభింపఁబడుచున్నది. యోగానుభవమునకు అనురూపమగుస్తుతి- పూర్వ స్తబకమునందువలె యిచ్చటను గావింపఁబడుచున్నది.

మూ॥ మహోవిహతమోహాం మహేశమహిలాయాః
స్మితం వితనుతాన్మేగృహేషు మహమగ్ర్యమ్. ౧

తేజస్సుచేఁ దొలఁగింపఁబడిన మోహముగలదియగు మహేశ్వరీ మందహాసితము- నాగృహములయందు ప్రశస్తమగు నుత్సవమును విస్తరింపఁజేయునుగాత!

ప్ర భ:—మోహము-అనాత్మయందగు నాత్మాభిమానము-అసత్యమగుజ్ఞానము, గృహములయందు' అనుచోనున్న బహువచనమువలన "నేను ఎచ్చటనెచ్చట వసించుచుందునో, అక్కడ నక్కడ, మోహమును తొలగించునదియగు మహేశ్వరీ మందహాసితముయొక్క కార్యమగు మహోత్సవము నాకు లభించునుగాత" అను భావ మేర్పడుచున్నది. నాయందు ప్రసరించిన మహేశ్వరీమందస్మిత విలసితముచేత దూరీకృత మోహమగు మహోత్సవము నేనున్న స్థలములందంతటనుగూడ ప్రచలితమగుఁగాత మనునర్థము గమ్యమగుచున్నది.

మూ॥ ఇయద్బహులగోలం జగల్లఘుదధానా
సితామహాముఖైరప్య ఖణ్డితవిధానా. ౨

ఇట్లు- ఇంతబహుళగోళమగు జగత్తును తేలికగా భరించుచున్నదియు, పితామహాదుల (బ్రహ్మాదుల)చేతఁగూడ ప్రతిహతము

కాని కార్యకారిణి యగునదియు (అగు ఉమాదేవి– నాకు చాలినంత బలమునిచ్చుగాక !) అని అయిదవశ్లోకముతో సమన్వయించుచున్నది.

ప్రభ:—'విశాలదృష్టితో హస్తనిర్దేశముచేత ప్రదర్శించి 'ఇంత' అని చెప్పుచున్నాఁడు' అని గ్రహింపనగును. ఆకాశమున నక్షత్రములవలె గణింపఁబడుచు, లెక్కకురానన్ని భువనగోళములుగల యీజగత్తునంతను శిరముపై కొంచెము ధరించుచు, బ్రహ్మాదులగు నధికారులచేత నాటంకము చేయఁబడని శాసనముగల మహేశ్వరి నాకు చాలినంత వీర్యము నొసఁగుఁగాత! అనియర్థము.

మూ॥ అనుష్టచరితేభ్యః, శుభాన్యభిదధానా
కులాని మలినానాం హతాని విదధానా.　　౩

దోషదూషితములుకాని యాచారములుగల శిష్టులకు మంగళములను వచించునదియు, పాపాత్ముల కులములను నశింపఁజేయునదియు, (అగు నుమ-నాకు చాలినంత బలమునిచ్చుగాక !)

ప్ర భ:—'వచించునది' అనగా సంఘటించునది యనియే యర్థముగ్రహింపవలయునుగాని చెప్పునదియని గ్రహింపఁగూడదు.

మూ॥ దుకూలమరుణాంశుప్రభం పరిదధానా
హసన్త్య రజతాద్రిక్షితీశితురధీనా.　　౪

బాలసూర్యకాంతి సదృశమగు(ప్రాతస్సంధ్యారాగరంజితమగు) దుకూలమును ధరించి రజతగిరి (కైలాస) నాథునకధీనమైన ఉమ నాకు చాలినంత బలమునిచ్చుగాత!) .

ప్ర భ:—రజతాద్రి (వెండికొండ) నేలుచున్న తెల్లనిమేనుగల హరునికి రాగము నుదయింపఁజేయుటకు— అరుణవసనము సమర్థమగును. కావున మీఁదిశ్లోకమునందలి– రజత- అరుణపదప్రయోగము– ఔచిత్యప్రకర్షకమని తెలియునది.

మూ॥ మునీంద్రకృతతన్త్రప్రసిద్ధ బహుదానా
ఉమాబలమలం నస్త్వనోత్వతులమానా.　　౫

ఋషిశ్రేష్ఠులచేత విరచితములగు తంత్రశాస్త్రములయందు ప్రసిద్ధమగు, అమితదానములుగలదియు, సరిలేని పరిమాణము గలదియు (అప్రమేయయు) అగు ఉమ- నాకు చాలినంత బలమునిచ్చుగాత!

ప్ర భ:—మునీంద్రుల వాక్కులు వ్యర్థములుకావు. వారు రచించిన తంత్రిశాస్త్రగ్రంథముల యందీయుమ— భక్తుల యభీష్టములనెల్ల నొసఁగునను నంశము ప్రసిద్ధమైయున్నది. ఈ యుమాస్వరూపమును నిశ్చయించుటకు వీలుపడదు. కావున సంపూర్ణశక్తియగు ఆపరమేశ్వరి ఉమ— నాకు బలమును సంఘటించుగాత! 2, 3, 4 శ్లోకముల యర్థముతోఁజేర్చి యీ అయిదవ శ్లోకమునందలి యర్థమును సమన్వయింపవలయును.

మూ॥ నిరస్తవిషయాం యద్ దధాతిమతికీలామ్
సమస్తజగదీశే ధృతిస్తవమతేయమ్. ౬

సమస్తభువనేశ్వరీ! శబ్దాదివిషయములను నిరసించునదియగు బుద్ధిజ్వాలను ధరించుటయే- నిన్నుధరించుట. (నీయొక్క-ధృతి) అని మతము.

ప్ర భ:—శబ్ద- స్పర్శ- రూప- రసగంధములు ౫ను విషయములని చెప్పఁబడును. నిరసించుట యనగా, నిరాకరించుటయని యర్థము. నిర్విషయమగు బుద్ధిని విరామములేకుండునట్లు ధరించుటయే పరమేశ్వరిని ధరించుట అని తాత్పర్యము.

మూ॥ శ్రుతాప్రవణచిత్తం స్మృతా నరమపాపమ్
ధృతాహృది విధత్సే గతస్వపరభావమ్. ౭

నీవు- శ్రుతవై- మనుష్యుని ప్రవణచిత్తునిగను స్మృతవై, పాపరహితునిగను, హృదయమునందు ధృతవై, స్వ—పరభావశూన్యునిగను చేయుచుందువు.

ప్ర భ:–"నిన్ను గుఱించి వినువాఁడు- నీయందాసక్తుఁడును, నిన్నుస్మరించువాఁడు- నిరాకృతపాపుఁడును, నిన్ను హృదయమున ధ్యానించువాఁడు- తాను- పరుఁడు అను భేదబుద్ధిని విడుచువాఁడును అగును" అని భావము.

మూ॥ అహంమతితటిన్యాః నతావని! మూలమ్
త్వమేవకిలనేయం మహర్షిరమణోక్తిః. ౮

నజ్జనపాలనీ! అహంమతియను నదికి మూలము నీవే యగుదువట! ప్రసిద్ధమగునిది- మహర్షి రమణోక్తి.

ప్ర భ:—'నేను' అనుబుద్ధి- యుదయించుచోటు చిత్స్వరూపము- అని అస్మద్గురువు రమణమహర్షి యుపదేశము. ప్రవంతికి (నదికి) జన్మస్థానము- అచలమే (కొండయే) యగును. కావున ప్రవంతి శబ్దసామర్థ్యమువలన అహంకారమూలము- అచలము (చలింపనిది) అనునర్థము- ఆక్షేపింపఁబడుచున్నది. అహంమూలాన్వేషణమువలననే జ్ఞానప్రాప్తి కలుగునని భావము. "అహమితిస్ఫురతి స్వయమిభాసతే ఇదమనుస్మరణ, సపదిలీయతే" అని రమణోపదిష్టముగదా!

మూ. అహంమతిలతాయాస్త్వయి యాశకన్దే।
స్థితో౽మ్బ! భువనస్య ప్రసిద్ధతి రహస్యమ్. ౯

ఈశ్వరకాంతవగు నంబా! అహంమతియను లతకు కందమగు (దుంపవగు)నీయందు వసించుయోగి-ప్రపంచరహస్యమును దెలిసికొనును.

ప్ర భ:—అహంమతి='నేను' అనుబుద్ధి. అదియే లతగా రూపింపఁబడినది. కందమనఁగా, దుంప, లేకమూలము, అనునర్థములు గలవు. నేననుబుద్ధికి మూలము చిత్స్వరూపమగు నీవే యగుదువు. చిత్స్వరూపమగు నీయందున్నయోగికి లోకము యొక్క వాస్తవమగు తత్త్వము తెలియునను నీయర్థము- అహంధీ-లతలకును-అంబా-కందములకునుగల తాదాత్మ్యము చేతఁ దెలియఁ జేయఁబడినది.

మూ. యదేతదఖిలామ్బ! ప్రసిద్ధమివదృశ్యమ్
తవైవకిలజాలం గతో౽భగతి మూలమ్. ౧౦

సకలజననీ! ప్రసిద్ధము (నిశ్చితము) వలె దృశ్యమగుచున్న యీప్రపంచమును, అహంమతిమూలమును సాక్షాత్కరించుకొనిన యోగి- నీకు సంబంధించినదేయగు జాలమని (జాలవిద్యయని, మాయయని) చెప్పుచున్నాఁడు. (కావుననే యతఁడు ప్రపంచరహస్యమును దెలిసినవాఁ డగుచున్నాఁడు.

ప్ర భ:—నేను అనుబుద్ధికి మూలమగు స్వరూపము నొందిన యోగి, ఈదృశ్యమంతయు నిశ్చితసత్యమువలె భాసించుచున్నను- ఇది కేవలమును మాయికమే యని తెలిసికొనుచుండును. కావుననే యట్లుచెప్పుచున్నాఁడు. కావుననే "ప్రపంచ రహస్యమును తెలిసికొనును. అను పూర్వశ్లోకార్థమును దీనితో నన్వయింపవలయును.

మూ. ప్రపశ్యతి పరాచీ జగద్ వివిధభేదమ్।

స్వాతః కిమపినాన్యత్ ప్రతీచిప్రరతసే. ౧౧

అమ్మా! నీవు బహిర్ముఖివై, జగత్తును వివిధభేదముగా వీక్షించుచున్నావు. ఓ యంతర్ముఖి! నీవనుట– నీకంటె (స్వరూపము కంటె– ఆత్మకంటె) ఇతరమేదియు లేదు.

ప్ర భః— నీవు పరాగ్దృష్టివై (వెలుపలఁ జూచుదానవై) నానారూపమగు భేదమును జూచుచున్నావు. కావుననే ప్రపంచస్థితి కలుగుచున్నది. అంతర్దృష్టి (లోచూపుగలదాన) వగునపుడు సర్వమును నీవే యగుచున్నావు. నీకంటె వేరయిన వస్తువేదియు లేదని భావము.

మూ. స్తుతా భవసి శశ్వత్ స్మృతాచ భజనే త్వమ్

ధృతా భవసియోగే తతాభవసి బోధే. ౧౨

నీవు భజనమునందు స్తోతలచే స్తుతవును, ఎల్లప్పుడును ధ్యాతలచేస్మృతవును, యోగమునందు యోగులచే ధృతవును, జ్ఞానమునందు జ్ఞాతలచేత తతవును, అగుచున్నావు.

ప్ర భ — స్తుతవు = వినుతింపఁబడిన దానవు.

స్మృతవు = స్మరింపఁ బడినదానవు.

ధృతవు = ధరింపఁబడిన దానవు.

తతవు = వ్యాపించిన దానవు.

అవ:— మీఁదఁ దెలుపఁబడినస్తుతి– స్మృత్యాదులవలనఁ గలుగు ఫలమీక్రిందిశ్లోకముచేఁ జెప్పఁబడుచున్నది.

మూ. స్తుతా దిశసి కామం

స్మృతా హరసి పాపం

ధృతాఽస్య ధిశశక్త్యై

తతా భవసి ముక్త్యై. ౧౩

స్తుతవై యభీష్టము నిచ్చెదవు.

స్మృతవై పాపమును హరించెదవు.

ధృతస్సైఅధికశక్తి నొసంగెదవు.
తతస్సై మోక్షమును ఘటించెదవు.

ప్ర భ:—నిన్ను స్తుతించిన స్తోతను గోరికను దీర్చెదవు. నిన్ను ధ్యానించిన ధ్యాతను పవిత్రీకరించెదవు. యోగముచేత నిన్ను ధరించిన యోగికి సమృద్ధమగు శక్తిని ఘటించెదవు. జ్ఞానసిద్ధికై వ్యాపించువానకై జ్ఞాతకు మోక్షమును సాధించెదవు. స్తోత్రము—అభీష్టదము. ధ్యానము—పాపఘ్నము. యోగము—శక్తిదము. జ్ఞానము—ముక్తిప్రదము. అనునది ఫలితార్థము. (ఉమాదేవిని స్తుతించినవారికి కోరికలు ఫలించును. ధ్యానించినవారికి పాపములు తొలఁగును. ఉమాస్వరూపమును ధరించినవారికి గొప్పశక్తులు కలుగును. వ్యాప్తమగు ఉమాస్వరూపము నెఱిఁగినవారికి మోక్షము కలుగును. అని తెలియునది.)

మూ॥ విశుధ్యతి యతాశీ, పరిమాద్యతి నశుద్ధః
పరిమాదరహితస్య స్ఫుటేలససి కఞ్జే. ౧౪

ఆహారనియమముగలవాఁడు విశుద్ధుఁడగును. అట్లు విశుద్ధుడగువాఁడు ప్రమాదము నొందఁడు. ప్రమాదరహితుని సహస్రారకమలము వికసించును. ఆకమలమునందు నీవు లసింతువు (క్రీడింతువు)

ప్ర భ:—నియతమగు నాహారమువలన విశుద్ధియు, విశుద్ధివలన అప్రమాదమును, అప్రమాదమువలన సాధకుని సహస్రారకమలమున దేవి లసించుటయు, అని యిచట గృహీత-ముక్తరీతి ననుసరించి వస్తుస్తోమము వర్ణింపఁబడినది. కావున "గృహీత-ముక్తరీత్యార్థ శ్రేణిరేకావలిర్మతా" అను లక్షణమువలన నిది యేకావళియను నలంకారమగుచున్నది.

మూ॥ స్ఫుటం యది సరోజం నటీవ పటు నాట్యమ్
కరోషి యతబుద్ధేర్జగజ్జననిశీర్షే. ౧౫

జగజ్జననీ! సహస్రారకమలము- స్ఫుటమగునపుడు (వికసించునపుడు) యతబుద్ధియగు (మనస్సును వశీకరించుకొనిన) యోగియొక్క శీర్షమున (రంగస్థలమున) నటివలె నిపుణముగా నటించుచుందువు.

మూ॥ శిరోగతమిదం నః పరిఫుల్లమివపద్మమ్
అనల్పమకరన్దం త్వమమ్బ! భవ భృఙ్గీ. ౧౬

ఓయమ్మా! నామస్తకమందున్న ప్రఫుల్లమగు ఈ పద్మము అనల్పమగు మకరందము గలదై యున్నది. నీవు మధుకరివి కమ్ము!

ప్ర భ:—అనల్పమగు మకరందము=దట్టమయిన తేనె. నీవాపద్మమునందుండి దానిరసము నాస్వాదింపుమని ప్రార్థించుచున్నాఁడు.

మూ॥ సరోజమతుదన్తీ పిబామ్బ! మకరన్దమ్
మహామధుకరి! త్వం భజేర్మదమమన్దమ్. ౧౨

అమ్మా! నీవు– ఆసరోజమును పీడంపకుండ, మధురసమును గ్రోలుము. మహామధుకరీ! (తదాస్వాదనముననీవు) అధికమగు మదమును (బోధవిశేషమును) బొందుము.

ప్రి భ:—అమ్మా! ఆకమలము– కోమలము. కావున మధువు నాస్వాదించునపుడు– అది లులితము కాకుండునట్లు నిపుణతమ భృంగివగు నీవు రసమునుగ్రహింపఁగలవు. మఱియు మధువునంతనుగూడ నీవు గ్రహింపగలవు అనునర్థమును మహామధుకరీశబ్ద స్వారస్యమువలన నెఱుఁగునది.

యోగానుభవ విశేషప్రాదుర్భావదశలయందు యోగికి శరీరవ్యథలుకలుగును. కావుననే కోమలమగు కుసుమమును పీడింపకుము'' అని రూపకముచేత మీది యర్థము అనుప్రాణితము.

మూ॥ అమఙ్గలమితః ప్రాజ్మయేశవధు! భుక్తమ్
ఇతః పరమమేయే! సుఖాన్యనుభవత్వమ్. ౧౩

ఈశ్వరప్రియా! అమేయా! ఇంతకుముందు నేను దుఃఖము ననుభవించితిని. ఇఁకమీఁద నీవు సుఖముల ననుభవింపుము.

ప్రి భ;—నీసుఖముకొఱకు దుఃఖములన్నియు నేననుభవించితిని. నీవానందమయివి. కావున సుఖముల ననుభవింపుమని భావము. జ్ఞానముకలుగుటకు ముందు అజ్ఞానియగు భోక్తచేత కష్టమంతయు ననుభవింపఁబడును. జ్ఞానము కలిగినపిమ్మట భోక్తృత్వము నశించును. అపుడు పరమేశ్వరియే భోక్త్రియగునని భావము. మూలశ్లోకమున 'మయా' అనుటకు బదులు 'మయి' అను పాఠభేదము కాన్పించుచున్నది. 'మయి' అను పాఠమును స్వీకరించునపుడు క్రిందిభావ మేర్పడుచున్నది.

"నీవు నాయందింతకుముందు–అమంగళము ననుభవించితివి. ఇంకమీఁద సుఖముల ననుభవింపుము. జ్ఞానోదయము కలుగకముందును, కలిగిన తరువాతనుగూడ నీవే భోక్త్రివి. కావున నాదుఃఖము నీవే యనుభవించితివి.

మూ॥ అహఙ్కృతి వశాన్మమేశ్వరి! పురాభూత్
తవాభవ దిదానీం మమాస్తి నవిభుత్వమ్. ౧౯

ఈశ్వరీ! ఈదృశమగుజ్ఞానము కలుగుటకు ముందు త్వదీయమగుచిత్తు అహంకృతివశమువలన మదీయమై యుండెను. ఇప్పుడది త్వదీయమైనది. కావున నాకు (చిద్) విభుత్వములేదు.

ప్ర భ:—బోధము కలిగినపిమ్మట మదీయమగు చిత్ ప్రభుత్వము త్వదీయమే యయినదని భావము.

మూ॥ యదాఽభవదియంమే తదాన్వభవ దార్తిమ్
తవేశ్వరి! భవన్తీ భునక్తు శమిదానీమ్. ౨౦

ఎప్పుడీచిత్తు- అహంకారవశమువలన మదీయమై యుండెనో అప్పుడు వ్యధననుభవించినది. ఈశ్వరీ! ఇప్పుడు త్వదీయమై సుఖము ననుభవించుగాత !

ప్ర భ:—మమత్వమున దుఃఖముకలుగును. నిర్మమత్వమున సుఖముకలుగును అనునది ప్రసిద్ధమగు సర్వసిద్ధాంతసారము.

మూ! కరోత్వియమహన్తా వివాదమధునాఽపి
తథాఽపి పురతస్తే మహేశ్వరి వివీర్యా. ౨౧

మహేశ్వరీ! ఈ యహంత (అహంభావము) ఇప్పటికినిగూడ వివాదమును (వ్యవహారమును) చేయనీ. అట్లొనర్చినను గూడ నీముం దిది- వివీర్యము కాకమానదు.

ప్ర భ:—వివాదము=వివిధమగువాదము. వివీర్యము=పోయిన బలముకలది. (విగతమగు వీర్యముగలది) ఈ యహంతయెక్కడ? నీవెక్కడ? నీయెదుటనిది నిలువఁగలదా! అని భావము.

మూ॥ ఇయంచ తవబుద్ధేర్యతోభవతి వృత్తిః
ఇమామపి కురుస్వాం క్షమావతి! విరోషా. ౨౨

ఈ బుద్ధివృత్తికూడ త్వదీయమే యగును. కావున క్షమావతీ! ఈవృత్తినిగూడ విరోషవై (శాంతవై) స్వీకరింపుము.

ప్ర భ:—ఈ బుద్ధివృత్తి నీయదియే. దీనిని శాసించుదానవు నీవే. కావున దీనినిగూడ నంగీకరింపుమని భావము.

మూ॥ సుధాబ్ధిరిహామాతః! తరఙ్గశతమాలీ
చిదభ్రపురమత్ర ప్రభాపదమదభ్రమ్. ౨౩

మాతా! ఇక్కడ (ఈశరీరమునందు) సుధాసముద్రము తరంగ శతమాలియై శతసంఖ్యాకములగు అనగా అసంఖ్యాకములగు తరంగపంక్తులు గలదై యున్నది. ఇక్కడ (ఈశరీరమునందు) అనల్పమును సర్వతేజో మూలపదమునగు చిదాకాశపురము (కూడ) ఉన్నది.

ప్ర భ:—సుధాసముద్రమనఁగా సహస్రారమే. తంత్రశాస్త్రములయందు సహస్రారము సుధాసముద్రమని వర్ణింపఁబడినది. "తరంగశతమాలి" అనుపదము చేత- సహస్రారముయొక్క విలాసవిభూతిపరంపర చెప్పఁబడుచున్నది. చిదాకాశ పురమనఁగా, బయలువంటి చైతన్యమే యగుపట్టణము. 'దహరము' అను నామమున శ్రుతిప్రసిద్ధమగు బ్రహ్మపుర మిదియేయని తెలియునది. ఇదియే శాస్త్రములయందు సూర్యమండలముగా నుపదేశింపఁబడిన హృదయమని గ్రహించునది. ఆహారమునకై, సుధాసముద్రమునుండి యమృతమును, నివాసమునకై దహరాకాశమువలన నవకాశ మును గలుగుచుండును. కావున దేవీ! విజయము నొందుము! అని భావము.

మూ॥ కురుత్వమిదమేకం నిజాలయశతేషు
సవిత్రి! విహారాస్మిన్ యథేష్టమయి దేహే. ౨౪

సవిత్రీ! నీ నివాసభవనశతములయందు నా యీ శరీరము నొకదానినిగూడ పరిగణింపుము. ఈదేహమునందు యథేష్టముగా విహరింపుము.

ప్ర భ:—నీ నివాస గృహములయందే నాశరీరమునుగూడ లెక్కించి దీని యందుఁగూడ స్వచ్ఛందమగు విహారము నొనర్పుమని భావము,

మూ॥ కుమారలలితానాం కృతిర్గణపతీయా
కరోతు ముదమేషా కపర్దిదయితాయాః. ౨౫

గణపతిముని కృత కుమారలలితావృత్తకలితస్తుతియై పరమేశ్వర ప్రేయసికి ప్రీతినొసంగుగాత!

ఇతి శ్రీమహర్షేః భగవత్పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః కృతౌ ఉమాసహస్రే
షోడశః స్తబకః సమాప్తః
సమాప్తంచ చతుర్థం శతకమ్.

ఇది- శ్రీమహర్షి- రమణభగవత్పాదశిష్యుండును శ్రీవత్సగోత్రుండును
శ్రీమత్ పంతుల శేషయశాస్త్రి పౌత్రుండును వేంకటరామ
బుధేంద్ర పుత్రుండును లక్ష్మీనారాయణశాస్త్రిచే నాంధ్రీక
రింపఁబడిన ఉమాసహస్రమను స్తోత్రకావ్యమున
పదునారవస్తబకము (నాలుగవశతకము)

ఓమ్, తత్, సత్,

[ఇది - ద్వితీయ భాగము]

“శ్రీ బాలసరస్వతీ” ప్రచురణములు.

—: పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రి కృతులు :—

౧. ఆంధ్రధ్వన్యాలోకము ప్రథమభాగము 3—0—0

౨. ” ద్వితీయభాగము 4—0—0

౩. ” తృతీయభాగము (అచ్చులో)

౪. ఈశావాస్యోపనిషత్తు ... 2—8—0
[ఆంధ్రపద్యానువాద, పదవిభాగ, ప్రతిపదార్థ, త్రిమత సంబంధి షోడశ భాష్యార్థ, తద్విమర్శన సమ్మిళిత స్వాభిప్రాయ, సమన్వితము]

౫. ఉమాసహస్రము ... ప్రథమభాగము 1—8—0
(శ్రీ కావ్యకంఠ గణపతిముని కృత మూల శ్లోకములు[సాంధ్ర పద్య-తాత్పర్య-వివరణములు-ద్వితీయభాగము-శతకత్రయము] 3—0—0

౬. అధ్యాత్మోపనిషత్తు ... 1—0—0
ఆంధ్ర పద్య వివరణ సమన్వితము.

౭. ఆంధ్రకఠోపనిషత్తు ... 0—10—0
పద్యానువాద సమన్వితము

౮. వేదాంతడిండిమము ... 0—8—0
గేయానువాదము.

౯. భామతి [నవ్యకావ్యము] (అచ్చులో)

౧౦. శ్రీ గీతా సుధాంజలి (ఉచితము)

ప్రాప్తిస్థానము:-

పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి, అధ్యాపకుడు
మహారాజ సంస్కృత కళాశాల—పత్తిపాటివారివీధి
విజయనగరము.